# ఎవరీ గురువు!

Grace Ministries

*Original title "The Guru"*

*Seventh Edition 2011*

All rights reserved by
© *Grace Ministries*

*Published & Distributed by*

GRACE MINISTRIES

Website: graceministriesindia.com
Email: president@graceministriesindia.com

# ముందుగా ఒక మాట...

జీవిత ప్రయాణంలో దైవత్వం విషయంలో, ఆధ్యాత్మిక విషయాలలో పలు రకాలైన అయోమయ జంక్షన్‌లు ఎదురైనప్పుడు– సరైన దారి చూపే మార్గదర్శకుడు ఉండాలనీ, ఈ జీవితానికి వెన్నంటి ఉండి నడుస్తూ నడిపించేవాడు ఎంతైన అవసరమని గుర్తిస్తాం. ఎన్ని ఉన్నా, ఎంతమంది ఉన్నా ఏదో తెలియని 'అజ్ఞానం', మాటలతో వివరించలేని 'లేమి' అందరి ఆత్మీయ జీవితాలలో వెంటాడుతూనే ఉంటుంది. దీన్నిబట్టే అనాధినుంచి ప్రజలు ఎవరెవరినో తమకు గురువులుగా నాయకులుగా పెట్టుకుని ముందుకు వెళుతున్నారు. తీరని ఈ లోటును ఆసరాగా తీసుకుని అనేకులు తమ స్వార్థానికి వాడుకున్నారు, వాడుకుంటున్నారు. బాధాకరం, కాలగమనంలో ఎవరినైతే గురువులుగా ప్రజలు అనుసరించారో, ఎంతగానో ఊహించుకుని వెంబడించారో చివరికి వారూ తమ వంటి నిస్సహాయులే అని గుర్తించి నిరుత్సాహపడ్డారు ...మోసపోయి భంగపడ్డారు. దీన్నే బైబిల్ "వారు కాపరి లేని గొర్రెలలాగా అలసిపోయి చెదరిపోయి ఉన్నారు" (మత్తయి 9:36) అని వివరించింది.

దారి తెన్ను తెలియని గొర్రెల గుంపుకు కావలసింది తమలో ఒక తెలివిగల గొర్రెనో, లేక అనుభవం వున్న వృద్ధ గొర్రెనో ...మరేదో కాదు. కావలసింది 'తమ సొంత కాపరి' మాత్రమే. ఇదే మనుష్యులకూ వర్తిస్తుంది! విచిత్రం ఏమంటే, అత్యంత ఆవశ్యకమైన ఆధ్యాత్మిక అవసరాలను తీర్చుకొనుటకు మనుషులు వెదకుతున్నది, ఎంపికచేసుకుంటున్నది తమ వంటి మట్టి మనుషులనే! గురువులు కానివారిని తమ గురువులుగా ప్రజలు అజ్ఞానంతో నిర్లక్ష్యంగా స్వీకరిస్తున్నారు. గొర్రెలవలెనే పలోమని వీరి వెంటపడి మరీ అప్పగించుకుంటున్నారు. కాని చివరకు పొందే ఫలితం మాత్రం ఒక్కటే– నిజమైన గురువును పొందక అలసిపోవడం, ...చెదరిపోవడం! ఇదే మానవ చరిత్ర అంతట్లో మళ్ళీ మళ్ళీ జరుగుతున్నది.

గొర్రె ఎప్పటికీ కాపరి కాలేదు! నరులలో ఎవరూ గురుదేవుడు కాలేరు. ఆధ్యాత్మికంగా అంధకారంలోవున్న మనిషికి వెలుగును ప్రసాదించి సరియైన మార్గాన్నే చూపే గురుదేవుడు కావాలి; సూర్యుని క్రింది విషయాలను వల్లించేవాడు కాదు కావలసింది, దాని అవతల ఉండే పర సంబంధమైన నగ్నసత్యాలను బయల్పరచే సద్గురువు కావాలి; విసిగి వేసారిపోయిన జీవితాలను భ్రమపెట్టి, మభ్యపెట్టే ఊహలు కాదు, అంతర్గత జీవితంలో శక్తిని నింపి నూతన జీవంతో నింపే మహాగురువు మనుష్యులకు కావాలి. ఆ మహోన్నత గురువునే ఈ పుస్తకం చూపిస్తుంది. శ్రద్ధతో అసాంతం ఈ పుస్తకాన్ని చదివితే ఆ గురువులోని మహత్వాన్ని చవిచూస్తారు. దారితప్పి ప్రమాదపు అంచున వున్న నిర్భాగ్య గొర్రెకు సొంత కాపరి తన చెంతకే వచ్చి అక్కున చేర్చుకుంటే ఎంతటి తృప్తిని ఇస్తుందో, అటువంటి నిశ్చయతనే ఈ చిన్న పుస్తకం ఇస్తుంది. చదవండి, మీ గురుదేవున్ని కలుసుకోండి!

# ఈ పుస్తకంలో...


1. సద్గురువు .......5
2. దేవుడు ఎలా ఉంటాడు? .......12
3. మనం ఎలాంటి వారం? .......27
4. సద్గురువు చనిపోవడం ఎందుకు? .......42
5. ముక్తి మార్గమేది? .......54
6. సద్గురువు చూపిన రుజువులు .......72
7. సద్గురువు చనిపోయి బ్రతికాడు .......84
8. అపాయం! .......93
9. ఏది సత్యం? .......103
10. మార్గాలన్ని ఒకటేనా? .......120
11. నిజమైన శిష్యులు .......138
12. ప్రశ్నలు, అభ్యంతరాలు, వాటి జవాబులు .......149

# 1 సద్గురువు

అదో చిన్న గ్రామం. అందులో ఒక వీధి. మార్గమంతా దుమ్ముతో నిండివుంది. అక్కడొక వ్యక్తి నిలిచివున్నాడు. ఆ వెనుక పర్వత పంక్తి కనబడుతూ ఉంది. ఆ దగ్గర్లో ఒక సరస్సు ఉంది. ఆయన చుట్టూ ఉద్రేకంతో జనసమూహం గుమిగూడి ఉంది.

ఆయన ఓ సాధారణమైన వ్యక్తిలాగా కనబడుతున్నాడు. కానీ ఆయన మాటలు అసాధారణమైనవి. ఆయన ప్రజలతో మాటలాడుతున్నాడు. మాటలు స్పష్టంగా వినబడుతున్నాయి:

“నన్ను పంపినవాని సంకల్పం నెరవేర్చడానికే నేను పరలోకం నుంచి దిగివచ్చాను గాని నా సొంత సంకల్పం నెరవేర్చడానికి కాదు.” [1]

ఈ మాటలు విన్నవారిలో అనేకులకు ఆశ్చర్యం కలిగింది. మరి కొందరు ఏమేమిటో సణుగుకొంటున్నారు. “ఈయనెవరో మనకు తెలీదా? ఈయన తల్లిదండ్రులు మనమెరిగినవాళ్ళే! నేను పరలోకంనుంచి వచ్చానంటాడేమిటి ఈయన?”

కొంతసేపైన తర్వాత ఈ గురువు ఆ ప్రాంతంలోని ముఖ్య పట్టణానికి వెళ్ళాడు. దక్షిణ ప్రాంతంలోని కొండల మధ్య పల్లపు భూమిలోని పట్టణమది. అక్కడ పెద్ద దేవాలయం ఒకటి ఉంది. ఆ దేవాలయ ఆవరణంలో ఆయన ఉపదేశం చేస్తున్నాడు. అక్కడివారు కూడా చాలామంది ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన గట్టిగా తేటగా మాట్లాడుతున్నాడు, “నేను చేసే ఉపదేశం నాది కాదు గాని నన్ను పంపినవానిది. దేవుని ఇష్టప్రకారం చేయడానికి ఎవరైనా ఇష్టపడితే ఈ ఉపదేశం ఆయనదో లేక నా అంతట నేనే చెపుతున్నానో ఆ వ్యక్తి తెలుసుకొంటాడు.”[2]

“ఇతనికి దయ్యం పట్టింది” అన్నారు కొందరు. ఆ పట్టణంలో ఆయనకు శత్రువులున్నారు. వీరు దేవుని పిల్లలమని చెప్పుకుంటూ తిరిగేవారు. వీరందరూ ఆ గురువును చుట్టుముట్టారు ద్వేషాన్ని వెళ్ళగ్రక్కుతూ.

గురువు ఇలా బోధ చేయసాగాడు: “దేవుడే గనుక మీ తండ్రి అయితే మీరు నన్ను ప్రేమతో చూచేవారే. ఎందుకంటే, నేను దేవుని దగ్గరనుంచి బయలుదేరి వచ్చాను. నా అంతట నేనే రాలేదు. ఆయన నన్ను పంపాడు.”[3]

ఈ వివాదం తీరిపోయింది. వాళ్ళంతా రాళ్ళు తీసికొని ఆయనమీద

వేయడానికి సిద్ధమయ్యారు. కానీ ఆయన వాళ్ళ చేతికి చిక్కలేదు. ఆ తర్వాత ఎలాగైతేనేం, ఆయన్ను చేజిక్కించుకున్నారు. దేవదూషకుడంటూ ఆయన మీద నేరం మోపారు. ఆయన్ను చంపివేశారు.

దీనితో ఈ గాథ ముగియలేదు. ఆయన జీవించింది, ఇలా ఉపదేశించింది ఇస్రాయేల్ దేశంలో. ఇది రెండు వేల సంవత్సరాల క్రిందటి విషయం. ఈ రోజున ఈ వ్యక్తి ఖండఖండాంతరాల్లో కీర్తి గలవాడు. ఈయన గొప్ప గురువని చెప్పి ప్రతి దేశంలోనూ విశ్వసించేవారున్నారు. ఈయన ఖ్యాతి అంతటా వ్యాపించింది. ఈయన మహా గురువు. ఈయన పేరు యేసు క్రీస్తు.

గురువు పైన చెప్పిన సంగతులు నిజమయితే ఆయన గొప్ప ప్రవక్త అయివుండాలి. మానవకోటికి గొప్ప ఉపదేశకుడై ఉండాలి. ఆయన చెప్పినదంతా మనం జాగ్రత్తగా వినితీరాలి. మరి, ఆయన మాటలు తెలివితేటలున్న వాళ్ళు నమ్మగలరా? ఆయన మాట వినగల బలమైన కారణాలేవి? దీనికి ఒకటే జవాబు: యేసు క్రీస్తు ఉపదేశం తప్పకుండా నమ్మదగినది. దాన్ని నమ్మడానికి ఎన్నో మంచి కారణాలున్నాయి. ఇది నిశ్చయమైన మాట.

ఎవరైనా సరే, గ్రుడ్డిగా నమ్మాలని యేసుప్రభువు చెప్పలేదు. తాను చెప్పిన ప్రతి మాటనూ రుజువు చేశాడు. ఆయన దేవుని దగ్గరనుంచి వచ్చాడు. ఆయన మాటలు మానవకోటికి ఎంతో ప్రాముఖ్యమైనవి. ఈ రోజున మనకు కూడా ఆయన మాటలు చాలా ఉపయోగకరమైనవి, అవసరమైనవి. అందుచేత ఈ పుస్తకంలో ఆయన ఉపదేశాలు ధ్యానం చేయబోతున్నాం. దేవుణ్ణి గురించీ, మనిషిని గురించీ ఇంకా అనేక విషయాలు ఆయన చెప్పాడు.

## గొప్ప వాగ్దానాలు

క్రీస్తు ప్రజలకు అనేక వాగ్దానాలు అందించాడు. జీవితానికీ ఓ ఉద్దేశం ఏర్పడాలంటే, జీవితంలో తృప్తి కలగాలంటే, మనశ్శాంతి దొరకాలంటే తన దగ్గరికి వచ్చేవారికి ఇస్తానన్నాడు ఈ సద్గురువు. శాశ్వతానందాన్ని గురించీ, అనంతమైన శాంతిని గురించీ చెప్పాడు. మరణ భయంనుంచీ, దాని శక్తినుంచీ విడుదలను వాగ్దానం చేశాడు. దేవునితో శాశ్వత జీవాన్ని ఇస్తానన్నాడు. శాశ్వత జీవంలో కన్నీరు, బాధ, శిథిలావస్థ, నాశనం అనేవి ఉండవని అన్నాడు. మనుషుల్ని భయమూ అజ్ఞానమూ కీడూ మొదలైన కట్లనుంచి విడిపిస్తానన్నాడు. పాపవిముక్తి, రక్షణ తరువాత ఎప్పుడో దొరికేది అనుకోకూడదని చెప్పి ఇప్పుడే ఇస్తానన్నాడు. నమ్మేవారికి నూతన హృదయమిస్తాను, నూతన స్వభావమిస్తాను,

వారిని దేవుని సన్నిధికి యోగ్యులను చేస్తాను అన్నాడు ఈ సద్గురువు.

మీరు దేవుణ్ణి నిజంగా తెలుసుకోగలరు; దేవునితో సంపూర్ణమైన పొందిక కలిగి జీవించగలరు అంటూ ఈయన ఉపదేశించాడు.

## మర్మమైన జగత్తు

మనం జీవించే ప్రపంచం మర్మంతో కూడినది. మనం గ్రహించలేని ప్రాముఖ్య విషయాలెన్నో ఉన్నాయి. నిజం ఒప్పుకోవాలంటే మనల్ని గురించి మనకు తెలిసినది చాలా తక్కువ. దేవుణ్ణి గురించి తెలిసినది ఇంకా తక్కువ. శరీర నేత్రాలతో దృశ్య జగత్తును చూడవచ్చు. చేతులతో వస్తువులను తాకవచ్చు. యంత్రాల సహాయంతో వాటిని పరీక్ష చేయవచ్చు. అయినప్పటికీ వాటి గురించిన గొప్ప మర్మాలు బోలెడన్ని ఉన్నాయి. శాస్త్రాలను మనకు నేర్పే ఉపాధ్యాయులు అవసరమని మనం గ్రహిస్తున్నాం. వారి పుస్తకాలు కూడా మనం చదువుకొంటున్నాం.

అయితే ఆత్మ సంబంధమైన విషయాలు శరీర నేత్రాలకు కనబడవు. వాటిని చేతులతో తాకలేము. దూరదర్శిని, సూక్ష్మదర్శిని మొదలైన ఉపకరణాలు కూడా ఈ విషయంలో సహాయం చేయవు. దేవుణ్ణి చూడడానికి ఇవి పనికి రావు. ఏ పదార్థ విజ్ఞానశాస్త్ర పుస్తకమూ మనకు ఆధ్యాత్మిక లోకాన్ని చూపలేదు, నేర్పలేదు. దేవుని దగ్గరికి మార్గమేదో ఉపదేశించజాలదు కూడా. ఈ విషయాలు తెలుసుకోవాలంటే మనకు మరో విధమైన గురువు కావాలి.

అనాదికాలంనుంచీ మన దేశంలో గురువులనేకులు ఉండేవారు. ఎందుకని? ప్రజలకు గురువు కావలసిన అక్కర తెలుసు. ఆత్మసంబంధమైన వెలుగు కోసం గురూపదేశం అవసరమని అనుకున్నారు వారు. ఉపదేశం చేసి మంచి ప్రవర్తన గల గురువును ఎంతో మెచ్చుకున్నారు. అలాంటి గురూపదేశాలను తరతరాలుగా ఈ దేశీయులు ధ్యానిస్తూ వచ్చారు.

## ఆదర్శ గురువు

ఈ పుస్తకంలో ఉన్న ఉపదేశాలు ఆదర్శం అయిన సద్గురువు నేర్పినవి. గురు శ్రేష్ఠులలోని ఉత్తమ గుణాలన్నీ యేసుక్రీస్తులో ఉన్నాయి. యేసు దయాళుడు. తన శిష్యులను దేవునితో సహవాసం అనుభవించేవారినిగా చేశాడు. ఈ బాధ్యతను వహించాడు. ఆయనకు దేవుడు బాగా తెలుసు. ఇతరులను దేవుని దగ్గరికి తేవడం ఎలాగో ఆయనకు బాగా తెలుసు. దేవునికీ మానవునికీ ఆయన మధ్యవర్తి.

ఆయన సాధుగుణం గలవాడు. ఎవరినీ, ఎప్పుడూ, ఏమాత్రమూ గాయపరచిన వాడు కాదు. పరుల క్షమానికి పూర్తిగా అంకితమైపోయాడు. మనుషుల మేలుకోసం ఆయన జీవితమంతా ఖర్చు చేశాడు.

ఆయన దేవుని వాక్కులను బాగా వివరించి ఉపదేశించేవాడు. మాటల్లోనే కాదు, అనుదిన జీవితం ద్వారా కూడా ఆయన ఇతరులకు ఒక సందేశంగా ఉండేవాడు. ఆయన జీవితం పవిత్రమైనది. ఆయన లక్షణాలు సౌందర్యమైనవి. ఆయన సాధుస్వభావుడు, సహనశీలి, వినయభూతుడు. ఏ విధమైన గర్వం ఆయనలో లేదు.

ఆయనకు పేరుప్రతిష్ఠలమీద మోజు ఏమీ లేదు. స్వార్థం ఆయనలో ఏమాత్రమూ లేదు. ఆయన ప్రవర్తన పవిత్రమై, మంచితనంతో నిండి ఉంది.

ఆయన జీవితం ఎంతో సుందరమైనది. ఆయన జీవితంలోనుంచి ప్రేమ ప్రవాహమైంది. దేవుడంటే ఆయనకు ప్రేమ, మానవులంటే ప్రేమ. పవిత్ర జీవితం, త్యాగం, నిస్వార్థం, సమర్పణ – ఇవన్నీ ఆయన్లో ఉన్న గుణాలు.

## క్లుప్త జీవితం

ఆయన బేత్‌లెహేం అనే గ్రామంలో జన్మించాడు. ఈ గ్రామం జెరుసలంకు దక్షిణంగా కొద్ది దూరాన ఉంది. ఆయన నజరేతు పల్లెలో పెరిగి పెద్దవాడయ్యాడు. ఆయన బీదవాడు. స్వంత చేతులతో కష్టించి పని చేసి, జీవనం సంపాదించుకొనేవాడు. ఆయన పెండ్లి చేసుకోలేదు. ఆయన బాల్య దినాల విషయం మనకు ఎక్కువ తెలియదు గానీ ఆయన "జ్ఞానంలోను, శారీరకంగాను వృద్ధి చెందుతూ ఉన్నాడు. దేవుని దయలో, మనుషుల దయలో వర్ధిల్లుతూ ఉన్నాడు" అని రాసి ఉంది.[4]

ఆయన తన ముప్పయ్యో ఏట ఇల్లు వదలిపెట్టాడు. గ్రామ గ్రామంలో సంచరిస్తూ ఉపదేశం చేశాడు. దేశంలో మారుమూలల్లో కూడా పర్యటించాడు. ఆయనకు ఆస్తిపాస్తులేవీ లేవు. ఆయనే ఓసారి తనను గురించి ఇలా చెప్పాడు: "నక్కలకు గుంటలున్నాయి. గాలిలో ఎగిరే పక్షులకు గూళ్ళున్నాయి. కానీ మానవ పుత్రునికి తల వాల్చుకొనే స్థలం కూడా లేదు."[5]

ఇస్రాయేల్ దేశం పొలిమేరలు ఆయన అంతగా దాటివెళ్ళినట్లు కానరాదు. తన జీవిత ముఖ్యోద్దేశం ఆ దేశం లోపలనే నెరవేరబోతుందని ఆయనకు తెలుసు.

కొద్ది కాలంలోనే దేశమంతటా ఆయన పేరు మ్రోగింది. జనులు గుంపులుగుంపులుగా ఆయన మాటలు వినడానికీ, ఆయన పనులు చూడడానికీ

రాసాగారు.

ఆనాటి మత నాయకులకు ఇది బొత్తిగా ఇష్టం లేకపోయింది. ఆయనను చూచినప్పుడు వారి పదవులకు ముప్పు తెచ్చిపెడతాడని భయం కల్గింది. వారిలో అసూయ కలిగింది. కనుక వారు ఆయనను పట్టుకొని సిలువ వేసి చంపారు. సిలువ వేయడమనేది నేరస్థుల్ని చంపడానికి రోమ్‌వారు ప్రయోగించిన అనాగరిక విధానం, మోటు పద్ధతి. బహు క్రూర కృత్యం. ఆయన్ను ఒక కొయ్య సిలువ మీద ఉంచారు. కాళ్ళు చేతులు చాచి ఉంచారు. వాటిని సిలువకు మేకులతో దిగగొట్టారు. అప్పుడా సిలువను ఎత్తారు. భూమిలో నాటారు. ఆయనక్కడ వ్రేలాడుతూ, చావుకు దగ్గరగా వస్తూ, బాధకరమైన మరణాన్ని పొందాడు. యేసు క్రీస్తు ఆ విధంగా తన ముప్పయి మూడో ఏట సిలువపై చనిపోయాడు.

చనిపోకముందు, నేను తిరిగి బ్రతికి లేస్తానని చెప్పాడు. నిజంగా చనిపోయి బ్రతికాడు. శిష్యులు చూచి నమ్మారు. నలభై రోజులు ఆయన వారికి కనబడుతూ వచ్చాడు. ఆ తర్వాత ఆయన పరలోకానికి వెళ్ళాడు.

తాను పరలోకంనుంచి దిగివచ్చానన్నాడు. దేవుడు తనను పంపాడన్నాడు. అయితే ఆయన క్లుప్త జీవితానికీ సిలువ మరణానికీ అర్థమేమిటి? ఆయన ఎందుకు చావవలసి వచ్చింది? దేవుడాయన్ను పంపాడు గదా? శత్రువుల బారినుంచి కూడా ఆయన్ను తప్పించలేకపోయాడా? ఈ రోజున మనకు క్రీస్తు ఉపదేశానికి, మరణానికీ అర్థమేమిటి. ఈ ప్రశ్నలన్నిటికీ ఆయనే జవాబు చెప్పాడు. ఈ జవాబులు మనం ఈ పుస్తకంలో పరిశీలించబోతున్నాం.

**శుభవార్తలు**

యేసు క్రీస్తు జీవితాన్ని గురించి లెక్కలేని గ్రంథాలు, వ్యాసాలు లోకంలో ఉన్నాయి. ఈ చరణాల్లో కొన్ని సహాయకరమైనవి. కానీ కొన్ని నిరుపయోగమైనవి, హానికరమైనవి కూడా. ఎందుకంటే అందులో సత్యాన్ని తారుమారు చేసి రాశారు. ఆయన జీవితాన్ని గురించిన వివరాలు బైబిలులోనే దొరుకుతాయి. బైబిలులోని రెండో భాగంలో (క్రొత్త ఒడంబడిక లేక క్రొత్త నిబంధన) ఉన్న నాలుగు శుభవార్తలలో క్రీస్తు చరిత్ర చదువవచ్చు.

మత్తయి, మార్కు, లూకా, యోహాను ఈ నాలుగురు శుభవార్తలను వ్రాసినవారు. వీరు యేసు క్రీస్తు కాలంలో జీవించినవారు. మత్తయి, యోహాను అనే వారిద్దరు ప్రభు సన్నిహితులైన శిష్యులు. మార్కు, లూకా అనేవారిద్దరికీ యేసు శిష్యులెవరో తెలుసు. సత్యాన్ని పరిశోధించి తెలుసుకోవడానికి అవకాశాలు వారికి

ఉన్నాయి. క్రీస్తు జీవితంలోని వివరాలన్నీ వారికి తెలుసు. ఆయన ఏమి చెప్పినదీ, ఏమి చేసినదీ వారెరుగుదురు. ఆ విషయాలన్నీ మనకోసమే వారు వ్రాశారు. మన ముందున్న ఈ వివరాలు ఎంతో ఉపయోగం. జీవిత చరిత్ర అన్న తర్వాత ఆ వ్యక్తి ఏమి చెప్పాడో, ఏమి చేశాడో మనకు తెలియాలి గదా! ప్రభువైన యేసు జీవితం ఎలాంటిదో, ఆయన ఉపదేశాలేవో తెలుసుకోవాలంటే మనకు ఈ గ్రంథాలే ఆధారం. ఆయన చెప్పినదీ, చేసినదీ ఉన్నది ఉన్నట్లు వీటిలో కనబడుతాయి. ఈ నాలుగు శుభవార్తలలో ఉన్న వివరాలు నమ్మదగినవి అనడానికి ఎన్నో రుజువులున్నాయి.

ఈ పుస్తకంలో యేసు నోటినుంచి వెలువడిన మాటలు మీకు పరిచయం చేయాలని నా ఉద్దేశం. ఆయన తన శిష్యులకు దేవుణ్ణి గురించీ, మనల్ని గురించీ, తనను గురించీ, మోక్షం గురించీ ఉపదేశించిన సంగతులు మీకు అందించాలని నా అభిలాష. బైబిలులోని ఇతర భాగాల్లోనుంచి కొన్ని సత్యాలను కూడా ఎత్తి రాశాను. ఎందుకంటే బైబిలు దేవుని వాక్కే అని యేసు నేర్పాడు.

ఈ పుస్తకంలో మీరు దేవుని ఉపదేశాలు చూస్తారని చెప్పాను. మానవుడి మనసులో చాలా ప్రశ్నలు చెలరేగుతూ ఉంటాయి. వాటిలో ముఖ్యమైన కొన్నిటిని గురించి యేసుప్రభువు చేసిన బోధనలూ, ఆయన నమ్మి ఇతరుల నమ్మకానికీ అప్పగించిన అంశాలూ ఇందులో కనిపిస్తున్నాయి. యేసు ఉపదేశాలు నిజంగా తెలుసుకోవాలనేవారి కోసమే ఈ పుస్తకాన్ని రాశాను.

యేసు తేటగా ఉపదేశించేవాడు. మానవ క్షేమానికి తగిన సత్యం ఆయన ఎన్నడూ దాచినవాడు కాడు. సత్యం ఎంత కఠినమైనా మనకు కావాలి. మనం అనుకున్నట్టు  ఉండలేకపోయినా, ఆయన ఉపదేశాలు నిజమైనవి. కనుక వాటిని పరిశీలించితీరాల్సిందే.

మీరు చదవబోయే తరువాతి రెండు అధ్యాయాలు దేవుణ్ణి గురించీ, మనల్ని గురించీ. యేసుప్రభువు నేర్పిన మిగతా ఉపదేశాలన్నీ ఈ పునాదివంటి సత్యాలపై ఆధారపడి ఉన్నాయి. నాలుగో అధ్యాయంలో సద్గురువు చనిపోవలసిన కారణాన్ని పరిశోధిస్తాం. ఆ తరువాత మోక్షాన్ని గురించి చూస్తాం. మోక్షమనేది మనకందరికీ తెలుసుకోవలసిన విషయం. యేసు దేవుని దగ్గరనుంచి వచ్చిన నిజ గురువు. ఈ విషయం స్పష్టంగా రుజువైంది కూడా, నన్ను నమ్మండి అంటూ రుజువు లేకుండా ఆయనేమీ చెప్పలేదు. ఆరు, ఏడు అధ్యాయాల్లో  ఈ రుజువులు కొన్నిటిని పరిశీలిస్తాం. ఎనిమిది, తొమ్మిది, పది అధ్యాయాల్లో మరో ప్రాముఖ్యమైన అంశం వివరించాను. మత విషయాల్లో పొరబడడం సామాన్యమైన విషయం. సత్యాన్ని

ఎలా తెలుసుకోవాలి అనేది అందులో చర్చిస్తాం. ఆ తరువాత సద్గురువు శిష్యులు ఎలా ఉండాలి అనే విషయాన్ని పరిశీలిస్తాం.

ఈ పుస్తకం చదువుతూ ఉండగా పాఠకుడి తలలో ఏమో అభ్యంతరాలు సందడి చేయక మానవని నాకు తెలుసు. ముగింపులో ఇలాంటి అభ్యంతరాలూ, సందేహాలూ వాటికి జవాబులూ పొందుపరిచాను.

ఇప్పుడు యేసుప్రభువు దివ్యమైన ఉపదేశాలపై మన మనసును లగ్నం చేద్దాం, పదండి.

**గమనిక:** శుభవార్తలలోనుంచి, బైబిలులోని ఇతర భాగాలలో నుంచి అనేక వచనాలెత్తి ఈ పుస్తకంలో రాశాను, లేక వాటిని గురించి రాశాను, లేక వాటి సారాన్ని రాశాను. ప్రతి అధ్యాయం చివరా రిఫరెన్సులు ఇచ్చాను. కావాలంటే ఒక బైబిలును దగ్గర ఉంచుకొని ఈ వచనాలు చూడండి.

**ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. యోహాను 6:38.
2. యోహాను 7:16,17.
3. యోహాను 8:42.
4. లూకా 2:52.
5. మత్తయి 8:20.

# 2 దేవుడు ఎలా ఉంటాడు?

"దేవుడు ఎలా ఉంటాడు?"

తరతరాలనుంచి మానవులు ఈ ప్రశ్న అడుగుతూనే ఉన్నారు. మానవుని చరిత్రలో ప్రతి జాతిలో ఈ ప్రశ్న హృదయాలలో మారుమ్రోగుతూనే ఉంది. బాలలూ ఈ ప్రశ్న అడిగారు. వృద్ధులూ ఇదే ప్రశ్న అడిగారు. వేదాంతులు దీన్ని గురించి ధ్యానం చేశారు. అన్ని రకాల మనుషులు ఈ ప్రశ్న ప్రాముఖ్యమైనదని గుర్తించారు. అయితే ఈ ప్రశ్నకు జవాబేమిటి?

"నేను దేవుని దగ్గరనుంచి వచ్చాను" అని చెప్పాడు యేసుప్రభువు. ఆ మాట నిజమైతే ఆయన దేవుని గురించి దివ్యమైన ఉపదేశాలు అందించగలిగేవాడు అనుకోవడం పొరపాటు కాదు. కాబట్టి ఈ ప్రశ్న మళ్ళీ అడిగి చూద్దాం. "శాశ్వతుడైన సర్వాతీతుడైన దేవుడు ఎలా ఉంటాడు? ఆయనతో పరిచయం మనకు సాధ్యమౌతుందా? దేవునిలో గుణాలున్నాయా? ఉంటే ఆ గుణాలు ఏవి? ఈ ప్రశ్నలు అడిగాం. సరే, ఇప్పుడు జవాబుల కోసం యేసు క్రీస్తు ఉపదేశాలను జాగ్రత్తగా పరిశీలిద్దాం.

**మర్మం**

దేవుని గురించి మనం గ్రహించలేని విషయాలు ఎన్నో ఉన్నాయి. ఇహలోకం గడ్డమీద మనం ఉన్నంతకాలం కొన్ని విషయాలు మనకు అంతుపట్టవు కూడా. దేవుణ్ణి వర్ణించలేము. దేవుడు నిత్యుడు, అనంతుడు, అదృశ్యుడు. మనం ఊహించలేనంత మహిమ, వైభవం, శోభ గలవాడు. కంటితో ఆయనను చూడలేము. దేవుని ఎదుట మనమంతా భయభక్తులతో తల ఒగ్గవలసిందే. ఆయనను శిరసావహించవలసిందే. వినయంతో పడి ఉండవలసిందే. మనకు మించిన గూఢమైన సత్యాల గురించి తొందరపడి మాట్లాడకూడదు. ఇదంతా నిజమే. అయితే దేవుడు తానే తనను గురించిన సత్యాన్ని వెల్లడి చేయగలడని అనుకోవచ్చు. దేవుడు అలా చేస్తే ఆయన ఎలా ఉంటాడో కొంతవరకైనా మనం తెలుసుకోగలుగుతాం.

యేసుప్రభువు తనను ఈ లోకానికి పంపిన దేవుని గురించి పదే పదే మాట్లాడాడు. ఆయన దేవుని గురించి మనకు వెల్లడి చేసే విషయాలు

పవిత్రమైనవి, సుందరమైనవి, ఉన్నతమైనవి. కానీ ఈ చిన్న పుస్తకంలో వాటినన్నిటినీ మనం పరిశీలించలేము. కొన్నిటిని మాత్రం తీసుకొని వాటిని క్లుప్తంగా పరిద్దాం.

## దేవుని స్వభావం

అదొక బావి. దాని ప్రక్కనే ఒక రోజు యేసు కూచునివున్నాడు. అక్కడే ఒక స్త్రీ నిలిచివుంది. ఆమెకు దేవుడంటే సరిగ్గా తెలియదు. దేవుడు లేకుండానే బ్రతుకుదాం అనుకుంటుంది. ఆమెతో యేసు సంభాషించాడు. మాటల సందర్భంలో ఆయన దేవుని గురించి ఇలా అన్నాడు: “నిజమైన ఆరాధకులు ఆత్మలో సత్యంలో తండ్రిని ఆరాధించే కాలం వస్తూవున్నది. అది రానే వచ్చింది. అలాంటి ఆరాధకులు కావాలని తండ్రి వెదుకుతూవున్నాడు. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించేవారు ఆత్మలో సత్యంలో ఆరాధించాలి.”[1]

ఈ మాటలను మొదట చూద్దాం. దేవుని స్వభావాన్ని గురించి యేసు నేర్పిన సత్యాలు మరి కొన్ని ఉన్నాయి. వాటిని తరువాత ధ్యానం చేస్తాం.

మొదటిది: దేవుడు ఉన్నాడు.

దేవుడు ఉన్నాడు అనేదాన్ని గురించి ఎప్పుడూ ప్రశ్నించవలసిన అవసరం లేదు. యేసుప్రభువు మాట నిజమైతే, నాస్తికుల వాదమంతా పచ్చి అబద్ధమై ఊరుకుంటుంది. దేవుడు లేడని వాదించేవారు ఎందరో చాలా కాలంనుంచీ ఉన్నారు. వారిలో ఎవడు చెప్పినదైనా నమ్మేముందు యేసుప్రభువు ఉపదేశాన్ని చూడాలి. నాస్తికులందరి బోధనూ ఒక చోట చేర్చి, యేసు ఉపదేశాలతో పోల్చి చూడండి. యేసు చెప్పిన మాటలు నమ్మడానికి సరైన కారణాలు అనేకం మనకు కనబడుతున్నాయి. యేసుప్రభువు దేవునిదగ్గరనుంచి వచ్చాడు. దేవునితో ఎడతెగని సహవాసం చేశాడు. దేవుని మూలంగా గొప్ప కార్యాలు చేశాడు. దేవుని ఉనికిని గురించి ఆయన వాదించలేదు. దేవుని ఉనికిని ప్రత్యక్షంగా చూపి దృఢపరచాడు. దేవుడున్నాడు అనడానికి మనకు లభించే రుజువుల్లో ఆయనే బలమైన రుజువు. దేవుడు లేడు అనడానికి నాస్తికుడిని బలమైన రుజువు చూపమనండి, చూపలేడు.

నేను కూడా ఒకప్పుడు ఈ నాస్తికుల ప్రభావంలో పడిపోయినవాణ్ణే. అనేకులు ఈ ప్రమాదంలో పడిపోతున్నారని నాకు తెలుసు. లోకంలో అనేకుల జీవిత విధానం కలిగించే విషాదకరమైన ఫలితాలలో నాస్తికత ఒకటి. గానీ దేవునికి ఉనికి లేదని రుజువు చేయడం అసాధ్యం. దేవుడు లేడనవచ్చు, గానీ దాన్ని ఎవరూ నిరూపించలేరు. రుజువు చేయలేని విషయాన్ని పట్టుకొని వ్రేలాడడం తెలివైన

పనేనా? తనకు లేని జ్ఞానం ఉన్నదని నటిస్తున్నాడు నాస్తికుడు. మానవుడు బలహీనుడు. పరిమితులకు లోనైనవాడు. మహా గూఢమైన జగత్తులో చిన్న నలుసులాంటి ఈ భూగోళం మీద బ్రతుకుతున్నాడు. భూమి ఉత్పత్తిని మానవుడు ఊహించవలసిందే. దేవుడు లేకుండానే ఇదంతా కలిగిందని వాదించడం అవివేకం. అది వెర్రి పని. దేవుడు లేనే లేడనడం అర్థం లేని ప్రలాపం.

యేసుప్రభువు దేవుని దగ్గరనుంచి వచ్చిన గురువే. ఆయన నేర్పినదేమిటి? దేవుడు ఉన్నాడు. మనం దేవుణ్ణి అనుభవించగలం. మనం యథార్థమైనవారమైతే, దీన్ని ఇట్టే గ్రహించగలం. కానీ తెలుసుకోవడానికి ఇష్టముండాలి గదా! "అడగండి, మీకు ఇవ్వబడుతుంది. వెదకండి, మీకు దొరుకుతుంది. తలుపు తట్టండి, తెరవబడుతుంది" అని యేసు అన్నాడు.[2]

దీన్ని ప్రతి ఒక్కడూ చేయవచ్చు. కానీ చేయడానికి ఇష్టం లేకపోతే, దేవుడు లేడని చెప్పతగదు. సరైన విధంలో దేవుణ్ణి వెదికేవారికి ఆయన దొరికితీరుతాడు. ఇది నిశ్చయం.

మరో విషయాన్ని చర్చించబోతున్నాం.

దేవుడు ఆత్మ. దేవునికి భౌతికమైన స్వరూపం లేదు. ఏ శరీరమూ లేదు. మన కండ్లలో చూడగల వ్యక్తి కాడాయన. యేసుప్రభువు చెప్పనే చెప్పాడు – "దేవుడు ఆత్మ". అంతేగాని ఆయన జగత్తు కాదు. ఈ జగత్తు ఆయనలో ఒక భాగమూ కాదు. సాలె పురుగు గూడు అల్లుతుంది. ఇది సాలీడులోనుంచి వస్తుంది. సాలీడు తనలో ఉన్న అంతర్భాగంనుంచి గూడును అల్లుతుంది. అయితే ఈ సాదృశ్యం దేవుని విషయంలో సరిపోదు. జగత్తు ఒక పదార్థం, భౌతికమైనది. దేవుడు కేవలం ఆత్మ. మిశ్రం లేని ఆత్మ. దేవుడూ, జగత్తూ, ఈ రెండు ప్రత్యేకమైనవి. దేవుడు సగము పదార్థం, సగము ఆత్మ కాలేడు.

ఆత్మ స్వరూపం ఎలాంటిది? దీన్ని ఎవరూ ఊహించలేరు. ఆత్మను చేతి పనితో ఎవరు ప్రదర్శించగలరు? మానవుడు మానసికంగా గానీ భౌతికంగా గానీ ఏ చిత్రాన్ని కల్పించి చూచినా అది ఆత్మకు భిన్నమే అవుతుంది, గాని నిజాన్ని చూపజాలదు. ఇలాంటి ప్రయత్నాల ద్వారా ఆత్మకున్న స్వభావాన్ని ఏ మనిషీ ప్రదర్శించలేడు. అంతేకాదు, దేవుని గురించిన తప్పుడు అభిప్రాయాన్ని కలిగించడం జరుగుతుంది. ఓహో! దేవుని వైభవ ప్రభావాలు ఎంత గొప్పవి! ఆయన అనంత మహిమ ఎంత గంభీరమైనది! దీన్ని ఎవరు వివరించగలరు? ఎవరు దీన్ని మన కంటికి కనపరచ గలరు? దేవుని స్వరూప స్వభావాలు ఎటువంటివి? దేవుని వ్యక్తిత్వమెలాంటిది? ఆయనను దేనితో పోల్చిచూడగలం?

## దేవుడు తండ్రి

దేవుణ్ణి గురించి యేసుప్రభువు ఒక ప్రత్యేకమైన కోణంలో బయలుపరిచాడు: ఆయనను తండ్రి అని పేర్కొనగలం. దేవుణ్ణి గురించి మాట్లాడేటప్పుడు యేసుప్రభువు "తండ్రి" అని పదే పదే చెప్పేవాడు. దీనికెన్నో మంచి కారణాలున్నాయి. శాశ్వతుడైన సర్వాతీతుడైన దేవుడు ఒక వ్యక్తి అని "తండ్రి" అని ఆయనను పిలవడంలో స్పష్టం అవుతుంది. దేవుడు వ్యక్తిత్వం గలవాడు. ఆయన ఒక పదార్థం కాదు. ఒక శక్తి మాత్రమే కాదు. దేవుని గురించి "ఆయన" అని చెప్పాలి, "అది" అనకూడదు. దేవుడు "ఉన్నది" అనము. "ఉన్నాడు" అంటాం. ఏమీ తెలియనివాడు కాదు దేవుడు. తెలిసికొనే మనసు ఆయనకు ఉంది. ఆయన చైతన్యం గలవాడు, అనుభూతి గలవాడు, చిత్తవృత్తి గలవాడు. వ్యక్తులందరికీ ఇలాంటి గుణాలే ఉండాలి. ఆయనకు భౌతిక శరీరం లేదు గాని కండ్లు చేసినవాడు చూడగలడు. చెవులు సృజించినవాడు వినగలడు. మనసులను చేసినవాడు తెలుసుకోగలడు. మనలను వ్యక్తులనుగా చేసినవాడు వ్యక్తి గాక మరెవరు?

దేవునికి వ్యక్తిత్వం ఉంది అని చెప్పినప్పుడు ఆయనను సాధారణ వ్యక్తిగా ఊహించుకోకూడదు. దేవుడు పరిమితులకు లోనైన వ్యక్తి కాడు. పతనం చెందిన వ్యక్తి కాడు. స్వార్థపరుడైన వ్యక్తి కాడు. ఇలాంటి గుణగణాలు ఈ లోకంలోని వ్యక్తులందరిలో చూస్తూనే ఉన్నాం. అయితే ఈ విషయాల్లో దేవుడు మనుషులలాంటి వాడని మనం భావించకూడదు. దేవుని జ్ఞానం పరిమితి లేనిది. ఆయన చిత్తం సర్వశక్తిగలది. ఆయన హృదయం ప్రపంచానికి మించిన విశాలమైనది.

దేవుడు ఆదర్శ తండ్రిలాగా ఉన్నాడని యేసు చూపాడు. ఆయన సంపూర్ణ జ్ఞానం గలవాడు. తన స్వప్రజలను దయతో చూచుకుంటాడు. బలంగా కాపాడుకుంటాడు. ఆయన ప్రజలు ఆయనను నిశ్చతంగా నమ్మవచ్చు. ఆయన గొప్ప తండ్రి, మంచివాడు, వారికి సత్యం నేర్పుతాడు. వారిని సన్మార్గంలోకి నడిపిస్తాడు. దేవునిలో కనికరం ఉంది. మృదువైన భావాలు ఉన్నాయి. ఆయన ప్రేమ ఎన్నడూ సడలనిది.

తండ్రి అనడంలో దేవునికి సంతానం ఉంది అనే భావం కూడా కనిపిస్తుంది. యేసుప్రభువు దేవుణ్ణి తండ్రీ అని పిలిచాడు. శిష్యులకు ప్రార్థించడం ఎలాగో నేర్పుతూ "పరలోకంలో ఉన్న మా తండ్రీ" అన్నాడు.[3] దీనికి అర్థమేమిటో తరువాతి పుటలలో చర్చించుకుంటాం. దేవుని సంతానం ఆయన ఆత్మద్వారా పుట్టినవారు. వారు దేవుణ్ణి ఎరుగుదురు. వారు దేవునికి విధేయత చూపేవారు.

దేవుణ్ణి ప్రేమిస్తారు. లోకంలో కుమారులు తండ్రులకు సన్మానించినట్టే ఆత్మసంబంధమైన ఈ సంతానం దేవుణ్ణి సన్మానిస్తారు.

యేసుప్రభువు చేసిన దివ్యమైన ఉపదేశ సారాంశమిది. ఇది హృదయాన్నీ, మనసునూ, ఆత్మనూ తృప్తిపరచగల సత్యం. ఈ మర్మమైన జగత్తు వెనక తండ్రి ప్రేమ హృదయ స్పందన వినబడుతూవుంది.

యేసు ఉపదేశిస్తూ దేవుడు "వెదుకుతున్నాడు" అన్నాడు. తనను ప్రేమించాలని మనల్ని ప్రేమతో వెదుకుతున్నాడు. ఇప్పుడు ఆయన ఈ భూమిమీద కనబడకపోయినా ప్రజలు తనవైపు తిరగాలని ఎంతో ప్రయాసపడుతున్నాడు. పని చేస్తున్నాడు. ప్రజలు తనమీద నమ్మకం పెట్టాలని కోరుతున్నాడు. ప్రజలు తనకు వారి హృదయాలను అర్పించాలని వెదుకుతున్నాడు. ఆయన వారికి దూరంగా లేడు. ఆయనలోనే మనం జీవిస్తున్నాం, చలిస్తున్నాం, ఉనికి కలిగి ఉన్నాం. ఆయనను బట్టి మాత్రమే మనకు ఉనికి ఉంది. ఏ విధంగా మనకు గాలి చుట్టూరా ఉందో అలాగే ఆయన మనలను ఆవరించి ఉన్నాడు.

ఆయనను వెదికి కనుక్కోవడానికి మనం అటూ ఇటూ పరుగెత్తనక్కర్లేదు. ఆయన లేని స్థలమంటూ ఎక్కడా లేదు. మనమేదో దేవుణ్ణి వెదకాలనుకుంటాం గానీ నిజంగా దేవుణ్ణి వెదికేవారెందరు? ప్రజలు తమ్మును కలతపెట్టే సమస్యలకు పరిష్కారాన్ని వెదుకుతారు. కొందరు హృదయ సంతృప్తిని వెదుకుతారు. మరికొందరు మనశ్శాంతినీ, మత విషయమైన అనుభవాన్నీ, పరవశతనూ వెదుకుతారు. దేవుడు తమకు ఆశీర్వాదాలు, బహుమానాలు, వరాలివ్వాలని వెదుకుతారు.

అంటే, మనుషులు దేవుని దగ్గరనుంచి పారిపోతున్నారు. అందుకే దేవుడు మనిషిని వెదకవలసి వచ్చింది. ఎవడైన దేవుణ్ణి వెదుకుతున్నాడంటే, దేవుడే మొదట అతడిని వెదుకుతున్నాడని అర్థం. మనం ఆయన్ను వెదికి కనుక్కోవాలని దేవుని కోరిక.

## దేవుడు ప్రేమ

దేవుడు ప్రేమస్వరూపి అందుకే ఆయన ఇదంతా చేస్తున్నాడు. ఇష్టం లేని ప్రజల్ని పట్టుకొని, నన్ను గౌరవించండని బలవంతం చేసే దేవుడు కాడు. నన్ను ఆరాధించండని నిర్బంధించేటంత వ్యర్థుడు కాడు. మన ఆరాధన దేవునికి ఏమీ కలుపదు. ప్రజల మెప్పుకు ఆయన ఏమీ అర్రులు చాచడం లేదు. మనమిచ్చేవాటితో ఆయనకేమీ ఐశ్వర్యం కలుగబోదు. ఆయన మనుషులను

ప్రేమిస్తున్నాడు. అందుచేత వారిని వెదుకుతున్నాడు. ప్రజలందరూ పవిత్రులై ఎల్లకాలం ఆనందంతో బ్రతకాలని దేవుని కోరిక. ప్రజలు ఉత్తమమైన ఆశీర్వాదాలను అనుభవించాలని ఆయన కోరుతున్నాడు. మనుషులు దేవుణ్ణి తెలుసుకొని, ఆయనను దేవుడుగా ఘనపరచి నప్పుడే ఈ శ్రేయస్సు అభిస్తుంది. ఈ క్షేమం మనకు హస్తగతం కావాలంటే దేవుణ్ణి ప్రేమిస్తూ, ఆరాధించాలి.

ప్రేమతో దేవుడు మానవుణ్ణి వెదుకుతున్నాడు. తనతో సరైన సంబంధం కలిగించుకోవడానికి నా దగ్గరకు రండి" అంటూ దేవుడు మనల్ని పిలుస్తున్నాడు.

అంటే, దేవుడు ఆత్మ గనుక మనం ఆయనను ఆత్మలో, సత్యంలో ఆరాధించాలని భావం. దేవుణ్ణి ఆయన స్వభావాన్ని అనుసరించి ఆరాధించాలి. మరే విధానమూ ఆయనకు ఇష్టం లేదు. యేసుప్రభువు చెపుతున్నట్లు యథార్థమైన ఆరాధన ఆత్మ సంబంధమైనదే. భౌతికమైన ఏ వస్తువులతో ఈ ఆరాధనకు సంబంధమే లేదు. ఆత్మలో సత్యంలో ఆరాధించాలంటే దేవుని మహత్తునూ, దేవుని వైభవాన్నీ గుర్తించి తీరాలి. యేసు శిష్యులలో ఒకరు ఈ విధంగా అన్నారు: "జగత్తునూ అందులో సమస్తాన్నీ సృజించిన దేవుడు భూలోకానికీ పరలోకానికీ ప్రభువు గనుక మనిషి చేతులతో చేసిన ఆలయాలలో నివసించడు. తనకు ఏదో కొరత ఉన్నట్టు మనుషుల సేవలు అందుకోడు. ఆయనే అందరికీ జీవితాన్ని, ఊపిరిని, అలాంటివాటన్నింటినీ ప్రసాదిస్తున్నాడు."[4]

ఈ పరమాత్మను ఎక్కడైనా ఆరాధించవచ్చు. మనం ఎక్కడ ఉన్నా ఆయనకేమీ భేదం లేదు. అంటే ఈ విషయంలో ఒక దేశంకంటే మరొకటి మంచిదనడు. పట్టణం కానివ్వండి, కొండలు కానివ్వండి, నదులు కానివ్వండి, ఒకదానికంటే ఒకటి మంచిదని ఆయన అనడు. రోజులూ, తిథులూ అనే పట్టింపులేదు. దేవుణ్ణి ఎక్కడైనా, ఎప్పుడైనా ఆరాధించవచ్చు. కానీ ఆరాధన ఆత్మలోనే జరుగవలసివుంది. ఆరాధన సత్యంలో కూడా జరగవలసి ఉంది. దేవుడు వెల్లడి చేసిన సత్యానికి అనుగుణంగా ఉండాలి ఆరాధన. ఆరాధన సజీవంగా ఉండాలి. వాస్తవమైనదై ఉండాలి. అందులో స్వార్థభావన, స్వంత చిత్తం, నటన ఏమాత్రం ఉండరాదు. "తనకు ప్రార్థన చేసేవారందరికీ – యథార్థంగా ప్రార్థించేవారికి – యెహోవా దగ్గరగా ఉన్నాడు."[5]

వ్యర్థమైన ఆరాధనను గురించి యేసుప్రభువు హెచ్చరిక చేస్తూ అప్పటి మత నాయకులతో ఇలా చెప్పాడు:

"ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను గౌరవిస్తున్నారు గాని వారి హృదయం నాకు చాలా దూరంగా ఉంది. వారు నన్ను వ్యర్థంగా ఆరాధిస్తున్నారు. మానవ

కల్పితమైన నియమాలను దేవుని ఉపదేశాలుగా బోధిస్తున్నారు."[6]

సద్గురువు దేవుణ్ణి గురించి చేసిన మరో దివ్యోపదేశాన్ని విందాం. దేవుడు పవిత్రుడు, ధర్మశీలుడు, న్యాయవంతుడు.

యోహాను శుభవార్త 17వ అధ్యాయంలో యేసుప్రభువు ప్రార్థన చేస్తూ, దేవుణ్ణి "పవిత్రుడవైన తండ్రీ" అనీ, "న్యాయవంతుడవైన తండ్రీ" అని సంబోధించాడు.[7]

దేవుడు తన క్రియలన్నిటిలో పరిపూర్ణుడు, తప్పు చేయనివాడు. దేవుడు అబద్ధం చెప్పడం అసాధ్యం. అన్యాయంగా, అక్రమంగా ప్రవర్తించడం, చెడుగును ఏ రూపంలో గానీ ప్రోత్సహించడం అసాధ్యం. ఆయనకు కల్మషం, చెడుగు, పాపం ఏ మాత్రమూ అంటవు. దేవుని పవిత్రత లోపం లేనిది, వర్ణించలేనంత వైభవంతో కూడింది.

దేవుని పవిత్రత గురించి బైబిలు అంతటా చెపుతుంది. అది దేవుని ప్రేమను, కనికరాన్ని గురించి చెప్పినదానికంటే, ఆయన పవిత్రత గురించే ఎక్కువగా మాట్లాడుతుంది. దేవుడు తన ప్రజలతో పదే పదే ఇలా చెపుతున్నాడు. "నేను పవిత్రుడనై ఉన్నట్టు మీరు పవిత్రులై ఉండండి". నేను దుర్మార్గతకు విముఖుడను. చెడుగు చేసేవారిని శిక్షిస్తాను అంటూ దేవుడు చెపుతూనే ఉన్నాడు. పరమాత్మ యొక్క పరమ ఉత్తమమైన గుణమే పవిత్రత. చెడుగు లేకపోవడం మాత్రమే కాదు, చెడుగును తీవ్రంగా ద్వేషించే పవిత్రత దేవునిది.

ఈ లోకంలో చెడుగు అంతటా ఉంది. కానీ ఈ చెడుగు దేవునిలో ఉన్నదనుకోవడం మహా ఘోరం. చెడుగును దేవుడు సృజించలేదు. చెడుగును దేవుడెన్నడూ ఆమోదించడు.

## దేవునిలో చెడుగు ఏ మాత్రమూ లేదు

"దేవుడు వెలుగు, ఆయనలో చీకటి అంటూ ఏమీ లేదు."[8]

దేవుని పవిత్రత గురించిన జ్ఞానం ఏ కొంచెం ఉన్నవాడికైనా ఈ సత్యం ఇట్టే బోధపడుతుంది. దేవుని గుణశీలాలు నిష్కళంకాలు. ఈ విషయాన్ని యేసుప్రభువు నొక్కి చెప్పాడు.

పవిత్రుడైన దేవుని దగ్గరనుంచి వచ్చిన ఉపదేశమంతా పవిత్రమై ఉంటుంది. ఇలాంటి ఉపదేశం నీతిని కలిగిస్తుంది. న్యాయాన్ని చేకూరుస్తుంది. దేవుని దగ్గరనుంచి వచ్చిన ఉపదేశకుడు ఎవడైనా పవిత్రుడై ఉంటాడు. ఇతరులను పవిత్రులను చేయడానికి ప్రయత్నిస్తాడు. మానవులతో నిజ దేవునికి గల

సంబంధాలతో ఇది ఒక ప్రాముఖ్యమైన గుర్తు.

## సృష్టికర్త

యేసుప్రభువు ఉపదేశంలో మరో గొప్ప సత్యాన్ని మనం చూడగలం: దేవుడు విశ్వానికి సృష్టికర్త, సంరక్షకుడు, పరిపాలకుడు. మానవజాతిని గురించి యేసు ఇలా అన్నాడు: "సృష్టి ఆరంభంనుంచి దేవుడు వారిని స్త్రీ పురుషులుగా సృజించాడు."[9] బైబిలులోని ప్రథమ గ్రంథంలోని మొదటి అధ్యాయంలో ఈ విషయం ఉంది. బైబిలు, అందులోని అన్ని భాగాలూ దేవుని వాక్కు అని ఈ సద్గురువు నేర్పాడు. బైబిలులోని ప్రారంభ వాక్యాలను గమనించండి:

"ఆదిలో దేవుడు ఆకాశాలనూ, భూమినీ సృజించాడు." అంటే, జగత్తు నిత్యమైనది కాదు. అది తనంతట తానే ఏర్పడినది కాదు. ఈ జగత్తుకు ఆరంభం ఉంది. అది వాస్తవమైనది. దేవుడు దీనిని శూన్యంలోనుంచి చేశాడు.

సృష్టిలోనిది ఏదీ దేవునిలో ఒక భాగం కాలేదు. దేవుడే శాశ్వతుడు, స్వయంభవుడు. యేసు ఉపదేశం ప్రకారం దేవుడు లోకానికి ముందున్నవాడు, లోకానికి భిన్నమైనవాడు, లోకానికి పైగా ఉన్నవాడు.

"పర్వతాలు ఉనికిలోకి రాకముందే, భూమిని, లోకాన్ని నీవు సృష్టించకముందే నీవే దేవుడివి, శాశ్వతుడైన దేవుడివి."[10]

దేవుడు లోకాన్ని పరిపాలిస్తున్నాడు

దేవుడు సృష్టికర్త మాత్రమే కాడు. ఆయన సృష్టిని పోషిస్తున్నాడు, పరిపాలిస్తున్నాడు. యేసుక్రీస్తు కొండపై చేసిన ప్రసంగం నిండా తేటతెల్లంగా కనిపిస్తున్నాయి. "పరలోకం తోడని ఒట్టు పెట్టుకోకూడదు అది దేవుని సింహాసనం, భూమి ఆయన పాదపీఠం" అంటూ యేసుప్రభువు చెప్పాడు.[11] "ఆయన మంచివారికి, చెడ్డవారికి కూడా సూర్యోదయం కలిగిస్తాడు. న్యాయవంతులకు, అన్యాయవంతులకు కూడా వానకురిపిస్తాడు" అన్నాడు.[12] దేవుడు తన ప్రజల అక్కర ఎరుగును, వారి ప్రార్థనలకు జవాబిస్తాడు.[13] పక్షులకు ఆహారమిస్తాడు. అడవి పువ్వులను అందంగా అలంకరిస్తాడు. పక్షులకంటే పువ్వులకంటే తన వారిపట్ల ఎక్కువ శ్రద్ధ చూపుతాడు.[14] దేవునికి తెలియకుండా పిచ్చుక కూడా కింద పడదని చెప్పాడు.[15] అంటే చిన్న సంఘటనలు సహా ప్రభువే జరగనిస్తున్నాడని భావం. అలాంటప్పుడు పెద్ద విషయాలను దేవుడు చూచుకోకుండా ఉంటాడా?

"స్తుతి పాటలు పాడండి, దేవునికి స్తుతి పాటలు పాడండి. సంకీర్తనం చేయండి.

మన రాజుకు సంకీర్తనం చేయండి. లోకమంతటికీ రాజు దేవుడే. కీర్తన పాడండి. దేవుడు తన పవిత్ర సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు. దేవుడు లోకప్రజలను పరిపాలిస్తున్నాడు" అని దేవుని వాక్కులో రాసి ఉంది.[16]

దేవుడు సర్వ శక్తి గలరాజు. ఆయన లోకాలన్నిటికీ ప్రభువు, సార్వభౌముడు. అన్నీ ఆయన మహిమగల పాదాల కింద ఉన్నాయి. ఆయన సమస్తాన్నీ పరిపాలిస్తున్నాడు. ఆయన లోకాన్ని సృజించి దాన్ని గురించి మరచిపోలేదు. సృష్టిలో ఏదో మూల ఆయన ఒదిగి కూర్చోలేదు. తన సృష్టిని గురించి దేవునికి ఒక నిర్ణయమైన ఉద్దేశం ఉంది. అంతం లేని ప్రభావంతో జ్ఞానంతో ఆయన తన ఉద్దేశాన్ని నెరవేర్చుకుంటున్నాడు.

**ప్రాముఖ్యమైన గొప్ప సత్యం**

యేసుప్రభువు దేవుని గురించి చేసిన దివ్యోపదేశాలలో అతి ప్రాముఖ్యమైన దాన్ని ఇప్పుడు నేర్చుకోబోతున్నాం. ఈ సత్యంవల్ల దేవుని లక్షణాలను తెలుసుకోగలం.

దేవుడు ఆత్మ. దేవుడు యేసుక్రీస్తులో తనను తాను ప్రత్యక్షం చేసుకొన్నాడు.

దేవుడు చేసిన వస్తువులవల్ల దేవుని గురించిన కొన్ని విషయాలు తెలుసుకోవచ్చు. "ఆకాశాలు దేవుని మహిమను గురించి చెపుతున్నాయి. విశాలమైన అంతరిక్షం ఆయన చేతులతో చేసిన పనిని తెలియజేస్తూ ఉంది."[17]

ఇంతకంటే గొప్ప ప్రత్యక్షం దేవుడు అనుగ్రహించాడు. పరమాత్మ అయిన దేవుడు ఎక్కడా దాక్కోలేదు. దేవుడు దిగివచ్చాడు. తన కుమారునిలో మనుషులకు కనబడ్డాడు.

సద్గురువైన యేసు ఉపదేశాలనుబట్టి చూస్తే ఆయన గురువు మాత్రమే కాడు. అంతకు మించినవాడని రుజువవుతుంది.

ఆయన ప్రార్థిస్తూ ఒకసారి ఇలా అన్నాడు: "తండ్రీ, ప్రపంచం ఉనికిలోకి రాకముందు నీతో నాకున్న మహిమ ఇప్పుడు నీ సముఖంలో నాకు మళ్ళీ కలిగించు."[18]

జగత్తు సృష్టి కాకముందే యేసుక్రీస్తు ఉన్నాడని దీని అర్థం.

మరో సందర్భంలో ఆయన ఇలా అన్నాడు: "నేను, నా తండ్రి ఒకటే."[19] "నన్ను చూచేవారు నన్ను పంపినవాణ్ణి చూస్తున్నారు."[20]

"నన్ను చూచినవాడు తండ్రిని చూచినట్టే."[21]

యేసు మనుషుల్లో మనిషిగా కనబడ్డాడు. కానీ ఆయన మానవమాత్రుడు కాడు.

తాను దేవుణ్ణే అని ఆయన చెపుతున్నాడు. ఆయన భూమిపై జన్మించాడు. ఆయనది నిజమైన మానవ స్వభావం. లోకానికి రాకముందు ఆయనకు దైవస్వభావం ఉంది. భూమిని దేవుడు సృజించకముందు ఆయన తండ్రితో మహిమలో ఉన్నాడు. అందుకే ఆయన తనను చూస్తే దేవుణ్ణి చూచినట్టే అన్నాడు.

**శత్రువులవైఖరి**

యేసుప్రభువు శత్రువులు తాను దేవుణ్ణి అంటున్నాడని గుర్తించారు. “నేను, నా తండ్రి ఒకటే” అన్నప్పుడు యూదులు రాళ్ళు తీసుకొని ఆయనను కొట్టబోయారు. అప్పుడు యేసు “నా తండ్రినుంచి అనేక మంచి పనులు నేను మీకు చూపాను. వాటిలో ఏ పనికారణంగా మీరు నా మీద రాళ్ళు రువ్వుతున్నట్టు?” అని వారినడిగాడు. “మంచి పనికి నీమీద మేం రాళ్ళు రువ్వం. మేము రాళ్ళు రువ్వే కారణం ఏమంటే, నీవు దేవదూషణ చేస్తున్నావు. నీవు మనిషివే అయినా నిన్ను దేవుడుగా చేసుకుంటున్నావు” అని యూదులు ఆయనకు బదులు చెప్పారు.[22]

రెండు వేల సంవత్సరాల క్రితం యేసు కన్య గర్భ వాసాన జన్మించాడు. అది ఈ లోకసంబంధమైన ఆయన జన్మం. దేవుడు నా తండ్రి అన్నప్పుడు యేసు ఈ జన్మాన్ని గురించి చెప్పలేదు. ఈ జన్మం ఆయన మానవ స్వభావాన్ని సూచిస్తుందంతే. ఆయన లోకంలో జన్మించకముందు తండ్రి అయిన దేవునితో తనకున్న సంబంధాన్ని తెలియజేస్తూ పైనున్న మాటలు అన్నాడు. “నేను దేవుని శాశ్వతుడైన కుమారుణ్ణి” అని ఆయన భావం. దేవుడు ఎల్లప్పుడూ తండ్రి, క్రీస్తు ఎల్లప్పుడూ కుమారుడు. ఇది నిత్యమైన సంబంధం. అనంతంగా తండ్రి కుమారులు సంపూర్ణ ఏకత్వంలో ప్రేమలో ఉన్నారు.

దేవునికి కుమారుడు ఉంటాడా?

“దేవుడు పెళ్ళాడతాడా? ఆయనకు పిల్లలు కలుగుతారా? యేసు దేవుని కుమారుడు అంటే నేను నమ్మను” అని కొందరు అభ్యంతరాన్ని వెలిబుచ్చుతారు. ఈ విధంగా మాట్లాడేవాళ్ళలో కొందరికి బైబిలు సరిగ్గా అర్థం కాలేదని చెప్పవచ్చు. మరికొందరేమో బైబిలు చెప్పేదాన్ని బుద్ధిపూర్వకంగా తారుమారు చేస్తున్నారు. ఆలోచించండి. దేవుడు మనిషి కాడు గదా. కుమారుడు కావాలంటే మనిషిలాగా పెళ్ళాడి కనాలా? పరమాత్ముడైన దేవుడు ఆత్మ అయిన కుమారునికి తండ్రి అయివుండడం అసాధ్యమా? దీన్ని మనం మన ఆలోచనలో శరీర సంబంధమైన జన్మంతో ఎందుకు కలపాలి?

మరి కొందరంటారు గదా, “మాకిదంతా అర్థం కావడం లేదు”. మీకు అర్థం

కాకపోతే ఈ దివ్య సత్యం వాస్తవం కాకుండా పోతుందా? దాన్ని కాదని చెప్పగలరా?

మరో సందర్భంలో కూడా యేసు యొక్క శత్రువులు ఆయన దేవుని కుమారుణ్ణి అని చెపుతున్నట్లు గ్రహించారు. ఒకప్పుడు యేసు "ఇప్పటి వరకు నా తండ్రి పని చేస్తూవున్నాడు. నేనూ చేస్తూవున్నాను" అంటూ వాళ్ళకు ప్రత్యుత్తరం ఇచ్చాడు. ఈ కారణం చేత యూదులు ఆయన్ను చంపాలని ఇంకా తీవ్రంగా ప్రయత్నించారు.[23]

యేసును చంపడానికి చివరకు వారికి దొరికిన కారణం ఇదే. బైబిలు ఇలా వివరిస్తుంది: "ప్రముఖయాజి ఆయనను ప్రశ్నించాడు, నీవు దివ్యుడైన దేవుని కుమారుడివా? . . . అప్పుడు యేసు అవును, నేనే ఆయనను. . . ప్రముఖ యాజి తన బట్టలు చింపుకొని మనకిక సాక్షులతో ఏం పని? ఈ దేవదూషణ మీరు విన్నారు గదా! మీరేమంటారు? అన్నాడు. ఆయన చావుకు తగినవాడని వారంతా తీర్పు చెప్పారు."[24]

యేసు శత్రువులు ఆయన చెప్పినదేమిటో స్పష్టంగా గ్రహించారు. వారి సిద్ధాంతాల ప్రకారంగా "నేను దేవుణ్ణి" అని ఎవడైనా చెప్పుకుంటే ఘోర పాపం చేస్తున్నాడని కూడా వారికి బాగా తెలుసు. యేసు చేసిన నేరమిదే అన్నారు వారంతా. యేసు వారిని ఆవిధంగా ఆలోచించనిచ్చాడు. దీనికోసం వారు తనను చంపేలా చేసుకున్నాడు. వారి అభిప్రాయాన్ని దిద్దడానికి ప్రయత్నం చేయలేదన్నమాట.

**ఆయన శిష్యులకు తెలిసింది**

యేసు పరలోకంనుంచి వచ్చిన దేవుడని ఆయన శిష్యులకు బాగా తెలుసు. యేసు ఈ విషయంలో తన శిష్యుల అభిప్రాయాన్నీ, నమ్మకాన్నీ ఎన్నడూ దిద్దలేదు. శిష్యులు అలా నమ్ముతూంటే, వారి విశ్వాసంలో ఎంతో ప్రోత్సహించాడు కూడా.

పేతురు ఆ శిష్యులలో ఒకడు. ఒక రోజు అతడు అన్నాడు గదా, "నీవు అభిషిక్తుడవే! సజీవుడైన దేవుని కుమారుడవే."[25] దేవుడే నీకిది వెల్లడి చేశాడని యేసు అన్నాడు.

శిష్యులలో తోమా మరొకడు. క్రీస్తు చనిపోయి తిరిగి బ్రతికి వచ్చాక, ఆయనను ఆరాధిస్తూ తోమా "నా ప్రభూ, నా దేవా" అన్నాడు.[26] యేసుప్రభువు తోమా చెప్పిన మాటలను సరిచేయలేదు. పైగా ఇలా అన్నాడు: "నీవు నన్ను చూచి నమ్ముతున్నావు. చూడకుండానే నమ్మేవారు ధన్యులు."

యోహాను తాను రాసిన శుభవార్త ప్రారంభంలో యేసును "వాక్కు" అని

పేర్కొన్నాడు. “ఆదిలో “వాక్కు” ఉన్నాడు. “వాక్కు” దేవునితో ఉన్నాడు. “వాక్కు” దేవుడే. ఆయన ఆదిలో దేవునితో కూడా ఉన్నాడు. సమస్తమూ ఆయన మూలంగా కలిగింది. . . . “వాక్కు” శరీరి అయ్యాడు. ఆయన కృపతో సత్యంతో నిండినవాడై కొంతకాలం మనమధ్య ఉన్నాడు. మేము ఆయన మహాత్యం చూశాం. ఆ మహాత్యం తండ్రి ఒకే ఒక కుమారునిలాంటిది. ”[27]

ఇక్కడ ఈ సత్యం స్పష్టంగా ఉంది. యేసు ఈ లోకానికి రాకముందు దేవుడై ఉన్నాడు. భూమిమీద అమర దేవుని అవతారం. క్రీస్తును గురించి బైబిలులో రాసివున్న అనేక వచనాలలో కూడా ఇదే భావం ఉంది.

“ఎందుకంటే మనకు శిశువు కలిగాడు. మనకు కుమారుడు ప్రసాదించబడ్డాడు. ఆయన భుజాలమీద రాజ్యభారం ఉంది. ఆయనను ఆశ్చర్యకరుడు, ఆలోచనకర్త, బలాఢ్యుడైన దేవుడు, అనంత యుగాలకు తండ్రి, శాంతికర్త అంటారు.” [28]

యేసు శిష్యులలో ఒకడైన పౌలు ఇలా తేటగా రాశాడు: “మన గొప్ప దేవుడూ రక్షకుడూ అయిన యేసుక్రీస్తు.”[29]

హీబ్రూ వారికి రాసిన లేఖలో రచయిత దేవుడు తన కుమారుడైన యేసుతో ఈ విధంగా అన్నట్లు రాశాడు: “దేవా! నీ సింహాసనం శాశ్వతంగా ఉంటుంది.”[30]

యేసుక్రీస్తు దేవుని అవతారమే గనుక అయి ఉండకపోతే తాను దేవుణ్ణి అని శిష్యులకు నేర్పి ఉండేవాడు కాదు.

యేసు ఆరాధన పొందాడు

యేసు దేవుడు. ఇది ఆయనకు తెలుసు. ఈ సత్యాన్ని మరో విధంగా ఆయన వెల్లడి చేశాడు. ఇతరులచేత ఆయన ఆరాధన పొందాడు.

శుభవార్తలలో అనేక రకాలైన ప్రజలు క్రీస్తును ఆరాధించినట్లు కనబడుతుంది. ఒక కుష్ఠరోగి ఆయనను ఆరాధించాడు.[31] ఒక అధిపతి ఆయనను ఆరాధించాడు.[32] మరో చోట ఓ స్త్రీ ఆయనను ఆరాధించింది.[33] ఆయన శిష్యులు ఆయన్ను ఆరాధించారు.[34]

కొన్ని దేశాలలో ప్రజలు పూజించే వస్తువులు కుప్పలు తెప్పలుగా ఉంటాయి. అలాంటి దేశాలలో యేసును ఆరాధించడమనేది ఏమీ ఆశ్చర్యం అనిపించకపోవచ్చు. కానీ ఒక విషయాన్ని మనం గ్రహించాలి. యేసు నివసించింది ఇస్రాయేల్ దేశం. ఆ దేశంలో ఏది పడితే అది పూజించరు. ఆ దేశ ప్రజలు సృష్టికర్త అయిన దేవుణ్ణి మాత్రమే ఆరాధించేవాళ్ళు. మరి దేన్నీ మరెవరినీ ఆరాధించకూడదనే శాసనం ఉంది. ఒకసారి యేసు ఇలా అన్నాడు: “నీ ప్రభువైన దేవుణ్ణే ఆరాధించాలి. ఆయనకు మాత్రమే సేవ చేయాలి.”[35] చాలా సార్లు

యేసుప్రభువు బైబిలులోని మొదటి భాగాన్ని (పాత ఒడంబడిక లేక పాత నిబంధన) దేవుని వాక్కు అంటూ దాన్ని ఘనపరచాడు. దానిలో ఒకే స్వరం అంతటా మారుమ్రోగుతుంది – సజీవుడైన సత్య ఏక దేవుణ్ణి తప్ప దేనినీ, ఎవరినీ ఆరాధించకూడదు.

బైబిలులోని గురువుల్లో గానీ ప్రవక్తల్లో గానీ ఆరాధన పొందాలని కోరినవారెవరూ లేరు. అలాంటివారిని ఆరాధించేవారెవరూ లేరు. ఆరాధన అనేది మనిషి ఊహించరాని ఘనత అని దేవుని ప్రజలందరికీ తెలిసిన విషయం. అంతటి ధైర్యానికి ఎవరూ ఒడిగట్టలేదు. కానీ యేసు అలా కాదు. ఆరాధనను ఆయన అంగీకరించాడు. తనకు ఆరాధన తగినదనీ తాను పాత్రుడైన దేవుణ్ణనీ ఆయనకు బాగా తెలుసునని దీన్నిబట్టి మనం గుర్తించగలం.

తాను దేవుణ్ణి అని యేసు చెప్పుకున్నాడు. దేవుడు అన్నట్లు ఆయన సృష్టికర్త, పోషించేవాడు, ప్రపంచాలను పరిపాలించేవాడని భావం. ఆయన తప్ప మరి ఎవడైనా సరే, భూమిమీద బ్రతికే ఏ మనిషైనా సరే, సృష్టించబడినవాడే. యేసుక్రీస్తైతే శాశ్వతుడు. మనం మానవమాత్రులం. యేసు దేవమానవుడు.

దేవుడెలా ఉంటాడు?

ఇవి దేవుని గురించి యేసుప్రభువు వెలిబుచ్చిన సత్యాలు. దేవుణ్ణి గురించి కొన్ని విషయాలు సత్యములు. వీటికి వ్యతిరేకమైనవి సత్యములు కావని స్పష్టమే.

యేసుప్రభువు నేర్పిన సత్యాలను ఒకే దీర్ఘ వాక్యంలో ఇలా చెప్పవచ్చు: దేవుడు ఆత్మ, పవిత్రుడూ న్యాయవంతుడూ అయిన తండ్రిలాంటివాడు, శాశ్వతుడూ అనంతుడూ అయిన సృష్టికర్త, విశ్వానికి సంరక్షకుడు, పరిపాలకుడు, మానవ జాతికి తనను తాను యేసుక్రీస్తులో వెల్లడి చేసుకున్నవాడు, మనుషులు తనను తెలుసుకోవాలనీ తనను ఆత్మపూర్వకంగా సత్యంలో ప్రేమించాలనీ వారికోసం ప్రేమతో వెదకుతున్నవాడు.

దేవుని గురించి ఇంతకంటే ఉన్నతమైన ఆలోచన మరొకటి ఉంటుందని నేననుకోను.

దేవుని గురించి ఎంతో అర్థంతో కూడిన మూడు క్లుప్త సత్యాలు బైబిలులో కనిపిస్తున్నాయి.

## వెలుగు, ప్రేమ, జీవం

“దేవుడు వెలుగు. ఆయనలో చీకటి అంటూ ఏమీ లేదు.”[36] ఇది ప్రకృతి సంబంధమైన వెలుగు కాదు. ఇది పవిత్ర తేజస్సు, సత్యం, మహా వైభవం.

"దేవుడు ప్రేమ. దేవుడు ప్రేమస్వరూపి గనుక ప్రేమతో చూడనివాడు దేవుణ్ణి ఎరుగనివాడే."[37] ఇది కూడా శరీరసంబంధమైన ప్రేమ కాదు, మానవ ప్రేమ కాదు. ఇది సంపూర్ణ వాత్సల్యత, దయ, కరుణ, కృపతో కూడిన ప్రేమ. సృష్టి అంతటి ఉన్నతమైన క్షమాన్ని కోరుకొనే ప్రేమ.

దేవుడు శాశ్వత జీవం. "ఆయనే నిజమైన దేవుడూ, శాశ్వత జీవమూ."[38] ఈ జీవం చెట్లు చేమలది కాదు. జంతువులలోది కాదు. మానవ జీవమూ కాదు. ఈ జీవం స్వయంగా ఉనికి గలది, నిత్యమైనది, ఆది అంతాలు లేనిది.

దేవుని స్వభావాన్ని గురించి తిరిగి ఇలాగు నొక్కి చెప్పవచ్చు. ఆయన తన స్వరూపాన్ని యేసు క్రీస్తులో కనుపరచుకొన్నాడు. యేసు క్రీస్తు పరలోకంనుంచి వచ్చాడు. ఆయన దేవుడే. ఆయనకు దేవుడెలా ఉంటాడో నిశ్చయంగా తెలుసు. దేవుని గురించి అనేక సత్యాలను ఆయన మనకు తెలియజేశాడు. కొందరు దేవుని గురించి "నేతి, నేతి" అంటారు ("ఇది కాదు, ఇది కాదు"). అంటే దేవుడు ఇలా ఉంటాడు, అలా ఉంటాడు అని చెప్పలేమంటారు. దేవునిలో గుణాలు లేవంటారు. కానీ దేవుడైన యేసుక్రీస్తు అలా చెప్పలేదు. మనం దేవుని గురించిన సత్యాలను ఎన్నో తెలుసుకోగలమని ఆయన నేర్పాడు. దేవుడు "సచ్చిదానంద" స్వరూపం అనడమే కాదు. అంతకు మించిన విషయాలు కూడా మనం తెలుసుకోగలం.

అన్ని లోకాలకు సృష్టికర్త, పరమాత్ముడు అయిన దేవుడు భూమికి దిగివచ్చాడు. స్వయం ప్రకాశమూర్తి, అమరుడు, సర్వాతీతుడు అయిన దేవుడు క్రీస్తులో ప్రత్యక్షమయ్యాడు. ఎంతో ప్రేమ, కనికరాలు ఉన్న దేవుడు, నీతి న్యాయాలు గల ఆత్మ అయిన దేవుడు అవతరించాడు. ఒక వేదాంతి దేవుణ్ణి ఉపాధ్యాయుడుగా ఆలోచిస్తూ చేసిన ప్రార్థన రాసి ఉంది. "నేను అన్వేషించే గురువు సృష్టికర్త, స్థితికర్త, సర్వ జగత్తుకూ శాసన కర్త. నా భావనలోని ఆదర్శ ఆచారోత్తముడు దేవుని ప్రత్యక్షత, సాక్షాత్తూ దేవుడు. నా దార్శనిక మూర్తి అయిన ఆ ఆచార్యునికి వినయంతో నమస్కరిస్తున్నాను."

ఈ గురువు యేసు క్రీస్తే. ఈయన నిజమైన గురుదేవుడు, పరిపూర్ణుడైన ఉపాధ్యాయుడు, ఏ తప్పు చేయలేని బోధకుడు, తిరుగులేని దేవమానవుడు. దేవుని ప్రత్యక్షత అయిన ఆయనను మనం ఆనందంతో స్వీకరించాలి. జాగ్రత్తగా, శ్రద్ధగా, నిశ్చయతతో, నమ్మకంతో ఆయన ఉపదేశాలను పరిశీలించి శిరసావహించాలి.

దేవుడు గురించి యేసుప్రభువు బయలుపరచిన ఉపదేశాలివే: సృష్టికర్త దేవుణ్ణి మనం తెలుసుకోగలం, ప్రేమించగలం. ఆయనే మన ఆరాధనకు పాత్రుడు. మనం హృదయపూర్వకంగా ఆయనకు లోబడాలి. మన సమస్తాన్ని ఆయనకు

సమర్పణ చేయాలి.

కానీ ఆయన ఉపదేశాల ద్వారా మనకు సంపూర్ణ ప్రయోజనం కలగాలంటే, ముందుగా మనల్ని గురించి మనమే తెలుసుకొని తీరవలసిన ముఖ్యమైన సత్యాలు కొన్ని ఉన్నాయి. వీటిని మనం చదువబోతున్నాం.

**ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. యోహాను 4:23,24
2. మత్తయి 7:7
3. మత్తయి 6:9
4. అపొ కా 17:24,25
5. కీర్తనలు 145:18
6. మార్కు 7:6,7
7. యోహాను 17:11,25
8. 1 యోహాను 1:5
9. మార్కు 10:6
10. కీర్తనలు 90:2
11. మత్తయి 5:35
12. మత్తయి 5:45
13. మత్తయి 7:7-11
14. మత్తయి 6:25-33
15. మత్తయి 10:29,30
16. కీర్తనలు 47:6-8
17. కీర్తనలు 19:1,2
18. యోహాను 17:5
19. యోహాను 10:30
20. యోహాను 12:45
21. యోహాను 14:9
22. యోహాను 10:30-33
23. యోహాను 5:17,18
24. మార్కు 14:60-64
25. మత్తయి 16:16
26. యోహాను 20:28
27. యోహాను 1:1-3,14
28. యెషయా 9:6
29. తీతు (టైటస్) 2:13
30. హీబ్రూ 1:8
31. మత్తయి 8:2
32. మత్తయి 9:18
33. మత్తయి 15:25
34. లూకా 24:52
35. మత్తయి 4:10
36. 1 యోహాను 1:5
37. 1 యోహాను 4:8
38. 1 యోహాను 5:20

# 3 మనం ఎలాంటి వారం?

మానవుడంటే గొప్ప మర్మం. ఒకణ్ణి ఒకడు అర్థం చేసుకోలేడు. సరి గదా, మనల్ని మనమే గ్రహించుకోలేం. విజ్ఞానశాస్త్రం మానవుణ్ణి గురించి ఎన్నో పరిశోధనలు చేసింది. అనేక విషయాలు నేర్చుకుంది – ముఖ్యంగా మానవ శరీరాన్ని గురించి. అయినా, మానవుడు ఎవడు అనేదానికి సంపూర్ణమైన జవాబు ఇంతవరకు దొరకలేదు. కానీ జవాబు చెప్పడానికి మనుషులు ప్రయత్నిస్తూ అనేక ఊహాగానాలు చేశారు.

కొందరు మానవుడు ఒక జంతువులాంటి ప్రాణి మాత్రమే అన్నారు. మరి కొందరు మానవుడు దేవుని ఉన్నతమైన స్వరూపం అన్నారు. ఈ రెండు అభిప్రాయాలకు మధ్యస్థంగా మరెందరో వివిధ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఈ అధ్యాయంలో మానవుడు తానెవరో తెలుసుకొనేందుకు చెప్పిన మాటల జోలికి నేను పోదలచుకోలేదు. మానవుడి మనసును గురించీ, శరీరాన్ని గురించీ విజ్ఞాన శాస్త్రం చెప్పేవాటిని నేను ఇక్కడ పరిశోధించను. గురుదేవుడు చేసిన ఉపదేశాలను చూద్దాం. యేసుప్రభువు మానవ స్వభావాన్ని గురించి ఏమి ఉపదేశించాడు? దేవుని ఎదుట మానవుడి స్థితి ఎలాంటిదని చెప్పాడు? వీటినే ధ్యానం చేయాలని కోరుతున్నాను.

ఈ గురువు సామాన్యుడు కాడు. ఈయన పరలోకంనుంచి దిగివచ్చినవాడు. ఈయన దేవుడు. ఈయన బోధ జాగ్రత్తగా వినదగినది. ఈ ఉపదేశాల వెలుగులో మనమెవరిమో తెలుసుకోవడం మన కర్తవ్యం.

మొదటిది: మానవుడు దేవుని సృష్టి. అంటే మానవుడు లేని కాలం ఒకటి ఉందన్నమాట. దేవుడు మానవుణ్ణి సృజించేదాకా మానవుడికి ఉనికి లేదు. గురుదేవుడు ఇలా అన్నాడు: “సృష్టి ఆరంభంనుంచి దేవుడు వారిని స్త్రీ పురుషులుగా సృజించాడు.”[1] బైబిలులోని మొదటి అధ్యాయంలో సృష్టి కథనం ఉంది. అందులో రాసివుండేది వాస్తవమని యేసు నేర్పాడు. మానవుడి ప్రారంభమిది: “దేవుడు తన స్వరూపంలో మానవుణ్ణి సృజించాడు . . . దేవుడు నేల మట్టితో మానవుణ్ణి చేసి అతని ముక్కుపుటాల్లో ప్రాణశ్వాస ఊదాడు. ఈ విధంగా మానవుడు సజీవుడయ్యాడు.”[2]

## సృష్టించబడినవారు దేవుడు కాదు

మనం దేవునిచేత సృష్టించబడినవారం. కాబట్టి మనం దేవుళ్ళం కాము, కాలేము. దేవునిలో ఒక భాగం కూడా కాము. సృష్టికర్త సృష్టికి ఎంతో పైగా ఉన్నతంగా ఉన్నాడు. మానవుడు సృష్టించబడ్డాడు. అందుచేత దేవునికంటే ఎంతో తక్కువ. ఈ వ్యత్యాసం అనంతమైనది. దేవుణ్ణి ఒక వ్యక్తిగా "ప్రేమ సముద్రం" అని పోల్చి చెప్పుకుంటే, ఆ సముద్రంలో చేపల్లాంటి వాళ్ళం, చేపలు ఉనికిలోకి రాకముందు సముద్రం ఉంది. సముద్రం చేపలు కాదు. చేపలు సముద్రమూ కావు. చేపలూ సముద్రమూ, ఈ రెండు భిన్నమైనవి. రెండూ ఒకటి అంటే తప్పు అవుతుంది. మానవుడు లేకపోయినా దేవుడు సంపూర్ణుడు, సమగ్రమైనవాడు. మానవుడనేవాడు లేకపోయినా దేవునికి వచ్చే కొరత ఏమీ లేదు. మానవుడి ఉనికి దేవుని స్వభావంలో ఏ మాత్రమూ మార్పు కలిగించదు. కానీ దేవుడు లేకుండా మానవుడు ఉండలేడు. దేవుడు లేనిదే మానవుడికి ఉనికి లేదు.

## మానవుడి గొప్పతనం

మానవుడు దేవుని సృష్టి అన్నాం. దేవునికి మానవుడు ఎంతో తక్కువ అని చెప్పుకొన్నాం. అయితే ఇందులో ఒక విశేషం ఉంది. దేవుని సృష్టిలో మానవుడు ఉత్తమ స్థాయికి చెందినవాడు. ఎందుకంటే దేవుడు మానవుణ్ణి తన స్వరూపంలో చేశాడు. ఈ సృష్టికర్తకు మానవుడు కొన్ని ప్రాముఖ్య విషయాల్లో ప్రతిబింబంగా ఉన్నాడు. దేవుడు ఆత్మ. ఆందుచేత మానవుడికి ఆధ్యాత్మిక స్వభావం ఉంది. దేవుడు వ్యక్తిత్వం గలవాడు. అలాగే మానవుడికి వ్యక్తిత్వం ఉంది. అంటే మానవుడికి మనసు ఉంది. ప్రేమను వ్యక్తీకరించే శక్తి ఉంది. చిత్తం ఉంది. సంకల్ప శక్తి ఉంది.

దేవుడు మానవుణ్ణి సృష్టించిన రోజున మానవుడి మనసు వెలుగుతో సత్యంతో నిండివుంది. అతడి ప్రేమ దేవునిలో లగ్నం అయివుంది. ప్రేమ దేవునివైపుకు ప్రవహించింది. ఆనందం, శాంతి వెల్లువలై పారాయి. మానవుడి చిత్తం దేవుని చిత్తంతో పొందిక గలది. దేవుని చిత్తంతో శృతి గలది.

దేవుడు మానవుణ్ణి గొప్ప ఉద్దేశంతో సృజించాడు. సత్య స్వరూపియైన న్యాయవంతుడైన దేవుడు మానవుణ్ణి తన పోలిక ప్రకారం ఊరికే సృజించడు గదా, అతణ్ణి నిరుపయోగమైన నిరర్థకమైన వ్యర్థమైన ఉనికికి నియమించడు గదా. మానవుడు పక్షిలాంటివాడు కాడు. పక్షి పుల్లలు అక్కడివీ, ఇక్కడివీ ఏరి తెస్తుంది. రాళ్ళు రేణువులూ సేకరిస్తుంది. గూడు కట్టుకుంటుంది. తరువాత ఎక్కడికో

పోతుంది. మనిషి దేవుని దృష్టిలో ఇంత చౌకబారువాడు కాడు. దేవునికి మానవుణ్ణి గురించి చాలా ఉన్నతమైన సంకల్పం ఉంది.

దేవుడు మానవుణ్ణి భూమికి పాలకుడుగా నియమించాడు. అతడు లోకానికి దేవుని ప్రతినిధిగా ఉన్నాడు. బైబిలులోని మొదటి అధ్యాయంలో దేవుడు మన ఆది తల్లిదండ్రులతో ఇలా అన్నాడు: "మీరు ఫలిస్తూ సంఖ్యలో అధికం కండి. భూలోకమంతటా విస్తరించండి. దాన్ని లోబరచుకోండి. సముద్రంలోని చేపలమీదా, గాలిలో ఎగిరే పక్షులమీదా, భూమిపై తిరిగే ప్రతిదానిమీదా పరిపాలన చేయండి."[3]

మానవుడు శోకాన్నీ దురవస్థనూ అనుభవించాలని, రోగాలతో మరణంతో నిండినవాడై ధూళిలో పొర్లాడాలని దేవుడు అతణ్ణి సృజించలేదు. ఇతర మనుషులకూ క్రూర మృగాలకూ దుష్ట శక్తులకూ భవిషత్తుకూ భయపడుతూ జీవితం గడపాలని అతణ్ణి సృష్టించలేదు. అతడి ఆశలకూ అజ్ఞానానికీ బానిసగా ఉండడానికి అతణ్ణి సృజించలేదు దేవుడు. మొదటి మానవుడు భూలోకానికి పాలకుడు. అతడు ఘనుడు, న్యాయవంతుడు, స్వతంత్రుడు.

ఆ రోజుల్లోని మానవుడికి దేవుడు తెలుసు. దేవునితో సహవాసం చెయ్యగలిగేవాడు. అప్పుడు దేవునికీ, మానవుడికీ మధ్య అభ్యంతరాలు లేవు. ఆటంకాలు లేవు. మానవుడు ఉనికిలోకి వచ్చినప్పుడు పాపం లేనివాడు, మంచివాడు. దేవుని మహిమార్థం జీవించగలిగినవాడు. దేవునితో మానవుడికున్న సంబంధం ప్రేమతో నమ్మకంతో విధేయతతో కూడినది.

## పతనం

మానవుడు ఆరంభంలో ఎలా ఉండేవాడో తెలుసుకున్నాం. అంటే, ఇప్పుడు కూడా అలాగే ఉండిపోవలసినది. గురుదేవుడైన యేసు ఈ సందర్భంలో మరో విషయాన్ని తెలియజేశాడు. ఇది ఒకవేళ మీకు తెలియకపోతే, తప్పకుండా తెలుసుకుని తీరాలి. మానవుడిలో మార్పు కలిగింది. అతడు పాపం చేశాడు. ఇప్పుడు మానవుడు పతనమైపోయినవాడు. గురుదేవుడు శిష్యులకు ఈ విధంగా ఉపదేశించాడు: "మీరు చెడ్డవారు అయినా మీ పిల్లలకు మంచివాటిని ఇవ్వాలన్న సంగతి తెలుసునే. అలాంటప్పుడు పరలోకంలో ఉన్న మీ తండ్రి తనను అడిగేవారికి మరి నిశ్చయంగా మంచివే ఇస్తాడు గదా![4]

"మీరు చెడ్డవారు" అంటున్నాడు గురుదేవుడు. గమనించండి, ఎవరితో అంటున్నాడీ మాటలు? వాళ్ళందరూ చాలా మంచివాళ్ళని పేరు పొందినవారే.

యేసు మాటల అర్థమేమంటే, మనుషులందరూ పాపులే. దేవుని దృష్టిలో మనుషులందరూ చెడ్డవాళ్ళే. ఇలా చెప్పడం కొత్త సంగతి ఏమీ కాదు. ప్రాచీనమైన ప్రార్థన ఒకటి ఉంది. ఇది సంధ్యావందన శ్లోకం. "పాపోహం, పాప కర్మాణాం, పాపాత్మ, పాప సంభవా, పాహిమాం కృపయా దేవ శరణాగతి వత్సల – తస్మాత్ కారుణ్యభావేన రక్ష . . . రక్ష" ("నేను పుట్టుకచేత, క్రియలచేత పాపిని. నా ఆత్మ పాపంచేత భ్రష్టమైనది. నేను పాపాలలోనే జన్మమెత్తాను. దేవా, నన్ను కరుణించు, రక్షించు" అని దీని భావం).

మరో సందర్భంలో గురుదేవుడు గంభీర వాక్కుల్లో ఇదే సత్యాన్ని సూచించాడు.

"ఎందుకంటే లోపల నుంచి అంటే మనిషి హృదయంలోనుంచి చెడ్డ తలంపులు, లైంగిక అవినీతి, దొంగతనాలు, హత్యలు, వ్యభిచారాలు, పేరాశలు, దుర్మార్గాలు, మోసం, కామవికారం, అసూయ, అపనిందలు, గర్వం, మూర్ఖత్వం వస్తాయి. ఈ చెడ్డవన్నీ లోపలనుంచి వచ్చి మనిషిని అశుద్ధం చేస్తాయి."[5]

ఈ ఉపదేశ సారాంశాన్ని గమనించండి. చెడుగు అనేది హృదయంలో ఉంది. ఆ చెడ్డ విషయాలన్నీ మానవ హృదయంలోనుంచి వస్తున్నాయి. ఇలాంటప్పుడు హృదయం ఎంత చెడ్డదో!

ఈ విషయాన్ని లోతుగా మనం చర్చించాలి. ఈ సత్యం మీదనే గురుదేవుడు ఉపదేశించే అనేక సత్యాలు ఆధారపడి ఉన్నాయి. మనమందరమూ చెడ్డవారమనే సత్యం మనకు సహజంగా రుచించదు. దీన్ని ఎదుర్కోవడం కష్టతరం. ఈ అధ్యాయాన్ని దాటేసిపోతే బావుంటుందని కొందరికి అనిపిస్తుంది. మరి కొందరు ఈ అంశాన్ని అశ్రద్ధగా చదివేయవచ్చు. అయితే ఈ సత్యాన్ని విడిచిపెడితే, మిగతావాటిని సరిగా అర్థం చేసుకోలేం. గురుదేవుడు ఎందుకు చనిపోవలసి వచ్చింది? యేసుప్రభువు మరణానికి అర్థమేమిటి? ఈ ప్రశ్నలు గ్రహించగలగాలంటే మానవుణ్ణి గురించిన ఈ సత్యం ముందు గ్రహించుకోవాలి. ఈ సత్యాన్ని జాగ్రత్తగా పరిశీలిద్దాం. గురుదేవుడు ప్రేమతో బోధించినది మన శాశ్వత సంక్షేమాన్ని కోరి బోధించాడని జ్ఞాపకముంచుకొని మరి చదవండి.

ఆరంభంలో మనకు సహజంగా ఒక ప్రశ్న ఎదురౌతుంది. మనిషి దేవుని స్వరూపంలో చేయబడ్డాడు అన్నాం గదా – పైగా అప్పుడు మానవుడు ఏమి పాపం లేనివాడు గదా – అలాంటివాడు ఎలా చెడ్డవాడైపోయాడు? ఈ ప్రశ్నకు బైబిలే సంతృప్తికరమైన సమాధానం ఇస్తుంది.

మన ప్రథమ తల్లిదండ్రులు ఆది పురుషుడు, ఆది స్త్రీ. వారి ఆనందానికీ, సంపూర్ణ జీవితానికి అవసరమైన సమస్తమూ దేవుడు వారికిచ్చాడు. కానీ దేవుడు

వారిని పరీక్షకు పంపాడు. అలా చేయడానికి దేవునికి సంపూర్ణమైన హక్కు ఉంది.

దేవుడు వారికి ఒక ఆజ్ఞ ఇచ్చాడు. హెచ్చరిక కూడా చేశాడు. "అవిధేయత చూపారూ అంటే, చస్తారు జాగ్రత్త!" అన్నాడు. ఈ ఆజ్ఞ ఒక చెట్టుఫలాన్ని గురించినది. కానీ ఒకవేళ అది దేన్ని గురించైనా ఉంటే ఎక్కువ భేదం ఉండేది కాదు. ఆ ఆజ్ఞ అర్థం ఒకటే. ఏమిటంటే, "నేను దేవుడను. నీవు మానవుడవు. నన్ను నీవు ప్రేమించాలి. సంపూర్ణంగా నన్ను విశ్వాసించాలి. సంతోషంతో నాకు విధేయత చూపాలి. ఇలా జీవించడం నీ ఉత్తమ ధర్మం, విశేష విధి, గొప్ప అవకాశం. అలాకాక అవిధేయతద్వారా నాకు వేరైపోతే, నీవు చస్తావు, జాగ్రత్త." ఈ విషయం బైబిలులోని మొదటి పుస్తకం మూడో అధ్యాయంలో కనిపిస్తున్నది.

ఆది మానవ దంపతులు దేవునినుంచి తొలగారు. దేవునితో తమకు ఉన్న ప్రేమబంధాన్ని తెంపుకున్నారు, విశ్వాసాన్ని విసర్జించారు. విధేయతను విడిచిపెట్టారు. తమ స్వంత చిత్తానికి దేవుని చిత్తాన్ని లోబరచుకోజూశారు. తమ్మును తాము దేవునికంటే ఉన్నత స్థానంలో పెట్టుకోవాలని ప్రయత్నించారన్నమాట. వారికి వచ్చిన పరీక్ష ఇదే – దేవుడు చెయ్యమని చెప్పినది చేస్తారా? లేదా? దేవుడు చెప్పాడు గనుక విధేయత చూపవలసిందే అనే ఉద్దేశం వారికి ఉంటుందా అనేదే పరీక్ష.

మానవుడికి మనసు ఉంది. అందుచేత తనకున్న అనేక అవకాశాలను పరీక్షించుకోగలడు. మానవుడికి చిత్తం, సంకల్ప శక్తి అనేది ఉంది గనుక ఏది మంచిదో విచారణ చేసి నిర్ణయించుకోగలడు. అయితే, శోచనీయమైన విషయ మేమిటంటే, దేవుడు స్పష్టంగా చెప్పిన మాటను వినకూడదని నిశ్చయించుకున్నాడు మనిషి. స్వతంత్రంగా ప్రవర్తించడానికి తీర్మానించుకున్నాడు. తన చిత్తాన్ని దేవుని సంకల్పానికంటే ప్రాముఖ్యంగా భావించాడు. ఆది మానవుడు చేసిన పాపమెలాంటిది? అది అన్ని పాపాలకు మూలం. ప్రపంచానికి ప్రభువైన దేవునికి ఎదురు తిరిగాడు. దేవునికష్టమేదో విచారించకుండా తన ఇష్టప్రకారమే చేశాడు. దేవుడు తన జీవితానికి అధికారి అని గుర్తించినవాడు కాడు. పాపమనేదాని సారాంశమిదే.

## ఫలితం

ఆ గడియలోనే మానవుడి చరిత్ర వక్రమైంది. ఆ మొదటి స్త్రీ పురుషులు పాపులయ్యారు. వారి మనసుల్లో వెలుగు తగ్గిపోయింది. చీకటీ, తగని ఆలోచనలూ వారి మనసుల్ని ఆక్రమించాయి. వారి చిత్తం దేవుని చిత్తంనుంచి

శ్రుతి తప్పినది. దేవుని చిత్తానికి వ్యతిరేకంగా రూపొందింది. వారి హృదయంలో ప్రేమ, ఆనందం, శాంతి లోపించాయి. భయం, ఆందోళన, విచారం వారిని ఆవరించాయి. ప్రేమ, విశ్వాసం, విధేయతల సంబంధం తెగిపోయింది. మానవుడు నేరస్థుడయ్యాడు. దేవుని సహవాసంనుంచి వేరైపోయాడు. మానవుడు విధేయత చూపకపోతే అతడు చనిపోతాడని దేవుడన్నాడు. మరణం అంటే వేరైపోవడం. శరీర మరణం శరీరంనుంచి ఆత్మ వేరైపోవడం. ఆత్మసంబంధమైన మరణం అంటే మనిషి ఆత్మ దేవుని సహవాసంనుంచి, ఆయన జీవంనుంచి వేరైపోవడం. పాపం అనేది దేవుణ్ణి బయట ఉంచే గోడను లేవనెత్తుతుంది. ఇది మనిషి బతుకుతుండగానే ఆధ్యాత్మిక మరణం. మొదటి మనిషికి, అతడి భార్యకు సంభవించింది అదే.

**అయితే ఇప్పుడో?**

"అయితే, ఇప్పటి సంగతి చెప్పవయ్యా! ఎప్పుడో జరిగినదానితో మనకు నిమిత్తమేమిటి?" అంటూ ఎవరైనా అనవచ్చు. "మనం శాస్త్రీయంగా ఎంతో పురోగతి సాధించాం. అభివృద్ధి చెందాం. నవ యుగంలో ఉన్నాం. విద్యలో నాగరికతలో ఎంతో ముందంజ వేశాం" అని కూడా వాదించవచ్చు.

నీ చుట్టూరా ఒక్కసారి కలయచూడు. అవినీతి, మోసం, దుర్మార్గత, స్వార్థం, అన్యాయం, ద్వేషం, హింస, దౌర్భాగ్యస్థితి, మరణం మొదలైన చెడు విషయాలు అంతటా కానవస్తాయి. విజ్ఞానశాస్త్రమూ, విద్యా, నాగరికతా మానవుడి హృదయాన్ని మాత్రం మార్చలేకపోయాయి. వీటిని బట్టి మనం మంచివాళ్ళం కాలేదు. పాపాన్నీ, మరణాన్నీ జయించలేదు. మన ఆది పితరులు చేయనారంభించినదే మనం కొనసాగిస్తున్నామనడానికి రుజువులు ఎన్నో ఉన్నాయి. వారు ఏమయ్యారో, మనమూ అదై ఉన్నాం. ఆ స్థితే మనకూ సంక్రమించింది. మనుషులు చాలా సార్లు దుష్టమృగాలకంటే చెడ్డగా ప్రవర్తించడం మనం చూస్తూనే ఉన్నాం.

ఆకాశం వైపుకు చూడు. దేవుని మహిమను సూచించే నక్షత్రాలను ఒక్కసారి చూడు. దేవుని మహా శక్తి, ప్రభావం, జ్ఞానం, మహత్తు కొంతవరకు నీకు స్ఫురించి తీరుతాయి. మానవలోకం ఉండవలసివున్నట్లు ఉందని ఎలా అనుకోగలవు? చెప్పు. మానవుడు ఆరంభంలో దేవుని వనంలో ఉన్నట్టు ఇప్పుడున్నాడా? ఆ విధంగా అనుకోలేము. అసాధ్యం.

నీ లోపలి స్థితిని చూచుకో. నీ హృదయంలో ఉన్న పరిస్థితి నీకు అర్థం కావడం

లేదూ? హృదయంలో తరచుగా అశాంతి ఉంటుంది. ఆత్మలో ఏదో భారమున్నట్టు అనిపిస్తుంది గదూ? అప్పుడప్పుడు నీ అంతరంగ స్థితి బాగా లేదని ఏదో చెడిందని నీకు తోచడం లేదా? ఇతరుల్లో లోపాలు, దోషాలు కనిపిస్తున్నాయి. అలాంటప్పుడు మనలో కూడా లోపాలు, దోషాలు ఉన్నాయని గ్రహించలేనంత శూన్యులెవరున్నారు?

మన పొరుగువారికంటే మనం మంచివాళ్ళమని నిశ్చయం చేసుకోవడానికి ప్రమాణమేది? గర్విష్టులూ, తమ స్థితిని తాము తెలుసుకోలేని వెర్రివారూ ఆ విధంగా తలపోయవచ్చు. ఎలాంటి పాపం చేయలేదని చెపితే వాస్తవాన్ని నుండి తప్పుకుంటున్నామన్న మాట. యేసుప్రభువు ఉపదేశానికి వ్యతిరేకత చూపుతున్నాం కూడా.

**దేవుని వాక్కును చూడండి**

అన్నిటికంటే ముఖ్యమైనది దేవుని వాక్కు దృష్టి, ఈ క్రింద పొందుపరచిన వచనాలలో మన నిజ స్థితిని దేవుడు చూపుతున్నాడు.

“జ్ఞానదృష్టిలో ప్రవర్తించేవారెవరైనా ఉన్నారా అని దేవుణ్ణి వెదికేవారెవరైనా ఉన్నారా అని ఆయన చూశాడు. వాళ్ళంతా త్రోవ తప్పినవాళ్ళు. అందరూ ఏకంగా వ్యర్థులయ్యారు. మంచి చేసే వాడు లేడు – ఒక్కడూ లేడు”.[6] మానవ లోకంవైపు చూచినప్పుడు పవిత్రుడైన దేవునికి కనబడిన స్థితి ఇది. ఈ లోకంలో ఒక్క వ్యక్తి కూడా చెడు లేనివాడు కానరాడు. దేవుని దృష్టిలో మనిషి మంచివాడు కాడు.

“ఎన్నడూ తప్పిదం చేయకుండా, ఎప్పుడూ మంచినే చేసే న్యాయవంతుడు ఈ భూమిమీద ఎవ్వడూ లేడు.” “. . . మనుషుల హృదయం చెడుతనంతో నిండివుంది. బ్రతికినన్నాళ్ళూ వారి హృదయంలో వెర్రితనం ఉంటుంది. తరువాత వారు చనిపోయిన వారిదగ్గరికి చేరుతారు.”[7]

పాపం విషయం వచ్చేటప్పటికీ మనిషి వెర్రివాడైపోతాడు.

“మేమందరమూ అశుద్ధుల లాంటి వాళ్ళమయ్యాం. మా నీతి క్రియలన్నీ మురికి గుడ్డలాగా ఉన్నాయి. మేమందరమూ ఆకులలాగా వాడిపోయేవాళ్ళ. గాలిలాగా మా అపరాధాలు మమ్మల్ని ఎగరగొట్టి తీసుకుపోతున్నాయి.”[8]

మనం చేసే క్రియలు చాలా మంచివని మనం అనుకోవచ్చు. ఇవన్నీ పాపంచేత మచ్చలు గలవి. ఇవి దేవునికి మురికి గుడ్డలలాగా కనిపిస్తున్నాయి.

“మన దేవుడైన యెహోవాకు వ్యతిరేకంగా అపరాధం చేశాం, గనుక సిగ్గుతో సాష్టాంగపడుదాం రండి. మన అవమానం మనల్ని కప్పుకోనివ్వండి.”[9]

యథార్థ భక్తులు ఈ విధంగా ఆత్మ పరీక్ష చేసుకుని గ్రహించగలుగుతారు.

"నా ప్రజ మూర్ఖులు. వారు నన్ను ఎరగరు. వారు తెలివితక్కువ పిల్లలు. వారికి గ్రహించే శక్తి లేదు. చెడుగు చేయడంలో వారు ఆరితేరినవారు గాని మంచి చేయడం ఎలాగో వారికి ఏమీ తెలియదు."[10]

ఈవిధంగా దేవుడు తన ప్రజలను చూచి చెప్పాడు.

"హృదయం అన్నిటికంటే మోసకరం. దానికి ఘోరమైన రోగం ఉంది. దాన్ని ఎవరు గ్రహించగలరు?"[11]

మన హృదయమే మనల్ని మోసగిస్తుంది.

ఈ విషయమంతా క్లుప్తంగా బైబిల్‌లోని క్రొత్త ఒడంబడిక (నిబంధన)లోని ఒక భాగంలో ఇలా రాసి ఉంది: "న్యాయవంతుడు లేడు, ఒక్కడూ లేడు. గ్రహించేవారెవ్వరూ లేరు. దేవుణ్ణి వెదికేవారెవ్వరూ లేరు . . . ప్రతి ఒక్కరి నోరు మూతపడాలి, లోకమంతా దేవుని తీర్పు క్రిందికి రావాలి – అందుచేత ధర్మశాస్త్రం చెప్పేదంతా తన క్రింద ఉన్న వారికి చెపుతూవుంది . . . భేదమేమీ లేదు – అందరూ పాపం చేశారు, దేవుడిచ్చే మహిమను అందుకోలేక పోతున్నారు."[12]

## ఏది సత్యం?

మనిషిని గురించిన సత్యమేది? నిన్నూ నన్నూ గురించిన అసలు సంగతి ఏమిటి? గురుదేవుడైన యేసుక్రీస్తు ఏమి నేర్పాడు? గురుదేవుడు తన శిష్యులను కూడా చెడ్డవారని పిలవడమేమిటి మరి? ఆయనకు మన హృదయం ఎలాంటిదో బాగా తెలుసు, గనుక ఉన్నది ఉన్నట్టే అలా చెప్పాడు.

ఇది మానవుని పాపకర్మ. స్వాభావికంగా మనుషుల తలంపులు సరిగా ఉండవు. వారి కోరికలు సరియైనవి కావు. వారు ఎన్నుకొనేవి మంచివి కావు. మానవునికి చెందిన ప్రతిదానికీ మానవుడి పతనంచేత దెబ్బ తగిలింది. ఆలోచనలు, కోరికలు, చిత్తం, దేహం, ఆత్మ, జీవం మొదలైనవన్నీ పతనమైనవే. మానవుడికి కేంద్రంగా ఉండేది దేవుడు కాదు, తాను, తన ఆశలే. మనిషి స్వప్రయోజనపరుడైపోయాడు. అతడు దేవునికి, లేక దేవుళ్ళకు ప్రార్థన చేయవచ్చు. మ్రొక్కవచ్చు. అయితే లోలోపల అతడి కోరిక ఏమంటే దేవుడు తనకోసం జీవించాలి, తాను దేవునికోసం కాదు. దేవుడు తనకు సేవ చేస్తూ, ఆరోగ్యాన్ని, శ్రేయస్సును, సంతోషాన్ని, లేక మంచి భార్యను, సంతానాన్ని, లేక మనశ్శాంతిని, సంతృప్తిని, లేక ఏది మంచిదో తాను అనుకున్నదాన్ని ఇవ్వాలని కోరుతున్నాడు. ఆశించేది తనకు దొరకకపోతే అతడు దేవునిమీద కోపగించుకోగలడు కూడా. ఒక్క

మాటలో చెప్పాలంటే మనిషి పాపి.

అందరూ ఏదో విధంగా పాపం చేస్తూనే ఉంటారు.

కొందరు మనుషులను మంచివారంటాం. నిజంగా కొంతమంది ఇతరులకంటే మంచివారుగా కనిపిస్తున్నారు. కానీ మనుషులందరినీ దేవుని పరిపూర్ణమైన మంచితనంతో పవిత్రతతో పోల్చిచూస్తే ఏ మనిషి మంచివాడు కాడు. అందరిలో లోపం, పాపం కనబడుతున్నది. ఇది దేవుడు మనకు తెలియజేస్తున్నాడు.

మనుషులందరూ చేసే పాపాలు ఒకే రకంగా ఉండవు. అన్నీ స్పష్టంగా కానరావు. కొందరు మనుషులు మితం లేకుండా పాపమనే బురదలో బహిరంగంగా పొర్లుతూ ఉంటారు. మరికొందరు మర్యాదస్థులై గౌరవాన్ని పొందినవారై మతస్థులై పాపాలు చేస్తున్నారు. కొందరు శరీర సంబంధమైన పాపాలు చేస్తారు, మరి కొందరు తమ బహిరంగ జీవితాన్ని ఏదో మార్గాన శుద్ధి చేసుకొనే ప్రయత్నం చేస్తారు గాని అంతరంగంలో శుద్ధి లేకుండా ఉంటారు. కొందరు వ్యభిచారం చేస్తారు, దొంగతనం చేస్తారు. హత్యలు చేస్తారు. మరికొందరు స్వార్థం, ఆత్మస్తుతి, స్వాతిశయం, స్వప్రయోజకత్వం, అహంకారం, స్వనీతి అనే విషయాల్లో పాపులు. ఇతరులకంటే గొప్ప భక్తులమనే 'గీర్మాణం', మంచివారమనే గర్వం కొంతమందికి ఉంది. దానికి వ్యతిరేకంగా దేవుడు చెప్పే సత్యాలు తమకు ఇష్టం లేదు గనుక వినని అవిశ్వాసం, అవిధేయత అనే పాపాలు కూడా వారు చేస్తున్నారు.

పాపం సిగ్గు లేకుండా ప్రవర్తించవచ్చు. అది మురికి కాలువలో పొర్లాడగలదు. ఆపై పాపం కపటంగా కుయుక్తితో ప్రవర్తించవచ్చు. మతం, నీతి అనే పేర్ల కింద మర్యాదగా చెలామణి కాగలదు.

పాపులందరూ ఒకేవిధంగా పాపం చేయరు గాని ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా పాపం చేస్తారు. పాపమనేది బహిరంగమైనది మాత్రమే కాదు, అంతరంగమైనది కూడా. మన స్వభావంలో బాగా నాటుకుని ఉంది పాపం. మనం చేసేదానిలో మాత్రమే కాదు, మనమేమై ఉన్నామో అందులోనే ఉంది పాపం.

కొందరికి ఈ సంగతి గిట్టదు. యేసుప్రభువు చెప్పినదే గనుక నిజమైతే, దానికి వ్యతిరేకమైన అభిప్రాయాలన్నీ తప్పు అని అర్థం. పాపానికి మోసం చేసే స్వభావం ఉంది. పాపం మనుషులను గుడ్డివాళ్ళనుగా చేసి దాక్కుంటుంది. అందుచేత పాపమనేది కొన్ని సార్లు ఉన్నట్టు కనబడదు. పాపం కలిగించే భ్రమ ఇది. హృదయం అన్నిటికంటే మోసకరమైనది. ఇతరులలోని లోపాలు మనకు బాగా

కనబడవచ్చు. మనలోని లోపాలు మాత్రం అంత సులభంగా కానరావు.

"మనం పాపం లేనివారమని చెప్పుకొంటే మనలను మనమే మోసపుచ్చుకొంటున్నాం. మనలో సత్యం ఉండదు."[13] తన పాపాన్ని గురించి గ్రహించని వ్యక్తిలో దేవుడు పని చేయడం లేదన్నమాట.

మనం పైన పరిశీలించిన బైబిలు వచనాలు వ్రాసినవారేమీ భ్రష్టులయినవారు కాదు, వారు లోకంలోకెల్లా గొప్ప భక్తులని మనం గుర్తించదగినవారు. వారు జ్ఞానోదయం కలిగినవారు. వారికి దేవుడు తెలుసు. దేవుని సన్నిధిలో తమ్మును తాము గ్రహించుకోగలిగారు. వారు దేవుణ్ణి ఇంకా ఎక్కువగా ఎరిగినకొలది తమలో ఉన్న పాపస్వభావాన్ని బాగా అర్థం చేసుకోగలిగారు. మానవుడు స్వభావసిద్ధంగా ఎంత చెడిపోయినవాడో, బలహీనుడో బాగా నేర్చుకోగలిగారు.

## సర్వ జ్ఞానోదయం

ఇదే సత్యం నిజమైన జ్ఞానోదయంలో ఒక ప్రముఖ భాగం. మన భ్రష్ట స్వభావాన్ని మనం తెలుసుకోవాలి. దేవుడు దాని పట్ల ఎలా వ్యవహరిస్తాడో, దానికి ఎలాంటి నివారణ ఉందో కూడా తెలుసుకోవాలి. మనం పాపవిముక్తిని, శాంతిని, ఆనందాన్ని అనుభవించగల మార్గం ఇదే.

గురుదేవుడు ఒక ఉదాహరణ చెప్పి ఈ సత్యాన్ని నేర్పాడు.

"ప్రార్థన చేయడానికి ఇద్దరు మనుషులు దేవాలయానికి వెళ్ళారు. వారిలో ఒకడు పరిసయ్యుడు (మతనిష్ఠ గలవాడు). ఇంకొకడు సుంకంవాడు. పరిసయ్యుడు నిలుచుండి తననే ఉద్దేశించి ఇలా ప్రార్థించాడు: దేవా, ఇతరులు దోపిడీదొంగలూ అక్రమకారులూ వ్యభిచారులూ, నేను అలాంటివాణ్ణి కాను – ఈ సుంకంవాడి లాంటివాణ్ణి కూడా కాను. అందుచేత నీకు కృతజ్ఞతలు చెప్పుకొంటున్నాను. వారానికి రెండు సార్లు ఉపవాసముంటాను, నా రాబడి అంతట్లో పదో భాగం చెల్లిస్తూవున్నాను. ఆ సుంకంవాడైతే దూరంగా నిలుచుండి ఆకాశవైపు తలెత్తడానికి కూడా ధైర్యం లేకుండా ఉన్నాడు. గుండెలు బాదుకొంటూ దేవా! నేను పాపినే. నన్ను కరుణించు అన్నాడు. దేవుని దృష్టిలో న్యాయవంతుల లెక్కలో చేరి అలా ఇంటికి వెళ్ళింది ఇతడే గాని ఆ మొదటి మనిషి కాదని మీతో చెపుతున్నాను. ఎందుకంటే, తనను గొప్ప చేసుకొనే ప్రతి ఒక్కరినీ తగ్గించడం, తగ్గించుకొనేవారిని గొప్ప చేయడం జరుగుతుంది."[14]

దేవుణ్ణి ఎరిగినవాడు, దేవునికి అంగీకారమైనవాడు తాను మంచివాణ్ణని భావించుకొనేవాడు కాదు. తాను పాపినని ఎరిగి దేవుడిచ్చే కరుణనూ క్షమాపణనూ

మనసారా ఆశించేవారినే దేవుడు దయ చూపి స్వీకరిస్తాడు.

సత్యమే మనల్ని విమోచించగలదు. పైన చెప్పినది ఆ సత్యంలో ఒక భాగం. పాపం అనేది దాస్యం. పాపవిముక్తి, రక్షణ అంటే పాపశక్తినుంచి, పాపానికి రావలసిన శిక్షనుంచి, చివరికి దాని సన్నిధానంనుంచి కూడా విడుదల అనుభవించడం. పాపంవల్ల కలిగే తప్పుడు ఊహలు పోయేవరకు, మనం ఏమై ఉన్నామో గుర్తించేవరకు దేన్ని సరిగా గ్రహించము, విడుదల పొందము.

విముక్తి దేనినుంచి? బాధ, దుఃఖం, అజ్ఞానంనుంచి మాత్రమేనా? ఇవన్ని సూచనలు మాత్రమే. అసలు రోగం పాపం, పాపంనుంచి మనకు విమోచన కావాలి.

**పాపంవల్ల కలిగే ఫలితాలు**

గురుదేవుడు పాప ఫలితాలను గురించి ఖండితంగా ఉపదేశించాడు. ఆయన మనలను ప్రేమిస్తున్నాడు గనుకనే అలా ఉపదేశించాడు. ప్రేమతో గురుదేవుడు చెప్పినది వినగలవాడే జ్ఞాని. పాపం మూలంగా అపాయమేమీ కలగదనుకోవడం అజ్ఞానం. పాపానికి భయంకరమైన ఫలితాలు కలుగుతాయి. సందేహం లేదు. ఈ ఫలితాలు ఏమో యేసుప్రభువు తానే తేటగా వివరించి చెప్పాడు.

మొదటిది: పాప ప్రభావం చేతనే మనుషులు సత్య విషయమైన జ్ఞానాన్ని కోల్పోయారు. దేవుని విషయాలను గ్రహించలేనంతగా వారి మనసులు మొద్దుబారి పోయాయి. పాపం అంధకారాన్నీ భయాన్నీ తత్తరపాటునూ తెచ్చిపెట్టింది.

నెమ్మదిలేనితనం, నిరుత్సాహం, పరస్పర విరుద్ధ వివాదాలు, నిరాశ, ఆత్మసంబంధమైన అజ్ఞానం అంతటా ఉన్నాయి. మనుషులు తమ నిజ స్థితిని, దేవుణ్ణి, దేవుణ్ణి సమీపించే మార్గాన్ని, పాపాన్ని పోగొట్టే మార్గాన్నీ ఎరగరు. అంటే ఈ భూమిపై మన జీవితాల్లోని ముఖ్యమైన విషయాల గురించిన సత్యం తెలియక చీకటిలో నడుచుకొంటున్నారన్నమాట.

రెండోది: మనుషులు పాపులు కావడం మూలంగా దేవునికి విరోధులయ్యారు. ఈ సంగతి వారికి తెలిసి ఉండకపోయినా ఈ సత్యం మారబోదు.

మానవ స్వభావం, అది ప్రవర్తించే విధానం గురుదేవుడైన క్రీస్తు సిలువ దగ్గర తేటగా కనబడుతున్నాయి. యేసుక్రీస్తు దేవుని అవతారం. ఆయన పవిత్రుడు, దయాళుడు, ప్రేమ పూర్ణుడు. ఆయన మేలు చేస్తూ ఉండేవాడు. ఆయన ఎవరికీ ఎన్నడూ హాని చేయలేదు. ఆయన పట్ల ఆనాటి మనుషులూ మత నాయకులూ ఎలా వ్యవహరించారు? వారు సంతోషంతో గురుదేవుణ్ణి స్వీకరించి అంగీకరించి

ఉంటారని మనం అనుకోవచ్చు. కానీ అలా జరుగలేదు. వారు ఆయనను హత్య చేశారు. దేవుణ్ణి ప్రేమిస్తున్నామని చెప్పారు. తీరా ఆయన వారి మధ్యకు మనుషుడుగా వచ్చినప్పుడు ఆయన్ను అసహ్యించి, హింసించి, చంపారు. ఆయన దయ పరిపూర్ణమైనది. ఆయన ప్రేమమూర్తి. అలాంటి గురుదేవుణ్ణి నిరాకరించి చంపింది మత నిష్ఠగలవారే, మేము దైవభక్తి గలవాళ్ళమని చెప్పుకొనేవారే.

ఇదంతా ఎలా జరిగింది? పాపం కల్పించిన మాయాప్రభావమిది. పాపంవల్ల కలిగే భ్రమ ఇది. దేవుని వద్దనుంచి మానవుడు తొలగిపోవడం మూలంగా కలిగే పాపం ఫలం ఇది. మనుషులు ఎంతైనా మతాసక్తులు కావచ్చు. మేము దేవుని సేవకులమనుకోవచ్చు గానీ అదే సమయంలో దేవుని విషయంలో వారికి ఆయన కుమారుణ్ణి తృణీకరించేటంత విరోధ భావం ఉండవచ్చు.

గురుదేవుడు నేర్పిన సత్యమిదే. మనం గ్రహించవలసిన మాటలతో ఆయన తన శిష్యులను హెచ్చరించాడు: "లోకం మిమ్ములను ద్వేషిస్తే, మీకంటే ముందుగా నన్ను ద్వేషించిందని తెలుసుకోండి . . . ఇప్పుడైతే వారు నన్నూ తండ్రినీ చూచి ద్వేషించారు."[15]

దుఃఖకరమైన సత్యమేమిటంటే ఒకప్పుడు దేవుని పోలికలో సృజించబడ్డ మానవుడు ఇప్పుడు కొన్ని విషయాల్లో దేవుని పోలికకంటే పిశాచం పోలికను ఎక్కువగా కనపరస్తూ ఉన్నాడు. ఇలా కనపరచే విధానాల్లో ఒకటి యేసుక్రీస్తును నిరాకరించడం.

మరొకటి – మనుషులు పాపులు, అందుచేత వారు నశించిన స్థితిలో ఉన్నారు, ఆధ్యాత్మిక జీవం లేనివారు, నాశనపాత్రులు.

ఆది మానవుడు పాపం చేసినప్పుడు ఏం జరిగిందో చూశాం. దేవుని సన్నిధినుంచి, దేవుని ఆనందం, శాంతి, సహవాసాలనుంచి వేరైపోయాడు. ఎల్లప్పుడూ పాపంవల్ల కలిగే ఫలితం ఇదే.

దేవునికి మనిషికి మధ్య ఉన్న అడ్డును గురించి బైబిలులోని ఒక భక్తుడు ఇలా వ్రాశాడు: "మీ అపరాధాలు మీకూ మీ దేవునికీ అడ్డం వచ్చాయి. మీ పాపాలు ఆయన ముఖం మీకు కనబడకుండా చేశాయి. అందుచేత ఆయన వినడం లేదు."[16]

పాపానికి ఇది తగిన శిక్ష. మనుషుల నేరానికి ఈ శిక్ష సరిపోయినదే. ఇది విత్తిన దానినే కోయడం. మనిషి పాపం చేయాలని ఉద్దేశించి దేవుని నుంచి తొలగిపోతాడు. తన ఇష్టప్రకారం ప్రవర్తించడం ఆరంభిస్తాడు. పని ఆరంభంలో అతడు ఎన్నుకొన్నది, పని చేశాక అతడికి దొరుకుతుంది. పాపంలో జీవించేలా

అతడు తనను దేవునినుంచి వేరు చేసుకోవాలంటే అలాగే చేయవచ్చు. అతడు వేరైపోతాడు. ఎవరైనా ఏదో విధంగా అతణ్ణి దేవుని దగ్గరికి తెస్తేనే తప్ప అతడు శాశ్వతంగా దేవుని సన్నిధినుంచి దూరంగా ఉంటాడు. ఒక వ్యక్తికి సంభవించగల చివరి ఘోరమిది. మనం ఇప్పుడు చేసుకొనే తీర్మానాన్ని బట్టి చివరికి మనకు న్యాయమైన తీర్పు జరుగుతుంది. మనం ఇప్పుడు దేని వెంటపడుతామో అదే దొరుకుతుంది. దేవునికి బదులుగా పాపాన్ని ఎన్నుకొంటే మన చివరి స్థితి మాటల్లో చెప్పనశక్యం కాని భయంకరంగా ఉంటుంది.

పాపానికి రాబోయే దేవుని శిక్ష గురించి గురుదేవుడు ఎన్నోసార్లు హెచ్చరించాడు. దేవుడు ప్రేమస్వరూపి. ఇది సత్యమే. కానీ దేవుని ప్రేమ న్యాయాన్ని త్రోసిపుచ్చదు. పవిత్రత మరచిపోదు. దేవుడు ప్రేమే గానీ దేవుడు పాపాన్ని ద్వేషిస్తాడు. దాన్ని శిక్షించి తీరుతాడు. పాపమంటే దేవునికి ఎంతో అసహ్యమైన విషయం. దానిమీద ఆయన కోపం ఎప్పుడూ మండుతూ ఉంటుంది. "దుర్మార్గం మీదా దేవుని కోపం కూడా పరలోకంనుంచి వెల్లడి అయింది."[17]

మంచితనం, సత్యం, నీతిన్యాయాలు, ధర్మశీలత ఇవి దేవునికి ఎంతో ప్రియంగా ఉన్నాయి. కాబట్టి వీటికి వ్యతిరేకమైనవి ఆయనకు కోపం పుట్టిస్తాయి. ఒకవేళ పాపంమీద కోపగించకపోతే దాన్ని శిక్షించకపోతే ఆయన ఎలా దేవుడై ఉంటాడు?

పాపంమీదికి దేవుడు పంపే తీర్పు గురించి గురుదేవుడైన యేసుక్రీస్తు అనేక సార్లు హెచ్చరించాడు. కొందరిని గురించి "వీరు శాశ్వతమైన శిక్షలోకి వెళ్ళిపోతారు" అన్నాడు.[18] వేరు చోట ఆయన "శరీరాన్ని మాత్రమే చంపేవారికి భయపడకండి. వారు ఆత్మను చంపలేరు. శరీరాన్ని ఆత్మనూ కూడా నరకంలో నాశనం చేయగలవాడు ఒకడు ఉన్నాడు. ఆయనకే భయపడండి" అన్నాడు.[19] "నరకంలోని ఆరని అగ్ని"ని గురించి గురుదేవుడు మరో సందర్భంలో మాట్లాడాడు.[20] "అక్కడ ఏడుపూ, పళ్ళు కొరుకుకోవడం ఉంటాయి" అన్నాడు.[21]

ఇవన్నీ పాపుల మార్గంలో చివరికి జరగబోయేవి. ఎందుకంటే పాపులు నేరస్తులై అపరాధులై దోషులై ఉన్నారు. వారికి శిక్ష తగినదే. విశ్వానికి న్యాయమూర్తియైన దేవుడు వారి వారి వంతుచొప్పున తగినదాన్ని ఇవ్వకతప్పదు. లోకంలో అంతటా మనుషులు ఒప్పుకొంటున్నారు దుర్మార్గతకు శిక్ష రావాలని. అన్నీ జాతుల్లో చట్టాలూ న్యాయస్థానాలూ చట్టాలను మీరినవారికి శిక్షలూ ఉన్నాయి. మనమంతా దేవునికి వ్యతిరేకంగా పాపం చేశాం. ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించాం, దేవుని చట్టాలను అతిక్రమించాం. న్యాయమూర్తియైన దేవుడు

ఇదంతా జరగనట్టు ప్రవర్తించలేదు, అలా ప్రవర్తించడు. ఆయన దీన్నంతా ఎలా చూస్తూ ఊరుకోగలడు?

**ఆశాభావాన్ని పుట్టించే విషయం**

ఈ అధ్యాయం ముగింపులో ఆశాజనకమైన ఒక మాట చెప్పాలని నా కోరిక. మనం పాపులమై ఉన్నప్పటికీ మన పాపాలు దేవునికి అసహ్యంగా ఉన్నప్పటికీ, దేవుడు మనల్ని ప్రేమిస్తున్నాడు. “దేవుడు ఈ లోకాన్ని ఎంతో ప్రేమించి తన ఒక్కగానొక్క కుమారుణ్ణి ప్రసాదించాడు. ఆ కుమారుని మీద నమ్మకం ఉంచేవారెవరైనా సరే నాశనం కాకుండా శాశ్వత జీవం పొందాలని ఇందులో దేవుని ఉద్దేశం.”[22]

యేసుప్రభువు వచ్చి దేవుని స్వభావాన్ని వెల్లడి చేశాడని రెండో అధ్యాయంలో చూశాం. అయితే ఆయన ఈ లోకానికి వచ్చినది ఈ ఒక్క కారణాన్నిబట్టి కాదు, ఎంతమాత్రం కాదు. ఈ గురుదేవుడు మన పాపాన్ని తీసివేసి మనకు పాపవిముక్తి కలిగించడానికి వచ్చాడు.

ఆయన తన గురించి ఇలా చెప్పాడు: “నశించినదాన్ని వెదకి రక్షించడానికి మానవ పుత్రుడు వచ్చాడు.”[23] నశించినది అంటే మనుషులు. మానవ పుత్రుడంటే మానవుడుగా పుట్టిన దేవుని కుమారుడైన యేసుక్రీస్తు. దేవుడు లోకంలోకి వచ్చినప్పుడు తప్పిపోయి నశించిన స్థితిలో ఉన్నవారిని వెదకుతూ వచ్చాడు. ఆయన వచ్చినది వారిని శిక్షించి ధ్వంసం చేయడానికి కాదు గాని వారిని రక్షించడానికే. దీన్ని గురించి యేసు శిష్యుల్లో ఒకడు ఇలా రాశాడు: “పాపులను రక్షించడానికి క్రీస్తు యేసు లోకానికి వచ్చాడు. ఈ మాట నమ్మతగినది, పూర్తి అంగీకారానికి యోగ్యమైనది. పాపులందరిలోనూ ప్రముఖ పాపిని నేనే.”[24]

పాపులను దేవుని దగ్గరికి పిలవడానికి యేసు వచ్చాడు.

“నేను పాపులనే పిలవడానికి వచ్చాను గాని న్యాయవంతులను కాదు” అని ఆయన అన్నాడు.[25] ఈ మాట తాము చాలా మంచివాళ్ళమని అనుకొనే కొందరు మత నాయకులతో చెప్పాడు. పాపులని పేరు పొందినవారితో యేసు కలసిమెలసి ఉండడం కారణంగా వారు ఆయన్ను విమర్శించారు. తాము పాపులమని తెలిసినవారికోసమే నేను వచ్చానని యేసు చెపుతున్నాడు. గొప్ప మార్పులకూ, విశేషమైన అవకాశాలకూ హక్కులకూ, సంపూర్ణ విముక్తికీ, శాశ్వతానందానికీ, ప్రేమస్వరూపియైన దేవుని సన్నిధికీ పిలవడానికి గురుదేవుడు వచ్చాడు.

ఈవిధంగా మానవకోటి పట్ల దేవుని గొప్ప శ్రద్ధనూ మహా ప్రేమనూ కొంతవరకు అర్థం చేసుకోగలం. మనుషుల నాశనాన్ని ఆయన ఏమీ కోరడు.

మనకు సత్యం, కాంతి, విముక్తి, శాంతి కలగాలని కోరుతున్నాడు. మనం స్వభావసిద్ధంగా, సహజంగా, క్రియల మూలంగా పాపులమై ఉన్నప్పటికీ మనకు గొప్ప మార్పు కలగవచ్చు. మన పాపాలన్నీ తొలగించబడడం, మనకు కొత్త స్వభావం కలగడం, మన పతనమైన స్థితి కంటే ఎంతో ఉన్నతమైన స్థితి పొందడం సాధ్యమైంది. ఇలా జరగాలని దేవుని కుమారుడు పరలోకంనుంచి భూలోకానికి వచ్చాడు.

అయితే దీన్నంతటినీ సాధించేందుకు ఆయన బాధలు అనుభవించి చనిపోవలసి వచ్చింది. నిజంగా ఆయన రాకడకు అన్ని కారణాలకంటే ఈ కారణమే ప్రధానమైనది. ఇది ఎందుకు నిజమో తరువాతి అధ్యాయంలో కనిపిస్తున్నది.

**ఈ అధ్యాయంలోని బైబిల్‌లోని రిఫరెన్సులు:**

1. మార్కు 10:6
2. ఆది 1:27; 2:7
3. ఆది 1:28
4. మత్తయి 7:11
5. మార్కు 7:21-23
6. కీర్తనలు 14:2,3
7. ప్రసంగి 7:20; 9:3
8. యెషయా 64:6
9. యిర్మీయా 3:25
10. యిర్మీయా 4:22
11. యిర్మీయా 17:9
12. రోమ్ 3:10-23
13. 1 యోహాను 1:8
14. లూకా 18:9-14
15. యోహాను 15:18-24
16. యెషయా 59:1,2
17. రోమ్ 1:18
18. మత్తయి 25:46
19. మత్తయి 10:28
20. మార్కు 9:43
21. మత్తయి 22:13
22. యోహాను 3:16
23. లూకా 19:10
24. 1 తిమోతి 1:15
25. మత్తయి 9:13

# 4 సద్గురువు చనిపోవడం ఎందుకు?

దేవుని కుమారుడు మరణించాడు. ఈ విషయం మర్మం గలది, మహా అద్భుతమైనది. కొందరు ఈ విధంగా ప్రశ్న వేస్తూ ఉంటారు, “క్రీస్తు దేవుని కుమారుడు గదా, దేవుని ప్రత్యక్షం, దేవుని అవతారం గదా? అలాంటప్పుడు ఎందుకాయన అంతగా బాధలు అనుభవించి చనిపోవలసి వచ్చింది? చావునుంచి తప్పించుకో లేకపోయాడా?

ఆయన మరణాన్ని గురించి అంతా పూర్తిగా గ్రహించగలవారెవరూ మనలో లేరు గాని ఈ ప్రశ్నకు సమాధానం తేటగా ఉంది. ఆయనను ఎవరూ బలవంతంగా మరణానికి గురి చేయలేదు. అసలు సత్యమేమిటంటే, ఆయన బాధలు అనుభవించి చనిపోవడానికే వచ్చాడు.

మరో ప్రశ్న: దీనికంతటికీ కారణం ఏమై ఉండవచ్చు? గురుదేవుడు స్వయంగా దీనికి కారణమేమిటో చెప్పాడు. దేవుని వాక్కు కూడా దీన్ని గురించి ఎంతగానో చెపుతున్నది. ఈ అధ్యాయంలో గురుదేవుని మరణ కారణాలనే ధ్యానిస్తాం.

అయితే మొట్టమొదట ఆయన ఏ విధంగా చనిపోయాడో చూద్దాం.

యేసుప్రభువును అప్పటి మత నాయకులు అనేకులు ఎంతో ద్వేషించారు. వారు ఆయనమీద అసూయపడ్డారు. అంతేగాక వారికి కోపం వచ్చింది. ఎందుకంటే ఆయన వారి పాపాలనూ కపటాన్నీ బయట పెట్టాడు. ఆయన ఇచ్చిన వెలుగుకంటే తమ చీకటే వారికి ప్రీతి. అంచేత ఈ వెలుగును ఆర్పేయడానికే పూనుకున్నారు.

ఆ కాలంలో ఇస్రాయేల్ ప్రజలు రోమ్ ప్రభుత్వం కింద ఉన్నారు. వారి మత నాయకులు మరణశిక్ష వేయడానికి అధికారం లేదు. అందుచేత వీరు యూదా అనే స్వామిద్రోహిని లంచమిచ్చి కొనేశారు, అతనిద్వారా ఆయన్ను బంధించారు, రోమ్ అధిపతి ఎదుటికి తెచ్చారు. ఆ అధిపతి పేరు పొంతి పిలాతు.

యేసు పూర్తిగా నిర్దోషి అని పిలాతు గ్రహించాడు. అయినా యూదులకు సంతోషం కలిగిద్దామని యేసును సిలువ వేయడానికి వారి చేతులకు అప్పగించాడు. రోమ్ సైనికులు ఆయన్ను పట్టుకొని ఆయన తలపై ఒక ముండ్ల

కిరీటం పెట్టి, "యూదుల రాజా, శుభం" అంటూ ఎగతాళి చేశారు. ఆయన ముఖంమీద ఉమ్మివేశారు. ఆయన్ను భయంకరమైన కొరడాతో కొట్టారు. చివరికి ఆయన్ను సిలువ వేయడానికి జెరుసలం నగరం బయటకు తీసుకుపోయారు. అక్కడ ఒక కొండ మీద వారు ఆయన కాళ్ళు చేతులు చాచి సిలువకు మేకులతో దిగగొట్టి సిలువ ఎత్తి భూమిలో నాటారు. ఆయన సిలువమీద ఎంతో వేదనలు అనుభవిస్తూ ఉన్నప్పుడు యూదుల మత నాయకులు ఆయన్ను ఇంకా పరిహాసం చేస్తూ దూషించారు.

యేసుక్రీస్తు మరణం బైబిల్‌లోని నాలుగు శుభవార్తల్లో రాసి ఉంది. మత్తయి 27, మార్కు 13, లూకా 23, యోహాను 19 – ఈ నాలుగు అధ్యాయాలు ఈ సంఘటనను వివరిస్తున్నాయి. ఒక శుభవార్త కొన్ని వివరాలు ఇస్తుంది, మరో శుభవార్త ఇంకా కొన్ని వివరాలు లేక వేరు వివరాలు ఇస్తుంది. ఈ నాలుగు శుభవార్తలు కలిసి ఎంతో అర్థవంతమైన సంఘటన సంపూర్ణంగా వర్ణిస్తున్నాయి.

సిలువమీద యేసు చివరి నిమిషాలు ఇలా ఉన్నాయి:

"మధ్యాహ్నం పన్నెండు గంటలనుంచి మూడు గంటలవరకు దేశమంతటా చీకటి కమ్మింది. సుమారు మూడు గంటలప్పుడు యేసు హీబ్రూ భాషలో ఇలా బిగ్గరగా కేక వేశాడు: ఏలీ! ఏలీ! లామా సబక్తానీ? ఆ మాటలకు నా దేవా! నా దేవా! నా చేయి ఎందుకు విడిచిపెట్టావు? అని అర్థం.

"ఆ తరువాత, సమస్తమూ అప్పటికే అయిపోయిందని తెలిసి, లేఖనం నెరవేరడానికి యేసు నాకు దప్పి అవుతూ ఉంది అన్నాడు. పులిసిపోయిన ద్రాక్షరసంతో నిండిన ఒక పాత్ర అక్కడ ఉంది. కనుక వారు ఒక స్పంజి నిండా దానిని పట్టించారు. దానిని హిస్సోపు మొక్క కాడకు తగిలించి ఆయన నోటికి అందజేశారు. ఆ పులిసి పోయిన రసం తీసుకొన్న తరువాత యేసు అన్నాడు: సమాప్తమయింది."

"అప్పుడు యేసు బిగ్గరగా కేక వేసి తండ్రీ! నీ చేతికి నా ఆత్మను అప్పగించు కొంటున్నాను అన్నాడు. అలా చెప్పి ప్రాణం విడిచాడు".

ఈవిధంగా గురుదేవుడైన యేసుక్రీస్తు బాధలు అనుభవిస్తూ చనిపోయాడు. ఇప్పుడు ఆయన మరణం అర్థమేమిటో మనం విచారణ చేయాలి. "ఇది ఎందుకని ఈ విధంగా జరిగింది?" అని భయభక్తులతో మనం అడగాలి. తన బాధలకూ మరణానికీ అర్థమేమిటో యేసునే చెప్పనిద్దాం.

**యేసు ఎందుకు చనిపోయాడు?**

గురుదేవుడు తన గురించి చెప్పిన మాటలివి:

"అలాగే మానవపుత్రుడు తనకు సేవ చేయించుకోవడానికి రాలేదు గాని, సేవ చేయడానికే వచ్చాడు. ఇదీగాక, అనేకుల విమోచనకు వెలగా తన ప్రాణం ధారపోయడానికి వచ్చాడు."[1]

"నేను మంచి కాపరిని. మంచి కాపరి గొర్రెలకోసం తన ప్రాణం ధారపోస్తాడు."[2]

సిలువపై కారబోయే తన రక్తాన్ని గురించి గురుదేవుడు ఇలా చెప్పాడు: "ఇది నా రక్తం – పాప క్షమాపణ కలిగేలా అనేకులకోసం చిందబోయే ఒడంబడిక రక్తం."[3]

యేసుప్రభువు వచ్చినది ఉపదేశం ఇవ్వడానికి మాత్రమే కాదు. ఆయన ఉపదేశం ముఖ్యమైనదే గానీ అంతకు మించిన ఉన్నత లక్ష్యం ఆయనకుంది. మనలను విమోచించడానికి ఉపదేశం మాత్రమే చాలదు. యేసుక్రీస్తును ఈ లోకానికి రప్పించిన ముఖ్య లక్ష్యమిదే – ఆయన పాపులకోసం బాధలు అనుభవించి చనిపోవడానికి వచ్చాడు.

యేసుప్రభువు ఒక సాంఘిక సంస్కర్తగా చనిపోలేదు. ఏదో లక్ష్య సాధనకు హతసాక్షిగా ఆయన చనిపోలేదు. దేశ స్వతంత్రతకు కాదు ఆయన చనిపోయింది. స్వార్థ త్యాగానికి మాదిరిగా ఆయన చనిపోయినవాడు కాదు. దేవుడు మనుషులను ప్రేమిస్తున్నాడని చూపడానికి మాత్రమే ఆయన చనిపోలేదు. ఆయన మరణానికి ఇంతకు మించిన అర్థం ఉంది. శత్రువులు ఆయనను ద్వేషించి, చంపితే చనిపోయిన వాడేమీ కాదాయన. ఆయన స్వేచ్ఛగా తనకు తానై వారి చేతిలో చిక్కివుండకపోతే, ఆయనను చంపడం వారి వశం కాదు. అందరి మనుషుల్లాగా యేసు చనిపోలేదు. ముప్ఫయి మూడు సంవత్సరాల యవ్వనదశలో ఆయన చావు విషాద సంఘటన అని వాపోవనక్కర్లేదు. అసలు సంగతేమిటంటే, ఇది దేవుడు మనుషులకు పాపవిముక్తి కలిగించే విధానం.

దేవుడు పవిత్రుడు అని ఇంతకుముందే తెలుసుకున్నాం. మానవుడు పాపి, పాపంచేత దేవునినుంచి వేరైపోయాడని కూడా చదివాం. మనం పవిత్రుడైన దేవుణ్ణి తెలుసుకోవాలంటే, ఇప్పుడు ఆయనతో సహవాసం చేయాలంటే, శాశ్వతంగా ఆయనతో నివాసం చేయాలంటే, ఈ పాపం విషయమైన సమస్య పరిష్కరించుకోవాలి. పాపులను నాశనం చేయడం దేవునికి చాలా సులభం. కానీ దేవుడు పాపులను రక్షించాలనుకున్నాడు. కొందరు ఇది చాలా సులభమనుకోవచ్చు

గాని అలా కాదు. దీనికి దేవుని కుమారుని అవతారం అవసరమయింది, ఆయన బాధలు అవసరం, ఆయన చనిపోవలసివచ్చింది.

**క్రీస్తే మహా యజ్ఞం**

మనుషులందరికీ శిక్ష మాత్రమే తగినది. ఎందుకంటే మనుషులందరూ పాపులు, నేరస్థులు, దోషులు. దేవుడు లోకానికి పవిత్రుడైన న్యాయమూర్తి. న్యాయం తీర్చేవాడు. పాపానికి తగిన శిక్ష దేవుడు విధించి తీరాలి. దేవుడు పాపాన్ని చూచి చూడనట్టు ఊరుకోలేడు. దేవుడు పాపాన్ని ఊరికే పోనిస్తే అప్పుడు ఆయన న్యాయశీలి అనీ పవిత్రుడు అనీ అనిపించుకోడు. దేవుడు అలాంటప్పుడు తన న్యాయమైన శాసనాలనూ చట్టాలనూ, తన ధర్మశాస్త్రాన్నీ నెరవేర్చుకున్నవాడు కాలేడు. ఈ సత్యాన్ని ముందు గ్రహించకపోతే యేసుప్రభువు ఎందుకు చనిపోవలసివచ్చినదో మనకు బోధపడదు.

అద్భుతమైన సత్యం ఇదే! దేవుని కుమారుడు తన ప్రజల కోసం బలియాగ మయ్యాడు. పాపుల స్థలంలో, పాపులకోసం, పాపులకు రావలసిన శిక్ష ఆయన అనుభవించాడు. వారికోసం చనిపోయాడు. న్యాయంగా పాపులను క్షమించడానికి ఇదే ఏకైక మార్గం.

పాపులకోసం యేసు మృతిని గురించి బైబిలు అనేక చోట్ల నొక్కి చెపుతుంది. ఈ క్రింది వచనాలు పరిశీలించండి.

"ఆయన మన అక్రమ కార్యాల కోసమే గాయపడ్డాడు. మన అపరాధాల నిమిత్తమే ఆయనను నలగ్గొట్టడం జరిగింది. మనకు శాంతి కలిగించే శిక్ష ఆయనమీద పడింది. ఆయన పొందిన దెబ్బల మూలంగా మనకు ఆరోగ్యం కలిగింది. మనమందరమూ గొర్రెలలాగా తప్పిపోయాం. మనలో ఒక్కొక్కరం సొంత త్రోవకు తొలగిపోయాం. యెహోవా మన అందరి అపరాధాలను ఆయనమీద మోపాడు."[4]

"మనం ఇంకా బలం లేని స్థితిలో ఉన్నప్పుడు క్రీస్తు తగినకాలంలో భక్తిహీనులకోసం చనిపోయాడు."[5] "ఇందులో దేవుడు తన ప్రేమను మనపట్ల చూపుతున్నాడు."[6]

"నేను పొందిన ఉపదేశమే మీకు అందించాను. ఇది అన్నిటికంటే ముఖ్యం: లేఖనాల ప్రకారము క్రీస్తు మన పాపాలకోసం చనిపోయాడు."[7]

"ఇప్పుడు యుగాల అంతంలో ఒకేసారి తనను తాను బలిగా అర్పించు కోవడంవల్ల పాపం లేకుండా చేయడానికి ఆయన ప్రత్యక్షమయ్యాడు."[8]

"ఈయనైతే పాపాలకోసం ఎప్పటికీ నిలిచివుంటే ఒకే బలి చేసిన తరువాత దేవుని కుడి వైపున కూర్చున్నాడు."[9]

క్రీస్తు బాధలు అనుభవించాడు. తన రక్తం కార్చాడు. పాపులకోసం ప్రాణమిచ్చాడు. ఇది వాస్తవం. ప్రవక్తలు దీనిని ప్రకటించారు. శిష్యులు దీనిని బోధించారు. ఇదే సద్గురువు నేర్పించాడు. నిజంగా ఇదే బైబిలుకు కేంద్రం, హృదయం లాంటిది. ఎవరైన సరే, యేసుప్రభువును సద్గురువుగా అంగీకరిస్తే, ఈ సత్యాన్ని అంగీకరించవలసి ఉంటుంది.

## అసాధ్యమా?

క్రీస్తు మనకోసం, మన పాపాలను తీసెయ్యడానికి చనిపోవడం అసాధ్యమంటూ అభ్యంతరం తెలియజేస్తారు కొందరు. ప్రతి ఒక్కరూ తన పాపానికి తానే వెల చెల్లించాలని, తన పాపాలకోసం శిక్ష అనుభవించాలని అంటారు. కానీ మనుషుల్లో కూడా ఇతరులకోసం బాధలు అనుభవించడం అనేది అసాధ్యమైనది, విపరీతమైనది ఏమీ కాదు.

మనుష్యులందరికి బాగా తెలుసు – ఇతరుల కోసం బాధ అనుభవించడమనేది. మనుషులకు ఇది కొత్త విషయమేమీ కాదు. తల్లిదండ్రులు సంతోష పూర్వకంగా సంతానం కోసం తమ రక్తం కార్చి చనిపోయినవారున్నారు. దేశ ప్రేమకు ఎందరో జైళ్ళలో బాధపడ్డారు. ప్రజలకు స్వతంత్రత కావాలని ఉరి కంబానికెక్కిన వారున్నారు. స్వతంత్రతను కాపాడుకోవాలన్న ఆశయంతో సిపాయిలు యుద్ధరంగంలో ప్రాణాలొడ్డారు. ఇతరులకోసం స్వేచ్ఛగా బాధపడి, ప్రాణం పెట్టడమనేది ఉత్తమమైన మానవ సుగుణం, సాహస కార్యం. అలాంటప్పుడు దేవుని కుమారుడు ఇంతకంటే మించి చేయలేడని ఎవరైనా చెప్పగలరా? దేవునికి అంత ఉత్తమ ఆశయాలుండవా? అంత దయ, కనికరం, స్వేచ్ఛ, స్వచ్ఛందత ఉండవా? చెప్పండి!

## ఉదాహరణలు

ఒక అబ్బాయి ఉన్నాడనుకోండి. తల్లి పదే పదే అతడితో చెప్పింది: "నువ్వు అగ్గిపుల్లలతో ఆడవద్దు." ఒక రోజు తల్లి బయటికి ఎక్కడికో వెళ్ళింది. ఆ అబ్బాయి అగ్గిపెట్టె తీసుకున్నాడు. తల్లి ఆజ్ఞను మీరాడు. అగ్గిపుల్లలు గీచడం మొదలుపెట్టాడు. అది పూరిపాక. పిల్లవాడు దానిక్కాస్తా అంటించాడు. భయపడి అటూ ఇటూ పరుగెత్తసాగాడు. దారి కనబడట్లేదు. దట్టంగా పొగ, మంట అతణ్ణి

ఆవరించాయి. బయటికి రాలేకపోయాడు. ఇంతలోనే తల్లి వచ్చింది. జరిగినదంతా గ్రహించింది. అయితే ఇప్పుడేమి చెయ్యాలి? ఊరికే బయట నిలబడి "నా కొడుకు తప్పు చేశాడు. మంటల్లో పడి చావనియ్యి. చేసుకున్నవారికి చేసుకున్నంతా" అంటూ ఊరుకుండి పోతుందా? అలా ఎన్నటికీ ఉండదు. వెంటనే మండుతున్న ఇంట్లోకి పరుగెత్తి పోతుంది, త్వరగా చిన్న కిటికీ తలుపు తెరుస్తుంది, ఆ పిల్లవాణ్ణి తీసుకొని బయటికి గెంటేస్తుంది. ఇప్పుడు అతడు సురక్షితంగా ఉన్నాడు. కానీ తనను రక్షించుకోవడానికి సమయం మించిపోయింది. ఇంతలోకే మంటలు ఆమెను చుట్టుముట్టాయి. మంటలామె దుస్తులకు అంటుకున్నాయి. వేడికి ఆమె దహించుకుపోతున్నది. పొగకు ఊపిరాడకుండా ఉంది. మంటలకు తట్టుకోలేక ఆమె కుప్ప కూలిపోయింది. ఆ పిల్లవాడు ఆరంభించిన మంట ఆమెను కాల్చివేసింది. తప్పు చేయడం అతడు, అతడికోసం మరణించడం ఆమె.

మానవుడు తన పాపంతో ఒక మంట ఆరంభించాడు. దాన్ని తాను ఆర్పలేకపోయాడు. తన స్వప్రయత్నంతో ఈ అగ్ని ప్రమాదంనుంచి తప్పించుకోలేక పోయాడు. అతణ్ణి ఎవరు తప్పించాలి? దేవుడు ప్రేమస్వరూపి గదా! ఏ తల్లి కూడా దేవుడు చూపినంత అనంత ప్రేమనూ దయనూ చూపదు. తన స్వంత ప్రజలను రక్షించేందుకు దేవుడు ఆ మంటలోకి దూకడం అసాధ్యమేమీ కాదు. తప్పంతా వారిదే – అయినా దేవుడు ప్రేమతో వారి రక్షణకోసం బాధలు అనుభవించవలసి వచ్చింది.

మనుషులు పాపం చేశారు. వారికి తగినది బాధలు, మరణ శిక్ష. కానీ మనుషుల స్థానంలో దేవుడు ఆ బాధలను, మరణాన్ని భరించడానికి ఇష్టపడ్డాడు. దానికి బదులుగా జీవం, క్షమం, నిత్యానందం మనుషుల కిచ్చాడు. క్రీస్తు సిలువకు అర్థం ఇదే.

## చెల్లించవలసిన బాకీలు

ఒక మనిషి ఉన్నాడనుకోండి. అతడు తెలివితక్కువగా బాకీలో పడిపోయాడు. నా బాకీ చెల్లంచాలని ఒత్తిడి చేస్తున్నాడు బాకీ ఇచ్చిన ఆసామి. ఎంతో ప్రయత్నం చేశాడు గాని బాకీ చెల్లించలేకపోయాడు. కనీసం వడ్డీ కూడా కట్టలేకపోయాడు. బాకీ అసలు ఇంకా ఇంకా పెరుగుతూ ఉంది. ఇతడు భారంతో కృంగిపోయ్యాడు. ఈ బాకీ తీర్చడానికి అన్ని విధాల ప్రయత్నం చేశాడు గాని ప్రయోజనం లేకపోయింది. ఈ మనిషికొక స్నేహితుడున్నాడు. అతడి దగ్గర డబ్బుంది. అతడు ఈ కష్టాన్ని గురించి విని, వచ్చి, బాకీ పూర్తిగా చెల్లించివేశాడు.

ఒకడు మరొకడి బాకీ తీర్చడం కష్ట సాధ్యమేమీ కాదు. ఇది దయతో చేసే సహాయం మాత్రమే. మనుషులకున్నంత దయ దేవునికి ఉండదా?

మనుషుల పాపాలు రుణంలాంటి బంధకాలని చెప్పవచ్చు. న్యాయంగా చేస్తే ఈ బాకీ చెల్లించితీరాలి అంటే బాధలు, మరణం పొందితీరాలన్నమాట. పతనమైన మనుషుల అపరిమితమైన రుణం చెల్లించడం, పర్వతమంత బ్రహ్మాండంగా ఉన్న మన పాపాలను తొలగించడం ఎలాగు? ఈ గొప్ప భారం మన మీద నిలిచి ఉండకుండేలా ఈ వెల ఎవరు చెల్లించగలరు? దేవుని కుమారుడు ముందుకు వచ్చాడు. సిలువ మీద ఈ బాకీ చెల్లించాడు. పాపులకోసం ఆయన బాధలు అనుభవించి చనిపోయాడంటే దీనికాయన చెల్లించిన వెల ఎంత గొప్పదో ఎవరు లెక్కకట్టగలరు? ఇది మనం ఊహించలేని సంగతి. అయితే ఒక్క విషయం తేటతెల్లమే. యేసుక్రీస్తులో విశ్వాస ముంచితే లోకంలోని పాపులందరికీ కూడా పాపవిముక్తి, రక్షణ దొరకవచ్చు. ఆయన చేసినది అంత విలువగలది, ప్రభావంగలది.

యేసుక్రీస్తు బాధలు కేవలం శరీర సంబంధమైనవి మాత్రమే కావు. ఆ మాటకొస్తే ఆయన శరీరక వేదనలు ఘోరమైనవి గానీ ఆయన ఆత్మలో పడ్డ వేదనలు అంతకంటే గొప్పవి. ఆయన ఎవరో జ్ఞాపకముంచుకోవాలి. ఆయన పవిత్ర దేవుని అవతారం. పాపంయొక్క స్పర్శచేత పవిత్రమైన ఆయన హృదయం ఎంతో బాధ చెందింది. ఈ విషయంలో బైబిలు ఏమంటుంది? "దేవుడు ఏ పాపం లేని ఆయనను మనకోసం పాపంగా చేశాడు."[10] అందువల్ల పవిత్రుడైన గురుదేవునికి ఎంత బాధ కలిగినదో ఎవరు గ్రహించగలరు?

పాపమనేది ఎంత భయంకరమైనదో, దేవుని ప్రేమ ఎంత గొప్పదో, మానవ పాపవిముక్తికి యేసు ఎంత వెల చెల్లించాడో మనం తెలుసుకోవాలంటే మనం సిలువవైపు సరిగ్గా అర్థవంతంగా చూడగలగాలి.

## ధర్మం, న్యాయం

మనుషుల పాపాలను యేసుప్రభువు ఈవిధంగా భరించడం న్యాయమా? న్యాయమే. అనుమానమేమీ లేదు. నీతిన్యాయాలకు విరుద్ధమైన దేనినీ దేవుడు ఎన్నడూ చేయడు. నిజంగా ఇదొక్కటే మానవ విముక్తికోసం దేవుడు అవలంబించగల ధర్మమార్గం, న్యాయమార్గం. ఒకవేళ దేవుడు ఆ విధంగా ఎవరో నిర్దోషియైన ఒక మనిషిని బలవంతం చేసి, బాధపడి చచ్చేలా చేస్తే న్యాయం అనిపించుకోదు. కానీ క్రీస్తును దేవుడేమీ బలవంతం చెయ్యలేదు. క్రీస్తు

ఇష్టపూర్వకంగానే అలా చనిపోయాడు. అంతేకాకుండా ఆయన మానవమాత్రుడు కాడు. నిజం చెప్పాలంటే, ఏ మనిషి అయినా బాధపడి చావడంవల్ల మరో మనిషికో లేక మానవకోటిలో ఒక్కడికి కూడా పాపాలనుంచి విమోచన ఇవ్వడం అసాధ్యం. కానీ తాను సృష్టించిన మనుషులందరి కోసం అనంతుడైన దేవుడు న్యాయంగా బాధలు అనుభవించ గలిగాడు. ఆయనకు ఇష్టం ఉండే వారి పాప శిక్షను భరించాడు. వారి రుణం చెల్లించాడు. వారి విమోచనకు తాను వెలగా చెల్లించాడు.

అలా చేయడం ఆయనకు ఇష్టమే. యేసుక్రీస్తు రాకడకు అర్థమిదే. ఆయన దేవుడు. మనుషులకు బదులుగా ఆయన వేదనలతో చనిపోవడానికి స్వేచ్ఛగా సిద్ధమై వచ్చాడు. “నా ప్రాణం మళ్ళీ తీసుకొనేలా దానిని ధారపోస్తాను, గనుక నేనంటే నా తండ్రికి ప్రేమ. నా ప్రాణం ఎవరూ తీయరు. నా అంతట నేనే దానిని ధారపోస్తాను” అని యేసు చెప్పాడు.[11]

దేవుని కుమారుడు తనకు తానై శరీరంలోనూ ఆత్మలోనూ బాధలు అనుభవించాడు, మనుషులకోసం చనిపోయాడు. ఆయన మానవుడుగా వచ్చాడు. పతనమైన మానవకోటి కోసం యజ్ఞంగా తన్ను అర్పించుకొన్నాడు. మనుషుల పాప భారమంతా ఆయన తనమీదికి తీసుకొన్నాడు. వారు చేసిన పాప కర్మననుభవించి కర్మ విముక్తి చేశాడు.

ఇది పూర్తిగా న్యాయాన్ని నెరవేర్చింది. నిజంగా ఇది ఏ మనిషీ వర్ణించలేనంత అద్భుత విషయం.

యేసు మనకోసం చనిపోయాడని మనం నమ్మి మనసారా ఆయన వైపు తిరిగితే మనకు ఎంత దీవెన కలుగుతుంది! అప్పుడు ఆయన గొప్ప ప్రేమ గురించి మనం కొంతవరకు అర్థం చేసుకోసాగుతాం, ఆ ప్రేమను మన హృదయాల్లో అనుభవించ సాగుతాం. దేవుని మహా పవిత్రతనూ న్యాయాన్నీ గ్రహించసాగుతాం. ఆయన వాటికి అనుగుణంగా ఎలా పాపాలను క్షమించగలడో అది కూడా అర్థం చేసుకోసాగుతాం.

### క్రీస్తు మరణ ఫలితాలు

యేసుక్రీస్తు మరణం మానవ చరిత్ర అంతటిలోకి ఘోరమైన నేరం. కానీ ఇది అన్నిటికంటే గొప్ప ఆశీర్వాదాలను మనుషులకు తెచ్చింది. దేవుని కృప, కరుణ, ప్రభావం, జ్ఞానం అంత అద్భుతంగా ఉన్నాయి.

**క్షమాపణ**

యేసుప్రభువు మానవ పాపాలకోసం బలిగా చనిపోయినందుచేత మనం పశ్చాత్తాపపడి ఆయనమీద నమ్మకం వుంచితే దేవుడు మనల్ని న్యాయంగా క్షమించగలడు. దేవుని క్షమాపణ చౌకబారు సరకు కాదు. న్యాయంగా మనుషులను క్షమించడానికి ఆయన ఎంతో గొప్ప వెల చెల్లించవలసి వచ్చింది. మనం ఆ క్షమాపణ పొందాలంటే ప్రతి పాపంనుంచీ చెడుగు అంతటినుంచీ మళ్ళుకొని విశ్వాసంతో ఆయనకు లోబడిపోవాలి. విశ్వాసంతో దేవునివైపుకు తిరగాలి. సిలువపై ఆయన చేసినదాన్ని అంగీకరించాలి. దీన్ని మనం తిరస్కరిస్తే లేక లెక్క చేయకపోతే, మన పాపాలతో అలానే కొనసాగుతూవుంటే, దానికి తగ్గ శిక్ష వచ్చిపడుతుంది. దాన్ని తప్పించుకోలేము. మనం సిలువకు వీపు చూపి వెళ్ళిపోతే మన పాపం, మన భ్రష్ట స్వభావం, దేవుని పట్ల మన విరోధ భావం ఎంతో వచ్చిపడే శిక్షవల్ల కనబడుతుంది. క్రీస్తు చనిపోయినప్పుడు పెద్ద బండలు సహితం పగిలాయి. మన హృదయాలలో చలనం కలగకుండా ఉంటుందా?

**క్షమాపణ ఇప్పుడే**

"అప్పుడు ఆయన వారితో ఇలా అన్నాడు. అభిషిక్తుడు బాధలు అనుభవించి చనిపోయిన వారిలో నుంచి మూడో రోజున సజీవంగా లేస్తాడని జెరుసలం మొదలుకొని ప్రజలందరికి ఆయన పేర పశ్చాత్తాపం, పాపక్షమాపణ ప్రకటించడం జరగాలని వ్రాసి వుంది."[12]

"ఆయనలో ఆయన రక్తం ద్వారా మనకు విముక్తి, మన పాపాలకు క్షమాపణ కలిగాయి."[13]

"మన పాపాలు మనం ఒప్పుకొంటే ఆయన మన పాపాలు క్షమించి అన్యాయమంతటి నుంచి మనలను శుద్ధి చేస్తాడు. అందుకు ఆయన నమ్మతగినవాడూ, న్యాయవంతుడూ."[14]

పునర్జన్మ అనే సిద్ధాంతం సత్యమని కొందరి నమ్మకం. ఒకవేళ మనం ఈ లోకంలో లెక్కలేని పర్యాయాలు పుట్టినా, ప్రతి సారీ ఘోర పాపాలను ఎన్నిటిని ఒడిగట్టినా, యేసు రక్తం మనలను సమస్త పాపం నుంచి శుద్ధి చేయగలదు. మనలను నిష్కలంకులనుగా చేయగలదు. మనలను పవిత్రుడైన దేవుని సన్నిధికి యోగ్యులను చేయగలదు. మనకు సంపూర్ణ క్షమాపణ నివ్వగలదు. క్రీస్తుద్వారా ఇదంతా దేవుడు మనకు ఇస్తున్నాడు.

యేసుక్రీస్తు సిలువమీద చేసిన బలియజ్ఞం సంపూర్ణ సిద్ధి గలది. సర్వ

లోకంలోకి అది ప్రభావం గలది. మరో బలితో ఏ మాత్రమూ నిమిత్తం లేదు. మరో బలిని దేవుడు అంగీకరించడు కూడా. దేవుడు మనకోసం చేసినదాన్ని పశ్చాత్తాప పూర్వకంగా మనం అంగీకరించాలి, విశ్వసించాలి. ఆయనకు మన హృదయాన్ని సమర్పించాలి. ఇదే దేవుని కోరిక.

**శాంతి, సమాధానం**

యేసు చనిపోవడం వల్ల మనకు మరొకటి లభించగలదు – దేవునితో శాంతి, పాప ఫలితంగా దేవునికీ పాపికీ మధ్య సంబంధం తెగిపోయింది. క్రీస్తు మరణంద్వారా ఈ సంబంధం మళ్ళీ ఏర్పడింది. హృదయాలను కదిలించే ఈ మాటలు వినండి: "మనలను దేవుని దగ్గరకు తేవడానికి న్యాయవంతుడైన క్రీస్తు పాపాల విషయంలో న్యాయం తప్పినవారి కోసం ఎప్పటికీ ఒకే సారి బాధలు అనుభవించాడు."[15]

ఇదే సత్యం మరో చోట రాసి ఉంది – "క్రీస్తులో దేవుడు లోకాన్ని తనతో సఖ్యపరచుకొంటూ . . . ఉన్నాడు."[16]

"సిలువ మీద చిందించిన క్రీస్తు రక్తం ద్వారా తాను సమాధానపరిచే కార్యంవల్ల అన్నిటినీ తనతో సఖ్యపరచుకోవాలని కూడా తండ్రి ఇష్టం."[17]

ఇది పరమాద్భుతమైన సత్యం! మధ్య ఆటంకాలు తొలగిపోయ్యాయి. మధ్య గోడలా ఉన్న పాపం, నేరం అనేవి దేవునినుంచి మనలను ఇంతవరకూ వేరుచేసినవి. అవన్నీ ఇప్పుడు గతించాయి. సర్వాతీతునితో పొందికగా ఉండడానికి మార్గం తెరచి ఉంది. అది అందుబాటుగా ఉంది. క్రీస్తు మృతి ఫలితంగా దేవునితో స్నేహం, శాంతి, దేవునితో ధన్యతమయమైన శాశ్వత సమాధానం, ఇంకా ఎన్నో. మనం ఇంతవరకు తిరుగుబాటు చేశాం. ఇప్పుడాయన తన కుమారుడైన యేసుద్వారా ప్రజలకు ప్రాధేయపూర్వకంగా తనతో సమాధానపడండని చెపుతున్నాడు. దేవుని విశ్వాసులలో ఒకడు ఇలా వ్రాశాడు:

"మేము క్రీస్తుకు దూతలం. దేవుడు మాద్వారా వేడుకొంటూ ఉన్నట్టుంది. దేవునితో సఖ్యపడండి అంటూ క్రీస్తు పక్షంగా బతిమాలుతున్నాం."[18]

**విమోచన**

అంతే కాకుండా క్రీస్తు ద్వారా మనకు విముక్తి లభించగలదు. గురుదేవుడు ఒక సారి ఇలా చెప్పాడు: "మానవ పుత్రుడు సహితం సేవ చేయించుకోవడానికి రాలేదు గాని సేవ చేయడానికే వచ్చాడు. అంతేకాదు, అనేకులకు విడుదల

కలిగించడానికి తన ప్రాణం వెలగా ధారపోయడానికి వచ్చాడు." విమోచించడమంటే బంధకంలో ఉన్న మనిషికోసం వెల చెల్లించి విడుదల చెయించడమని అర్థం. మానవుడు పాప బంధకాలలో, మరణ బంధకాలలో, ఉన్నాడు. అతణ్ణి విడుదల చేయడానికి యేసుప్రభువు పూర్తిగా వెల చెల్లించాడు. పేతురు ఇలా రాశాడు: "మీ పూర్వికులనుంచి పారంపర్యంగా వచ్చిన మీ వ్యర్థమైన జీవిత విధానంనుంచి మిమ్ములను విడిపించినది వెండి బంగారాలలాంటి నాశనమయ్యే వస్తువులతో కాదు గాని ఏ లోపమూ కళంకమూ లేని గొర్రెపిల్లలాంటి క్రీస్తు అమూల్య రక్తంతోనే మిమ్ముల్ని విడిపించడం జరిగింది."[19]

ఆయనవైపు ఎవరు విశ్వాసంతో తిరుగుతారో వారు ఆయన ఆస్తి అవుతున్నారు. ప్రియులైన పిల్లలూగా, ఆయన స్వకీయ సంపాద్యముగా అవుతున్నారు. అందుకే దేవుడు వారితో – "నేను నిన్ను వెల ఇచ్చి విడిపించాను. భయంతో ఉండబోకు. పేరు పెట్టి నిన్ను పిలిచాను. నీవు నా సొత్తు" అన్నాడు.[20]

## క్రొత్తజీవం

చివరిగా మనకు ఆధ్యాత్మిక జీవితం లభించగలదు. ప్రజల జీవిత విధానాలను మార్చడానికే యేసు చనిపోయాడు. ఈ విధంగా దేవుని వాక్కు చెపుతుంది:

"తన సొంతవారుగా, ఆసక్తితో మంచి చేసేవారుగా పవిత్రపరచుకోవాలని మనకోసం తనను తాను అర్పించుకున్నాడు."[21]

"బ్రతికేవారు ఇకనుంచి తమ కోసం బ్రతకకుండా, తమ స్థానంలో చనిపోయి మళ్ళీ సజీవంగా లేచిన వాని కోసమే బ్రతకాలని ఆయన అందరి కోసమూ చనిపోయాడు."[22]

"మనం పాపాల విషయంలో చనిపోయి న్యాయం కోసం బ్రతకాలని ఆయన తానే తన శరీరంలో మన పాపాలు మ్రానుమీద భరించాడు."[23]

ఇదంతా మతాచారాలకు మత విషయమైన ప్రయత్నాలకు మించినది. దీనికంతటికీ మూలం సంపూర్ణంగా మారిన హృదయమే. ఇది లేకుండా ముక్తి కలుగుతుందనే ఆశ లేదు. పవిత్రత లేకుండా ఎవడూ దేవుణ్ణి చూడలేడని బైబిలు చెపుతుంది. క్రీస్తు తన ప్రజల పాపాలను భరించాడు. వారికి రావలసిన శిక్షను తాను పొందాడు. కానీ ప్రజలు తమ ఇష్టం వచ్చినట్లు బ్రతకడానికి ఇదేమీ అనుమతి పత్రం ఇవ్వదు. ఈ విధంగా వాదించేవారికి అసలు విషయం బోధపడలేదన్న మాట. అసలు విషయం దీనికి వ్యతిరేకమే.

క్రీస్తు మృతి అర్థాన్ని చూచి ఆయనను ప్రభువుగా, రక్షకుడుగా, రాజుగా అంగీకరించి ఆయనను మన పాపం మోసుకుపోయినవాడని గుర్తించేవారు పాపం ఎంత భయంకరంగా ఉందో కొంతమట్టుకైనా గ్రహిస్తారు. అప్పుడు పాపాన్ని ద్వేషిస్తారు. ప్రస్తుతం తమలో పాప సంబంధమైన ఆశలెన్ని ఉన్నాయో వాటినన్నిటిని నిరోధించాలని చూస్తారు. గతాన్ని సరిదిద్దుకోవడానికి తాము చేయగలిగినదంతా చేస్తారు.

అలాంటివారికి క్రీస్తు సిలువ కృతజ్ఞతకు గొప్ప పునాదిలాంటిది. వారు దేవుని వాక్కును ప్రేమిస్తారు. నిజమైన నీతికీ నిస్వార్థత్యాగానికీ దేవుని సేవకూ కూడా సిలువే ఆధారం అవుతుంది. ఈ సిలువలో విశ్వసించినవారు పాపం చేయాలని మార్గాలను వెదకరు. తమకోసం చనిపోయిన ప్రభువును దుఃఖపెట్టే విధానాలు చేపట్టరు. పాపమనేది విశ్వాసికి కటిక చేదు. కొందరు పేరుకు మాత్రం విశ్వాసులు. అలాంటివారికి పాపం ఘోరంగా అనిపించకపోవచ్చు.

ఈ కారణాలను బట్టి క్రీస్తు బాధలు అనుభవించి చనిపోయాడు. తన వేదనను బట్టి ఆయన పాపులకు విముక్తిని ప్రసాదించగలడు. తద్వారా శాంతి, విమోచన లభిస్తాయి. ఆయన బాధ అనుభవించడం ద్వారానే మనకు నూతన జీవితం కలగడం సాధ్యమౌతుంది. మనం దేవుని ప్రజలం కాగలిగే సాధ్యత కలిగింది. దేవుణ్ణి ఎరిగి ఆనందించగలం. ఆయనను సదాకాలం మహిమపరచగలం. ఇలాంటి ప్రేమ మన హృదయాలను కదిలించాలి. ఆయనకు మన సమస్తమూ ఇచ్చివేయడానికి మనలను ప్రేరేపించాలి.

**ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. మత్తయి 20:28
2. యోహాను 10:11
3. మత్తయి 26:28
4. యెషయా 53:5,6
5. రోమ్ 5:6
6. రోమ్ 5:8
7. 1 కొరింతు 15:3
8. హీబ్రూ 9:26
9. హీబ్రూ 10:12
10. 2 కొరింతు 5:21
11. యోహాను 10:17,18
12. లూకా 24:46,47
13. ఎఫెసు 1:7
14. 1 యోహాను 1:9
15. 1 పేతురు 3:18
16. 2 కొరింతు 5:19
17. కొలస్సయి 1:20
18. 2 కొరింతు 5:20
19. 1 పేతురు 1:18
20. యెషయా 43:1
21. తీతు (టైటస్) 2:14
22. 2 కొరింతు 5:15
23. 1 పేతురు 2:24

# 5 ముక్తి మార్గమేది?

నిత్యానందానికి, శాంతికి మార్గమేది? విముక్తికి మార్గమేది? మోక్షానికి ఏది దారి? దేవునితో పొందిక కలిగి ఉండడం ఎలాగు?

ఇవన్నీ ప్రాముఖ్యమైన ప్రశ్నలు. వీటికి వేరువేరు జవాబులు, అభిప్రాయాలు లోగడ అక్కడక్కడా మనకు లభించాయి. ఇప్పుడు ఈ విషయాన్ని మనం పూర్తిగా పరిశోధించాలి.

ఈ ప్రశ్నలకు ఒక్కటే జవాబు ఉంటే బావుంటుందని మనం అనుకోవచ్చు. దురదృష్టంగా మనుషులు అనేక జవాబులిస్తూ వచ్చారు. ఈ జవాబులు తరచుగా పరస్పర వ్యతిరేకాలై ఉన్నాయి.

కొందరు కర్మ మార్గాన్ని ప్రకటిస్తారు. కర్మ మార్గం క్రియావాదం. సత్కార్యాలచేత మోక్షం లభిస్తుందని వీరి భావం. మరి కొందరు భక్తి మార్గాన్ని ఉపదేశిస్తారు. ఇది భక్తి ప్రవృత్తులద్వారా మోక్షాన్ని పొందాలని ప్రయత్నం. మరి కొందరు జ్ఞాన మార్గమే మోక్షానికి ద్వారమంటారు. ఆత్మసంబంధమైన జ్ఞానాన్ని మోక్షానికి సాధనంగా వీరు భావిస్తారు. కొందరు వీటిలో ఏ ఒక్కటీ చేపట్టినా పరవా లేదంటారు. కొందరు వేదాంతులు పలు విధాలైన యోగాలను ఉపయోగించాలంటారు. శరీర సంబంధమైన అభ్యాస మార్గాల ద్వారా ప్రయత్నిస్తున్నారు. సూర్య నమస్కారాలు, జపతప స్వాధ్యాయాలు, పరిత్యాగం, సన్యాస స్వీకారం, వగైరాలను ముక్తి మార్గాలుగా ఉపదేశిస్తున్నారు.

ఇలాంటి విషయాల గురించి చర్చించక ముందు మనం తెలుసు కోవలసినదేమిటంటే, మనం దేనినుంచి విముక్తి పొందాలి? కొందరు మాయనుంచి విముక్తి కావాలంటారు లేదా, అజ్ఞానం నుంచి విముక్తి కావాలంటారు. కర్మ నియమాన్ని గురించి మాట్లాడతారు. పూర్వజన్మలో చేసుకున్న పాపం పట్టి గడుపు తుంటారు. పూర్వజన్మ పుణ్యం ఇప్పటి మంచికి ఆధారమంటారు. జన్మపరంపర చక్ర భ్రమణంలాంటిదని చెపుతారు. చావడం పుట్టడం చావడం... ఇలా చక్రం తిరుగుతుందట. ఈ చక్రంనుంచి విముక్తి కావాలని కోరుతారు.

మన సమస్యకు మూలం ఎక్కడుందో అక్కడికే యేసుప్రభువు వెళుతున్నాడు. మనకు అవసరమైనది పాపంనుంచి విముక్తి అని ప్రభువు అంటున్నాడు.

అపరాధంనుంచి, పాపం శక్తినుంచి విడుదల మనకు కావాలి. ఈ విముక్తి మనకు లభించింది అంటే, అంతా సరిపోతుంది. ఈ కాలంలో గానీ అనంత కాలంలో గానీ ఎవరికీ, దేనికీ మనం భయపడనక్కర్లేదు.

ఈ విషయాన్ని గురించి తల పోస్తూ, మనలను విమోచనకు తీసుకువస్తాయని సాధారణంగా మనుషులు ఉద్దేశించిన మార్గాలను పరిశీలన చేద్దాం. ఈ మార్గాలు పాపాన్ని తీసివేయడానికి సరిపోతాయో లేదో చూద్దాం. పాపంవల్ల కలిగే అపరాధంనుంచి, శిక్షనుంచి, శక్తినుంచి విమోచించి మనలను దేవుని దగ్గరకు తెస్తాయో లేదో పరీక్ష చేద్దాం.

## క్రియా మార్గం

“క్రియా మార్గం నాకు తృప్తినిస్తుంది. ఇది నాకు చాలు. మంచి క్రియలు లేకుండా విముక్తి కలగదు” అని ఎవడైనా అనవచ్చు.

హృదయ పూర్వకంగా దేవునికి సేవ చేయాలి. నిజమే, ఆయన మహిమార్థమై పని చేయాలి. తోటి మనుషులకోసం కష్టపడాలి. దేవుని సేవలో సత్కార్యాలు చాలా ముఖ్యమైనవి. కానీ అసలైన సేవ ఏమిటో ముందు మనం తెలుసుకొని తీరాలి. ఆ సేవ ఎలా చేయాలో కూడా ఎరిగి ఉండాలి. మన స్వభావాన్ని గురించి గురుదేవుడు ఏమి నేర్పించాడో మనకు తెలుసు. మానవ స్వభావం చెడ్డది. అందుచేత మనంతట మనం మంచి కార్యాలను మన స్వభావంలోనుంచి రప్పించలేము. మనం చేసే అతి శ్రేష్ఠమైన పని కూడా పాపంతో కూడినది.

ముండ్ల చెట్టు మామిడి కాయలు కాయదు. నీటి ఊట ఉత్పత్తి స్థానంలో ఉప్పు నీళ్ళుంటే, నీళ్ళన్నీ ఉప్పుగానే అయిపోతాయి గానీ ఎన్నడూ తియ్యగా ఉండవు. మనకు క్రియల వల్ల మోక్షం లభించదు. ఎందుకంటే మన క్రియలు పవిత్రమైనవి కావు. శుద్ధమైనవి కావు. అపవిత్రమైన దానిలోనుంచి పవిత్రమైనదాన్ని పుట్టించగలమా? ఒకవేళ అనంత జన్మలెత్తడం సాధ్యమైనా ఇది సాధ్యం కాదు. మనం అనంతకోటి జీవితాలు గడిపినా, దానికి ఫలితం పాపాన్ని అపరిమితంగా వృద్ధి చేయడం అంతే!

ఒక గొప్ప భక్తుడు మానవుడి పాపాన్ని, బలహీనతను ఈ విధంగా వర్ణించాడు: “నాలో – అంటే, నా శరీర స్వభావంలో – మంచిది ఏదీ నివసించడం లేదని నాకు తెలుసు. మంచి చెయ్యాలని ఇష్టపడడం అనేది నాకుంది గాని మంచి చేయడం నావల్ల కావడం లేదు. నేనిష్టపడే మంచి చేయడం లేదు గాని ఇష్టపడని చెడుగు చేస్తున్నాను. . . ఈ విధంగా నాకొక నియమం తెలిసిపోయింది. అదేమిటంటే,

మంచి చేయాలని ఇష్టమున్నా నాలో చెడుగు ఉంది."[1]

మనం ఈ లోకంలో ఉన్నంత కాలం మనలో ఈ నియమం ఉంటుంది. మనకు ఇది తెలసినా, తెలియకపోయినా, మనకిది ఇష్టమున్నా, లేకపోయినా ఈ నియమం మనలో ఉండి పని చేస్తూనే ఉంది.

అంతే కాకుండా, మన స్వభావాన్ని మనమే ఏ మాత్రమూ మార్చుకోలేము. "కూషు దేశస్థుడు తన చర్మం మార్చుకోగలడా? చిరుతపులి తన మచ్చలను మార్చు కోగలదా?"[2] ఈ ప్రశ్నను దేవుడు అడుగుతున్నాడు. మనలను మనం నూతనంగా చేసుకోలేమని సూచించడానికే ఈ విధంగా అడుగుతున్నాడు. సూక్ష్మమైన మన చర్మాన్నే మార్చుకోలేమే. అలాంటప్పుడు మన స్వభావాన్ని ఎలా మార్చుకోగలం? మానవుడి అంతర్గత స్వభావంతో పోల్చి చూస్తే, మానవుడి చర్మం రంగు మార్చే ప్రయత్నం చిన్న పిల్లలాటే అవుతుంది. మనలోని భ్రష్టమైన స్వభావాన్ని మార్చేందుకు ఎలాంటి ప్రయత్నాలు కూడా పనికి రావు. మానసిక, శారీరక క్రమశిక్షణలు గానీ, వైరాగ్యాలు గానీ, అభ్యాసాలు గానీ, సన్యాసం గానీ, యజ్ఞ యాగాదుల గానీ, జపతపాలు గానీ, యోగ ముద్రలు గానీ, ధర్మ కార్యాలు గానీ, మత సంబంధ ఆచారాలు గానీ ఆంతర్య స్వభావాన్ని మార్చలేవు. ఈ మతాచారాలు హిందూ, క్రైస్తవ, బౌద్ధ మతాలలోవి కావచ్చు. దీనికి అవన్నీ పనికి రానివి. మనం చిన్న జీవిని కూడా సృష్టించలేమే! మనలో మంచి స్వభావాలను ఎలా సృష్టించగలం? క్రియా మార్గాన ఇది ఎన్నడునూ కలగదు. చెడ్డ చెట్టు ఎన్ని పండ్లు కాసినా దాని పంట అంతా చెడ్డదే.

బహిరంగంగా మనలను మనమే దిద్దుకోవచ్చు. కొన్ని చెడు అలవాట్లను మానివేయవచ్చు. స్పష్టంగా కనబడే పాపాలను మానివెయ్యవచ్చు. మత సంబంధమైన వ్యక్తులం కాగలం. భక్తినీ మర్యాదనూ ఆచరణలో పెట్టుకోగలం. మన స్వకీయ నీతిని గురించి గొప్పలు కూడా చెప్పుకోవచ్చు. కానీ వీటిలో ఏదీ కూడా మన హృదయాలను మార్చదు. మనలను మంచివాళ్ళనుగా చేయదు. మన అలవాట్లను కొంతవరకు మార్చుకోగలం. స్వభావాన్ని మాత్రం బొత్తిగా మార్చలేము. ఒంటిమీద ఏదో కొంచెం చింది పడిందనుకోండి, దాన్ని శుభ్రం చేసుకోవచ్చు. కడుక్కోవచ్చు. పాపం అలాంటిది కాదు. అది మానవుడి అంతరంగంలో ఏర్పడిన డాగు. దీన్ని ఎవడూ తుడిపివేయలేడు. ఒంటిమీద చెల్ది పొక్కులు లేచినప్పుడు మందు పూతతో నయం చేయవచ్చు. కానీ పాపం అంత సులభంగా పోదు. మన ఆంతర్యంలో పాపమనేది కొరుకుడు పుండులాంటిది. మానవుడి ప్రయత్నమేది దీన్ని నయం చేయడం అసాధ్యం. దేవునికి మానవునికి

మధ్య పాపమనేది పెద్ద అగాధం. మానవుడు సత్కార్యాలతో దేవునికి తనకు మధ్య వంతెన నిర్మించలేడు.

ఓ మనిషి బురద గుంటలో దిగబడిపోయి, తన జుట్టు తానే పట్టుకుని, పైకి ఎంత పీక్కున్నా పైకి రాబోడు. ఒకాయన ఇలా చెప్పాడు – "అగ్ని సముద్రం మీదుగా వెన్నతో వంతెన కట్టడం ఎంత కష్టమో తన స్వప్రయత్నంతో మోక్షం సంపాదించుకోవడం అంత కష్టం." అలా చేయగలం అనుకునే వారంతా వారి భ్రష్ట ప్రభావంచేత గుడ్డివారైపోయినవారే! పాప స్థితిలో నుంచి ఎవ్వడూ తనను తానే పైకెత్తుకోలేడు.

**దేవుడు ఏం అంటున్నాడు?**

దేవుని వాక్కు ఈ విధంగా చెపుతుంది – "ధర్మశాస్త్ర క్రియలవల్ల ఏ మనిషి న్యాయవంతుడు అని దేవుని లెక్కలోకి రాడు."[3]

"మీకు పాపవిముక్తి, రక్షణ కలిగినది కృపచేతే, విశ్వాసంద్వారానే. అది మీవల్ల కలిగినది కాదు. దేవుడు ఉచితంగా ఇచ్చినదే. అది క్రియలవల్ల కలిగినది కాదు, గనుక డంబంగా మాట్లాడుకోవడానికి ఎవరికి వీలులేదు. మనం ఆయన చేసినవారం. ఆయన ముందుగా ఏర్పాటు చేసిన మంచి పనులు మనం చేయాలని మనలను క్రీస్తులో సృజించాడు."[4]

"క్రియలవల్ల కలిగినది కాదు" – ఈ సత్యాన్ని సరిగా గ్రహించడం మనుషులకు కష్టం. కనుకనే దేవుడు తన వాక్కులో దీన్ని పదే పదే చెపుతున్నాడు. ఇప్పుడే మనం చదివిన వచనంలో క్రీస్తు విశ్వాసుల జీవితంలోని సత్‌క్రియల స్థానాన్ని గుర్తించగలం. మన విమోచన కోసం సత్‌క్రియలు చేయలేము. విమోచన పొందిన తరువాత చేయగలం.

దేవుడు తన కుమారుణ్ణి మనకోసం చనిపోవడానికి పంపాడు. దాన్ని నమ్మి పాపక్షమాపణ పొంది క్రొత్త స్వభావం అనుభవించే వారిలో దేవుని ప్రేమ ఏర్పడుతుంది. అప్పుడు దేవుణ్ణి ప్రేమించి కృతజ్ఞతతో సత్‌క్రియలు చేస్తాం. కాని, మోక్షంకోసం కర్మ మార్గం పని చేయదు.

మనం ఇప్పుడు ఎన్నో ధర్మ కార్యాలు విజయవంతంగా చేస్తున్నామనుకోండి. ఇవి మన గత పాపాన్నీ, అపరాధాన్నీ తొలగించలేవు. మన గత జీవితమే మనకు తీర్పు తీరుస్తుంది. ఎన్ని సత్కార్యాలు చేసినా, ఇది ఉండే ఉంది. ఈ విషయాన్ని తిరిగి చెప్పడం మంచిది. మతాచారాలు గానీ, ధర్మశాస్త్ర క్రియలు గానీ, మానవ ప్రయత్నమేదైనా గానీ, మన అసలు స్వభావాన్ని మార్చలేవు, ముందు చేసిన పాపాలను తీసివేయలేవు. ఇది నిశ్చయమైన సత్యంగా మనం గుర్తుంచుకోవాలి.

క్రీస్తు సిలువను ధ్యానించండి. మనం స్వప్రయత్నంతో మంచి పనులతో విముక్తి సంపాదించుకోగలిగితే దేవుడు తన కుమారుణ్ణి మన స్థలంలో చనిపోవటానికి పంపుతాడా? ఈ ప్రశ్న దానికే జవాబిస్తుంది. ఇది అసాధ్యమైన విషయం. ఒకవేళ నిర్దోషులు కావడం అనేది "ధర్మశాస్త్రం ద్వారా వస్తే క్రీస్తు అనవసరంగా చనిపోయినట్టే!"[5] మానవుడికి మోక్షం లభించాలంటే కర్మ మార్గం చాలదనీ, అంతకు మించినది కావాలనీ సిలువ తేటగా ఘోషిస్తుంది.

**జ్ఞాన మార్గం**

మరొకడు ఇలా గంటాడు: "మీరు చెప్పినది నిజమే. కర్మ మార్గంవల్ల మనకు మోక్షం లభించదు. అంతరాత్మ సాక్షాత్కారం, జ్ఞానం మార్గం మాత్రమే ముక్తికి మార్గం."

మానవుడికి ఆధ్యాత్మికమైన వెలుగు కావాలి. దేవుణ్ణి గురించీ, మనలను గురించీ సత్య జ్ఞానం కావాలి. ఇది నిజమే. కాని సత్య జ్ఞానం అంటే ఏమిటి? – మనం పాపులం, దేవుడు పవిత్రుడు, అనంతుడు. ఆయన అన్నిటికి పైగా ఉన్నవాడు. ఇదంతా చూడటానికి మన కండ్లు తెరుచుకోవాలి. నిజమైన దేవుణ్ణి వ్యక్తిగతంగా అనుభవించ గలగాలి. ఇదే జ్ఞానం మనకు కావలసి ఉంది. విముక్తి అనేది అజ్ఞానం నుంచి మాత్రం కాదు. ఇది అవసరమే గానీ మనకు కావలసిన విమోచన పాపం నుంచి.

**జ్ఞానం మాత్రమే చాలదు**

లోకానికి బోలెడంత జ్ఞానం ఉంది. వేదాంతమూ ఉంది. తెలివితేటలున్నాయి. వివేకం ఉంది. అనుభవం కూడా ఉంది. ఇవన్నీ ఉండి కూడా దేవుని సత్య జ్ఞానాన్ని సమీపించలేకపోయింది. "లోకం తన జ్ఞానం మూలంగా దేవుణ్ణి తెలుసుకోలేదు."[6]

ఆరంభంలో దేవుని ప్రత్యక్షత ద్వారా మనుషులు దేవుణ్ణి ఎరిగి ఉన్నప్పటికీ వారి జ్ఞానం చాలకపోయింది. మన ప్రథమ పితరులకు దేవుణ్ణి గురించిన నిజమైన జ్ఞానం ఉందని లోగడ చూశాం. దేవునికీ వారికీ మధ్య ఆరంభంలో పాపమనే అడ్డం లేదు. అజ్ఞానం అనే అభ్యంతరం లేదు. సహవాసానికి ఎలాంటి అడ్డంకీ లేదప్పుడు. అంత మాత్రంచేత వారు పాపంలో పడిపోకుండా ఉండగలిగారా? దేవుని సేవకుడైన పౌలు బైబిలులోని 'రోమ్‌వారికి లేఖ" రాస్తూ, మనుషులు దేవుణ్ణి ఎరిగి ఉండిన సమయాన్ని గురించి ఇలా వివరించాడు:

"కంటికి కనబడని ఆయన లక్షణాలు – ఆయన శాశ్వత బల ప్రభావాలు. దేవత్వం కనబడే సృష్టిని చూడడం వల్ల తేటతెల్లంగా తెలిసిపోతూవున్నాయి. వారు ఏ సాకూ చెప్పలేని స్థితిలో ఉన్నారు. ఎందుకంటే, వారు దేవుణ్ణి ఎరిగి ఉండి కూడా దేవుడుగా ఆయనను మహిమపరచలేదు, ఆయనకు కృతజ్ఞత చెప్పలేదు. అంతేగాక వారి తలంపులు వ్యర్థమైపోయాయి. వారి తెలివితక్కువ హృదయాలు చీకటి మయమయ్యాయి. తాము జ్ఞానులమని చెప్పుకొంటూ బుద్ధిలేనివారయ్యారు. ఎన్నడూ నాశనం కానివాడైన దేవుని మహిమకు బదులుగా నాశనం అయ్యే మనుషుల విగ్రహాలను తెచ్చిపెట్టుకొన్నారు. పక్షుల విగ్రహాలూ నాలుగు కాళ్ళున్న మృగాల విగ్రహాలూ, ప్రాకే ప్రాణుల విగ్రహాలూ కూడా పెట్టుకున్నారు.[7] వారి జ్ఞానం, వారి తెలివి వారిని దుర్మార్గం నుంచి తప్పించలేకపోయింది.

**జ్ఞానం అపరాధాన్ని తొలగించదు**

మనలను గురించి మనకు సత్య జ్ఞానం ఉందనుకోండి. దేవుణ్ణి గురించి కూడా మనకు నిజమైన జ్ఞానం అలవడింది అనుకోండి. అయితే ఈ జ్ఞానం మన పాపాన్నీ, అపరాధాన్నీ తొలగించడం అసాధ్యం. మనకు నూతన స్వభావాన్నిచ్చి, దేవుని సన్నిధిలో జీవించేందుకు యోగ్యతను ఏమాత్రమూ ఇవ్వలేదు. పాపికి జ్ఞానోదయం కలగవచ్చు. నేను పాపిని అని అతడు గ్రహించవచ్చు. దేవుణ్ణి గురించిన విషయం కూడా అతడికి బోధపడి ఉండవచ్చు. కానీ ఈ జ్ఞానం అతణ్ణి మార్చదు. దానివల్ల అతడు తనకు మార్పు కావాలి అనే అక్కరను మాత్రం గుర్తించగలుగుతాడంతే. నిజంగా చూస్తే, జ్ఞానమనేది మనకు కావాలి. దీన్నిబట్టి మనం పాపాన్ని విసర్జించి సత్య దేవుణ్ణి వెదకగలుగుతాం. కాని, ఆ జ్ఞానమంతా కలిసి ఒక్క పాపాన్ని కూడా తుడిచివేయడం అసాధ్యం. గత జీవితంలో చేసిన ఒక్క పాపం చాలు – మనల్ని పవిత్ర దేవుని దగ్గరనుంచి దూరంగా ఉంచడానికి. ఆ పాపం తొలగిపోయేవరకూ దేవుని సన్నిధికి ప్రవేశించడానికి మనకు హక్కు లేదు.

మనిషికి ఉన్న ఏ జ్ఞానప్రకాశం గానీ, తెలివి గానీ, వికాసం గానీ మనిషి పాపిష్టి హృదయాన్ని మార్చదు, మన పాపాన్నీ, అపరాధాన్నీ తీసివేయదు.

ఒక మనిషి భయంకరమైన నేరం చేశాడనుకోండి. అతణ్ణి న్యాయస్థానంలో నిలబెట్టారు. ఆ దోషికి న్యాయమూర్తి తెలుసు. కాని, ఈ పరిచయం అతడి నేరాన్ని తీసివేయదు. అతణ్ణి విడుదల చేయదు. న్యాయమూర్తి నిజాయితీపరుడైతే దోషి తనతో ఉన్న పరిచయాన్ని బట్టి అతడికేం సాయం చేయలేడు. మనమంతా దేవుని

ఎదుట పాపులంగా, అపరాధులంగా నిలబడుతున్నాం. దేవుడు నిజాయితీపరుడు. న్యాయప్రకారం ఎప్పుడూ జరిగిస్తాడు. దేవుణ్ణి గురించిన జ్ఞానం మూలంగా మన అపరాధాలు పోవు. ఒక్క పాపాన్ని కూడా తొలగించలేదు.

చెరసాలలో హంతకుడున్నాడనుకోండి. అతడికి మరణ శిక్ష విధించబడింది. అతడికి రాజు బాగా తెలుసు. అంతమాత్రం చేత అతడికి విడుదల దొరకదు. అతడి పాపం తొలగిపోదు. రాజు న్యాయాన్ని జరిగిస్తే, చట్టాన్ని సన్మానిస్తే, ఆ నేరస్థుడిని ఏ మాత్రమూ విడుదల చేయడు. మనమంతా పాపం చేశాం. మనమీద మరణ శిక్ష విధించబడి ఉన్నది. దేవుడు న్యాయం గలవాడు. దేవుడు నియమాన్ని పాటిస్తాడు. జ్ఞానం మనలను విమోచించదు. జ్ఞానం మాత్రమే ముక్తికి సాధనం కాబోదు.

దీన్నిబట్టి జ్ఞాన మార్గాన్ని మించినదేదో మనకు కావాలనిపిస్తుంది. క్రీస్తు సిలువ కూడా ఈ విషయాన్నే రుజువు చేస్తుంది. ఆయన సిలువవైపు చూడండి. అడగవలసిన ప్రశ్ననే మరోసారి అడగండి. మన జ్ఞానంవల్ల, వికాసంవల్ల మాత్రమే మోక్షం లభించడం సాధ్యమైతే, దేవుడు తన కుమారుణ్ణి మన స్థానంలో బాధ అనుభవించి చనిపోవడానికి పంపేవాడా? ఇది అసాధ్యం. యేసు సిలువనుంచి దూరం చేయడానికి ప్రయత్నించే ఏ జ్ఞానమైనా సరే అది జ్ఞానమనిపించుకోదు. క్రీస్తు సిలువను త్రోసివేసే ఏ జ్ఞానమైనా, అది అజ్ఞానమే అనిపించుకుంటుంది.

### భక్తిమార్గం

కొందరు భక్తి మార్గాన్ని ప్రకటిస్తారు. భక్తి ప్రవృత్తుల ద్వారా మోక్ష ప్రాప్తి కలుగుతుందని వీరి భావన. మిగతా మార్గాలకంటే దీనికి స్థిరమైన ఆధారం ఉందా? పరిశీలిద్దాం పట్టండి.

మనం సత్యం దేవుణ్ణి ప్రేమించాలి. ఆయనకు సమర్పణ చేయాలి. ఆయనను స్తుతించాలి, సేవించాలి. బైబిలు బోధలలో ఇది పెద్ద భాగం వహిస్తుంది. ఒక సారి ఒక మనిషి దేవుని ఆజ్ఞలన్నిటిలోకీ ప్రాముఖ్యమైనది ఏది అని గురుదేవుడైన క్రీస్తును అడిగాడు. ఆయన చెప్పిన జవాబు: "హృదయపూర్వకంగా, సంపూర్ణ ఆత్మతో మనస్ఫూర్తిగా మీ దేవుడైన ప్రభువును ప్రేమిస్తూ ఉండాలి. ఇదే ముఖ్యమైన ఆజ్ఞ మొదటిది కూడా."[8]

### భక్తి మాత్రమే చాలదు

భక్తి ప్రధానమైనదే గాని ఇది మాత్రమే చాలదు. అసత్యమైన వస్తువులో, అయోగ్యుడైన వ్యక్తిలో భక్తి నిలపడం కూడా సాధ్యం కావచ్చు. ఈ లోకంలో ఏకైక

సత్య దేవుణ్ణి విసర్జించి మరో వ్యక్తిని లేక వస్తువును భక్తితో సేవించడం అనేది ఉంది. ఈ విధంగా చేస్తే మన పాపాన్ని పొడిగించుకున్నట్టే అవుతుంది. మన భక్తికి వ్యక్తి ఎవరో, వస్తువేదో అది చాలా ప్రాముఖ్యమైనది అని గురుదేవుని ప్రబోధం – మనం సత్య యేక దేవునికి మాత్రమే భక్తి చూపాలి."[9] (ఈ అంశాన్ని గురించి బైబిలు ఏమి చెపుతుందో విపులంగా తెలుసుకోవాలంటే, ఈ క్రింది రిఫరెన్సులు చూడాలి – నిర్గమ 20:3–5; ద్వితీ 8:19; 13:6–11; న్యాయాధిపతులు 2:11,12,17; 1 దిన 5:25; కీర్తన 106:19–21; యెషయా 42:8,17; యిర్మీయా 10:11; హోషేయ 4:12; 1 కొరింతు 8:5; 10:20; 1 యోహాను 5:21; ప్రకటన 9:20,21.

మనం నిజమైన భక్తితో మన సృష్టికర్త దేవుణ్ణి మాత్రమే ఆరాధించాలని ఎంతగానో ఆశించవచ్చు. మిగతాదంతా వదిలేయవచ్చు. కాని, ఈ భక్తి కూడా మనకు పాపవిముక్తి కలిగించదు. నిజానికి మన భక్తిని గురించి చెప్పుకోవడం నిష్ప్రయోజనం. దేవుణ్ణి ప్రేమించవలసిన రీతిగా మనం ప్రేమించడం లేదు. ఆయన మహిమార్థం సరిగా జీవించడం లేదు. మనం ఆయన్ను చాలినంతగా స్తుతించడం లేదు. కవులు తమ కావ్యాలలో భక్తినీ దైవ ప్రేమనూ చక్కగా వర్ణించవచ్చు. ప్రజలు పాటలూ కీర్తనలూ చక్కగా పాడవచ్చు. వ్రాయడం, పాడడం ఒక ఎత్తు – హృదయ పూర్వకంగా చేయగలగడం మరొక ఎత్తు. దేవుడు ఆత్మ. మన ఆరాధన కూడా ఆత్మతో, సత్యంతో జరగాలి. ఈ విషయాన్ని జ్ఞాపకముంచుకోవాలి. కానీ స్వభావసిద్ధంగా మనం పాపులం. సృష్టికర్తను ప్రేమించి, ఆత్మతో ఆయనను ఆరాధించక మునుపు మనం పూర్తిగా మార్పు పొందాలి. క్రొత్త సృష్టి కావాలి. మనకు ఆయన దగ్గరనుంచి ఒక నూతన ఆధ్యాత్మిక స్వభావం లభించాలి.

## భక్తి పాపాన్ని తొలగించదు

సత్య దేవునిపట్ల గాఢమైన ప్రేమ నీకు ఉన్నా, అలాంటి భక్తి ప్రేమలు నీ పాపాన్ని తొలగించవు. అపరాధాలను పరిహరించవు. నేరస్థుడు న్యాయాధిపతిని ఎంతో ప్రేమించవచ్చు. ఆ ప్రేమను వెల్లడి చేయవచ్చు. కాని, అంత మాత్రాన శిక్షనుంచి విడుదల కలగదు. ఖైదీ ఎంతగానో రాజుకు స్తుతి పాఠాలు చేయవచ్చు. కాని, రాజు చట్టప్రకారం చేస్తే ఆ పొగడ్తలు చెరసాలనుంచి విడుదలను అతడికి ఇవ్వలేవు. మనం దేవునికి ఎంతో భక్తిని ప్రకటించవచ్చు. మన ప్రేమ పొంగి పొర్లవచ్చు. సంపూర్ణమైన శ్రద్ధాసక్తులు ప్రదర్శించవచ్చు. అయితే దీని ద్వారా మన

గత పాపం, అపరాధం పోదు. ఒక్క పాపంవల్ల వచ్చే శిక్షను కూడా తప్పించలేదు. పాపానికి శిక్ష వచ్చితీరాలి. క్రీస్తు సిలువమీదకి పోవాలి. మరో మార్గం లేదు. లేకపోతే, దేవుని పవిత్రత ప్రజ్వలిస్తూ ఖడ్గంలాగా పాపిని దూరపరుస్తుంది. ఈ కారణంచేతనే మనుషులందరూ ఆయనకు దూరంగా ఉన్నారు. మనం దీన్ని గ్రహించలేకపోతే దీని కారణం మనకు దేవుని పవిత్రత అర్థం కాలేదన్నమాట. “మనం దేవుణ్ణి ప్రేమించామని కాదుగాని ఆయనే మనలను ప్రేమించి మన పాపాలకు కరుణాధారమైన బలి కావడానికి తన కుమారుణ్ణి పంపాడు.”[10] విముక్తి కార్యంలో మన ప్రేమ చెప్పుకొనేంత గొప్పదేమీ కాదు. దేవుని ప్రేమ మనలను విమోచిస్తుంది. ఈ ప్రేమను వెల్లడి చేయడానికి దేవుడు తన కుమారుణ్ణి చనిపోయేందుకు పంపాడు. మరో మార్గం లేదు. భక్తి గానీ, జ్ఞానం గానీ, కర్మ గానీ, మరే మార్గం గానీ ఇక్కడ పని చేయడం లేదు. ఈ మూడు మార్గాలను జత చేసినా ఉపయోగం కానరాదు. ఈ మూడు అసాధ్యతలను కలిపితే అది సాధ్యతగా మారదు. క్రియలు ముఖ్యమే. జ్ఞానం అవసరమే. భక్తి కావలసినదే. ఒక్కొక్క దానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. కానీ, వీటిలో ఏ ఒక్కటి గానీ మనిషి కల్పించిన మరే మార్గం గానీ పాపాలను తీసివేయడం, నూతన జీవం ఇవ్వడం, దేవుని సన్నిధికి మనలను యోగ్యులనుగా చేయడం సాధ్యం కానే కాదు.

ఇలా ఉంటే అసలు మార్గమేది? గురుదేవుడు ఉపదేశించిన ఆ నిజమైన మార్గం సరిగ్గా మూడు మాటల్లో చెప్పవచ్చు. ఇది సిలువ మార్గం. ఇది కృప మార్గం. ఇది విశ్వాస మార్గం.

**సిలువ**

సిలువ మార్గం – సిలువ మీద దేవుని కుమారుడు బాధలు అనుభవించి చనిపోయాడని లోగడ చాలా సార్లు చెప్పుకున్నాం. ఈ సత్యాన్ని ఎన్ని సార్లు చెప్పుకున్నా తనివి తీరదు. ఇది క్రీస్తు శుభవార్తకు గుండెలాంటిది. దేవుడు తన ప్రజల పాపాలను నాశనం చేసి వారిని తన పవిత్ర సన్నిధికి రప్పించుకునే మార్గమిదే.

సిలువ మీద యేసుప్రభువు చనిపోకపోతే, మనుషులకు పాపవిముక్తి గానీ రక్షణ గానీ పరలోకం గానీ లేదు. సిలువే గనుక లేకపోతే అంతా నాశనమే. భక్తుడైన పౌలు నీతి క్రియలు బాగా చేసినవాడు, జ్ఞానం గలవాడు, భక్తి గలవాడు, ఆధ్యాత్మిక వికాసం గలవాడు. దేవునితో మంచి అనుభవం కూడా గలవాడు. కాని, వీటిలో దేనిమీద కూడా ఆయన విశ్వాసం పెట్టకుండా ఈ విధంగా అన్నాడు –

"నాకైతే మన ప్రభువైన యేసు క్రీస్తు సిలువను బట్టి తప్ప మరి దేనిని బట్టి అతిశయముగా మాట్లాడడం దూరం అవుతుంది గాక!"[11]

## కృప

కృపా మార్గం – మానవుడు పాపి, తనను తాను సత్‌క్రియలచేత మోక్షం సంపాదించుకోలేడు. క్రియలు ద్వారా, జ్ఞానం ద్వారా, ఆరాధన ద్వారా ఇవ్వనీ కలిసి ఉండడం ద్వారా కూడా పాపవిముక్తి పొందలేడు. మానవ ప్రయత్నమేదీ అతడి సమస్యకు పరిష్కారం చూపలేదు. మానవుడు ఆత్మ సంబంధంగా మృతుడు. దేవుని న్యాయమైన తీర్పుకు గురి అయినవాడు. అతడు నరకానికి మాత్రమే తగినవాడు. అతడి పాపానికి సాకు ఏదీ లేదు. అతడు పని చేసే జీవితాన్ని, క్షమాపణను సంపాదించుకోలేడు. అతడు నిస్సహాయుడు. పూర్తిగా దిక్కుమాలినవాడు. అలాంటప్పుడు మానవుడికి విముక్తి కలిగే మార్గమేది? దీనికి ఒకే జవాబున్నది: ఇది దేవుడే చెయ్యాలి.

దేవుణ్ణి బైబిలు "సర్వ కృపానిధి" అని పేర్కొంటుంది.[12] దానిని మనుషులకు ఇవ్వడంలో దేవునికి ఎంతో ఆనందం ఉంది. అయోగ్యులపట్ల కూడా ఆయన అనుగ్రహం విస్తరిస్తున్నది. ఆయన మోక్షం ఇస్తాడు. విమోచన ఇస్తాడు. క్షమాపణ ఇస్తాడు. శాశ్వత జీవమిస్తాడు. ఇవన్నీ ఉచితంగా దేవుడు ప్రసాదిస్తాడు. మన గురుదేవుడైన క్రీస్తు నేర్పినదిదే.

## దేవుడు ఏమిస్తాడు?

దేవుడు తన ఏకైక కుమారుణ్ణి ఇచ్చాడు: "దేవుడు ఈ లోకాన్ని ఎంతో ప్రేమించి తన ఒక్కకానొక్క కుమారుణ్ణి ప్రసాదించాడు. ఆ కుమారుని మీద నమ్మకం ఉంచువారెవరైనా సరే నాశనం కాకుండా, శాశ్వత జీవం పొందాలనీ ఇందులో దేవుని ఉద్దేశం."[13]

దేవుడు శాశ్వత జీవమిస్తాడు. గురుదేవుడిలా చెప్పాడు: "నా గొర్రెలు నా స్వరం వింటాయి. అవి ఆయనకు తెలుసు. అవి నన్ను అనుసరిస్తాయి. నేను వాటికి శాశ్వత జీవం ఇస్తూవున్నాను. అవి ఎన్నడు నశించవు."[14]

దేవుడు ఇలా చెపుతున్నాడు: "పాపం వల్ల వచ్చే జీతం మరణం గానీ దేవుడు ఉచిత కృపావరం మన ప్రభువైన క్రీస్తు యేసులో శాశ్వత జీవం"[15]

దేవుణ్ణి తెలుసుకోవడానికి జ్ఞానం ప్రత్యక్షత గల మనస్సును కూడా ఆయన ఇస్తాడు: "మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క దేవుడు – మహిమగల ఆ తండ్రి –

ఆయనను సంపూర్ణంగా తెలుసుకోవడంలో జ్ఞాన ప్రకాశాలు గల మనసు మీకు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను."[16] దేవుడు పాపక్షమాపణ ప్రసాదిస్తాడు: "ఆయనలో ఆయన రక్తం ద్వారా మనకు విముక్తి, మన పాపాలకు క్షమాపణ కలిగాయి."[17]

దేవుడు నీతిన్యాయాలూ నిర్దోషత్వమూ అనే వరం ఇస్తాడు: "భేదమేమీ లేదు – అందరూ పాపం చేశారు, దేవుడు ఇచ్చే మహిమను అందుకోలేకపోతున్నారు. అందుచేత నమ్మకం గలవారిని న్యాయవంతులుగా నిర్దోషులుగా ఎంచడం అనేది దేవుడు తన కృప చేత ఉచితంగా అనుగ్రహించేదే."[18]

దేవుడు తనతో శాంతి సమాధానాలిస్తాడు: "ఆయన మమ్ములను క్రీస్తు ద్వారా తనతో సఖ్యపరచుకున్నాడు."[19]

దేవుడు మనకు పాపవిముక్తి ఇస్తాడు: "మీకు పాపవిముక్తి, రక్షణ కలిగింది కృప చేతే, విశ్వాసం ద్వారానే. అది మీవల్ల కలిగినది కాదు. దేవుడు ఉచితంగా ఇచ్చినదే. అది క్రియల వల్ల కలిగినది కాదు."[20]

దేవుడు క్రీస్తులో సమస్తాన్ని ఇస్తాడు: "తన సొంత కుమారుణ్ణి ఇవ్వడానికి వెనక్కు తీయకుండా మనందరి కోసం ఆయనను అప్పగించిన దేవుడు ఆయనతో పాటు అన్నిటినీ మనకు ప్రసాదించడా?"[21]

ఇదంతా ఉచితంగా మనుషులందరికీ – నీకూ, నాకూ, ప్రతి ఒక్కరికీ ఇయ్యజూస్తున్నాడు దేవుడు. నిజంగా మనం దేనికీ అర్హులం కాము. ఒకవేళ పది లక్షల జన్మలెత్తి, అన్ని జన్మల్లో ఘోర పాపిగా ఉన్నా సరే, దేవుని కృప ప్రతి పాపాన్ని క్షమించగలదు. గానీ ఆ వ్యక్తి క్రీస్తును అంగీకరించి నమ్మకంతో స్వీకరించాలి. క్రీస్తులో ఉన్న దేవుని కృప ఎదుట ఎలాంటి కర్మ కూడా నిలవడం అసాధ్యం.

## కృప అంటే ఏమిటి?

కృప అనే మాటకు అసలు అర్థమేమిటి? ఈ పదానికి సాధారణ అర్థం: "అయోగ్యులైన వారిపట్ల దేవుని కరుణ." అంటే మనం దేవుని కృపకు తగినవారం కాము. మనలను మనం యోగ్యులనుగా చేసుకోలేము కూడా. అయోగ్యులైన వారికి ఉచితంగా ఇవ్వడమే కృప. మానవ ప్రయత్నం కృపకు ఏమీ సంబంధించినది కాదు.

కృప అంటే దేవుని అనుగ్రహానికి తగనివారికీ, ఏ మాత్రమూ దానికి యోగ్యులు కానివారికీ దేవుడు చూపే కటాక్షం. క్రియలవల్ల దీనిని సంపాదించుకోలేని వారికి ఇది ఉచితంగా దొరుకుతుంది. ముక్తికి కావలసిన సమస్తమూ దేవుడు ఇవ్వడమే

కృప. దేవుడు తన కుమారుణ్ణి ఇచ్చేశాడు. ఇది కృప. తనకు శత్రువులైనవారికి, పాపులకు, తన కోపానికీ, శిక్షకూ మాత్రమే పాత్రులైన వ్యక్తులకు ఆయన మోక్షం ప్రసాదిస్తున్నాడు. ఇది కృప.

ఒక దుర్మార్గుడు మీ ఇంట్లో చొరబడ్డాడనుకోండి. మీ చిన్న కుమార్తెను అసహరించుకుపోయి, కొట్టి చంపాడు. పోలీసులు అతణ్ణి వెదకి పట్టుకున్నారు. అతడు నేరస్థుడని రుజువయింది. తీర్పుకోసం న్యాయమూర్తి ఎదుట నిలవబెట్టారు. అప్పుడు నీవు న్యాయమూర్తితో, "ఈ నేరస్థుణ్ణి వెళ్ళిపోనివ్వండి. అతడు నాకు వ్యతిరేకంగా చేసిన నేరానికి నేనే దండనకు గురౌతాను. అతడి స్థానంలో నేను శిక్ష భరించి చస్తాను" అని చెప్పగలవా?

మనుషులు అలా చెయ్యరు. కాని, దేవుడు తనకు వ్యతిరేకంగా పాపం చేసిన వారిపట్ల ఈ విధంగానే చేశాడు. తన కుమారుణ్ణి హత్య చేసిన వారికోసం ఆయన చనిపోయాడు. ఆయనకు మనమే గాయాలు చేశాం. వాటి ద్వారానే మనం బాగు పడగలం. ఇది కృప.

**ఉదాహరణ**

ఓ రాజు ఉండేవాడు. అతడు చాలా మంచివాడు. దయ గలవాడు. అతడి దగ్గర ఒక సేవకుడుండేవాడు. అయితే అతడు పనిని సక్రమంగా చేసేవాడు కాడు. రాజుకు సేవ చేయడానికి బదులు తన స్వంత పనులే చూచుకునేవాడు. వీలు చిక్కినప్పుడెల్లా రాజును మోసం చేసేవాడు. రాజాతఃపురం నుంచి చాలా వస్తువులు దొంగిలించేవాడు. రాజ్య విధులనూ నియమాలనూ నిర్లక్ష్యం చేసి తృణీకరించేవాడు. రహస్యంగా రాజుకు తిరుగుబాటు చేశాడు. శత్రువుల పక్షాన చేరాడు. రాజును రాజ్యంనుంచి వెళ్ళగొట్టాలని కుట్ర పన్నాడు. ఈ ప్రయత్నంలో రాకుమారుణ్ణి హత్య చేశాడు.

అలాంటప్పుడు రాజు ఒక ప్రకటన చేశాడు. తిరుగుబాటుదారులు తమ అయుధాలను పారవేసి నా దగ్గరకు వచ్చి క్షమాపణ వేడితే, నేను వారిని క్షమిస్తాను అన్నాడు రాజు. ద్రోహి అయిన సేవకుడు తన తప్పిదాన్ని తెలుసుకున్నాడు. రాజుగారి దయను గ్రహించి వచ్చి రాజుగారి పాదాలపైబడ్డాడు. కన్నీటితో క్షమాపణ వేడుకున్నాడు. ఈ దుష్ట సేవకుడి మీద రాజుకు కనికరం కలిగింది. అతడికి తగినది మరణశిక్ష. అయినప్పటికీ రాజు అతణ్ణి పూర్తిగా క్షమించాడు. అంతేగాక, అతణ్ణి కుమారుడిగా భావించి అతడికి రాజ్యంలో ఉన్నత పదవి ఇచ్చాడు.

ఇలాంటిది ఎక్కడా జరగదు అని నీవు అనుకోవచ్చు. పాపి పశ్చాత్తాపపడినప్పుడల్లా ఇది జరుగుతూనే ఉంది. యేసుక్రీస్తు ద్వారా పరలోకాధిపతి దగ్గరకు వచ్చినప్పుడెల్లా మానవుడికి ఇలాగే జరుగుతూ ఉంటుంది. మనమందరమూ ఆ దుష్ట సేవకుడిలాంటివారమే. మనలను మార్చగలిగినది, మనకు సాయం చేయగలిగినది, క్షమించగలిగినది, రక్షించగలిగినది దేవుని అద్భుతమైన కృప మాత్రమే.

**విశ్వాసమార్గం**

విశ్వాస మార్గం సిలువ మార్గంతో, కృప మార్గంతో పొందిక గలది. సిలువపై క్రీస్తు ఏం చేశాడో చూశాం. దేవుడు కృపద్వారా ఏమిస్తున్నాడో పరిశీలించాం. ఇప్పుడు దేవుని కృపను ఎలా పొందాలో చూద్దాం. క్షమాపణ, ముక్తి ఎలా లభిస్తాయో గమనిద్దాం. వాటిని మన కార్యాల ద్వారా గానీ మన భక్తి జ్ఞానాల ద్వారా గానీ సంపాదించుకోలేము అని చెప్పుకున్నాం. మరి అవి ఎలా లభిస్తాయి? ఇవి విశ్వాస మార్గాన మాత్రమే లభిస్తాయి. దేవుడు రాయించిన విషయాలు బైబిలులో ఉన్నాయి. ఈ క్రిందివాటిలో కొన్ని క్రీస్తు చెప్పినవి, కొన్ని ఆయన శిష్యులు చెప్పినవి. అన్నీ దేవుని ప్రేరణవల్ల కలిగినవి.

**దేవునివాక్కు**

"నా మాట విని నన్ను పంపిన వాణ్ణి నమ్మేవారు శాశ్వత జీవం గలవారు. వారు తీర్పులోకి రారు. మరణంలోనుంచి జీవంలోకి దాటారు."[22]

"మీతో ఖచ్చితంగా చెపుతున్నాను, నన్ను నమ్మినవారికి శాశ్వత జీవం ఉంటుంది."[23]

"ఆయన మీద నమ్మకం వుంచే ప్రతి ఒక్కరికీ ఆయన పేరు మూలంగా పాప క్షమాపణ దొరుకుతుందని ఆయనను గురించి ప్రవక్తలందరూ సాక్ష్యం చెప్పేవారు."[24]

"అయ్యలారా, పాపవిముక్తి పొందడానికి నేనేం చెయ్యాలి? . . .ప్రభువైన యేసు మీద నమ్మకం పెట్టు. అప్పుడు నీకు పాప విముక్తి కలుగుతుంది."[25]

"శుభవార్తను గురించి నాకు సిగ్గు అంటూ ఏమీ లేదు. ఎందుకంటే, దానిని నమ్మే ప్రతి ఒక్కరికీ – మొదట యూదులకు, తరువాత ఇతర ప్రజలకు కూడా – అది పాపవిముక్తి, రక్షణ కలిగించే దేవుని ప్రభావం."[26]

"మీకు పాపవిముక్తి, రక్షణ కలిగింది కృపచేత, విశ్వాసం ద్వారానే. అది మీ

వల్ల కలిగినది కాదు. దేవుడు ఉచితంగా ఇచ్చినదే."[27]

ఈ విధంగా బైబిలులోనుంచి ఎన్నైనా వచనాలు ఎత్తి చూపవచ్చు. విమోచన, పాపక్షమాపణ, దేవునితో శాశ్వత జీవం విశ్వాస మార్గంలోనే లభిస్తాయి అని గురుదేవుడు స్పష్టంగా బోధించాడు. ఇందులో ఎలాంటి సందేహమూ లేదు. అయితే విశ్వాస మంటే ఏమిటి? దీన్ని అభ్యసించేది ఎలాగు? దేవుడు యేసు క్రీస్తును లోకానికి పంపాడు అని విశ్వసించడం మాత్రమే కాదు – విశ్వాసం అంతకు మించినది. యేసు క్రీస్తు పుట్టుక, జీవనం, మరణం, పునర్జీవితం అనే వాస్తవాన్ని మానసికంగా గుర్తించినంత మాత్రాన అది విశ్వాసం కాదు. ఈ వాస్తవాల్ని మనం నమ్మవలసి ఉంది, నిజమే గానీ అది మాత్రమే చాలదు. దేవుని గురించి, మనుషుల గురించి యేసుప్రభువు చేసిన బోధలు, ఆయన లోకానికి ఎందుకు వచ్చింది, వీటిని గురించిన విషయాలను అంగీకరించినంత మాత్రాన కూడా అది విముక్తి తెచ్చే విశ్వాసం కాదు. ఈ విషయాల గురించి సరైన అభిప్రాయం కలిగి ఉండడం మంచిదే. విశ్వాసమనేది వీటన్నిటికీ మించినది. ఇంతకూ విశ్వాసమంటే ఏమిటి? బైబిలు ఈ విషయాన్ని బహు తేటగా వెల్లడి చేస్తుంది.

**విశ్వాసం**

విశ్వాసమంటే యేసుక్రీస్తు మీద నమ్మకం. ఒక వ్యక్తిమీద విశ్వాసముంచడమంటే ఆ వ్యక్తి చెప్పిన మాటలు నమ్మాలి గదా. ఆయన గుణాన్ని నమ్మి దానిపై అధారపడాలి. ఆయన వాగ్దానాల మీద నిలవబడాలి. ఆయన మోసం చేయడనీ, ఆశాభంగం కలిగించడనీ దృఢంగా నమ్మాలి. ఆయన తన మాటప్రకారం జరిగించితీరుతాడని ఆశాభావంతో ఎదురు చూడాలి. క్రీస్తుమీద విశ్వాసముంచడమంటే ఇదే అర్థం. ఆయన విశ్వసనీయుడనీ ఆయనను సంపూర్ణంగా నమ్మవచ్చుననీ గుర్తిస్తాం. మనం ఎన్నడూ చేయలేనిది ఆయన మనకోసం చేస్తాడని నమ్ముతాం. ఆయన మనల్ని క్షమిస్తాడనీ మనకు ముక్తి, శాశ్వత జీవం ఇస్తాడనీ నమ్ముతాం. ఆయన మోసం చేస్తాడేమోననే భయాన్ని వదిలేసి, మనమీద మనకున్న నమ్మకం విడిచిపెట్టి, ఆయన వాగ్దానాలు నెరవేరుస్తాడని నమ్ముతాం. ఇదే విశ్వాసం.

**ఆయన దగ్గరికి రావాలి**

విశ్వాసంలో గురుదేవుని దగ్గరకు రావడం ఇమిడి ఉంది. యేసు ప్రభువు ఇలా

చెప్పాడు: "తండ్రి నాకు ప్రసాదించిన వారందరూ నాదగ్గరకు వస్తారు."[28] ఇప్పుడు యేసుక్రీస్తు సశరీరంగా ఈ లోకంలో లేడు. అయితే ఆయన దేవుడు, ఆయన అందరికీ సమీపంగా ఉన్నాడు. ఆయన మనలను చూస్తూ మనదగ్గరికే వస్తున్నాడు. మనమెక్కడ ఉన్నా ఆయన దగ్గరకు రావచ్చు. ఆయన సశరీరుడుగా ఉన్నట్లు ఆయనను సమీపించగలం.

మనం ఉన్నవాళ్ళం ఉన్నట్టే ఆయన దగ్గరికి రావాలి. మన అక్కరను మనం గుర్తించాలి. ఆయన మన అక్కరను తీర్చాలని ఇష్టపడుతున్నాడని గ్రహించి విశ్వసించాలి. మనలను తన దగ్గరికి రమ్మని ఆహ్వానించాడు. తీరా మనం వచ్చినప్పుడు ఆయన త్రోసివేస్తాడా? గతకాలంలో మనం ఏమి చేసినా పరవాలేదు, మనం ఎంత చెడ్డవాళ్ళమైనా పరవాలేదు, మనం క్రీస్తుదగ్గరకు వస్తే ఆయన మనలను స్వీకరిస్తాడు. ఆయన మనకు స్వయంగా వాగ్దానం చేశాడు.

మనం ఆయన్ను నమ్మాలి.

## పిలుపు

విశ్వాసంలో దేవునివైపు చూచి ప్రార్థించడం కూడా ఇమిడి ఉంది. ఇది వ్యక్తిగతంగా మనసారా ప్రార్థించడం. "ఎవరైతే ప్రభువు పేర ప్రార్థన చేస్తారో వారికి విముక్తి కలుగుతుంది."[29] మనం క్రీస్తును ప్రార్థనలో పిలువగలం. శాశ్వత జీవంకోసం, వెలుగుకోసం, ముక్తికోసం ఆయనను అడుగగలం. సత్యాన్ని తెలియజేయమని ఆయనను అడుగవచ్చు. క్షమాపణ వేడవచ్చు. మనలను దేవుని బిడ్డలనుగా చేయమని అడగవచ్చు. ఆయన ఇలా చేసేందుకే వచ్చాడు. అలాంటప్పుడు మనం ఇలా చేయమని అడిగితే ఆయన చేయకుండా ఉంటాడా?

## స్వీకారం

విశ్వాసమంటే క్రీస్తును స్వీకరించడమే. "ఆయనను స్వీకరించినవారికి – అంటూ, ఆయన పేరు మీద నమ్మకం ఉంచినవారికి – దేవుని సంతానం కావడానికి ఆయన అధికారం ఇచ్చాడు. వీరు దేవునివల్ల పుట్టినవారే. రక్తంవల్ల గానీ శరీరాశవల్ల గానీ మానవ సంకల్పంవల్ల గానీ పుట్టినవారు కారు."[30]

ఆయన మన హృదయ ద్వారం దగ్గరే ఉన్న సజీవుడు. ఆయనకు మనం తలుపు తీయాలి. ఆయన మన పాపాలు క్షమిస్తాడు. బంధకాలనుంచి విమోచిస్తాడు. కనుక ఆయనను స్వీకరించాలి. ఆయన మనలను పరిపాలించేలా ఆయనను ప్రభువుగా, దేవుని కుమారుడుగా స్వీకరించాలి. ఆయన మన ఆరాధనకు పాత్రుడు. సేవకు,

సంస్తుతికి తగినవాడు. ఆయన తలుపు కొడతున్నాడు. ఆయనకు తలుపు తెరిస్తే ఆయన మన హృదయంలో ప్రవేశించడా? ఆయన స్వయంగా చేసిన వాగ్దానమే దీనికి జవాబు చెపుతుంది: "నేను తలుపు దగ్గర నిలుచుండి తట్టుతూ ఉన్నాను. ఎవరైన సరే నా స్వరం విని తలుపు తీస్తే లోపలికి వస్తాను. ఆ వ్యక్తితో నేను, నాతో ఆ వ్యక్తి భోజనం చేస్తాం." [31]

## తెలిసిన విషయాలపై ఆధారపడినది

విశ్వాసం తెలిసిన విషయాలపై ఆధారపడినది. ఒక వ్యక్తి ఎవడో తెలుసు కోకముందు అతణ్ణి నమ్మలేము గదా! పోనీ, ఆ వ్యక్తిని గురించి కొంతవరకైనా మనకు తెలిసి ఉండాలి. క్రీస్తు విషయం కూడా ఇలాగే. నిజమైన విశ్వాసం మూఢ నమ్మకం కాదు. ఊహపోహలు కావు. క్రీస్తును గురించిన సత్యాలను తెలుసుకున్నందుకు విశ్వాసం సాధ్యమవుతుంది.

## నైతిక తీర్మానం

"తన కుమారుని ద్వారా లోకానికి విముక్తి, రక్షణ లభించాలని దేవుడు ఆయనను పంపాడు గాని లోకానికి శిక్ష విధించడానికి కాదు. ఆయన మీద నమ్మకం ఉంచేవారికి శిక్షావిధి లేదు. నమ్మకం పెట్టనివారికి ఇంతకు ముందే శిక్ష విధించడం జరిగింది. ఎందుకంటే వారు దేవుని ఒకే ఒక కుమారుని పేరుమీద నమ్మకం పెట్టలేదు. ఆ శిక్షావిధికి కారణం ఇదే – వెలుగు లోకంలోకి వచ్చింది గానీ తమ క్రియలు చెడ్డవి కాబట్టి మనుషులకు ప్రీతి పాత్రమయినది వెలుగు కాదు, చీకటి."[32]

విశ్వాసమనేది చీకటిలోకి దూకెయ్యడం కాదు. అది వెలుగులోకి దూకడంలాంటిది. క్రీస్తు దగ్గరకు రావడమంటే, వెలుగును, పవిత్రతను, నీతిని, నాయ్యాన్ని కోరుతున్న వారమౌతాం. మరి ఎందుకని అనేకులు ఆయనను నిరాకరిస్తారు? దీనికిదే జవాబు – అలాంటి తీర్మానం చేసుకోవడం వారికిష్టం లేదు. వారికి వెలుగుకంటే చీకటే ఎక్కువ ఇష్టం. వెలుగు కోసం ఈ నైతిక తీర్మానం మనం చేయకపోతే, మనకు సహాయం మరొకటి ఎక్కడా ఉండదు. క్రియలు గాని, జ్ఞానం గాని, భక్తి గాని, కర్మ గాని, వేదాంతం గాని, సిద్ధాంతం గాని, మతం గాని, క్రీస్తు చేసినది తెలుసుకోవడం గాని – వీటిలో ఏదీ మనకు సాయపడదు. అతి ప్రాముఖ్యమైన ప్రశ్న ఇదే – ఈ వెలుగు కావాలని మనం నిర్ణయం చేసుకొంటున్నామా? లేదా?

విశ్వాసం క్రీస్తును నమ్ముతుంది. క్రీస్తు దగ్గరికి వస్తుంది. క్రీస్తుకు ప్రార్థన చేస్తుంది. క్రీస్తును ఎన్నుకుంటుంది. తనకు కావలసినది క్రీస్తుదగ్గరనుంచి తీసుకుంటుంది. ఏదో ఉపదేశాలలో ఉంచిన శూన్యమైన నమ్మకం కాదిది. మన జీవితాలను మార్చగల మహా శక్తి గలదీ విశ్వాసం. ఇది మనలను క్రీస్తుతో సంయుక్తపరుస్తుంది. దేవుని వెలుగులో నడవడానికి మనకు సామర్థ్యం ప్రసాదిస్తుంది.

**మార్గం**

యేసుప్రభువు ఉపదేశించిన మార్గం సిలువ మార్గం, కృప మార్గం, విశ్వాస మార్గం. నిజంగా చెప్పాలంటే క్రీస్తే మార్గం. ఆయనలో విశ్వాసం ఆయనతో వ్యక్తిగత సంబంధమన్న మాట. ఈ సంబంధమే మనలను విమోచిస్తుంది. క్రీస్తే ముక్తి గురించిన ఆశాభావం. ఆయన జీవాన్ని, క్షమాపణను మనకిస్తాడు. బలం, తెలివి, శక్తి, ప్రేమ, దేవుని నిత్య సన్నిధి మనకు అనుగ్రహిస్తాడు. మనకింకా కావలసినదేమిటి? మనం ఆయనలో విశ్వసించినప్పుడు ప్రతి అడ్డుగోడ పడగొట్టడం జరుగుతుంది. అప్పుడు దేవుడు మనుషుల కోసం ఏర్పాటు చేసిన గొప్ప రక్షణను అనుభవించగలుగుతాం. దానిలో భాగాలైన శాంతీ, దేవునితో సహవాసం అనే వాటిని కూడా అనుభవిస్తాం. స్నేహితులారా, దేవుడు ఇవ్వజూపుతున్నదానికి పెడముఖం పెట్టవద్దండి.

మనకు విశ్వాసం ఉందా? ఉంటే దాన్ని ఉపయోగించుకుందాం. మన విశ్వాసం బలహీనంగా ఉందా? అసలు లేదా? యేసుక్రీస్తు లక్షణాలను చదివి తెలుసుకుందాం పట్టండి. ఆయన చేసిన వాగ్దానాలను, ఆయన ఇచ్చిన రుజువులను పరిశీలిద్దాం. ఆయన ప్రేమను, కనికరాన్ని గుర్తిద్దాం. పాపులకోసం ఆయన సిలువమీద అనుభవించిన మరణం, మృతులలోనుంచి ఆయన మహిమగల పునర్జీవితం గమనిద్దాం. పాపంనుంచి వైదొలుగుదాం. మన పాపాలను ఆయన ఎదుట ఒప్పుకుందాం. ఆయన ముఖ దర్శనం చేద్దాం. మన దగ్గర కొత్త ఒడంబడిక గాని, బైబిలు గాని లేకపోతే ఎలాగైనా సరే ఒకటి కొనుక్కోవడం మంచిది. దాన్ని జాగ్రత్తగా, ప్రార్థనా పూర్వకంగా చదవాలి. మీ హృదయాలను క్రీస్తువైపుకు ప్రార్థనా పూర్వకంగా ఎత్తండి. ఆయన లేకుండా మనం ఏమీ గ్రహించలేము, ఆయనను విశ్వసించలేము. ఆయన మన మనవి తప్పకుండా వింటాడు. ఆయన ఆత్మ మనలో పని చేసినప్పుడు మనలో విశ్వాసం ఏర్పడుతుంది.

మన సంశయాలు ఏవైనా సరే, భయాందోళనలు ఎన్ని ఉన్నా సరే,

ఆయనవైపుకు తిరిగినప్పుడు ఆయన మన ప్రార్థనలు తప్పకుండా వింటాడు. నాస్తికులు కూడా నిజాయితీపరులై ఉంటే, దేవుని దగ్గరికి, క్రీస్తు దగ్గరికి వచ్చి విశ్వసించగల పరిస్థితికి రాగలరు. ఉన్నపాటున మనం ఆయనవైపుకు తిరుగగలం. మనలో ఎంత అవిశ్వాసమున్నా, వేయి పాపాలు మనలను బంధించినా ఆయనను సమీపించాలి. ఆయన క్షమాపణ ఇవ్వగలడు. విశ్వాసాన్ని ప్రసాదించగలడు. ఎంత ఘోర పాపియైన, ఎంత గొప్ప ధర్మార్గుడైనా సిలువ మార్గాన, కృప మార్గాన, విశ్వాస మార్గాన మోక్షం పొందగలరు. నేను లోకమంతటిలో చెడ్డవాడిని, బలహీనుడిని అనుకునే వ్యక్తి, అవిశ్వాసిని, అయోగ్యుడిని అనుకునే మనిషి, అంతరంగంలో అనుమానాలు, భయాలు, ఆందోళన, చెడును అనుభవించేవాడు ఎవడైనా సరే రావచ్చు. క్రీస్తుదగ్గర కనికరం, దయ, సంపూర్ణ కృప అతడికి తప్పనిసరిగా దొరుకుతాయి.

**ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. రోమ్ 7:18,21
2. యిర్మీయా 13:23
3. రోమ్ 3:20
4. ఎఫెసు 2:8–10
5. గలతీ 2:21
6. 1 కొరింతు 1:21
7. రోమ్ 1:20–23
8. మత్తయి 22:37
9. మత్తయి 4:10
10. 1 యోహాను 4:10
11. గలతీ 6:14
12. 1 పేతురు 5:10
13. యోహాను 3:16
14. యోహాను 10:27,28
15. రోమ్ 6:23
16. ఎఫెసు 1:17
17. ఎఫెసు 1:7
18. రోమ్ 3:23,24
19. 2 కొరింతు 5:18
20. ఎఫెసు 2:8,9
21. రోమ్ 8:32
22. యోహాను 5:24
23. యోహాను 6:47
24. అపో కా 10:43
25. అపో కా 16:31
26. రోమ్ 1:16
27. ఎఫెసు 2:8
28. యోహాను 6:37
29. రోమ్ 10:13
30. యోహాను 1:12,13
31. ప్రకటన 3:20
32. యోహాను 3:17–18

# 6 సద్గురువు చూపిన రుజువులు

యేసుప్రభువు చేసిన దివ్య బోధలలో కొన్నింటిని ఇంతవరకు పరిశీలించాం. ఈ ఉపదేశాలు గొప్పవని అంతటా అందరూ గుర్తించారు. ఇప్పుడు ఇవి ఎక్కడివో, వీటిని మనం ఎందుకు నమ్మి, పాటించాలో తెలుసుకుందాం.

ఒక సారి గురుదేవుడు తన ఉపదేశాల గురించీ, దేవుని గురించీ చెపుతూ ఇలా అన్నాడు:

"నా అంతట నేనే మాట్లాడలేదు. నేనేమి చెప్పాలో, ఏమి మాట్లాడాలో నన్ను పంపిన తండ్రి నన్ను అదేశించాడు. . . . నేను చెప్పే సంగతులు తండ్రి నాకు ఎలా చెప్పాడో అలాగే చెపుతున్నాను."[1]

ఒక సారి గురుదేవుడు తండ్రియైన దేవునికి ప్రార్థన చేస్తూ తన శిష్యుల గురించి ఇలా అన్నాడు: "నీవు నాకు ఇచ్చిన మాటలు వారికిచ్చాను. వారు వాటిని అంగీకరించారు, నేను నీ దగ్గరనుంచి వచ్చానని వారు రూఢిగా తెలుసుకొన్నారు, నీవు నన్ను పంపావని నమ్మారు."[2]

ఈ విధంగా గురుదేవుడు ఈ సంగతి గట్టిగా నొక్కి చెప్పాడు. తన బోధలు తాను కల్పించలేదనీ, అవి తన ఉద్దేశాలు కావనీ, మత సంబంధమైన అభిప్రాయాలు తాను ప్రకటించడం లేదనీ చెప్పాడు. పైపెచ్చు, తాను చెప్పే ప్రతి మాటా దేవుడు తనకిచ్చినదని చెప్పాడు. ఈ మాటలు చెప్పడానికి దేవుడు తనను పంపాడని కూడా చెప్పాడు. ఈ విషయాన్ని ఒక్క క్షణ కాలంలో ఆలోచించాలి. ఇది చాలా ప్రాముఖ్యమైన విషయం కూడా. గురుదేవుడు ప్రబోధించే వాటిలో ఇది గనుక నిజమైతే మిగతావన్నీ నిజమైనట్టే. ఆయన ఉపదేశమంతా నేరుగా దేవుని దగ్గరనుంచి వచ్చినట్టు రుజువయ్యాయన్న మాటే. అలాంటి పక్షంలో ఆయన ఉపదేశాలు విశ్వాస విధేయతలతో మనం అంగీకరించి తీరవలసిందే.

ఎవరో ఒకరు వచ్చి క్రీస్తు చెప్పినట్లే తనను గురించి తాను ఎన్నో విషయాలు చెప్పుకోవచ్చు. అవి నిజం కాకపోయినా అతడు వాటిని బోధించవచ్చు. ప్రజలు కూడా "మేము దేవుని దగ్గరనుంచి సందేశం అందుకున్నామని" చెప్పవచ్చు. అది నిజం కాకపోవచ్చు కూడా. కొందరు వచ్చి మేము దేవుని అవతారమనీ, దేవుని కుమారులమనీ చెప్పుకోవచ్చు. అందుచేత దీన్ని గురించి కూడా మనం కొన్ని ప్రశ్నలు అడగవలసి ఉంది.

యేసుక్రీస్తు నిజంగా దేవుని వద్దనుంచి వచ్చాడని శిష్యులు ఎందుకు నమ్మారు? వారికి ఆయన చూపిన రుజువులేవి? దేవుడు ఆయనను పంపాడు అనడానికి ఆయన మాటలు కాక మరేమైనా రుజువులున్నాయా?

యేసుప్రభువు నా మాటలు కాక వేరే రుజువేమీ కనబడకపోతే మీరు నమ్మవద్దు అని ప్రజలకు చెప్పాడు. "నా తండ్రి క్రియలు నేను చేయకపోతే నన్ను నమ్మకండి".[3] మరో చోట "నా విషయం నేనే సాక్ష్యం చెప్పుకొంటే నా సాక్ష్యం నిలిచేది కాదు."[4] దీనికి అర్థం స్పష్టంగా తెలుస్తుంది – "నేను స్వయంగా, నా పక్షాన నేనే మాట్లాడితే, అది రుజువుగా ఉండదు. దీనికి మించిన రుజువు మీకు కావాలి."

యేసు క్రీస్తు వచ్చి నేను దేవుని దగ్గరనుంచి వచ్చిన ఉపదేశకుణ్ణి అని చెప్పుకుంటే చాలదు. నేను దేవుని కుమారుణ్ణి అని చెప్పుకున్నంత మాత్రాన రుజువు సరిపోదు. ఆ మాటకొస్తే ఈ విధంగా తనను గురించి తానే ఎవరు చెప్పుకున్నా, వాదం నిలబడదు. రుజువు కాదు. తన మాటను నెగ్గించుకోవడానికి కొన్ని రుజువులు చూపగలగాలి. అలా చూపలేకపోతే ఆయన్ను ఎలా నమ్మడం? ఒక దేశంనుంచి మరో దేశానికి రాయబారులు వెళ్ళేటప్పుడు కావలసిన పత్రాలన్నీ తీసుకొని మరీ వెడతారు. నేను పరలోకం నుంచి వచ్చిన రాయబారిని అని ఎవరైనా చెపుతుంటే మనం రుజువులేమిటని అడగకుండా ఉంటామా?

మంచి నిదర్శనాలు లేకుండా నమ్మాలని యేసుప్రభువు కూడా చెప్పలేదు. తనమీద ప్రజలు గుడ్డి నమ్మకం ఉంచాలని యేసుప్రభువు ఎన్నడూ కోరడు. తాను దేవుని వద్దనుంచి వచ్చినట్టు బలమైన రుజువులను ప్రభువు పదే పదే చూపించాడు.

ఈ రుజువులు అనేకమందిని ఒప్పించాయి. నాడూ, నేడూ కూడా ఈ రుజువులు అనేకమందిని ఒప్పిస్తున్నాయి. యేసు క్రీస్తు దేవునివద్దనుంచి వచ్చాడని ఆయన శిష్యులు అనేకమైన మంచి రుజవులను బట్టి నమ్మారు. ఆ రుజువులేవో మనం తెలుసుకోవాలి.

ఆయన జీవితాన్ని, పనులను మనం జాగ్రత్తగా పరిశీలించాలి. అలా చేస్తూ మనం ఈ ప్రశ్న వేస్తూ ఉండాలి: "దేవుడు తనను పంపాననడానికి గురుదేవుడు చూపిన రుజువులేవి?"

### క్రీస్తు చేసిన మహత్కార్యాలు

గురుదేవుడు చేసిన కార్యాలు ఆయన దేవుని వద్దనుంచి వచ్చాడనడానికి బలమైన రుజువులు. గురుదేవుడే ఈ విషయాన్ని చెప్పాడు. "నెరవేర్చడానికి తండ్రి నాకిచ్చిన పనులే – నేను చేస్తూవున్న పనులే – తండ్రి నన్ను పంపాడని సాక్ష్యంగా

ఉన్నాయి.”[5]

“నా తండ్రి పేర నేను చేస్తూవున్న క్రియలు నన్ను గురించి సాక్ష్యం చెపుతున్నాయి.”[6]

యేసుప్రభువు చెపుతున్న ఈ క్రియలు ఏవి? ఈ క్రియలు రెండు విషయాలను బయలుపరుస్తున్నాయి. ప్రభావం, కరుణ. ఆయన ఈ క్రియలను దేవుని బలప్రభావాలతో చేశాడు. అంతేకాదు, దేవుని ప్రేమతో ఈ కార్యాలను ఆయన చేశాడు.

యేసుక్రీస్తు చూపిన ఆధ్యాత్మిక బలాన్ని గురించి కొంచెం ఆలోచించండి. యోహాను అనే వ్యక్తి గురుదేవుని దగ్గరకు స్వయంగా వెళ్ళలేక తన ప్రతినిధులను పంపి, యేసు క్రీస్తు నిజంగా దేవుని దగ్గరనుంచి వచ్చిన వాడేనా అని నిశ్చయంగా తెలుసుకోవడానికి కోరాడు. యేసుప్రభువు ఈ విధంగా ఆ వ్యక్తులతో అన్నాడు: “మీరు తిరిగి వెళ్ళి, మీరు చూచినదీ విన్నదీ యోహానుకు తెలియజేయండి. గుడ్డివారికి చూపు వస్తూ ఉంది, కుంటివారు నడుస్తున్నారు, కుష్ఠరోగులు బాగుపడుతూ ఉన్నారు, చెవిటివారు వింటూ ఉన్నారు. చనిపోయినవారిని సజీవంగా లేపడం జరుగుతూ ఉంది. బీదలకు శుభవార్త ప్రకటన జరుగుతూ ఉంది.”[7]

ఈ సందర్భంలో యేసుప్రభువు తాను దేవుని దగ్గరనుంచి వచ్చినట్లు రుజువు చూపాడు. తాను చేస్తున్న మహత్కార్యాలే రుజువులని చెప్పాడు. ఇది అసలైన సత్యం. నిజంగా ఆయన చేసిన క్రియలు చాలా ఆశ్చర్యకరమైనవి.

ఆయన గుడ్డివారికి చూపు ప్రసాదించాడు. చెవిటివారు వినగలిగేలా చేశాడు. కుంటివారు నడవగలిగారు. మానవ ప్రయత్నాలకు మించిన రోగాలను ఆయన బాగు చేశాడు. చచ్చినవాళ్ళకు కూడా ప్రాణదానం చేసి బ్రతికించాడు.

ఈ క్రియలు చూచి అనేకమంది నమ్మారు. ఒక సారి ఇస్రాయేల్ నాయకుడొకడు మాట్లాడుతూ అనేకమంది మనస్సుల్లో ఉన్నది బయలుపరచాడు: “మీరు దేవుని దగ్గరనుంచి వచ్చిన ఉపదేశకులని మాకు తెలుసు. ఎందుకంటే, దేవుని తోడ్పాటు ఉంటేనే తప్ప మీరు చేసే సూచకమైన అద్భుతాలు ఎవరూ చేయలేరు.”[8]

యేసుప్రభువు శిష్యులలో ఒకడైన పేతురు ఇస్రాయేల్ ప్రజలందరికి ఇలా చెప్పగలిగాడు: “దేవుడు నజరేతువాడైన యేసుచేత అద్భుతాలూ వింతలూ సూచకమైన క్రియలూ మీ మద్య చేయించి ఆయన దేవుని దృష్టిలో యోగ్యుడై ఉన్నట్టు మీకు వెల్లడి చేశాడు. ఇది మీకే తెలుసు.”[9]

యేసుప్రభువూ, ఆయన శిష్యులూ ఆయన చేసిన మహత్కార్యాలను

రుజువులుగా చూపి, ఆయన దేవుని దగ్గర నుంచి వచ్చాడని రుజువుపరిచారు.

## అనేకులు ఈ క్రియలు చూశారు

ఈ మహత్కార్యాలు, అద్భుతాలూ ఎవరో ఒకరు విని, కల్పించి, ఊహించి చెప్పిన గాథలు కావు. అసలు విషయమేమిటంటే, జన సమూహాల ఎదుట యేసుప్రభువు ఈ అద్భుతాలు చేశాడు. అనేకమంది శత్రువులూ మిత్రులూ అక్కడ ఉన్నారు. కావాలంటే వారు "ఈయన ఈ క్రియలు చేయలేద"ని చెప్పగలిగి ఉండేవారే. వీలుంటే శత్రువులు ఈ విధంగా ప్రచారం చేయకుండా ఉంటారా? వారు వేయి కండ్లతో ఆయన ప్రతి పనినీ పరీక్షిస్తూ ఉన్నారు! ఆయన్ను చంపడానికి కుట్ర పన్నుతూ కూడా, ఆయన మహాత్కార్యాలను ఒప్పుకున్నారు. "ప్రముఖ యాజులూ పరిసయ్యులూ సమాలోచన సభను సమకూర్చారు. అప్పుడు వారు ఇలా చెప్పుకున్నారు: ఈ మనిషి అనేక సూచకమైన అద్భుతాలు జరిగిస్తూవున్నాడు గానీ మనం ఏం చేస్తున్నాం? మనం ఇలాగే అతణ్ణి చేయనిస్తే అందరూ అతణ్ణి నమ్ముతారు."[10]

గురుదేవుని అద్భుత కార్యాలు మనిషి శక్తికి మించినవి. వీటిని మరే విధంగానూ వివరించడానికి వీలుకాదు. ఇవేమీ చిత్ర విచిత్ర కార్యాలు కావు. "తమాషా"గా చేసినవి కావు. గారడితో చేసిన మంత్రవిద్య ఏ మాత్రమూ కాదు. ఆయన నీళ్ళమీద నిజంగా నడిచాడు.[11] పుట్టు గుడ్డివాడి కండ్లను తెరిచాడు.[12] కుష్ఠరోగం ఉన్నవాడిని పూర్తిగా నయం చేశాడు.[13] నాలుగు రోజుల క్రితం చచ్చిన మనిషిని బ్రతికించాడు. గురుదేవుడు అతణ్ణి బ్రతికించేందుకు వచ్చినప్పుడు చచ్చినవాని సోదరి "ప్రభూ, అతడు చనిపోయి ఇప్పటికి నాలుగు దినాలయ్యింది, గనుక కంపు కొడుతుంది" అంది.[14]

ఏదో తమాషా "కనికట్టు" విద్యతో నీళ్ళమీద నడవడం సాధ్యం కాదు. గుడ్డివారి కండ్లు తెరవడం, కుష్ఠరోగిని బాగుచేయడం మొదలైన క్రియలు గారడితో జరిగే పనులు కావు. చచ్చినవారిని మంత్ర ప్రయోగం చేసి బ్రతికించడం వీలుపడదు. గురుదేవుడు ఈ క్రియలన్నీ దేవుని శక్తితో చేశాడు.

## అసాధ్యమా?

కొందరు అద్భుతాలు జరపడం అసాధ్యమని బల్ల గుద్ది చెపుతున్నారు గానీ ఈ వాదాన్ని వారు స్థిరపరచుకోలేకపోతున్నారు. వీరు దేవుని గురించి సరిపోయినంతా తెలుసుకోలేదు. దేవుడు వ్యక్తి, సర్వాతీతుడు, అనంత

బలప్రభావాలు ఉన్నవాడు. ఈ విశాల ప్రపంచాన్ని సృజించాడు. మానవుణ్ణి చేశాడు. అలాంటి దేవునికి రోగుల్ని బాగుచేయడం అసాధ్యమా? చనిపోయినవారిని బ్రతికించడం అసాధ్యమా? లోకాన్ని సృష్టించిన దేవుడు తన ఇష్టం వచ్చినది చేయగలడు. ఈ దేవుడు ప్రేమగలవాడు. మానవ జాతిని ఆశీర్వదించడానికి, మనుషులకు దివ్య ఉపదేశాలు చేయడానికి క్రీస్తును లోకానికి పంపించాడు. అలాంటి క్రీస్తుద్వారా తన కృపనూ శక్తినీ కనపరచడానికి మహత్కార్యాలు, అద్భుతాలు చెయ్యడం దేవునికి అసాధ్యమా? ఏ మాత్రమూ కాదు.

అద్భుతాలు సాధ్యమా కాదా అనే విషయం గురించి యేసుప్రభువు ఎన్నడూ వాదించలేదు. ఆయన అద్భుతాలు చేశాడంతే. ఆయన చేసిన అద్భుతాలను చూచిన ప్రజలు కూడా దీన్ని గురించి తర్జన భర్జనలు చేయలేదు. ఆయన అద్భుతాలు చేస్తుంటే వారు స్వయంగా చూశారు. అలాంటప్పుడు అక్కడ లేని మనిషి వచ్చి ఆయన అద్భుతాలు చేయలేదని చెప్పడం వ్యర్థమైన అభిప్రాయమే.

యేసుక్రీస్తు చేసిన అద్భుతాలు ఎంతో బలప్రభావాలు కనపరచినవి. అంతేకాదు, అవి కరుణతో నిండిన కార్యాలు. మనం ఆయన మీద విశ్వాసముంచడానికి అవి మంచి కారణాలుగా ఉన్నాయి.

## యేసుక్రీస్తు సుగుణాలు

యేసుప్రభువు దేవుని వద్దనుంచి వచ్చాడనడానికి ఆయన జీవితమే బలమైన రుజువు. ఆయన చెడ్డవాడై ఉంటే, అద్భుత కార్యాలు చేసినా, ఆయన దేవుని వద్దనుంచి వచ్చాడంటే నమ్మరాదు. దేవుని శక్తితో కాకుండా వేరే శక్తులతో అద్భుత కార్యాలు చేసిన వారుండవచ్చు. దేవుని తోడ్పాటు లేకుండా అద్భుత కార్యాలు చేసే దొంగ ప్రవక్తలూ కపట భక్తులూ ఉన్నారు. మాంత్రికులు కూడా ఉన్నారు. వారికి ప్రత్యేక శక్తులుండ వచ్చు కూడా. కొన్ని అద్భుతాలు వారు చేయగలిగినట్టే కనబడతారు. ఇలాంటివాడైతే అతడు దేవుని దగ్గరనుంచి వచ్చాడని నమ్మడానికి సరియైన ఆధారం లేదు. ఫలాని వాడి అద్భుతాలను పరిశీలించేటప్పుడు, ఈ క్రియలు చేసినవాడు ఎలాంటివాడో, అతడి ఉపదేశాలు ఎలాంటివో గమనించాలి.

యేసు క్రీస్తు విషయం గమనించండి. శుభవార్తలు చదివి చూడండి. యేసుప్రభువు ఎలాంటివాడో తేటగా తెలిసిపోతుంది. ఆయన మనుషులకున్న అక్కరలను చూచి కనికరంతో నిండిపోయేవాడు. వారిని రక్షించేందుకు తన కాలాన్ని, సుఖాన్ని, ఆఖరుకు తన ప్రాణాన్ని కూడా ధారపోయడానికి

సిద్ధమయ్యాడు. ఆయన అందరిని ప్రేమతో చూశాడు. దౌర్భాగ్యులనూ బీదవాళ్ళనూ నిస్సహాయులనూ ఎంతో ప్రేమించాడు. వారి అక్కరను బట్టి ఆయన అద్భుతాలు చేయవలసి వచ్చింది. ఆయన హృదయంలోనుంచి దయ, ప్రేమ, జాలి సమృద్ధిగా వచ్చి అనేక అద్భుత క్రియలను చేయించాయి.

ఒక సారి ఇద్దరు గుడ్డివారు ఆయన దగ్గరకు వచ్చారు. "యేసు వారిమీద జాలిపడి వారి కండ్లు ముట్టాడు. వెంటనే వారు చూపు పొంది, ఆయన వెంట వెళ్లారు."[15]

మరొకప్పుడు ఓ విధవరాలు చనిపోయిన తన కొడుకును పాతిపెట్టడానికి వెళ్తూ ఉంటే "పాడె దగ్గరకు వెళ్ళి దానిని తాకాడు. . . చనిపోయినవాడు లేచి కూర్చుని మాట్లాడసాగాడు."[16]

ఎల్లప్పుడు "జన సమూహాలను చూచినప్పుడు ఆయన వారిమీద జాలిపడ్డాడు. ఎందుకంటే, వారు కాపరి లేని గొర్రెలలాగా కృంగిపోయి దిక్కు తోచకుండా ఉన్నారు."[17]

## స్వచ్ఛమైన పవిత్రత

గురుదేవుని జీవిత చరిత్రంతా చదివి చూడండి. ఆయన ఎప్పుడు కూడా ప్రజల మెప్పును కోరినవాడు కాడు. ప్రజలు తనను శ్లాఘించాలనీ, పొగడాలనీ ఎన్నడూ ఆయన ఆశించలేదు. ఆయనలో ఏ మాత్రం గర్వం గానీ, అసూయ గానీ, దురుద్దేశం గానీ లేదు. ఆయన ఎంతమాత్రమూ స్వార్థపరుడు కాడు. శరీర సుఖాన్ని కోరినవాడు కాడు. ఆయన ఏ విధమైన అన్యాయం చేయలేదు. దుర్నీతికి ఎన్నడూ లొంగలేదు. ఆయన ఏది చెప్పినా, ఏది చేసినా పవిత్రమైన లక్షణం కానవచ్చేది. శత్రువులను కూడా ఆయన ఇలా నిలదీసి అడగగలిగాడు – "నేను ఏ అపరాధమైనా చేశానని మీలో ఎవరు రుజువు చేయగలరు?[18] ఆయనలో ఎలాంటి దోషం లేదు. ఆయనకు ఏ కళంకం అంటలేదు. ఆయన చెప్పినది, చేసినది ఏదీ ఎవరూ దాచిపెట్టవలసిన పనిలేదు.

రోమన్ గవర్నర్ అయి ఉన్న పొంతి పిలాతు ఎదుట యేసుక్రీస్తు ఉన్నాడు. పిలాతు ఆయనను జాగ్రత్తగా పరీక్షించాడు. అతడికి ఇష్టం లేకపోయినా యూదులు ఆయనను సిలువ వేసేలా అయన్ను వారికి అప్పగించాడు. పిలాతు కూడా ఈ విధంగా చెప్పవలసి వచ్చింది – "ఈ మనిషిలో నాకెలాంటి దోషమూ కనిపించడం లేదు." పిలాతుకే కాదు, మరి ఎవరికీ కూడా ఆయనలో ఏ దోషమూ కనబడదు. ఆయన స్వార్థం లేని జీవితాన్ని గడిపాడు. ప్రేమ స్వరూపిగా

జీవించాడు. పవిత్రతతో నిండినవాడు. దేవుని మహిమార్థమే, మానవుని మేలుకోసమే ఆయన బ్రతికాడు.

ఇక్కడ ఒక్క క్షణకాలం నిలిచి ఆలోచించాలి. ఈయన శక్తిమంతుడు, సాధుగుణం గలవాడు, పవిత్రుడు, కృపగలవాడు, పరిపూర్ణుడు, అద్భుత వ్యక్తి. ఇలాంటివాడు స్వయంగా చెప్పిన మాట "నేను దేవుని కుమారుడను. సత్యాన్ని ఉపదేశించడానికి దేవుడు నన్ను ఈ లోకానికి పంపించాడు." ఆయన పిచ్చివాడు కాడు, అబద్ధికుడూ కాడు. ఆయనను దేవుడీ లోకానికి పంపాడు. ఆయన నిజంగా దేవుని అవతారమే.

దీనికి ఆయన అద్భుతాలు నిజమైన రుజువులన్నాం. ఆయన సుగుణాలు బలమైన రుజువు అని కూడా చెప్పుకున్నాం. ఇదే కాదు. మరి కొన్ని రుజువులు కూడా ఉన్నాయి. చూద్దాం.

**పూర్వం రాసివున్న వాక్కులు**

యేసుక్రీస్తు దేవుని దగ్గరనుంచి వచ్చాడనడానికి పాత ఒడంబడికలోని ప్రవచనాలు బలమైన రుజువులు. పాత ఒడంబడికను లేఖనాలు అని కూడా బైబిలు రాసినవారు అన్నారు. క్రీస్తుకు పూర్వం 1400 సం॥ నుంచి వెయ్యి సంవత్సరాల కాల పరిమితిలో రాసివున్నవే ఈ లేఖనాలు. తనను గురించి అనేక ప్రశ్నలు వేస్తున్న యూదులకు యేసుప్రభువు చెప్పిన మాట ఇది: "లేఖనాలను పరిశోధిస్తున్నారు. వాటి మూలంగా మీకు శాశ్వత జీవం ఉందని మీ ఆలోచన. అవి నా విషయమే సాక్ష్యం చెపుతూ వున్నాయి."[19]

సంఘటనలు జరగకముందే దేవుడు వాటిని బాగా ఎరుగును. ఈ విషయాలను గురించి దేవుడు ముందుగానే మనుషులకు వెల్లడి చేయగలడు. ఆయన బైబిలులో ఇలా చెప్పాడు: "చాలా కాలం క్రిందట జరిగినవాటిని జ్ఞప్తికి తెచ్చుకోండి. నేనే దేవుణ్ణి, ఇక ఏ దేవుడూ లేడు. నేనే దేవుణ్ణి. నాకు సమానుడంటూ ఎవ్వడూ లేడు. ఆదినుంచి అంతాన్ని తెలియజేసేవాణ్ణి. పూర్వకాలం నుంచి ఇంకా జరగబోయే సంగతులను తెలిపేవాణ్ణి."[20]

పదే పదే దేవుడు తన ప్రవక్తల ద్వారా భవిష్యత్తును గురించి ముందుగా పలికాడు. పాత ఒడంబడికలో చాలా భాగం భవిష్యత్తును గురించిన వాక్కులే. ఇస్రాయేల్ జాతిని గురించి వాక్కులున్నాయి. ఇప్పటికే వీటిలో చాలా నెరవేరాయి. కొన్ని ఇప్పుడు నెరవేరుతూ ఉన్నాయి. వ్యక్తులను గురించి, దేశాలను గురించి, పట్టణాలను గురించి, జాతులను గురించి ఎన్నో వాక్కులున్నాయి. ఈ వాక్కుల్లో

ఆకాశంలో నక్షత్రాలలాగా ఒకే ఒక ప్రత్యేక వ్యక్తిని గురించిన ప్రవచనాలు వెదజల్లబడి ప్రకాశిస్తూ ఉన్నాయి. ఇస్రాయేల్ ప్రజలు ఈయనను "మెస్సీయా" అన్నారు. అంటే దేవుడు అభిషేకించినవాడు అని అర్థం. యూదులు తరతరాలుగా ఆయన రాకడకోసం ఆశాభావంతో ఎదురు చూస్తూ వచ్చారు. ఆయన తమ జాతిని విమోచించడానికి ఈ లోకానికి రాబోతాడనీ, ఆయనే రక్షకుడనీ, రాజు అనీ ఎదురు చూశారు. ఆయన గొప్ప ప్రవక్త, గొప్ప ఉపదేశకుడు అని కూడా భావించారు.

ఈయనను గురించి ప్రవక్తలు భవిష్యత్తును తెలుపుతూ కొన్ని సంగతులు చాలా వివరంగా, స్పష్టంగా రాశారు. ఈయన జన్మస్థలం పేర్కొన్నారు – "బెత్లెహేం." ఈయన జన్మ విధానం కూడా చెప్పారు – కన్యక గర్భంలో జన్మించడం. తన జాతియైన ఇస్రాయేల్ తిరస్కారానికీ, స్నేహితుని ద్రోహానికీ గురి అవుతాడనీ, సిలువమీద బాధలు అనుభవించి చనిపోతాడనీ మళ్ళీ బ్రతికి లేస్తాడనీ దైవావేశంతో రాశారు. ఇవి మాత్రమే గాక ఆయన జీవిత విశేషాలెన్నో చెప్పారు. ఈ విధంగా ఆయన జీవితాన్నీ మరణాన్నీ లేఖనాలు బయలుపరచాయి. పాత ఒడంబడిక ముగిసిన నాలుగు వందల సంవత్సరాలకు యేసుక్రీస్తు ఇస్రాయేల్ ప్రజల మధ్య కనిపించాడు. "లేఖనాలు నన్ను గురించి సాక్ష్యమిచ్చాయ"ని ఆయన చెప్పాడు. అంటే ఈ ప్రాచీనమైన వాక్కులూ, దైవాభిషిక్తుని గురించిన లేఖనాలూ ఆయన కాలంలో నెరవేరుతున్నాయని సూచించాడన్నమాట. నిజంగా ఆ భవిష్యద్వాక్కులు నెరవేరాయి.

ఈ వాస్తవాన్ని గమనించగలిగితే యేసుప్రభువు దైవావతారమని ఇది బలమైన నిదర్శనం. ప్రపంచంలోని సాహిత్యమంతటిలో ఇలాంటిది ఎక్కడ కూడా లేదు. ప్రవక్తలు ఇలా రాయగలిగారంటే, యేసుక్రీస్తు ఈ విధంగా వాటిని నెరవేర్చడంటే, దేవుడు తోడై ఉన్నాడని తేలుతుంది. లేకపోతే ఇది అసాధ్యం. యేసుక్రీస్తు దేవుని దగ్గరనుంచి వచ్చాడనడానికి నెరవేరిని లేఖనాలు బలమైన రుజువు అని మళ్ళీ చెపుతున్నాను. ఆ తరువాత కారణం కూడా ఇలాంటిదే.

## యేసుక్రీస్తు స్వయంగా చెప్పిన మాటలు

యేసుప్రభువు దేవుని దగ్గర్నుంచి వచ్చాడనడానికి ఆయన స్వయంగా పలికిన మాటలూ వాగ్దానాలూ బలమైన నిదర్శనం. గురుదేవుని ఉపదేశాలలో ఇలాంటి రుజువులెన్నో ఉన్నాయి. ఆయన చేసిన ఉపదేశాలను పరీక్షించవచ్చు. ఈ ఉపదేశాలు అబద్ధాలని రుజువైతే, ఆయన దేవునివద్దనుంచి వచ్చిన బోధకుడు కాడని తేలిపోతుంది. ఉపదేశాలు సత్యాలని రుజువైతే ఆయన దేవుడు పంపగా

వచ్చినవాడు అనడానికి ఆధారం ఉంది. ఎవ్వరూ ఎదిరించలేని సత్యమిదే – ఆయన ఉపదేశాలు వాస్తవాలు. భావిని గురించి గురుదేవుడు చెప్పిని విషయాలు ఎవరైనా పరిశీలించి తెలుసుకోగలరు.

ఇస్రాయేల్ దేవాలయం నాశనమౌతుందని ఆయన ముందుగా తేటగా చెప్పాడు.[21] నలభై సంవత్సరాల తర్వాత ఆయన చెప్పినట్లే జరిగింది. ఆ తర్వాత ఆ దేవాలయం తిరిగి కట్టబడలేదు.

ఈ యుగసమాప్తికి పూర్వం జాతులన్నిటికీ తన శుభవార్త ప్రచారం అవుతుందని ఆయన చెప్పాడు.[22] ఆయన ఈ మాటలు పలికినప్పుడు ఆయన శిష్యులు ఒక చిన్నగుంపు. చిన్న దేశమైన ఇస్రాయేల్‌కు బయట ఈ శుభవార్త ఆనాడు ప్రకటించడం జరుగలేదు. కాని, క్రమేణ అది లోకమంతటా వ్యాపిస్తుందని ఆయనకు తెలుసు. ఈ రోజున ఆయన చెప్పినట్లే శుభవార్త అంతటా వ్యాపించింది.

రోమ్ సైన్యాలు జెరుసలం నగరాన్ని నాశనం చేయబోతున్నారని యేసు చెప్పాడు. ఇస్రాయేల్ ప్రజలు లోకమంతటా చెదిరిపోతారని ఆయన చెప్పాడు."[23] ఈ మాట కూడా అక్షరాల నెరవేరింది. ఈ యుగాంతంలో యూదులు జెరుసలంను స్వాదీనం చేసుకుంటారని ఆయన సూచించాడు. మన కాలంలోనే ఇది జరిగిందని మనకు తెలుసు. ఈ యుగాంతం కూడా త్వరలో సంభవించవచ్చు.

యేసుప్రభువు భవిష్యత్తును గురించి మరి కొన్ని ప్రవచనాలు చెప్పాడు. తన మరణాన్ని గురించి కూడా ఆయన చెప్పాడు. తాను ఎలా చనిపోయేదీ, తిరిగి బ్రతికి లేచేదీ ఆయన ముందుగా చెప్పాడు.[24]

## అనుభవ పూర్వకమైన రుజువు

ఆ విధంగానే ఆయన వాగ్దానాలు కూడా తప్పకుండా నెరవేరుతాయి. తన దగ్గరకు వచ్చి, తనను విశ్వసించి, తనకు విధేయులైన వారికి విశ్రాంతి ఇస్తానని వాగ్దానం చెయ్యడం మాత్రమే కాదు, ఇస్తాడు కూడా. తన వాక్కులో ఎడతెగకుండా ఉండేవారికి ఆయన పాపంనుంచి విముక్తిని వాగ్దానం చేస్తున్నాడు. ఇస్తున్నాడు కూడా. దేవునిదగ్గరకు క్రీస్తుద్వారా వెళ్ళేవారి ప్రార్థనలను విని, మానవుడు దయచేస్తాడని వాగ్దానం. ఇది కూడా అనుభవంతో రుజువు అవుతుంది.

ఆయన ఇంకా అనేక వాగ్దానాలు చేశాడు. వీటిని పరీక్షించవచ్చు. తరతరాలుగా కోట్లకొలది ప్రజలు నాటినుంచి నేటివరకు ఆయన వాగ్దానాలు పరీక్షించి ఇవి నమ్మదగినవని స్వయానా అనుభవించి సొంతంచేసుకున్నారు.

ఇది అనుభవ పూర్వకమైన నిదర్శనం. క్రీస్తు దేవునిదగ్గరనుంచి వచ్చాడని దీన్నిబట్టి నిశ్చయత అవుతుంది. గురుదేవుని శిష్యులు ఆయనలో దేవుని ప్రభావాన్ని చూశారు. ఆయనను అనుసరిస్తూ, ఈ ప్రభావాన్ని తామూ అనుభవించారు. క్రీస్తు ఎవరో కన్నులారా చూడగలిగేలా దేవుడు వారి మనోనేత్రాలను వెలిగించాడు. వారు దేవుణ్ణి తెలుసుకున్నారు. ఆయన ప్రేమ సముద్రాన్ని తృప్తిగా త్రాగారు. చిట్టచివరకు ఆయన తమలో జీవించడానికి వచ్చాడని తెలుసుకున్నారు.

ఈ విషయాలను గ్రహించడానికి ఇతరుల అనుభవ సాక్ష్యానికే దీన్ని వదలివేయనక్కర్లేదు. యేసుక్రీస్తును మనం స్వయంగా అనుభవించి, రుజువుపరచు కోగలం. అలా చేయాలి. ఆయన సజీవుడు, తనదగ్గరికి వచ్చేవారి మనవి వింటాడు. తాను చెప్పినట్లు చేస్తాడు. ఆయన మాట ప్రకారం మనం చేస్తే, ఇదంతా నిజమని మనకు అర్థమవుతుంది. ఆయనను వెదుకుదాం పట్టండి. క్రీస్తును గురించి అనేకమందికి అనుమానాలు ఉంటాయి. ఎందుకని? వారికి ఆయనతో అనుభవం లేదు. అనుభవంలో క్రీస్తును మనం కలుసుకున్నప్పుడు మన సందేహాలన్నీ మయమైపోతాయి. ఉపదేశాలు అసలైన, సిసలైన వాస్తవాలని గ్రహిస్తాం. గురుదేవుని ద్వారా దేవుణ్ణి అనుభవించడం ద్వారా మన హృదయాలకూ, మనస్సులకూ సంతృప్తి కలుగుతుంది. ఇది లేకపోతే మన ధ్యానమంతా వ్యర్థం అవుతుంది.

## దేవుని సాక్ష్యం

ఈ అధ్యాయంలో చిట్టచివరి విషయాన్ని పరిశీలించుదాం. యేసుప్రభువు దేవుని దగ్గరనుంచి వచ్చాడనడానికి దేవుని స్వంత సాక్ష్యమే బలమైన రుజువు. "నన్ను పంపిన తండ్రి తానే నా విషయం సాక్ష్యం చెపుతున్నాడు"[25] అన్నాడు యేసుప్రభువు. క్రీస్తును గురించి దేవుడిచ్చిన సాక్ష్యంలో ఒక భాగం దేవుడు ఆయనకు చేయడానికిచ్చిన గొప్ప కార్యాలే. వీటిని గురించి ఇంతకుముందే ధ్యానించాం. ఆయన శిష్యుడైన పేతురు ఈ విధంగా అన్నాడు: "దేవుడు నజరేతువాడైన యేసును పవిత్రాత్మతో బలప్రభావాలతో అభిషేకించాడు. దేవుడు ఆయనకు తోడై ఉన్నాడు గనుక ఆయన మేలు చేస్తూ అపనింద పిశాచం వశంలో ఉన్నవారందరినీ బాగుచేస్తూ సంచరిస్తూ ఉన్నాడు."[26]

## పునర్జీవితం

కానీ దేవుడు క్రీస్తును గురించి ఇచ్చిన సాక్ష్యం మరొకటి ఉంది. ఇది చాలా బలమైనది. దేవుడు చనిపోయిన క్రీస్తును తిరిగి బ్రతికించాడు. ఇది పునర్జీవితం అంటాం. పునర్జీవితం కొందరికి విచిత్రంగా అనిపించవచ్చు. మరి కొందరు ఇది అసాధ్యమని భావించవచ్చు. యేసుప్రభువు చనిపోయి మూడో రోజున బ్రతికి లేచాడు. దేవుడాయనను సజీవంగా రప్పించాడు. ఈ అద్భుతం చాలా ప్రాముఖ్యమైనది గనుక తరువాతి అధ్యాయంలో దీన్ని విపులంగా చూద్దాం. ఈ అద్భుతం ద్వారా దేవుడు లోకమంతటికీ ఈ ప్రాముఖ్యమైన సందేశమిస్తున్నాడు. "ఈయన నా ప్రియ కుమారుడు. ఈయన మాట వినండి. ఈయన మిమ్మును సర్వ సత్యములోకి నడిపిస్తాడు."

యేసుప్రభువును గురించి దేవుడు మనకు అనుగ్రహించిన ఈ రుజువులను క్లుప్తంగా విశదీకరించాం. వీటిలో ప్రతి ఒక్కదాని గురించి ఎంతైనా రాయవచ్చు. వాటి గురించి ఎన్నో గ్రంథాలు రాసి ఉన్నాయి కూడా. దేవుడు ఇవ్వగలిగినన్ని రుజువులు ఇచ్చాడు. క్రీస్తు చేసిన క్రియలూ, ఆయన సుగుణాలూ, పూర్వం ఆయనను గురించి వ్రాసిన వాక్కులూ, భవిష్యత్తును గురించి ఆయన స్వయంగా చేసిన ప్రవచనాలూ, అనుభవముతో రుజువు కాగల ఆయన వాగ్దానాలూ, తండ్రియైన దేవుడు ఆయనను గురించి ఇచ్చిన వివిధ సాక్ష్యాలూ, మరణంనుంచి క్రీస్తు సజీవంగా లేవడమూ మొదలైన రుజువును గమనించాలి. ఇవన్నీ ప్రాముఖ్యమైన నిదర్శనాలు. ఆయనను విశ్వాసించడానికి ఇవి చాలు.

ఇన్ని రుజువులు లేకపోయినా మనుషులు అనేక విషయాలను నమ్మేస్తున్నారు. గురుదేవునిలాగా మరెవరైనా ఇన్ని రుజువులను చూపగలిగారా? మరే గురువు గాని, మతకర్త గానీ ఇన్ని నిదర్శనాలు చూపగలిగిన వారెవరున్నారు? ఎవర్నైనా నమ్మడానికి ఇంతకంటే బలమైన రుజువులు ఇంకేం కావాలి? మానవ చరిత్రలో ఇలాంటిది మరెక్కడైనా ఉందా?

## ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు

1. యోహాను 12:49,50
2. యోహాను 17:7
3. యోహాను 10:37
4. యోహాను 5:31
5. యోహాను 5:36
6. యోహాను 10:25
7. మత్తయి 11:4,5
8. యోహాను 3:2
9. అపొ కా 2:22
10. యోహాను 11:47,48
11. యోహాను 6:16-20
12. యోహాను 9వ అధ్యాయం
13. మార్కు 1:40-42
14. యోహాను 11:39
15. మత్తయి 20:34

16. లూకా 7:13
17. మత్తయి 9:36
18. యోహాను 8:46
19. యోహాను 5:39
20. యెషయా 46:9,10
21. మత్తయి 24:2
22. మత్తయి 24:14
23. లూకా 21:24
24. మత్తయి 16:21
మత్తయి 17:22
మార్కు 8:31
లూకా 9:22
యోహాను 12, 32,33
25. యోహాను 5:37
26. అపొ కా 10:38

# 7 సద్గురువు చనిపోయి బ్రతికాడు

గురుదేవుడు మరణించక మునుపు తనను గురించి ఈ విధంగా చెప్పాడు: "మానవ పుత్రుణ్ణి మనుష్యుల చేతులకు పట్టి ఇవ్వడం జరగబోతుంది. వారు ఆయనను చంపుతారు. మూడో రోజున ఆయన సజీవంగా లేపబడతాడు. అది విని శిష్యులకు అధిక దుఃఖం ముంచుకు వచ్చింది". [1]

ఈ వృత్తాంతం శుభవార్తలలో చాలా చోట్ల వ్రాసివుంది. ఈ విషయం మనం చూచిన మిగతా వాటన్నిటిలాగే గురుదేవుని ఉపదేశంలో ప్రముఖ భాగం.

యేసుక్రీస్తు దేవుని కుమారుడు అనడానికి ఆయన పునర్జీవితం ఆఖరి నిదర్శనం, గొప్ప రుజువు ప్రదర్శనం. "పవిత్రమైన ఆత్మ సంబంధంగానైతే ఆయన దేవుని కుమారుడు. ఆయన చనిపోయిన వారిలోనుంచి సజీవంగా లేవడం ద్వారా ఇది బలప్రభావాలతో రుజువైంది."[2]

గురుదేవుడు స్వయంగా నోరు తెరచి పలికిన ఈ దివ్యోపదేశాలను ధ్యానిద్దాం. ఈ ప్రబోధాలు ఎలా నెరవేరాయో పరిశీలిద్దాం.

**ఆయన్ను కొట్టారు, సిలువవేశారు, పొడిచారు**

ఆయనను సిలువ వేయకముందు హేళన చేశారు. ఉమ్మివేశారు, భయంకరమైన కొరడాలతో కొట్టారు. కొరడాకు చివర ఉక్కు ముక్కలు పదునైనవి కట్టి ఉంటాయి. కొట్టినప్పుడు ఈ ఉక్కు ముండ్లు దేహాన్ని పట్టి చీల్చివేస్తాయి. వీపు చీలి, రక్తం కారుతుంది. రోమ్ దేశస్తులు ఖైదీలను ఈ విధంగా చిత్ర హింస చేయడం అలవాటు. ఇలాంటి శిక్షకు ఖైదీలెందరో తట్టుకోలేక చనిపోయ్యారు. యేసును కొరడాలతో కొట్టిన తరువాత సిలువ వేయడానికి తెచ్చారు. ఆయనను సిలువమీద పెట్టి చీలలు కొట్టారు. ఆ సిలువను ఎత్తి నిలబెట్టారు. ఇది బాధకరమైన మరణం. అవమానకరమైన చావు. గురుదేవుడు ఆరు గంటలు సిలువమీద ఉన్నాడు. "తండ్రీ! నీ చేతికి నా ఆత్మను అప్పగించుకుంటున్నాను అంటూ యేసు పెద్దగా కేక వేశాడు. ఇలా చెప్పి ప్రాణం విడిచాడు."[3]

యేసుతో కూడా ఇద్దరు నేరస్తులు సిలువ వేయబడ్డారు. వీరి కాళ్ళు విరుగగొట్టడానికి సిపాయిలు వచ్చారు. "గనుక సైనికులు వచ్చి ఆయనతో కూడా సిలువవేయబడ్డ మొదటివాని కాళ్ళు, రెండోవాని కాళ్ళు విరగగొట్టారు, గానీ

యేసు దగ్గరకు వచ్చి అప్పటికి ఆయన చనిపోవడం చూచి ఆయన కాళ్ళు విరగగొట్టలేదు. అయితే సైనికులలో ఒకడు ఈటెతో ఆయన ప్రక్కను పొడిచాడు. వెంటనే రక్తమూ నీళ్ళూ కారాయి."[4]

## ఆయన చనిపోయాడు, సమాధిలో మూయబడ్డాడు

సమాధిమీద ముద్రవేశారు

ఆ తరువాత అదే రోజు కొందరు స్నేహితులు రోమ్ అధికారిదగ్గర అనుమతి పొంది యేసుప్రభువు మృత దేహాన్ని సిలువమీదనుంచి తీశారు. ఆ కొండ ప్రాంతంలో బండలో తొలిచిన సమాధిలో ఆయన శవాన్ని ఉంచారు. శవాన్ని గట్టిగా ప్రేత వస్త్రాలతో కాళ్ళు చేతులు కట్టివేశారు. ఆ సమాధి ముఖ ద్వారం మీద పెద్ద రాయి పెట్టి ఉంచారు.

యేసుప్రభువు శత్రువులు అధిసతి అయిన పిలాతుదగ్గరికి వెళ్ళారు. అతడు అధిపతి. వారు ఇలా అన్నారు: "సమాధిని భద్రం చేయాలని ఆజ్ఞ జారీ చేయండి. లేకపోతే అతడి శిష్యులు వెళ్ళి అతణ్ణి ఎత్తుకుపోయి ఆయన చనిపోయినవాళ్ళలో నుంచి సజీవంగా లేచాడు" అని అంటారేమో. పిలాతు సరే నన్నాడు. "మీరు వెళ్ళి మీ శాయశక్తులా సమాధిని భద్రం చేయండి" అన్నాడు. వారు వెళ్ళి కావలివారిని ఉంచి రాతికి ముద్రవేసి సమాధిని భద్రం చేశారు."[5]

యేసుప్రభువు చనిపోయాడు. ఇందులో ఏ మాత్రమూ సందేహం లేదు. ఆయన స్నేహితులు ఇది తెలుసుకొని ఎంతో సంతాపించారు. ఆయన శత్రువులు ఇది తెలుసుకొని ఎంతో సంతోషించారు. రోమ్ అధిపతికి ఈ విషయం తెలుసు. అతడికెంతో భారం తగ్గినట్లనిపించింది. అదే సమయంలో ఆందోళన మొదలైంది. పట్టణమంతటికీ ఈ సంగతి తెలిసింది. అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు. గురుదేవుడు చనిపోయాడు. సమాధిలో ఉంచబడ్డాడు. సమాధి భద్రంగా ఉంది. దానిమీద ముద్ర కూడా వేశారు. ఆయుధ ధారులైన సిపాయిలు రాత్రీ పగలూ కనిపెట్టి కావలి కాస్తున్నారు. శవాన్ని సమాధిలోనుంచి వెలుపటికి తీయడానికి ఎవరికీ అవకాశం లేదు.

## ఖాళీ సమాధి

యేసుప్రభువు సిలువ మరణం అనుభవించి అప్పటికి మూడో రోజు. ఆ రోజున క్రీస్తు అనుచరులు కొందరు సమాధిని చూడడానికి వచ్చారు. సమాధి ఖాళీగా ఉంది. మత్తయి రాసిన శుభవార్త చూడండి.

"విశ్రాంతి దినం గడచిన తరువాత ఆదివారంనాడు తెల్లవారుతూ ఉండగానే మగ్దలేనే మరియ, ఆ మరో మరియ సమాధిని చూడడానికి వచ్చారు. అంతకుముందు ఒక పెద్ద భూకంపం కలిగింది. ఎందుకంటే ప్రభుదూత ఒకడు పరలోకంనుంచి దిగివచ్చి సమాధి రాయిని దొర్లించి దానిమీద కూర్చున్నాడు. చూడడానికి అతడు మెరుపులాంటివాడు. అతని వస్త్రం చలి మంచంత తెల్లగా ఉంది. కావలివారికి అతని భయంచేత వణకు పుట్టి చచ్చినంతపనైంది. దేవదూత ఆ స్త్రీలను చూచి ఇలా అన్నాడు: భయపడకండి! సిలువ వేయబడ్డ యేసును మీరు వెదుకుతున్నారని నాకు తెలుసు. ఆయన ఇక్కడ లేడు. తాను చెప్పినట్టే ఆయన సజీవంగా లేచాడు. రండి, ప్రభువు పడుకొన్న స్థలం చూడండి. త్వరగా వెళ్ళి ఆయన శిష్యులతో ఇలా చెప్పండి: ఆయన చనిపోయిన వారిలోనుంచి సజీవంగా లేచాడు. మీ కంటే ముందుగా గలలీకి వెళ్ళబోతున్నాడు. అక్కడ మీరు ఆయనను చూస్తారు. మీతో నేను ఇది చెపుతున్నాను."[6]

ఆయన శిష్యులు కూడా వచ్చారు. స్వయంగా చూశారు. అర్థం చేసుకోసాగారు. యేసుప్రభు దేహానికి ఎన్నో గాయాలు, ఎన్నో దెబ్బలు తగిలాయి. సైనికులు శరీరానికి చీలలు వేసి కొట్టారు. ప్రక్కలో బల్లెం గుచ్చారు. అయితే మృతదేహం సజీవమై, సమాధిలోనుంచి ఆయన వెలుపలికి వచ్చాడు. ఆత్మను విడిచిన శరీరానికి, చనిపోయిన శరీరానికి ఆత్మ తిరిగి వచ్చింది, శరీరం సజీవమైంది. ఆయన మృత్యుంజయుడై సమాధిని గెలిచి లేచాడు.

ఇది బైబిలులో రాసి ఉన్న నిజ వృత్తాంతం. దీన్ని రాసినవారు ఈ విషయాలను ఎరిగినవారు, ఆ కాలంలో జీవించిన మనుషులు. మనం ఆలోచన గల వారమైతే, వివేకం గల వారమైతే ఈ విషయాలు నమ్మగలమా? అనేది ప్రశ్న.

ఈ సంగతులు తప్పకుండా నమ్మవచ్చు. వీటికి బలమైన రుజువులున్నాయి. కనుక మనం దీన్ని నమ్మకపోతే పొరబడుతున్నామని అర్థం. ఈ నిదర్శనాల గురించి ఆలోచిద్దాం.

మొదటిది, యేసుక్రీస్తు స్వయంగా చెప్పిన మాటలే రుజువు. సిలువ మరణం అనుభవించకముందే, నేను చనిపోయి తిరిగి బ్రతుకుతానని గురుదేవుడు స్పష్టంగా బోధించాడు. ఆయన సమాధిలోనుంచి వచ్చాక కూడా శిష్యులు మందమతులై ఈ యథార్థాన్ని గ్రహించలేక పోతున్నందుకు శిష్యులను గద్దించాడు."[7]

రెండో రుజువు: యేసుక్రీస్తు శిష్యులు కూడా యేసు మృత్యుంజయుడై లేచాడని దృఢంగా నమ్మారు. వారు చెప్పిన మాటలు చూడండి –

"మీరు జీవానికి కర్తను చంపించారు గాని దేవుడు ఆయనను చనిపోయిన

వారిలోనుంచి సజీవంగా లేపాడు. ఇందుకు మేము సాక్షులం."[8] అంటూ పేతురు ఇశ్రాయేల్ ప్రజలకు చెప్పాడు. ఇశ్రాయేల్‌వారే క్రీస్తును చంపిన హంతకులు అన్నాడు. మరో సారి ఇలా చెప్పాడు:

"దేవుడు ఆయనకు తోడై ఉన్నాడు గనుక ఆయన మేలు చేస్తూ అపనింద పిశాచం వశంలో ఉన్నవారందరినీ బాగుచేస్తూ సంచరిస్తూ ఉన్నాడు. యూదుల దేశంలో, జెరుసలంలో ఆయన చేసిన వాటన్నిటికీ మేము సాక్షులం. ఆయనను వారు మ్రానుకు వ్రేలాడదీసి చంపారు. మూడో రోజున దేవుడు ఆయనను సజీవంగా లేపి కనబడేలా చేశాడు. ప్రజలందరికి కాదుగాని సాక్షులుగా ఉండాలని దేవుడు మునుపు ఎన్నుకున్న మాకే కనబడేలా చేశాడు. చనిపోయిన వారిలోనుంచి ఆయన లేచిన తరువాత ఆయనతో మేము అన్నపానాలు పుచ్చుకున్నాం."[9]

మిగతా శిష్యులు కూడా ఇదే వాస్తవాన్ని నిశ్చయతతో నిర్దిష్టంగా బోధించారు. చనిపోయిన తరువాత యేసుప్రభువు లేచాడని క్రీస్తురాయబారులు గొప్ప బలప్రభావాలతో సాక్ష్యమిచ్చారు. దేవుని కృప వారందరికీ అధికంగా ఉంది."[10]

పౌలు ముక్తసరిగా ఈ సంగతి మూడు మాటలలో చెప్పాడు – "నేను పొందిన ఉపదేశమే మీకు అందించాను. అది అన్నిటికంటే ముఖ్యం: లేఖనాల ప్రకారమే క్రీస్తు మన పాపాలకోసం చనిపోయాడు. లేఖనాల ప్రకారమే ఆయనను పాతిపెట్టడమూ, మూడో రోజున ఆయనను సజీవంగా లేవడమూ జరిగింది. అప్పుడు ఆయన కేఫాకు కనబడ్డాడు, తరువాత పన్నెండుగురికి కనిపించాడు. ఆ తరువాత అయిదు వందలమందికి మించిన సోదరులకు ఒకే సమయంలో కనిపించాడు. వారిలో కొందరు కన్ను మూసినా ఎక్కువమంది ఇప్పటికీ బ్రతికే ఉన్నారు. అప్పుడు ఆయన యాకోబుకు కనిపించాడు."[11]

"బాధలు అనుభవించిన తరువాత ఆయన వారికి తనను కనుపరచుకొంటూ, తాను మళ్ళీ బ్రతికే ఉన్నానని అనేక రుజువులు చూపాడు. నలభైరోజులు ఆయన వారికి కనబడుతూ దేవుని రాజ్యాన్ని గురించి ఉపదేశించాడు."[12]

యేసుప్రభువు చనిపోయి బ్రతికిన తరువాత శిష్యులు ఆయనను చూశారు. ఆయనను తాకారు. ఆయనతో మాట్లాడారు, కలిసి భోజనం చేశారు. అప్పుడప్పుడు ఆయన వ్యక్తులకు కనబడ్డాడు. మరి కొన్ని సార్లు గుంపులకు కనిపించాడు. ఒకే సారి అయిదు వందలమందికి మించినవారికి ఆయన కనిపించాడు.

కొందరు శిష్యులు అంత సులభంగా ఒప్పుకోలేదు. వారికి బైబిలులోని మొదటి భాగంలో ఉన్న భవిష్యద్వాక్కులు అర్థం కాలేదు. గురుదేవుని మాటలు కూడా వారు గ్రహించలేదు. చనిపోయి బ్రతికిన క్రీస్తును తోమా మొదట నమ్మలేదు. గట్టి

రుజువు ఉంటేనే గాని నమ్మనన్నాడు. దీన్ని గూర్చి శిష్యుడైన యోహాను తను వ్రాసిన సువార్తలో వివరణ ఇలా ఉంది:

"తోమా వారితో ఆయన చేతులలో మేకుల గాయాలు నేను చూడకపోతే, ఆ మేకులు గుచ్చిన స్థలాల్లో నా వ్రేలు పెట్టకపోతే ఆయన ప్రక్కన నా చేయి పెట్టకపోతే నేను నమ్మను అన్నాడు. ఎనిమిది రోజుల తరువాత ఆయన శిష్యులు మళ్ళీ ఆ గది లోపల ఉన్నారు. తోమా వారితో కూడా ఉన్నాడు. తులుపులు మూసి గడియ వేసివున్నాయి. యేసు వచ్చి వారి మధ్య నిలిచి మీకు విశ్రాంతి కలుగుతుంది గాక! అన్నాడు. అప్పుడు తోమాను చూచి నీ వ్రేలు ఇటు చాచి నా చేతులు చూడు! నీ చెయ్యి చాచి నా ప్రక్కన పెట్టు. నీ అవిశ్వాసాన్ని విడిచిపెట్టి నమ్ము! అన్నాడు. అందుకు తోమా ఆయనతో నా ప్రభూ! నా దేవా! అన్నాడు. యేసు అతనితో నీవు నన్ను చూచి నమ్ముతున్నావు. చూడకుండానే నమ్మేవారు ధన్యులు అన్నాడు."[13]

**అభ్యంతరం**

ఎవరో ఒకరు దీనికి అభ్యంతరం చెప్పవచ్చు. "యేసు నిజంగా సమాధిలో నుంచి లేవలేదు. ఒకవేళ ఆయన శిష్యులు శవాన్ని దొంగిలించుకుపోయారేమో! లేకపోతే శిష్యులు ఈ కథను కల్పించి ఉండవచ్చు." కానీ ఇలా ఎన్నటికీ జరిగి ఉండదనడానికి చాలా బలమైన కారణాలున్నాయి. శవాన్ని దొంగిలించడం చాలా కష్టమైన పని. రోమ్ ప్రభుత్వ శాసనం ఉంది, సిపాయిలను మీరి ఆ శవాన్ని దొంగలిస్తారనేది అసంభవం. ఒకవేళ ఇతరులు అయుధాలు ధరించిన సిపాయిలను కన్నుకప్పి శవాన్ని దొంగలించడం సాధ్యమే అనుకుందాం. అలాంటప్పుడు దానికి రుజువులు కనబడి ఉండాలి గదా రుజువు లేకుండా ఎలా నమ్మగలం? పైగా ఉన్న రుజువులన్నీ ఇలాంటి వాదానికి వ్యతిరేకంగానే ఉన్నాయి.

యేసు శిష్యులను గురించి మనం ఎరిగినదంతా పరిశీలించి చూస్తే, వీరు ధర్మశీలురు, న్యాయవంతులు. మానవులందరిలో మంచి భక్తి తత్పరత గలవారు. వారి జీవిత చరిత్రను చదివినవారికి వీరు మోసగాండ్లు కానే కారని తెలిసి పోతుంది. వారి రచనలలో అతి శ్రేష్ఠమైన నైతిక సూత్రాలు ఉన్నాయి. శత్రువులు కూడా వారు తమ ఉపదేశాలకు భిన్నంగా జీవించినట్లు వేలుపెట్టి చూపలేదు. అబద్ధాలు, మోసం దేవుడు ద్వేషిస్తాడని వారు నేర్పారు. అలాంటివి చేసేవారు నరక శిక్షకు పాత్రులని నమ్మి ఉపదేశించారు.

వారందరూ క్రీస్తును గురించి బోధించినందుకు దారుణంగా హింసకుగురి అయ్యారు. వారిలో చాలామంది హతం అయ్యారు కూడా. యాకోబు హేరోదు ఖడ్గానికి ఎరయై చనిపోయాడు. శత్రువులు యోహానును స్వదేశం నుంచి వెళ్ళగొట్టి పత్మాసు ద్వీపంలోకి ప్రవాసం పంపారు. పౌలు శిరచ్ఛేదం చేయబడ్డాడు. మనకు దొరికిన ఆధారాలను బట్టి ఇతర శిష్యులకు కూడా ఇంతకంటే తక్కువ బాధలేమీ పొందలేదు. కానీ వీరు శాంతితో, ఆనందంతో అవమానాన్ని సహించారు. దెబ్బలను ఓర్చుకున్నారు. చిత్ర హింసలను కూడా తట్టుకున్నారు. ఆఖరుకు మరణాన్ని కూడా ప్రశాంతంగా పొందారు. క్రీస్తు కోసం హింసలు అనుభవించడం వారికి ఆనందమనిపించింది. అబద్ధం అని తెలిసి కూడా ఎవరూ దానికోసం చనిపోరు. యేసు సమాధిలో నుంచి లేచాడు అని వారు ఎరిగి ఉండకపోతే, ఆయన బ్రతికి ఉన్నాడు అని బోధించి, అంత బాధలు అనుభవించేవారా? అలా అనుకోవడం అర్థం లేనిది!

మరో విషయం, గురుదేవుని శిష్యులైన వీరు మొదట చాలా పిరికివాళ్ళు. తరువాత వీళ్ళు గొప్ప మార్పు చెందారు. పూర్వం శత్రువులకు భయపడి దాక్కునేవాళ్ళు. వీరిలో గొప్ప మార్పు కలిగాక, ఎక్కడలేని ధైర్యం వీరికి అలవడింది. లోకాన్నే తలక్రిందులు చేశారు. వారి భయమూ సందేహమూ గతించాయి. వారికి అపారమైన బలప్రభావాలూ ఆనందమూ కలిగాయి. ధైర్యం, సమస్తమూ జయించగల విశ్వాసం కలిగాయి. దేవుని ఆత్మ వారిలో బలంగా పని చేస్తున్నాడని స్పష్టంగా తెలిసిపోయింది. యేసుక్రీస్తు మృత్యుంజయుడై లేచాడు అనే దృఢమైన నిశ్చయమే వారిలో ఈ మార్పును తీసుకువచ్చింది. యేసుక్రీస్తు చనిపోయిన తరువాత మళ్ళీ బ్రతికాడని శిష్యులు నమ్మారు అనేది స్పష్టంగా రుజువైంది.

మరొకరు ఇలా అనవచ్చు – "వారు కావాలని అబద్ధం చెప్పలేదు. కానీ మోసపోయి ఉండవచ్చు. వాళ్ళు యేసును చూశామనుకున్నారు గాని నిజంగా చూడలేదు." ఈ అభ్యంతరం కూడా మిగతా వాటిలాగే కారణం లేనిది. పోనీ వారు మోసపోయారని అనుకుందాం. అయితే వారిని మోసం చేసిందెవరు? దేన్నిబట్టి వారు మోసపోయారు? యేసు తానే వారిని మోసం చేశాడందామా? అలాంటి ప్రయత్నం ఆయనేమీ చేయడు. శిష్యులు ఖాళీ సమాధిని చూశారు. ఆ విషయంలో సందేహమేమీ లేదు. నేను మీ ప్రభువును, యేసును అని ఆయన వారికి కనిపించి చెప్పాడు. వారు ఆయనతో కూర్చుండి భోం చేశారు. ఆయనను తాకారు. ఆయన చేతులలోని గాయాలను చూశారు. ఆయన ప్రక్క, కాళ్ళ

గాయాలను కూడా స్వయంగా చూశారు. పునర్జీవితం తరువాత వారు ఆయనతో నలభై రోజులున్నారు. ఆయన ఎవరో బాగా తెలుసుకోవడానికి వారికి ప్రతి అవకాశమూ ఉంది.

వారు మోసపోలేదు. యేసుప్రభువు మరణాన్ని జయించి లేచాడని వారికి బాగా తెలుసు. మనం వారు చెప్పినది వినాలి. ఏ దేశంలోనైనా సరే ఎక్కువమంది స్వయంగా చూచి చెప్పిన విషయం సత్యమని రూఢి చేస్తాయి న్యాయస్థానాలు. ఇద్దరి, ముగ్గురి సాక్ష్యం, ఒక్కొక్కప్పుడు ఒక్క మనిషి సాక్ష్యం కూడా న్యాయ స్థానంలో గెలుస్తుంది. యేసుక్రీస్తు పునర్జీవితం విషయంలో ఇద్దరు ముగ్గురి కంటే ఎక్కువమంది సాక్షులు మనకున్నారు. ఈ సాక్షులెవరు? నిష్కళంక చరిత్రులు. ఈ సాక్ష్యం కోసం వీరు తమ ప్రాణాలు పెట్టడానికి కూడా తెగించినవారు. ఈ వాస్తవాన్ని మనం కాదనలేము. ఆయనను గురించిన విషయాలు ప్రత్యక్షంగా చూచిన శిష్యులే స్వయంగా చెపుతున్నారు. యేసు చనిపోయాడు, తిరిగి బ్రతికాడు.

**అనేకులు ఇది నమ్మారు**

చివరి రుజువు: క్రీస్తు తిరిగి లేవలేదు అని నిరూపించడానికి ఆయన శత్రువులు రుజువులేమీ చూపలేకపోయ్యారు. సాధ్యమే గనుక అయి ఉంటే వారు రుజువులు చూపకుండా ఉంటారా? వారు క్రీస్తును ద్వేషించారు. ఆయన్ను చంపించారు. ఈ గురువు మాకు ఎసరు పెడ్తున్నాడంటూ ఆయన్ను కడతేర్చి, జయం పొందామని అనుకున్నారు. శిష్యులు “ఆయన మృత్యువును గెల్చి సజీవంగా లేచాడు” అని చెప్పసాగారు. అయినా అనేకులు పశ్చాత్తాపం చెందలేదు. చేతనైతే శిష్యులందరినీ వారి ఉపదేశాన్నీ నాశనం చేయడానికి వారు సిద్ధమే. ద్వేషం, అసూయ, అవిశ్వాసం వారి మనసులకు అంధత్వాన్ని కలుగజేశాయి. అయినా, శిష్యులు బోధించినదాన్ని కాదని రుజువు చేయలేకపోయారు.

యేసుప్రభువు శవం సమాధిలోనే ఉంటే, వాళ్ళు కొందరిని సమాధి దగ్గరకు తీసుకువెళ్ళి చూపించి, రుజువు చేయవచ్చు. లేదా, శవం మరో చోట ఉంటే దాన్ని తెచ్చి చూపవచ్చు. కానీ అది ఖాళీ సమాధి అని వారికి కూడా తెలుసు. యేసుప్రభువు విషయం ఏమయిందో వారికి తెలియదు. యేసు శిష్యుల వాదానికి వారు జవాబు చెప్పలేకపోయారు. వారి సాక్ష్యానికి ఎదురు చెప్పలేకపోయారు. వారు చేయగలిగినదల్లా కోపావేశంతో శిష్యులను బెదిరించి హింసించడమే. వాళ్ళను చిత్ర వధ చేసినంతమాత్రాన వాస్తవం మారిందా? వారి వాదం నెగ్గిందా?

మనకు తెలిసిన వాస్తవమైన విషయాలను బట్టి చూచినప్పుడు యేసుప్రభువు

చనిపోయి సజీవంగా లేచాడని స్పష్టంగా ఉంది. చరిత్రకారుడు, చాలా ప్రసిద్ధి చెందినవాడు ఇలా ధైర్యంగా చెప్పాడు: “యేసు పునర్జీవితం పురాతన చరిత్ర అంతటికీ సంపూర్ణంగా రుజువైన వాస్తవం.”

క్రీస్తు సజీవంగా లేచి అదృశ్యమైన దేవుని సన్నిధిలో ప్రవేశించి ఉన్నతమైన మహిమలో కూర్చున్నాడు. తరువాత ఆయన పవిత్రాత్మను పంపాడు. ఆయన శక్తితో శిష్యులలోకి వచ్చాడు. శిష్యులు పరమ సత్యాన్ని బోధించారు. దేవుని ఆత్మ లోకంలో పని చేస్తూ, మనుష్యుల చేత ఈ సత్యాన్ని ఒప్పిస్తున్నాడు. అనేకులు యేసుక్రీస్తులో విశ్వాసముంచేలా చేస్తున్నాడు.

దేవుడు క్రీస్తును లోకానికి పంపాడు, క్రీస్తు దేవుని కుమారుడు అనడానికి దేవుడిచ్చిన బలమైన నిదర్శనం పునర్జీవితమే. యేసు దేవుని దగ్గరనుండి వచ్చిన ఉపదేశకుడు కూడా అనే విషయాన్ని నిర్ధారణగా రుజువు చేసేది పునర్జీవితమే. యేసు ఈ పరీక్షలో గెలిచాడు. ఆయన చనిపోయిన తరువాత సజీవంగా లేచాడు గనుక ఆయన ప్రబోధాలలో మన నమ్మకానికి ఆధారం ఏర్పడింది. ఆయన దేవుణ్ణి గురించి, తనను గురించి, మనలను గురించి, దేవుని దగ్గరకు మార్గాన్ని గురించి నేర్పినదంతా మనం నమ్మగలగడానికి పునర్జీవితం గొప్ప ఆధారం. ఆయన ఊరికే రంగస్థలంలో కనబడినట్లు కనబడి, ఏవో ప్రబోధాలు చేసి అందరిలాగానే అంతరించి ఉంటే విశ్వాసమింకా ఎక్కడిది? ఆయన బ్రతికి ఉన్నప్పుడు మంచి రుజువులతో తన ప్రబోధాలను సమర్థించుకున్నాడు. చనిపోయి సజీవంగా లేచి అంతకంటే బలీయమైన రుజువులను మనకు చూపాడు.

## ఒక ప్రశ్న

మనం క్రీస్తు శుభవార్తలోని ప్రాముఖ్యమైన సత్యాలను చూశాం. ఇప్పుడు ఒక ప్రశ్న అడగడానికి సమయం వచ్చింది. ఆ ప్రశ్న ఏమంటే, నీవు క్రీస్తు విషయం ఏం చేస్తావు? ఆయన దేవుని కుమారుడు, నిజమైన గురుదేవుడు. ఆయన ఉపదేశాలు సత్యమైనవి, అధికార సహితమైనవి. అవి చాలా రమ్యమైనవి, పవిత్రమైనవి కూడా. తాను దేవుని నుంచి వచ్చాననీ సత్యం చెప్పాననీ ఆయన అనేక సాక్ష్యాధారాలూ రుజువులూ ఇచ్చాడు. నిన్ను ప్రేమిస్తూ సమస్త బంధకాల నుంచి విడిపించగోరుతున్నాడు. నిన్ను దేవుని సంతానంగా మార్చడానికి ఆయన శక్తివంతుడు. నీ సమస్త పాపాలను క్షమించగలడు.

ఆయన విషయం నీవు ఏం చేస్తావు? నీ పాపాల కోసం ఆయన సిలువ మరణం పొంది సజీవంగా లేచినవాడుగా నీ ఎదుట నిలబడుతున్నాడు. నీకు

ఉన్నతమైన మేలు, ఆధ్యాత్మిక ఆశీస్సులు కలగాలని చూస్తున్నాడు. నీ హృదయం ఆయనకిస్తావా? ఆయనను నమ్మి నీ ప్రభువుగా, ముక్తిదాతగా, రక్షకుడుగా స్వీకరిస్తావా?

ఆయనను సమీపించు, ప్రార్థించు. ఈ పుస్తకంలో ఆయన చేసిన అనేక వాగ్దానాలను పొందుపరిచాం. వాటిని నమ్మి దేవుణ్ణి వేడుకో. ఆయన వింటాడు. నీ దగ్గరకు వస్తాడు.

**ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. మత్తయి 17:23
2. రోమ్ 1:4
3. లూకా 23:46
4. యోహాను 19:32–34
5. మత్తయి 27:63–66
6. మత్తయి 28:1–7
7. లూకా 24:25–26
8. అపొ కా 3:15
9. అపొ కా 10:38–41
10. అపొ కా 4:33
11. 1 కొరింథు 15:3–8
12. అపొ కా 1:3
13. యోహాను 20:25–29

# 8 అపాయం!

మన శత్రువు భయంకరుడు, శక్తిమంతుడు. మనమీద ఏలుబడి చెయ్యడం వాడి ఆశ. ఈ శత్రువు ఎవరికీ కనబడడు. అగోచరంగా పని చేస్తాడు. అనేకులు వాడు లేనట్టే భావిస్తున్నారు. వాడు ఉపాయశాలి. వాడి పథకాలు వంచనతో కూడినవి. అందుకే చాలామంది వాడితో స్నేహంగా ఉంటారు. వాణ్ణి అంటిపెట్టుకుని ఉంటారు. వాడి పక్షాన నిలుస్తారు.

ప్రథమ మానవుడు కావాలని చూస్తూ చూస్తూనే పాపంలో పడిపోయాడు. దానికి ఫలితంగా లోకంలోకి పాపం ప్రవేశం చేసింది. "పాపం అనేది ఒకే మనిషి ద్వారా లోకంలోకి ప్రవేశించింది. పాపం ద్వారా చావు ప్రవేశించింది. మనుషులంతా పాపం చేశారు, గనుక అలాగే అందరికీ చావు వాటిల్లింది."[1] మనిషి పాపం వెనుక మరొకడి పాపం ఉంది. వాడే ఈ ప్రపంచంలోకి ప్రప్రథమంగా పాపాన్ని తెచ్చాడు. అంతకుముందు వాడొక దేవదూత. మనిషిని నిర్మించినట్లే దేవుడు ఆ దూతను కూడా సమగ్రంగా, లోపం లేకుండా ఉండేలా సృజించాడు. వాడు కూడా కావాలని, స్వయంగా తీర్మానం చేసుకుని మరీ పాపం చేశాడు. దేవునికి వ్యతిరేకంగా పాపం చేశాడు. ఆ పాపం గర్వమే. అది తనను తాను హెచ్చించుకోవడం. తనకు తానై పైకెక్కి కూర్చుందామనే భావన. తానూ దేవుడితో సమానుడిని కావాలనే కోరిక వాడిలో మొలకెత్తింది. దాన్ని పెరగనిచ్చాడు.

ఇప్పుడు వాణ్ణి "సైతాను" అని వ్యవహరిస్తున్నాం. వాణ్ణి పిశాచం లేక అపనింద పిశాచం అంటాం కూడా. ఆది సర్పమని కూడా వాడి పేరు. హృదయంలో ఈ ఒక్క పాపం అంకురించడానికి సైతాను ఒప్పుకున్నాడు. దీనికి ఫలితంగా వాడు పూర్తిగా చెడిపోయాడు. దేవుడితో సమాన స్థాయికి హెచ్చించుకోవడానికి ప్రయత్నించాడు. అదే వాడి స్వభావం పూర్తిగా పాడైపోవడానికి కారణమైంది. దేవుడు సృష్టికర్త. సైతాను సృష్టించబడినవాడు. తుదకు తానే దేవునికి ఎదురు తిరిగాడు. దేవుని రాజ్యంలో తనకున్న స్థానాన్ని కాస్తా పోగొట్టుకున్నాడు. దేవుడంటే సాధించలేని ద్వేషాన్ని నిలువెల్లా నింపుకున్నాడు. దేవుని సృష్టిమీద కూడా ద్వేషం వాణ్ణి నిలువెల్లా నింపివేసింది. ప్రథమ మానవుడి దగ్గరికి వచ్చాడు. ప్రథమ స్త్రీని సమీపించాడు. తాను చెడిన విధంగానే వారినీ పాప బురదలోకి దించాడు. వాడన్నాడు గదా – "మీరు దేవ సమానులవుతారు". అంతేకాదు – దేవునికి విరోధంగా ఈ పాడు

ఉద్యమాన్ని కొనసాగిస్తూనే ఉన్నాడు. శక్తిమంతుడుగా ఈ పిశాచం విహారం చేస్తూనే ఉన్నాడు.

ఈ పిశాచాన్ని గురించి యేసు క్రీస్తు ఉపదేశించాడు. దురాత్మగా ఉన్న సైతాను ఉన్నాడని చెప్పాడు. అతణ్ణి గురించి ఎన్నో విషయాలు వెల్లడి చేశాడు. సైతాను గుణగణాలు ఎలాంటివి? వాడి దుశ్శీలం ఎంతవరకు పని చేస్తుంది? వాడి విధానాలు ఏవి? ఈ విషయాలను విశదం చేస్తూ కొందరు కపటులైన మత నాయకులతో యేసు ఇలా అన్నాడు: "మీరు మీ తండ్రి అపనింద పిశాచానికి చెందినవారు. మీ తండ్రి ఆశల ప్రకారం జరిగించాలని కోరుతూ ఉన్నారు. మొదటినుంచి వాడు హంతకుడు. సత్యంలో నిలవనివాడు. సత్యం వాడిలో బొత్తిగా లేదు. వాడు అబద్ధికుడు. అబద్ధాలకు తండ్రి. వాడు అబద్ధం చెప్పినప్పుడెల్లా అది వాడి స్వంత అబద్ధమే."[2]

యేసుప్రభువు చెప్పిన ఈ మాటలు చాలా ఘాటుగా వారికి ధ్వనించాయి. ఎందుకంటే, మేము దేవుని సంతానమనుకున్నారు వాళ్ళు. కానీ యేసు ఎల్లప్పుడు సత్యమే చెప్పాడు. ఉన్నది ఉన్నట్లు బోధించాడు. ప్రజలు తెలుసుకొని తీరవలసిన విషయాలు చెప్పి గాని విడువలేదు. వారికి అవసరమైనదంతా చెప్పాడు.

## సైతాను విధానం

సైతాను హంతకుడు, అబద్ధికుడు. ప్రజలను దేవునికి దూరం చేస్తాడు. తద్వారా ప్రజలమీదికి చావును రప్పిస్తాడు. వారి శరీరాలను పాడు చేస్తాడు. వారి ఆత్మలను నాశనం చేస్తాడు. వారి జీవితాన్ని భ్రష్టు పట్టిస్తాడు. వారిని పూర్తిగా పాడు చేస్తాడు. సైతాను ప్రముఖ విధానం "మోసం." అబద్ధాలు చెప్పి ప్రజలను నాశనంలో గెంటివేస్తాడు. సత్యం మనుషులకు స్వతంత్రత, మోక్షం ఇస్తుంది. అసత్యం మనుషులను బానిసలుగా మారుస్తుంది, నాశనం చేస్తుంది. దేవుణ్ణి గురించిన అబద్ధాలు సైతాను మనకు నూరిపోస్తాడు. దేవుడు ఎలా ఉంటాడో మనుషులకు తెలియకుండా చేస్తాడు. దేవుణ్ణి గురించిన తప్పు అభిప్రాయాలు మనుషులలో ఏర్పడేలా చేస్తాడు. మనమెవరమో మనకు తెలియకుండా చేస్తాడు. తన నిజ స్వరూపం దాచిపెట్టుకుంటాడు. క్రీస్తును గురించి తప్పుడు విషయాలు చెపుతాడు. రక్షణను గురించి కపట ప్రబోధాలు చేస్తాడు. దొంగ మాటలు చెపుతాడు. కొన్నిసార్లు వాడు మనకు ఇవ్వజూపేది "కల్తీ సరుకు". సత్యాన్నీ అసత్యాన్నీ కలుపుతూ చెపుతాడు. అబద్ధాల మధ్య ఏదో ఒకింత సత్యం కలుపుతాడు. ఈ కల్తీ పదార్థం చూడడానికి సిసలైనదిగా, అసలైనదిగా కనబడుతుంది.

సైతాను విధానాలు చాలా శక్తివంతమైనవి. చాలా సార్లు సైతాను తన పద్ధతుల ద్వారా జయం సాధిస్తాడు కూడా. బైబిలులో వాణ్ణి గురించి ఈ విధంగా చెప్పబడింది:

"ఆ సర్పం ఆదిసర్పం. దానికి అపనింద పిశాచం, సైతాను అని పేరు. అది సర్వ లోకాన్ని మోసగిస్తూ ఉండేది."[3] వీడు సర్వ లోకాన్ని మోసపుచ్చేవాడు. సర్వలోకమంటే మానవ జాతి యావత్తూ అన్నమాట. యుగయుగాల మనుషులు, దేశ దేశాల ప్రజలు లోక జనాభా అంతా ఇందులో ఇమిడి ఉన్నారు. వీరందరూ ఇప్పటివరకు వీడి మోసకరమైన కార్యాలకు గురి అవుతూనే ఉన్నారు. వీడి మోసంనుంచి విముక్తులయిన వారు మిగతా వాళ్ళతో పోల్చి చూస్తే బహు కొద్దిమంది మాత్రమే. వీడి మోసం ఎలాంటిదో మనం తెలుసుకొని ఉండాలి. అందుకే దేవుడు ఈ విషయాలు మనకు వెల్లడి చేశాడు.

## నమ్మించే అబద్ధాలు

సైతాను అబద్ధాలు చెపితే అవి నలుగురూ నమ్మేలా ఉంటాయి. సైతాను రావడమే మంచి ఆకర్షణీయమైన వేషంతో వస్తాడు. వినడానికి ఇంపుగా ఉండేట్లు మాట్లాడుతాడు. "సైతాను తానే వెలుగు దూత వేషం వేసుకునేవాడు."[4] సైతాను స్వరూపం ఎప్పుడూ భయంకరంగా ఉంటుందనుకోకూడదు. ముఖం వికారంగా, ఆకారం భయానకంగా భగభగమని మంటలు ఊదే నోటితో ఏమీ కనబడడు. తనకిష్టమైనట్టు వెలుగు దూత వేషంతో రాగలడు. ధగధగా మెరిసిపోతూ, దేవుడా ఏమి? అని భ్రమించేలా రాగలడు.

వాణ్ణి "యుగదేవుడు" అని బైబిలు పేర్కొంటుంది. "వాడు విశ్వాసం లేనివారి మనసులకు గుడ్డితనం కలిగించాడు. అందుచేత వారు దేవుని స్వరూపి అయిన క్రీస్తు మహిను గురించిన శుభవార్త వెలుగు చూడలేకపోతున్నారు."[5]

సైతాను పేరెన్నికగన్న మంత్రగాడు. మోసం చెయ్యడంలో ప్రముఖుడు. అనుకూలాన్ని బట్టి వేషాలు మారుస్తూ ఉంటాడు. నేను నాస్తికుణ్ణి అంటూ వస్తాడు. దేవుడు లేడనే సిద్ధాంతాన్ని ప్రోత్సహిస్తాడు. మరో సారి మత విషయక పండితుడుగా వచ్చి మతాన్ని వృద్ధి చేస్తాడు. ఎలా వీలైతే అలా మనుషుల్ని నాశనం చేయడమే వాడి పని. తన పని గడుపుకునేందుకు మతాన్ని గాని, విమతాన్ని గాని, మత రాహిత్యాన్ని గాని, ఏది బడితే అది ప్రయోగిస్తాడు. మతం ముసుగు వేసుకుని పెద్ద భక్తుడిలాగా నలుగురిలో చెలామణి కాగలడు. ఈ విషయం గనుక మనకు తెలిసి ఉండకపోతే వాడి మోసంలో చిక్కుకుంటాం. ఆ మాటకొస్తే, దేవుని గురించి

ప్రజలను మోసగించాలంటే మతంలో ప్రవేశించి దానిలో పని చేయడం కంటే ఉపయోగకరమైన విధానం మరొకటి ఉన్నాదా? ఇలాంటి మోసాలకు మతం తప్ప మరో కూడలి స్థానం ఎక్కడ ఉందంటారు చెప్పండి? అందుకే సైతానుకు మతమంటే అంత ఇష్టం.

ముఖ్యంగా సైతాను చేసే దుష్కార్యం మరొకటి ఉంది. క్రీస్తు శుభవార్త విషయంలో మనుషుల కండ్లు మూసివేస్తాడు. అప్పుడు ప్రజలకు సత్యం కనబడదు. దాని అందం గోచరించదు. వారికి క్రీస్తును గురించిన శుభవార్త బోధపడదు. మనుషుల హృదయాలలోకి క్రీస్తు శుభవార్త ప్రవేశించింది అంటే, సైతాను రాజ్యం కూలిపోతుందన్న మాటే. ఈ విషయం సైతానుకు బాగా తెలుసు.

## ఈ యుగ దేవుడు

సైతాన్ను "ఈ యుగ దేవుడు" అని బైబిలు చెపుతుంది. అతడు సత్య ఏక దేవుని నుంచి ప్రజలు దూరంగా ఉండేలా చేస్తాడు. దేవుడు విశ్వానికంతటికీ సృష్టికర్త. సృజించబడిన మానవుణ్ణి దేవునికి దగ్గర కాకుండా చేయడమే సైతాను పని. ఇదంతా చేయడంలో వాడి విషతుల్యమైన సంకల్పం ఏమిటి? వాడికి బోలెడన్ని ఉద్దేశాలుండవచ్చు. కాని, ఒకటి మాత్రం నిశ్చయం. నేను దేవుణ్ణి కావాలి అనుకునే వాడెవడైనా సరే, ఒకే ముఖ్యమైన గురి పెట్టుకుంటాడు. అంటే, "నన్నందరూ ఆరాధించాలి" అనుకుంటాడు సైతాను. ఇందులో ఏ సందేహమూ లేదు. ఆఖరుకు క్రీస్తుకు కూడా ఎదురుపడి "నాకు నమస్కారం చేయి" అంటూ ప్రోత్సహించాడు.

"అపనింద పిశాచం ఆయనను చాలా ఎత్తైన పర్వత మీదికి తీసుకువెళ్ళి భూలోక రాజ్యాలన్నీ, వాటి వైభవాన్నీ చూపించాడు. అప్పుడు వాడు నీవు సాష్టాంగపడి నన్ను పూజిస్తే ఇదంతా నీకిస్తాను అన్నాడు. సైతానూ! అవతలికి పో! నీ ప్రభువైన దేవుణ్ణి ఆరాధించాలి, ఆయనకు మాత్రమే సేవ చేయాలి అని వ్రాసి ఉంది అని యేసు వాడితో చెప్పాడు."[6]

"సాష్టాంగపడి నన్ను పూజించు." సైతాను ఏలాంటి ప్రయత్నం చేశాడో చూడండి. అప్పుడు సైతాను ఓడిపోయాడు. కాని, అనేకులు సైతాను చేతిలోనే ఓడిపోతారు. కొందరు వాణ్ణి ఆరాధిస్తారు. తెలిసి కూడా వాణ్ణి పూజించేవారున్నారు. మరి కొందరికి తాము ఏం చేస్తున్నారో తెలియదు. దేవుణ్ణే ఆరాధిస్తున్నామనుకుంటూ సైతానును పూజిస్తారు.

## దయ్యం లేదా?

"ఇదంతా బూటకం. సైతాను లేదు. దయ్యమూ లేదు. ఇదంతా మూఢ నమ్మకం" అంటూ కొందరు దీన్ని పూర్తిగా కొట్టివేయడానికి ప్రయత్నిస్తారు. అయితే సైతాను లేదని నీకెలా తెలుసు? సైతాను ఉంటే వాడు ప్రజల మనసులకు గుడ్డితనం కలగజేస్తాడు. అలాగే సైతాను లేదు అనే ఆలోచన కూడా వాడే కలిగించగలడు. అలాంటప్పుడు సైతాను అనేవాడు లేదు అని చెప్పేవాడు అదే సైతానుచేత మోసపోయాడన్న మాట. సైతాను లేదని సైతానే అతనిచేత పలికించడానికి అతణ్ణి భ్రమింపజేస్తున్నాడని రుజువవుతున్నది. ఏమి జరుగుతున్నదో గుడ్డివాడు చూడలేడు. సైతాను లేదని చెప్పడానికి ఆధారమేమి? సైతానీయమైన పనులూ, పిశాచ క్రియలూ లోకంలో బోలెడన్ని ఉన్నాయి. సైతాననేవాడున్నాడనీ నేను మట్టుకు గట్టిగా నమ్ముతాను, ఎందుకంటే యేసుప్రభువు ఈ విషయాన్ని ఎంతగానో విశదం చేశాడు. సైతాను ఉన్నాడనే విషయాన్ని సందేహించే వారికి ఇంకా ఎన్నో రుజువులు చూపవచ్చు. అవన్నీ ఎందుకు? యేసుప్రభువు ఈ విషయం చేసిన ఉపదేశం చాలు. అదృశ్య లోకం ఆయనకు బాగా తెలుసు. సైతాను అనేవాడున్నాడని ఆయన స్వయంగా చెప్పాడు. అందుచేత సైతాను లేదు అనే అభిప్రాయం ఏ మాత్రమూ నెగ్గదు. లోకంలో జరుగుతున్న అనేక విషయాలు సరిగా గ్రహించాలంటే, పిశాచాలను గురించి యేసుప్రభువు చెప్పినది తు.చ. తప్పకుండా నమ్మాలి. లేకపోతే లోక గతి మనకు అర్థం కాదు.

## సైతాను సహాయకులు

సైతానుకు అనేకమంది సహాయకులున్నారు. వీళ్ళను దయ్యాలంటాం. పిశాచాలని కూడా అంటాం. దయ్యాలు పట్టిన వారిలోనుంచి యేసు వాటిని పారదోలాడు. "దయ్యాలు పట్టిన వాళ్ళను అనేకమందిని ప్రజలు ఆయన దగ్గరికి తీసుకువచ్చారు. ఆయన ఒక్క మాటతో ఆ దయ్యాలను వెళ్ళగొట్టాడు."[7] ఈ విధంగా యేసుప్రభువు తన మహా బలప్రభావాలు కనుపరచాడు. ఏ పిశాచం గానీ, సైతాను గానీ యేసు ఎదుట నిలువలేదు. ఆయన ఎదుట సైతాను, వాడి దూతలు గజగజ వణికి పారిపోవలసినదే. యేసు తన శిష్యులకు కూడా ఇదే శక్తి నిచ్చాడు. "రోగులను బాగు చేయండి. చనిపోయినవారిని సజీవంగా లేపండి. కుష్ఠరోగులను బాగుచేయండి. దయ్యాలను వెళ్ళగొట్టండి."[8] ఈ దయ్యాలంతా పడిపోయినవాళ్ళు. వీరంతా సైతానులాగే మొదట మంచివాళ్ళుగానే

సృష్టించబడ్డారు. మొదట్లో వీరంతా పవిత్రమైనవాళ్ళే, నీతిపరులే. సైతానుతోపాటు వీరు కూడా పాపంలో పడిపోయారు. వీరు సైతానులాగే స్వంత తీర్మానంచేత పాప పతనం చెందారు. వీరికి కూడా అందరి ఆరాధనను పొందాలనీ ఆశ ఉంటుంది. ప్రాచీన కాలంలో ఇస్రాయేల్ ప్రజలు అప్పుడప్పుడు ఈ దయ్యాల్ని పూజించేవారని బైబిలులో ఉంది. "దేవత్వం లేని దయ్యాలకు వారు బలులు అర్పించారు."[9] దేవుడు విశ్వమంతటినీ సృజించినవాడు. వారు అర్పణలు అలాంటి దేవునికి తేవలసి ఉంది. కానీ దయ్యాలకు అర్పణలు తెచ్చారని బైబిలులో రాసి ఉంది.

ఈ దయ్యాలు లోకంలో అంతటా ఉన్నాయి. ఈ దయ్యాలు ప్రజలను మోసం చేస్తాయి. దేవునికి మాత్రమే చెందవలసిన ఆరాధనను ఈ దయ్యాలు దొంగిలిస్తాయి. "ఇష్ట దేవతలు" ఎలాంటి మాయా దేవతలో మనం గమనించాలి. ఇష్ట దేవత అంటే అది నీ ఇష్టమొచ్చిన దేవత. నిజ దేవుణ్ణి మాత్రమే ఆరాధించాలని నీకిష్టం లేకపోతే ఆ ఇష్ట దేవత ఏమై ఉంటుంది?

సైతాన్ను గురించీ, వాడి సహాయకులను గురించీ యేసు ప్రభువు నేర్పిన సత్యం ఇది. సైతాన్నూ వాడి దయ్యాలనూ ఎందుకు దేవుడు ఈ విధంగా ఉండనిచ్చాడో గురుదేవుడు వివరించలేదు. కానీ బైబిలు వెల్లడి చేసిన కొన్ని విషయాలను బాగా తెలుసుకోగలం.

మొదటిది : దేవుడు చెడ్డదానిని దేనినీ సృజించలేదు. వారు సృజించబడిన తరువాత తమ్మును తామే చెడగొట్టుకున్నారు. స్వయంగా హెచ్చించుకున్నారు. దేవునికి ఎదురు తిరిగారు. అంతే కాదు మరో విధంగా మనం చెప్పవచ్చు. దేవుడు సెలవిచ్చి అనుమతించకపోతే దయ్యాలకు కూడా ఏమీ చేయడానికి శక్తి ఉండదు. దేవుడు సంపూర్ణంగా సమస్తమూ నిర్వహించగలడు. లోకం నుంచి పిశాచాలన్నిటినీ తొలగించి పాతాళంలో త్రోసివేయగలడు. లోకంలో రెండు అమితమైన శక్తులు లేవు. మంచి శక్తి ఒకటి, చెడు శక్తి ఒకటి అని రెండు ఉండవు. సైతాను మనకంటే శక్తిమంతుడు. కానీ సర్వశక్తిమంతుడైన దేవునికంటే బలహీనుడే.

మరో విషయం, దుష్ట శక్తులైన దయ్యాల్ని లోకంలో ఉండనిస్తున్నాడంటే, దేవునికి గొప్ప సంకల్పం ఒకటి ఉంటుంది. దేవుని సంకల్ప జ్ఞానాన్ని మనం పూర్తిగా గ్రహించలేము. చూచాయగా మాత్రమే గ్రాహ్యమవుతుంది. ఒక విధంగా, దేవుడు మనుషులను పరీక్షించగోరి ఉంచాడనవచ్చు.[10] దేవుని సంకల్పం మనం గ్రహించలేక పోయినా ఒకటి మాత్రం తెలుసుకుని తీరాలి. దేవుడు ఏది చేసినా జ్ఞానంతో చేస్తాడు. ఆయన సంకల్పం శ్రేష్ఠమైనది.

సైతాను దేవునికి ఎదురు తిరిగాడు. అలాగే వాడి మాదిరిగా మనుషులంతా దేవునికి ఎదురు తిరిగారు. అందుచేతనే మానవుడి మీద ప్రయోగించడానికి సైతానుకు శక్తి లభించింది. మానవుడే గనుక సైతాను సలహాలను పాటించకుండా ఉంటే మానవుడికి చెడుగు చేయడానికి సైతానుకు ఏ అధికారమూ ఉండేది కాదు. మానవులంతా స్వయంగా వాడి అధికారానికి లొంగిపోయారు గనుక లోకంలో సైతాను శక్తిమంతుడయ్యాడు.

## విముక్తి

సైతాను శక్తినుంచి, మోసంనుంచి విడుదల పొందడం ఎలాగా అనేది మన సమస్య. దీనికి పరిష్కారంగా శుభవార్త ఉంది. యేసుక్రీస్తు చేసిన కార్యమే శుభవార్త. “అపనింద పిశాచం యొక్క పనులను నాశనం చేయడానికే దేవుని కుమారుడు ప్రత్యక్షం అయ్యాడు.”[11]

యేసుప్రభువు మనలను పాపంనుంచి విమోచించగలడు. మనం ఆయన వైపు తిరిగి, విశ్వసిస్తే, సైతానుపై విజయాన్ని సాధించగలం. సైతానును దేవుడు ఎందుకు పని చేయనిస్తున్నాడో ఆ సంకల్పం నెరవేరే రోజు రాబోతున్నది. అప్పుడు దేవుడు వాణ్ణి పూర్తిగా లోకంలోనుంచి తొలగిస్తాడు. క్రీస్తే రాజ్యమేలుతాడు. సైతాన్ను దేవుడు అగ్ని సరస్సులో పడవేస్తాడు. అందులో వాడు అనంత యుగాల్లో యాతన అనుభవిస్తాడు. ఈ లోకంలో సైతానును అనుసరించినవారు అక్కడ కూడా వాని దగ్గరే ఉంటారు. వారందరూ అగ్ని సరస్సులో పడవేయబడతారు. ఈ విధంగా దేవుడు ఈ లోకాన్ని శుద్ధీకరిస్తాడు. లోకంలో చెడుగు గానీ, దాన్ని జరిగించేవారు గానీ ఉండకుండా చేస్తాడు. ఈలోగా లోకంలో సైతానును ఉండనిస్తున్నాడు, పని చేయనిస్తున్నాడు.

## సైతానుకు ఇతరసహాయకులున్నారు

మనుషులలో కూడా సైతానుకు సహాయకులున్నారు. యేసుప్రభువు నాటి మత నాయకులతో “మీరు మీ తండ్రియైన సైతాను సంబంధులు” అన్నాడు. మేము దేవుని సంతానమంటూ వారు గొప్పగా చెప్పుకున్నారు. మేము వృత్తి రీత్యా నాయకులం, ఉపదేశకులం, దేవుని సేవకులం అనుకున్నారు. కానీ వారు పొరబడ్డారు. వారు సేవించినది తమ స్వార్థాన్ని. వారు తమ తండ్రియైన సైతానునే సేవించారు.

తరచుగా కనబడే సత్యం ఒకటుంది. ప్రతి రోజూ మనం ఎదుర్కోవలసిన

అపాయం ఇది. క్రీస్తు జీవించిన రోజులలో మాత్రమే కాదు, ఇప్పుడు కూడా ఇదే ప్రమాదం ఉంది. అబద్ధ గురువులను గురించి జాగ్రత్తగా ఉండాలని బైబిలు మనలను హెచ్చరిస్తున్నది. కొండమీది ప్రసంగంలో యేసుక్రీస్తు ఇలా చెప్పాడు: "కపట ప్రవక్తల విషయం జాగ్రత్త! వాళ్ళు గొర్రె తోలు కప్పుకొని మీ దగ్గరికి వస్తారు గాని లోలోపల వారు క్రూరమైన తోడేళ్ళలాంటివారు."[12]

మరో సందర్భంలో ఆయన ఇలా అన్నాడు: "అనేకులు నా పేర వచ్చి "నేనే క్రీస్తును" అని చెప్పుకొంటూ చాలామందిని తప్పు దారి పట్టిస్తారు."

"కపట క్రీస్తులూ, కపట ప్రవక్తలూ వస్తారు. సాధ్యమైతే, దేవుడు ఎన్నుకొన్న వారిని కూడా తప్పుదారి పట్టించడానికి మహా సూచనలూ అద్భుతాలూ ప్రదర్శిస్తారు."[13]

గురుదేవుడు శిష్యులు ఆయనదగ్గర ఈ విషయాలను నేర్చుకున్నారు. ఆ తరువాత మనలను హెచ్చరించారు.

"ఎవ్వడూ మోసకరమైన వట్టి తత్వశాస్త్రంతో మిమ్ములను చెరపట్టకుండా జాగ్రత్త! అలాంటి వేదాంతం క్రీస్తును అనుసరించేది కాదు గానీ మనుషుల సాంప్రదాయాలనూ ఈ లోకంలో ఉన్న ప్రాథమిక విషయాలనూ అనుసరించేది."[14] "అయితే ఆ ప్రజలలో కపట ప్రవక్తలు కూడా లేకపోలేదు. అలాగే మీలో కూడా కపట ఉపదేశకులు ఉంటారు. వారు వినాశనకరమైన తప్పు సిద్ధాంతాలను దొడ్డిదారిన ప్రవేశపెట్టి తమను కొన్న ప్రభువును కూడా కాదంటారు."[15]

"చాలామంది కపట ప్రవక్తలు లోకంలోకి బయలు దేరారు, గనుక ప్రతి ఆత్మనూ నమ్మకండి, గానీ ఆ ఆత్మలు దేవునికి చెందేవో కావో పరీక్షించి చూడండి."[16]

**కపటబోధకులు**

దీన్ని బట్టి ఒక విషయం స్పష్టంగా తేలుతుంది. మేము గురువులమంటూ కొందరు వస్తారు. మరి కొందరు యాజులం, మత నాయకులం అంటారు. వీరందరూ నిజంగా దేవుని సేవకులు కారు. ఈ కపట బోధకులు ప్రజల ఆధ్యాత్మిక క్షేమాన్ని పాటించరు. దేవుని మహిమ గురించి నిర్లక్ష్యంగా ఉంటారు. వీరు స్వార్థ ప్రియులు. ఏదో పేరు ప్రఖ్యాతుల కోసం పాటుపడే మనుషులు. తమ స్వకీయ నీతిని స్థాపించేవారు. తమ స్వంత సిద్ధాంతాలను ప్రకటించేవారు. సైతాను కోరికల ప్రకారం ప్రవర్తించేవారు వీరంతా. వీరిని అనుసరించేవారికి తమ నాయకుల నిజ స్వరూపం తెలియదు. అప్పుడప్పుడు తమకే తమ నిజ స్థితి

తెలియదు. మోసపోయివుంటారు. వారి మతి భ్రమించి ఉంటుంది.

సైతాను పురికొల్పిన ఈ దొంగ బోధకులు వంచకులు. వీరి ముఖాలు ప్రకాశవంతంగా కనబడవచ్చు. పైకి భక్తి గలవారిలాగా కానవస్తారు. మర్యాదస్తులనిపిస్తుంది. మత సంబంధులుగా నటిస్తారు. పైగా వీరు మంచి మర్యాదలున్న నాగరికులుగా, చదువుకున్న ఆసాములుగా, సభ్యతగల పెద్ద మనుషులుగా ఉండవచ్చు. "ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. సైతాను తానే వెలుగు దూత వేషం వేసుకునేవాడు. అందుచేత వాడి దాసులు తాము నీతిన్యాయాలకు మారువేషం వేసుకోవడం వింత ఏమి కాదు."[17] ఈ బైబిలు వచనం అబద్ధ ఉపదేశకులు, మోసగించే మతస్థులు పైకి క్రీస్తు దూతల లాగా కనబడుతారని స్పష్టీకరిస్తుంది. అంతే కాదు, వీరిలో కొందరు క్రీస్తును గురించి ఎన్నడూ విననివారై ఉండవచ్చు కూడా. సైతాను ఆశ ఎక్కడైనా ఎప్పుడైనా ఒకలాగే ఉంటుంది. తన సేవకులు దేవుని సేవకులుగా ప్రజలచేత అంగీకారం కావాలని వాడి ఉద్దేశం.

జాగ్రత్తగా గమనించండి. వీరు సైతాను సేవకులైనప్పటికీ నీతి సేవకుల్లాగా కనబడుతారు. వీరిని అందరు చూచి పొగడుతారు, శ్లాఘిస్తారు. సత్యోపదేశకులంటూ నలుగురూ మెచ్చుకుంటారు. సన్మానాలు చేస్తారు. కానీ, వీరి ఉపదేశం యావత్తూ దయ్యాల నుంచి వచ్చేదే. ఈ విషయం వీరికి తెలిసి ఉండకపోవచ్చు. అయినా వీరి ఉపదేశం మానవుల ఆత్మలను నాశనం చేస్తుంది. తండోపతండాలుగా ప్రజలు వీరి వెంట పడతారు. "దొంగ వెలుగు" ఎందరిమీదో ప్రభావం చూపుతుంది. దానివల్ల ఎందరో ఆకర్షించబడి నాశనంలోకి దిగజారిపోతారు. మన గురుదేవుడు ఆ అపాయాలను గురించి మనకు హెచ్చరిక ఇచ్చాడు. వీటిని వెల్లడి చేశాడు. మనం జాగ్రత్తగా ఉండాలని ఆయన ఉద్దేశం.

## సత్యమేదో ఎలా తెలుసుకోవాలి?

ఈ ప్రశ్న మన హృదయాలలో మారు మ్రోగుతున్నదా. ఈ ప్రశ్న ప్రతి ఒక్కరూ అడిగి తీరాలి. ఎవరు సద్గురువు? ఎవడు దొంగ బోధకుడు? ఎలా వివేచించడం? ఈ ఉపదేశం సరైనదో కాదో ఎలా పసిగట్టడం?

ఇది దేవుని ఉపదేశం – కాదు ఇది సైతాను ఉపదేశం – ఎలా తెలుసుకోగలం? సత్య సందర్శనం ఎలా కలుగుతుంది? ఏది నిజం?

ఇది చావు బ్రతుకుల ప్రశ్న. శాశ్వత జీవమా? శాశ్వత మరణమా? అనంత

యుగాల ఆనందమా? అనంత యుగాల బాధా? వచ్చే అధ్యాయంలో దీన్ని పూర్తిగా చర్చించడానికి ప్రయత్నం చేద్దాం.

**ఈ అధ్యాంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. రోమ్ 5:12
2. యోహాను 8:44
3. ప్రకటన 12:9
4. 2 కొరింతు 11:14
5. 2 కొరింతు 4:4
6. మత్తయి 4:8-10
7. మత్తయి 8:16
8. మత్తయి 10:8
9. ద్వితీ 32:17
10. లూకా 22:31,32
11. 1 యోహాను 3:8
12. మత్తయి 7:15
13. మత్తయి 24:5,24
14. కొలస్సయి 2:8
15. 2 పేతురు 2:1
16. 1 యోహాను 4:1
17. 2 కొరింతు 11:14

# 9 ఏది సత్యం?

మనిషి ఎవరు? దేవుడు ఎలాంటివాడు? దేవునిదగ్గరికి మార్గమేది? అనే విషయాలను గురించి ఇంతవరకూ చర్చించాం. ఇవి నిజంగా చాలా ప్రాముఖ్య విషయాలు. సైతానూ, అబద్ధ బోధకులూ ఈ విషయాలను గురించి తప్పుడు ఉపదేశాలు చేస్తూ ఉండడం మామూలైన సంగతి. ఈ అంశాలను గురించి వివిధ అభిప్రాయాలూ, బోధలూ ప్రచారంలో ఉన్నాయి. ప్రతి ఒక్కరూ ఏదో నమ్ముతూనే ఉన్నారు. మనం నమ్మేది సత్యం అని నిశ్చయించుకోవడానికి ఆధారమేది? న్యాయానుసారమైన వాదమేది? అది నిజమో కాదో మనకెలా తెలుస్తుంది?

ఈ ప్రశ్న చాలా ప్రాముఖ్యమైనది. దీన్ని ఆలోచించకముందు మరో విషయాన్ని పరిశీలించాలి. అసలు ప్రజలు ఏదో విషయాన్ని నమ్మడమనేది ఎందుకు జరుగుతున్నది? దీనికి వీరు చూపే కారణాలు సరియైనవా? సహేతుకమైనవా? తెలివైనవా? దీన్ని కొంచెం విచారించి చూద్దాం.

అనేకులు తమ చుట్టూరా ఉన్న ప్రజలు నమ్మినదే నమ్ముతారు. ఇంతకంటే వేరే కారణం వారికి తోచదు. వేరే ఆలోచనేమీ లేకుండా పదిమంది నడిచే త్రోవనే వీరూ నడుస్తారు. గుంపు ఎటు వెళితే వీరూ అటే వెళతారు. మా శాఖ, మా మతం, మా పక్షం, మా కులం అంటూ దురభిమానంతో గుడ్డిగా వాటినే అనుసరిస్తారు. అవి ఏమి చెపితే అదే నమ్ముతారు. అవి ఏది నిజమంటే అదే నిజమంటారు.

తమ గుంపు అభిప్రాయాన్నే తమదిగా భావించడం తెలివైన పని కాదు. సత్యాన్ని వెదకేవాడు ఈ విధంగా చేయదగదు. గుంపు అభిప్రాయం నిజం కాకపోవచ్చు. ఒక గుంపుకు దేవుడు లేడనే అభిప్రాయం ఉంది. మరో గుంపు దేవుడున్నాడని ఖచ్చితంగా ప్రకటించవచ్చు. ఒక గుంపు క్రీస్తును దీక్షతో అనుసరించే ప్రయత్నం చేస్తే, మరో గుంపు క్రీస్తును నిరాకరించి, ఆయన శిష్యులను హింసించవచ్చు. మనం నమ్మేదానికి విరుద్ధంగా మరో గుంపు నమ్ముతుంది. ఇంతకూ సత్యాన్ని తేల్చేది ఎలాగా?

మనకు కావలసినది సత్యం. అందుచేత ఇతరుల అభిప్రాయాలను ఆలోచించకుండా అంగీకరించలేము. మతాన్ని గురించి అధిక సంఖ్యాకులు తరుచుగా తప్పు నిర్ణయానికి వస్తారు. నీవు ఎరిగిన వ్యక్తులందరూ దేవుణ్ణి గురించి

తప్పుగా అభిప్రాయపడుతున్నారేమో. దేవుని దగ్గరికి మార్గమేదో వారిలో ఏ ఒకరికి సరిగ్గా తెలియదేమో. దీన్ని గుర్తు పట్టడమెలాగా?

అనేకులు సంప్రదాయాన్ని అనుసరిస్తారు. పురాతన పద్ధతులే మాకు బాగున్నాయంటారు. ఆచారాలను మార్చుకోవడానికి ఇష్టపడరు. పూర్వీకులు నమ్మినదే మేమూ నమ్ముతాం అంటారు. ఇదే కారణాన్నిబట్టి అనేకులు బౌద్ధులు, ముస్లిములుగా, హిందువులుగా, క్రైస్తవులుగా ఈ రోజున ఉండడం తటస్థించింది. వీరి నమ్మకాలూ, ఆచారాలూ వీరు పుట్టిన కుటుంబాన్ని బట్టి ఏర్పడినవి. తల్లిదండ్రులు అలాంటి ఆచార వ్యవహారాలు అవలంబిస్తారు. కనుక పిల్లలు కూడా అవే నమ్ముతారు. అవే చేస్తారు. తరతరాలుగా ఈ నమ్మకాలూ ఆచారాలూ ఎడతెగకుండా వస్తూ ఉన్నాయి. వీటిలో కొన్ని బహు ప్రాచీనమైనవి.

సత్యాన్ని పట్టుదలగా వెదకేవారికి ఇది గిట్టుతుందా? సంప్రదాయంగా వచ్చిన ఈ నమ్మకాలు తప్పై ఉండవచ్చు. ఈ ఆచారాలు నిరుపయోగాలూ, శూన్యాలూ అయి ఉండవచ్చు. ఇవి మంచివని మనకు నిశ్చయం ఏమిటి? వీటిని మొట్టమొదటగా ఏర్పరచినవారు తప్పు చేసి ఉండవచ్చు. వీటిని పారంపర్యంగా తరతరాలుగా మనుషులు అనుసరిస్తూ పోతూ ఉన్నారు. ఈ విధంగా తప్పులు స్థిరపడిపోయాయి. పురాతనమైనంత మాత్రాన వీటిని గుడ్డిగా నమ్మి, అవలంబించవచ్చా? మనఃపూర్వకంగా మనం విశ్వసించేదానికి భిన్నంగా ఇతరులు నమ్ముతారనేది మనకు తెలియదా? దీనికి కారణం పురాతన సంప్రదాయమే. ఏది నిజమో మనం ఎలా నిశ్చయించుకోగలం?

మహా కవి కాళిదాసు ప్రాచీన విలువలను గురించి చెప్పినది కావ్యానికే కాదు, మత విషయాలకు కూడా వర్తిస్తుంది. అదేమిటంటే, “పాతదైనంత మాత్రాన అంతా మంచిది కాబోదు.” సత్యానికి గీటురాయి దానికున్న వయస్సు కాదు. అసత్యాలు కూడా అంత కాలం బ్రతుకుతూనే ఉన్నాయి. వీటిలో ఏది సత్యం, ఏది అసత్యం అనేది ఎలా నిర్ణయించడం?

బోధకుడు గానీ, గురువు గానీ చెప్పినదే నమ్మేవారు అనేకులు. వారు ఈ విధంగా వాదిస్తూ ఉంటారు – “ఈయన నా గురువు, నా ఉపదేశకుడు, నా ఆచార్యుడు. సత్యం అనేది ఈయనకు కాకపోతే మరెవరికి తెలుస్తుందీ అంట! ఆయన వృత్తే ఇది. ఆయన జ్ఞానంలోనే సత్యం ఉండి తీరుతుంది.”

ఈ వాదం చాలా బావుందనిపించవచ్చు. కాని, అసలు ఇది అవివేకంగా ఉంది. అబద్ధ బోధకులను గురించి యేసుప్రభువు హెచ్చిరించాడని ఇంతకుముందే నేర్చుకున్నాం. ఆయన హెచ్చరికలు వట్టివి కావు. యేసుప్రభువు ఉపదేశాలు

వింటే, ఏ గురువునైనా ఉపదేశకుణ్ణయినా నమ్మేయడం ప్రమాదకరమైన అవివేకం అనిపించుకుంటుందని మీకే తోచి తీరుతుంది. ఆలోచించకుండా ఎవరో గురువును అనుసరిస్తే విషతుల్యమైన అసత్యంలో దిగబడిపోవచ్చు. ఎవడైనా సరే, నేను గొప్ప గురువును, మహోపాధ్యాయుణ్ణి అని చెప్పుకోవచ్చు. అలాంటి వారికి అసలైన, సిసలైన సత్యమేదో తెలిసి ఉండకపోవచ్చు కూడా.

పేరు మోసిన బోధకుడు, వేదాంతి, మత స్థాపకుడు, ఎవడైన బయలు దేరవచ్చు. నేను గొప్ప ప్రవక్తనంటూ చెప్పుకు తిరగవచ్చు. నేను జగద్రక్షకుణ్ణి. దేవుని అవతారాన్నని కూడా చెప్పుకోవచ్చు. అలాంటి మనిషిని గురించి ఒక ప్రశ్న అడగాలి. అతడి ఉపదేశాన్ని నమ్మగల ఆస్పదమేమిటి? యేసు క్రీస్తులాగా వీరూ అలాంటి రుజువులను చూపగలరా?

గురువు అనిపించుకున్నంత మాత్రాన అతడు సత్యాన్ని నేర్పిస్తున్నాడనే నమ్మకమేమిటి? ఆచార్యుడని అందరూ పిలిచినంత మాత్రంచేత అతడు సత్యాన్ని ఎరిగినవాడని నమ్మగలమా? అతనికున్న బిరుదులన్నిటితో పాటు అతడు అసత్యాన్ని ఉపదేశిస్తున్నాడేమో? అది అసత్యమే గనుక అయితే అందర్నీ నరకానికి దారి తీస్తున్నాడన్న మాటే గాని పరలోకానికి కాదు. ఏది నిజమో ఎలా తేలడం? మరొకటి గురువు మన సద్గురువు ఉపదేశానికి కేవలం వ్యతిరేకంగా నేర్పవచ్చు. ఇంతకూ ఎవరిది నిజం? ఎవరిది అబద్ధం? తెలుసుకోవడమెలాగా?

కొందరు తమకు నచ్చినదే నమ్ముతారు. ఇది తమకు ఎందుకు నచ్చినదో వారికే సరిగ్గా తెలియదు. ఏదో నచ్చినది – అంతే. మతాన్ని గురించి ఉపన్యాసమేదైనా వింటారనుకోండి. లేదా ఏదైనా పుస్తకం చదువుతారనుకోండి. “నాకిది బాగుంది”, “అది నాకేమీ బాగా లేదు” అనిపిస్తుంది. నాకిది బాగా ఉన్నట్టు తోచింది గనుక, ఇది నిజమై ఉండాలి అనుకుంటారు కొందరు. నాకిది తృప్తి కలిగించింది, కాబట్టి ఇదే సత్యమై ఉండాలి అని భ్రమించేవారు మరికొందరు. తమకు నచ్చినది, సరిపడినది అని అనుకున్నదానిని మాత్రమే ఇలాంటి వారు నమ్ముతారు. వీరి ప్రమాణం ఇదే. ఏవో కొన్ని మత విషయమైన అభిప్రాయాలను విని ఆదరణ పొందే రకం ఇది. ఒకసారి చేపట్టినదాన్ని విడవడానికి ఒప్పుకోరు. వాటి యథార్థతను రుజువు చేయలేని పక్షంలో కూడా వాటిని ఏమాత్రం విడిచిపెట్టరు.

ఏదైనా నమ్మాలంటే ఇలాంటి విధానం మంచిది కాదని సులభంగా గ్రహించగలం. అబద్ధం కూడా తృప్తి కలిగిస్తుంది. దాని ద్వారా ఒకానొకడు తృప్తి కూడా పొందగలడు. అబద్ధం వినడానికి ఇంపుగా ఉండవచ్చు. అబద్ధాన్ని నిజమని నమ్మితే, అది నచ్చక పోతుందా? నేరస్థుడు చెరసాలనుంచి తప్పించుకుని

పోయాడనుకోండి. నన్నేవరూ పట్టుకోలేరులే అనే నిశ్చయంతో, సంతోషంగా తిరగవచ్చు. పోలీసులు తనను పట్టుకోబోయే ప్రయత్నంలో వున్నప్పుడు కూడా అలాగే తలపోయగలడు కూడా. రోగి రేపు చస్తాడనగా ఇవ్వేళ నేను బాగున్నాను, నాకు ఆరోగ్యంగా ఉంది అనుకోవచ్చు. అబద్ధ మత భావనలు ఇలాంటి తృప్తినే ఇస్తాయి. బ్రతికి ఉండగా తాత్కాలికంగా ఓదార్పును ఇవ్వగల తలంపులే గాని ఇవి తప్పక చావుకే నడిపిస్తాయి.

నగ్న సత్యంకంటే నగిషీ చెక్కిన అబద్ధం ఆకర్షణీయంగా గోచరించవచ్చు. భ్రమ అనేది మధురమైతే సత్యం గిట్టనిదే అవుతుంది. భ్రమలోనే ఆదరణ కలిగినట్టనిపిస్తుంది కూడా. సత్యం కోసం తహతహ చెందే వ్యక్తి అడగవలసిన ప్రశ్న ఇది – "నా అసలు కోరిక ఏమిటి? నాకు కావలసినది నన్ను తృప్తిపరచే ఉపదేశం మాత్రమేనా? లేకపోతే నాకు సత్యమే కావాలా?" అది ఎలాగైనా ఉండనియ్యి. నిజమే గదా నాక్కావలసిందని మనం చెప్పుకోవాలి.

కొందరు అంటారు గదా – విజ్ఞాన శాస్త్రం, భౌతిక సూత్రాలు రుజువు చేసినది మాత్రమే మాకు నమ్మదగినవి. భౌతిక విజ్ఞానం రుజువు చేసినదే నమ్మాలని శాస్త్రీయంగా రుజువయిందా? అలా రుజువు కాలేదు. దేవుణ్ణి గురించి భౌతిక విజ్ఞానం ఏమీ నిరూపించలేదు. ఇంకా అనేక ప్రాముఖ్య విషయాలను భౌతిక జ్ఞానం రుజువు చేయలేదు. దానికి అంత శక్తి లేదు. దేవుణ్ణి గురించీ ఆత్మ సంబంధమైన అనుభవాన్ని గురించీ భౌతిక విజ్ఞానం నిదర్శనం చేయగలదు అనుకోవడం అవివేకమూ పొరపాటూ. భౌతిక విజ్ఞానానికి మించిన నిదర్శనం మరొకటి లేదు అనుకోవడం కూడా గొప్ప పొరపాటే. భౌతిక విజ్ఞాన ప్రయోగశాలలో నిరూపించబడితేనే గాని నమ్మలేమనుకోవడం శుద్ధ తప్పు. విజ్ఞాన శాస్త్రీయ మితికి మీరిన ప్రాముఖ్యమైన సత్యాలు ఎన్నో ఉన్నాయి.

కొందరంటారు – "అంతర్వాణి మమ్ములను సత్యానికి నడిపిస్తుంది. నా వివేచనా జ్ఞానానికి వ్యతిరేకమైనది సత్యం కాదు" అని వీరి వాదం. ఈ వాదం బాగానే ధ్వనిస్తుంది. ఏది మంచిది, ఏది చెడు అని వివేచించే శక్తి ఎంతైనా కోరదగింది.

మనుషులందరికీ దేవుడు అంతర్వాణిని ఇచ్చాడు. మనం జంతువులం కాము. మనకు నైతిక జ్ఞానం ఉంది. పశువులకది లేదు. కానీ అంతర్వాణి కూడా లోపం లేనిదేమి కాదు అని తెలుసుకోవాలి. అంతర్వాణి కూడా లోపం గలది. అంతర్వాణి మనలో ఉన్న న్యాయమూర్తి లాంటిది. ఒక విషయాన్ని గురించిన వివరాలను

విన్నతరువాత తీర్పు చెపుతుంది. అయితే అంతర్వాణి అన్ని రుజువులనూ సేకరించదు. మంచి రుజువులను కూడా అంతర్వాణి అపార్థం చేసుకోవచ్చు. న్యాయాన్ని చెప్పనీయకుండా న్యాయమూర్తిని కుత్తుక నొక్కివేసినట్టు అంతర్వాణి కూడా గొంతు పిసికి చంపే ప్రమాదం లేకపోలేదు.

యేసుప్రభువు శిష్యులకు ఇలా హెచ్చరిక చేశాడు: "మిమ్ములను ఎవరైనా చంపితే తాను దేవునికి సేవ చేస్తున్నట్టు అనుకొనే కాలం కూడా వస్తూ ఉంది"[1]

కొందరు ఇలా అంటారు – "విగ్రహాలను పూజించడంలో తప్పేమీ లేదు. దాని ద్వారా మా అంతర్వాణికి అభ్యంతరమేమీ కలుగదు." మరి కొందరికి విగ్రహ పూజ ద్వారా అంతర్వాణికి నొప్పి కలుగుతుంది. రభస రేగుతుంది. క్రీస్తు శకం ప్రారంభ దినాలలో రోమ్ ప్రజలు "జూపిటర్" అనే దేవుణ్ణి పూజించారు. జూపిటర్ దేవుని గురించిన గాథలలోకి వెళితే అతడు అవినీతిపరుడు, వ్యభిచారి. ఈ దేవుణ్ణి పూజించేవారి అంతర్వాణిలో ఎలాంటి అభ్యంతరమూ కలగలేదు. అలాంటి దుర్మార్గుడు దేవుడు ఎలా అవుతాడు? అనే ప్రశ్న కూడా వారికి తోచలేదు. క్రైస్తవులు ఈ దేవుణ్ణి ఆరాధించము అని చెప్పేసరికి రోమ్ ప్రజలు దీన్ని అభ్యంతరంగా ఎంచారు. పైగా, కొందరు రోమ్‌వారు ఇలాంటి క్రైస్తవులను చంపినా తప్పు కాదు అనుకున్నారట. వీళ్ళు జూపిటర్ను పూజించరు, పోనీ, మరో దేవతనైనా పూజించరు, గనుక వీరిని చంపడం దైవసేవలా వాళ్ళకు అనిపించింది.

ఏది మంచి ఏది చెడు అనేదాన్ని గురించి ప్రజలు తారుమారు చేస్తూనే ఉంటారు. అంటే చెడును మంచి అనుకుని చెడునే జరిగించేవారున్నారు. మంచి చెడుగు అని నమ్మి మంచిని విసర్జించేవారూ ఉన్నారు.

అంతర్వాణి పొరపాటు పడనిదేమీ కాదు. దేవుణ్ణి గురించి, రక్షణను గురించి మనకు కావలసినదల్లా అంతర్వాణి నేర్పించదు. ఏది లోపమో ఏది సక్రమమో తెలుసుకోవడానికి అంతర్వాణికి మించిన మరో విధానం అవసరం.

## మానవుడి బుద్ధి

"నిజమేనండీ, మనకు ఇవేవీ సరిపోవు. ఇతరుల అభిప్రాయాలు చాలవు. సంప్రదాయాలూ, గురూపదేశాలూ, ఇంపైన ఉపదేశాలూ, పదార్థ విజ్ఞానమూ, అంతర్వాణీ ఇవేవీ చాలవు. మనకు సహేతుకమైన ఆధారం కావాలి. మంచి హేతువు లేని దేనినీ నమ్మను. నాకు బుద్ధి ఉంది. దానినే అనుసరిస్తాను. వివేకానికి విరుద్ధమైన దేనినీ నమ్మను" అంటున్నారు కొందరు.

ఇది కూడా వినడానికి బాగానే వుంటుంది. కానీ అసలు ఇందులో ఎంత నిజం

ఉంది? సహేతుకమైనది సత్యమని నిశ్చయత ఏమిటి? మానవుడు తన స్వబుద్ధిని ఆధారం చేసుకుని దేవుణ్ణి గురించి తెలుసుకోగలడా? దేవుని దగ్గరికి మార్గమేదో గ్రహించగలడా? మనిషి నిజ స్వరూపం అర్థం చేసుకోగలడా?

వివేచించే మనస్సు శ్రేష్ఠమైనదే. మానసికంగా గ్రహించుకోగల శక్తి మంచిదే. మనిషికి దేవుడిచ్చిన ఉత్తమమైన వరాల్లో ఇది ఒకటి. అయినా మానవుడి మనస్సూ, జ్ఞానమూ, సహేతుకమూ హద్దులేనివి కావు. మానవుడికి ఉన్నదంతా పరిమితులకులోనైనది. మన హేతుబుద్ధికి మించిన విషయాలు ఎన్నో ఉన్నాయి.

దేవుడు ప్రవక్తలద్వారా ఈ విధంగా ఉపదేశించాడు: “యెహోవా (దేవుడు) చెప్పేదేమిటంటే, నా తలంపులు మీ తలంపులలాంటివి కావు. మీ విధానాలు నా విధానాల లాంటివి కావు. ఆకాశాలు భూమికంటే ఎత్తుగా ఉన్నాయి. అలాగే నా విధానాలు మీ విధానాలకంటే, నా తలంపులు మీ తలంపులకంటే ఉన్నతంగా వున్నాయి.”[2]

దేవుని విషయాలు మానవుడు అందుకోలేడు. అనేక సంగతులు హేతుబుద్ధికి అనుగుణంగా ఉన్నవో లేవో అని తెలుసుకోవడం చాలా కష్టతరం.

మానవుడి చరిత్రను ఒకసారి గమనించండి. ఇందులో ఒక సత్యం కొట్టొచ్చినట్టు కానవస్తుంది. ఆధ్యాత్మిక విషయాలు నిశ్చయంగా గ్రహించగలగాలంటే హేతుబుద్ధి ఒక్కటే చాలదు. అంతర్వాణీ లాగే బుద్ధి కూడా కొంతవరకే సహాయపడవచ్చు. మనం బుద్ధి ద్వారా కొంత నేర్చుకోగలం – అంతే గాని సమస్తమూ నేర్చుకోలేము. మనమందరమూ పతనమైన వాళ్ళం, పాపులం. మన మనస్సు అవివేకమైన తప్పులు బోలెడన్ని చేయగలదు. మనకు ఎక్కువ తెలివి ఉందనడానికి రుజువు మనలో కనబడే వినయ భావమే.

శతాబ్దాల తరబడి భారత దేశంలో మహా బుద్ధిమంతులూ, మేధావులు, విద్వాంసులూ ఉంటూ వచ్చారు. తత్వవేత్తలు మెట్టినగడ్డ ఇది. వేదాంతులు జీవించిన భూమి ఇది. లోకంలో ఇతర జ్ఞానవంతులకు వీరే విధంగానూ తీసిపోరు. వీరు దేవుణ్ణి గురించిన గంభీరమైన సమస్యలను పరిశోధించారు. దీర్ఘంగా ఆలోచించారు. దేవునికీ మానవునికీ మధ్యగల సంబంధాన్ని గురించి ఎంతో ధ్యానించారు.

దీనికి ఫలితమేమిటి? ఉన్నది ఉన్నట్టు చెప్పుకోవడం మంచిది. వారి ఆలోచనలూ, సిద్ధాంతాలూ పరస్పర విరుద్ధమైనవి. ఒక సూత్రానికి మరో దానికి పొత్తు కుదరడం లేదు. అంతా అయోమయమై అగోచరమైనట్టు అనిపిస్తుంది. ఒకడికి వివేకం అనిపించినది మరొకడికి అవివేకంగా ధ్వనిస్తుంది. పశ్చిమ

వేదాంతంలో కూడా ఇదే గలిబిలి ఉంది. మానవులు హేతు వాదాలలో మునిగినప్పటినుంచి ఇలాగే జరుగుతున్నది.

భారతీయ వేదాంత విధానాలూ, తత్వ వాదాలూ పలురకాలు. వీటిద్వారా మానవుడి మనస్సూ, హేతుబుద్ధీ ఎలా పొరపాటులకూ పరిమితులకూ లోనైనవో గ్రహించగలం. ఈ విషయాన్ని తెలుసుకోవడానికి వేదాంతాన్నంతా నేర్చుకోవలసిన అవసరమేదీ లేదు. వేదాంతులు, తత్వవేత్తలు దేవుణ్ణి గురించి చెప్పేదేమిటో ఇప్పుడు చాలా క్లుప్తంగా పరిశీలిద్దాం. అలాగే లోకం, మానవుడు, విముక్తి అనే అంశాలపై వారి ఆలోచనలు ఏవో మనం చూడబోతున్నాం.

**దేవుణ్ణి గురించి**

1. లోకం ఉనికిని వివరించడానికి దేవుణ్ణి గురించిన సిద్ధాంతం బొత్తిగా అనవసరం (పూర్వ మీమాంస ప్రకారం).

2. దేవుడనేవాడు ఉన్నాడు. కానీ దేవుడు మితులకు లోనైనవాడు. దేవుడే సంపూర్ణంగా సృష్టి కార్యాన్ని చేయలేదు (యోగ సూత్రాల ప్రకారం).

3. దేవుడనేవాడు లేడు (సాంఖ్యా విధానం ప్రకారం.)

4. పరమాత్మ లేక పరబ్రహ్మం అనేది ఉన్నది. ఇది అగోచరమైనది. దీనికి వ్యక్తిత్వమూ, గుణాలూ లేవు "నిర్గుణ బ్రహ్మం" అని దీని పేరు. వ్యక్తిగతంగా కనబడేది బ్రహ్మం యొక్క ఛాయ మాత్రమే. పరబ్రహ్మం కేవలం "చైతన్య స్ఫూర్తి" మాత్రమే (శంకరాచార్యుడి అద్వైత వేదాంతం).

5. శంకరాచార్యుడు ఆలోచించిన "చైతన్య స్ఫూర్తి" అనేది శూన్యమే. గుణాలు లేని "చైతన్య స్ఫూర్తి" ఉండడం అసాధ్యం. పరమాత్మ వ్యక్తిగత స్వరూపమే. విష్ణువే ఆ భగవద్స్వరూపం. విష్ణువే ఆరాధ్యుడు. ఆయనలోని అంశయే, స్వరూపమే ఈ లోకమంతా. దేవుని అవతారాలు ఎన్నో ఉన్నాయి. శివుడు తక్కువ ప్రభావం గల దేవుడు (రామానుజుడి విశిష్టాద్వైత వేదాంతం).

6. దేవుడు వ్యక్తిత్వం లేనివాడు కాడు. ఆయనలో గుణాలున్నాయి. గుణాలు లేని పదార్థమంటూ ఉండదు. గానీ ప్రపంచం దేవుని స్వరూపం కాదు (మధ్వాచారుడి ద్వైత వేదాంతం).

7. శివుడే సర్వేశ్వరుడు. విష్ణువు తక్కువ స్థాయికి చెందినవాడు (శైవ సిద్ధాంతం ప్రకారం).

8. అవతారాన్ని గురించిన భావన ఉపనిషత్తులలో లేదు. వేదాలు అవతార సిద్ధాంతాన్ని నిరాకరించి ఉంటుంది (కె. యం. సేన్ అనే మహాశయుడు రాశాడు).

**లోకాన్ని గురించి**

1. లోకం వాస్తవమైనది (చార్వాక సిద్ధాంత ప్రకారం).

2. లోకం దృశ్యమానమైనది. అంతే గాని ఇది భ్రమ. లోకం అవాస్తవమైనది (గౌడపాదుడు).

3. లోకం వాస్తవమైనది. శాశ్వతుడైన దేవుడు శాశ్వతమైన అణువులతో సంకల్పించి, కల్పించినదే ఈ ప్రపంచం (వైశేషిక, న్యాయ సూత్రాల ప్రకారం).

4. లోకం వాస్తవమూ కాదు, అవాస్తవమూ కాదు. మధ్య కూడా కాదు. ఇదంతా మయా జన్మం. ఇది అవిద్య ప్రభావం. ఇది కలలాగా ఉంది. వర్ణించశక్యం కానిది (శంకరాచార్యుడి అద్వైతం).

**మన ఆత్మలకూ పరమాత్మకూ గల సంబంధాన్ని గురించి**

1. ఆత్మ అనేది లేదు. దేవుడు అనేవాడు లేడు. అందుచేత వీటి మధ్య సంబంధమనేది లేనే లేదు (చార్వాక).

2. వ్యక్తిగతంగా ఆత్మలున్నాయి. కానీ దేవుడు లేడు (పూర్వ మీమాంస, సాంఖ్య).

3. దేవుడు ఉన్నాడు. ఆత్మలు కూడా ఉన్నాయి. కాని, ఆత్మలకు చైతన్యమూ, స్మృతి, జాగృతీ లేవు. అణువులలాగే వాటికి లెక్క లేదు.

4. మానవుల ఆత్మలు, పరమాత్మ ఈ రెండు ఒకటే. పరమాత్మ, జీవాత్మ, బ్రహ్మం, ఆత్మ – ఇవి భిన్నం కానివి. మన ఆత్మలు పరమాత్మ వేరువేరుగా ఉన్నవి అనుకోవడం మాయ, అవిద్య (అద్వైతం).

5. మనుషుల ఆత్మలు దేవునికంటే భిన్నమైనవి. మన ఆత్మలు, పరమాత్మ ఈ రెండు ఒకటే అనుకోవడం అవిద్య (మధ్వాచార్యుడి ద్వైతం).

6. మానవాత్మ, దేవత్మ – ఈ రెండు పూర్తిగా ఒకటి కావు. మరో విధంగా ఇవి భిన్న భిన్నంగా కూడా ఉండవు (విశిష్టాద్వైతం).

**విముక్తి, మోక్షాన్ని గురించి**

1. మానవుడు విముక్తి పొందవలసనదేమీ లేదు (చార్వాక).

2. కర్మాచరణాల ద్వారా మోక్షం లభించదు. కర్మ అనేది మంచిదైనా, కాకపోయినా, శ్రద్ధ ఉన్నా, లేకపోయినా, దాని ద్వారా బంధవిముక్తి కలగదు (సాంఖ్య).

3. మోక్షప్రాప్తికోసం శరీరమూ, ఇంద్రియాలూ, మనస్సూ వీటిని పూర్తిగా

లోబరచుకోవాలి. ఇంద్రియ నిగ్రహం మోక్ష సాధనం (యోగ సూత్రాలు).

4. మోక్షప్రాప్తిలో ఆత్మకు చైతన్యం ఉండదు. కర్మ ముక్తి గలుగుతుంది. అది ఏమీ తెలియని స్థితి, చేయని స్థితి, అనుభవమేమీ లేని స్థితి. బంధకాలు పోవాలంటే అన్ని విధాలైన కర్మలూ విసర్జించాలి (వైశేశిక).

5. ధర్మ ద్వారానే ముక్తి దొరుకుతుంది. ధర్మం – ఇదే వేదాల సారాంశం. కొన్ని క్రియలను చేయాలనీ, మరి కొన్నిటిని విసర్జించాలనీ వేదాలే ప్రబోధిస్తాయి (పూర్వమీమాంస).

6. ముక్తి అనేది జ్ఞానం ద్వారానే సాధ్యం. జ్ఞానంకంటే ప్రతిదీ తక్కువే. వేదాలలోని ధర్మకర్మాలు కూడా చేయవచ్చు. లేదా, వాటిని తప్పుగా చేయవచ్చు. లేదా, వాటిని బొత్తిగా చేయకుండా విడిచివేయవచ్చు. వెలుగు చీకటికి ఉన్నట్టే జ్ఞానానికి కర్మాచరణకూ మధ్య వైరం ఉంది (శంకరాచార్యుడు).

7. ముక్తి అనేది భక్తి ద్వారానే సాధ్యం. భక్తి ద్వారా మాత్రమే దేవుడు సులభుడు అవుతాడు. మిగతాది దీని తరువాతది మాత్రమే. కర్మాచరణ భక్తికి సాధనం (మధ్వాచార్యుడు).

8. ముక్తి నానా విధాలుగా సాధ్యమవుతుంది. క్రియాచరణ, జ్ఞానం, భక్తి ఇవన్నీ ముక్తికి మార్గాలే (భగవద్గీతలోనూ తదితర గ్రంథాలలోనూ చేర్చబడినది).

9. గౌడపాదుడు ఇలా చెప్పాడు – "అసలైన సత్యమిదే. నాశనమనేది లేదు. సృష్టి లేదు. బంధకాలు కూడా లేవు. విముక్తికోసం ఆశించేవారు కూడా లేరు."

### కొన్ని ప్రశ్నలు

ఇదంతా జాగ్రత్తగా చదివిన తరువాత సత్యాన్ని వెదకే ప్రతి వ్యక్తికి కొన్ని ప్రశ్నలు ఎదురౌతాయి. సహేతుకంవల్ల, మానవ బుద్ధిజ్ఞానాలవల్ల ఇదేనా ప్రయోజనం? ఇంతకూ అసలైన సత్యమేది? దేవుడనేవాడున్నాడా? లేడా? ఒకవేళ ఉంటే దేవుడు సాకారుడా? నిరాకారుడా? సాకారుడయితే వ్యక్తిత్వం గలవాడా? వ్యక్తిత్వం లేనివాడా? ఆయన వ్యక్తి అయితే ఆయనకు అవతారాలుంటాయా? లేవా? మానవుని ఆత్మ, దేవుని ఆత్మ ఒకటేనా, కాదా? మోక్షాన్ని సంపాదించుకోవడానికి అవసరమైనది క్రియాచరణ మాత్రమేనా? జ్ఞానం మాత్రమేనా? భక్తి మాత్రమేనా? ఈ మూడు ఉండాలా? ఈ మూడు అనవసరమా? వీటన్నిటిని గురించి ఆలోచించడంవల్ల ఏమి ప్రయోజనం? వీటిని గురించిన వాస్తవం బోధపడుతుందా?

ఈ వేదాంత సిద్ధాంతాలన్నీ వాస్తవంగా సత్యాలే అనడానికి వీలు కాదు అలా

అనడం వ్యర్థమైన వాదమే. ఈ వాదాలన్నీ పరస్పర విరుద్ధమైనవి. ఒక విషయం నిజమైతే, దానికి కేవలం వ్యతిరేకమైన వాదం నిజం కాదని చెప్పడానికి అసాధారణ జ్ఞానమేమీ అక్కరలేదు. దేవుడున్నాడు అంటాం, ఇది నిజం. అలాంటప్పుడు దీనికి వ్యతిరేకమైన వాదం "దేవుడు లేడు." ఇది నిజం కావడం అసాధ్యమే గదా? పైన ఉదాహరించిన వాదాలన్నిటికీ ఈ నియమం సరిపడుతుంది. మానవుడి ఆత్మ దేవాత్మతో సమానమని ఒకడు అన్నాడు. కాదు అని మరొకడి వాదం. ఈ విధంగానే మిగతావన్నీ. ఈ రెండింటికి మధ్యస్థంగా దేవుడు ఒకవేళ ఉంటే ఉండవచ్చు అనేది సత్యం కావచ్చు అనుకోవడం సత్యానికి ఎంతో దూరం అయితే వీటన్నిటిలో అసలు నిజం ఎందులో ఉంది? అది మనకు ఎలా తెలుస్తుంది?

మనుషులకు ఊహాగానాలు చేయడం అంటే చాలా ఇష్టం. లోకంలో వేదాంతమంతా అనిశ్చయమైనది. సంశయమైనది. వేదాంత లక్ష్యమే ఇలా ఉండిపోయింది. ఎంతో గొప్ప మేధావులు కూడా ఒకరు చెప్పినదాన్ని మరొకరు వ్యతిరేకిస్తూనే ఉన్నారు. ఇంతకూ వీరందరికీ అసలు సంగతి తెలియదు. వాస్తవమనేది వీరందరి బుద్ధికి మించినది.

సాధారణ మానవుడు వీటిలో దేనిని విశ్వసించాలి? అతడు దేనినైనా ఎందుకని నమ్మాలి? తాను నమ్ముదామనుకున్న ప్రతి విషయమూ తనకంటే తెలివిగల మరొకడు అబద్ధమని సూచిస్తాడు. మరి ఎలాగా?

బహు కాలం క్రిందట ఆది శంకరుడు బౌద్ధ మతాన్ని గురించి చాలా ఘాటుగా విమర్శించాడు. ఆ మతాన్ని లోతుగా ఆలోచించినకొద్దీ ఇసుకలో త్రవ్విన బావిలానే కూలిపోతుంది; దీనిలో గట్టి పునాది లేదు; అందులో సత్యం లేశమంతకూడా లేదు అన్నాడు. గౌతమ బుద్ధుడు పరస్పర వ్యతిరేకమైన మూడు మార్గాలు ఉపదేశించాడు అన్నాడు శంకరుడు (ఈ మూడు మార్గాలు బాహ్యార్థ వాదం, విజ్ఞానవాదం, శూన్యవాదం). బుద్ధుడు పరస్పర విరుద్ధమైన విధానాలను అంగీకరించాడనేది నిస్సందేహమైన సంగతి, లేదా, బుద్ధుడు కావాలని మానవ జాతిని ద్వేషించి వారిని తప్పుడు త్రోవ పట్టించాడని అర్థమిస్తుంది. ప్రజలు ఈ విరుద్ధ భావాలను చేపట్టి దారి తెలియక తికమక పడాలని బుద్ధుడు ఉద్దేశించాడని నమ్మవలసి వస్తుంది అన్నాడు (శారీరిక భాష్యం 2:2,32).

శంకరుడు బౌద్ధాన్ని ఇలా విమర్శించినా, ఆయన దాన్ని గురించి వ్రాసినది మానవుడి వేదాంతాలన్నిటికి సరిపడుతుంది. మానవుడు కల్పించిన వేదాంతాలూ, మతాలూ పరస్పర విరుద్ధాలు. శంకరాచార్యుడు బౌద్ధంలో ఈ విధానాన్ని

గుర్తించాడే కానీ ఇది అన్నిటి విషయంలో నిజమే. ఒకడికి శ్రేష్ఠమైన జ్ఞానంగా అనిపించినది మరొకడికి తెలివిలేని చాదస్తంగా అనిపిస్తుంది.

మానవుడి మనస్సును గురించి పూర్వం ఒకరు ఈ విధంగా చమత్కరించారు: మనిషి మనస్సు అసలే కోతి, పైగా కల్లు త్రాగింది. అదే సమయంలో దాన్ని తేలు కుట్టింది. అందుకే మానవుడి హేతు బుద్ధి స్వేచ్ఛగా చెలరేగుతుంది. తన బాధ నుంచి బయట పడడానికి ఎంతో ఆరాటపడుతుంది. వెర్రి చేష్టలు చేస్తుంది. తీవ్రంగా ఊహాగానం చేస్తుంది. ఎంత తెలివిగలదైనా అది అజ్ఞానమే. నేను ఇంతకు ముందు చెప్పినదే మళ్ళీ చెప్తున్నాను. మనసు అనేది మనిషికి దేవుడిచ్చిన గొప్ప వరాల్లో ఒకటి. అయితే ఈ మనసును దేవుడని భావించి, దీన్ని పూజించబూనడం కేవలం అవివేకం. మనసును మనమేమీ అసహ్యించుకోనక్కర్లేదు. కానీ దానికి పరిమితి, హద్దులున్నాయని మనం గుర్తించాలి. హేతుబుద్ధి తనంతట తానే సర్వ సత్యంలోనికి ప్రవేశించదు. దేవుడు ఎలా ఉంటాడు? దేవుని దగ్గరకి దారి ఏది? అనే ప్రాముఖ్య ప్రశ్నలకు నిశ్చయమైన జవాబులివ్వలేదు మానవ బుద్ధి. దీనికి మించిన ఆధారం కావాలి.

మరి కొందరంటారు గదా – మనం జ్ఞానోదయం పొందిన హేతుబుద్ధి మీద ఆధారపడవచ్చు. అయితే ఎవరి హేతువు, ఎవరి బుద్ధి జ్ఞానోదయం చేత వెలిగించబడినవి? ఒకరి "జ్ఞానోదయ" బుద్ధి మరొకరి "జ్ఞానోదయ" బుద్ధికి భిన్నంగా బోధించవచ్చు. అసలు సంగతేమిటంటే, సత్య సందర్శనానికి హేతుబుద్ధిని ఆధారం చేస్తున్నవాడు తనమీద తానే ఆధారపడుతున్నాడని అర్థం. అతడు ప్రమాదంలో ఉన్నాడన్న మాట. తన స్వంత తలంపులను నమ్ముకుంటున్నాడు. అతడు వినయంతో దేవుని సన్నిధిలో పడితేనే తప్ప సత్యాన్ని గ్రహించలేడు. తాను చేసిన తెలివిలేని ప్రలాపాలకు అతడు పశ్చాత్తాపపడాలి. ఒక సారి యేసుప్రభువు ఇలా చెప్పాడు: "తండ్రీ! భూమ్యాకాశాల ప్రభూ! నీవు ఈ సంగతులు జ్ఞానులకూ తెలివైనవారికీ చూపకుండా దాచిపెట్టి, చిన్నపిల్లలకు వెల్లడి చేశావు. అవును, తండ్రి, అలా చేయడం నీకు ఇష్టమయ్యింది. అందుచేత నిన్ను స్తుతిస్తున్నాను."[3]

## ఆరుగురు గుడ్డివాళ్ళు

పూర్వం ఆరుగురు గుడ్డివాళ్ళు ఏనుగు స్వరూప స్వభావాలను గురించి తీవ్రంగా వాదోపవాదాలు చేశారు. ఈ వాదాన్ని పరిష్కరించుకునేందుకు స్వయంగా జంతు ప్రదర్శన శాలకు వెళ్ళి ఏనుగును తాకి చూడాలనుకున్నారు.

అలాగే చేశారు.

మొదటి అంధుడు ఏనుగును సమీపించి దాని కాలును పట్టుకున్నాడు. "చూడండ్రా . . . ఈ ఏనుగు చెట్టులాగా ఉంది" అన్నాడు. మరొకడు ఏనుగు తోక పట్టుకుని ఇలా అన్నాడు – "చెట్టంటావేమిట్రా! అసంభవం! ఏనుగు తాడులాగా ఉంది." ఇంకొకడు ఏనుగు ప్రక్కను ఆనుకున్నాడు. "తాడంటావేమిట్రా! ఏనుగు గోడలాగా ఉంటేనూ?" నాలుగోవాడు తొండాన్ని పట్టుకున్నాడు. "మీరింత తెలివితక్కువ వాళ్ళైపొయ్యారేమిట్రా! ఏనుగు పెద్ద పాములాగా ఉంది" అన్నాడు. అయిదోవాడు ఏనుగు దంతాన్ని చేజిక్కించుకుని "పామంటావేమిటి? పాము ఇంత గట్టిగా ఉంటుందా? ఇది ఒక గునపంలా ఉంది" అన్నాడు. ఆరోవాడు ఏనుగు చెవుల్లో ఒకదాన్ని పట్టుకుని "మీకందరికీ కళ్ళు లేవు. ఏనుగు పెద్ద ఆకులాగా ఉంది" అంటూ బిగ్గరగా అరచాడు. మళ్ళీ ఆరుగురు మునుపటి కంటే తీవ్రంగా వాదించుకుంటూ వెళ్ళిపోయారని కథ చెప్పుకుంటారు. ఈ ఆరుగురు గుడ్డివాళ్ళలో ప్రతి ఒక్కడికీ తాను చేసిన వర్ణన అర్థం సహేతుకమనిపించింది. ఇతరుల వర్ణన అర్థం లేనిదిగా ధ్వనించింది.

మనుషులు ఆత్మ విషయాలలో గుడ్డివాళ్ళే. సత్యాన్ని చేజిక్కించుకుందామంటే అది సాధ్యం కాకుండా ఏదో భయంకరమైన బలహీనత మానవుణ్ణి వెనక్కు నెట్టివేస్తుంది. మనకు, దేవునికి పాపమనే తెర అడ్డు వస్తుంది. అందుకే మానవుడు నేను సత్యాన్ని వెదకుతున్నానంటాడు. తీరా సత్యం కళ్ళెదుట నిలిచినప్పుడు దాన్ని తిరస్కరిస్తున్నాడు.

"మనకు కావలసినదల్లా మన ఆధ్యాత్మిక నేత్రాలు తెరవబడడమే గదా! గుడ్డివాళ్ళకు కండ్లు వస్తే ఏనుగు స్వరూపాన్ని చూడగలుగుతారు. అప్పుడు ఇక గొడవలేమీ ఉండవు. మనకు ఆత్మ సంబంధమైన అనుభవం కావాలి, మన ఆధ్యాత్మిక నేత్రాలు సత్యాన్ని చూడగలగాలి" అని కొందరంటారు.

ఈ మాటలు చాలావరకు యథార్థమే. మనకు సరైన ఆధ్యాత్మిక అనుభవం కావాలి. నిజమే గాని ఇందులో కూడా చిక్కులు ఉన్నాయి. నా మనోనేత్రాలు తెరచుకున్నాయి అని ఎవడైనా అనుకోవచ్చు. కానీ అందరికంటే ఘోరంగా గుడ్డివాడై ఉండవచ్చు. నాకు జ్ఞానోదయమైంది అని చెప్పినంత మాత్రాన ఎవ్వడూ జ్ఞాని గానీ ఆధ్యాత్మిక వ్యక్తి గానీ కాదు.

అన్ని మతాలలోనూ కొందరికి ఏవేవో ఆధ్యాత్మిక అనుభవాలు కలుగుతూ ఉంటాయి. అయినా ఇలాంటి అనుభవాలు వాటంతటవి దేవుణ్ణి గురించి, ఆత్మను గురించి సత్యమేదో మనకు తెలియజేయవు. ఎందుకంటే ఇలాంటి

అనుభవాలకు ఉత్పత్తి ఏదో, కారణమేదో ఎవరికి తెలుసు? అది మరుగుగా, గూఢంగా ఉంది. మనిషికి కలిగే మత విషయమైన అనుభవాలు వారి వేదాంతంలాగే ఉంటాయి. వారి హేతుబుద్ధిలాగే ఉంటాయి. వీటిలో ఒకదానికొకటి పరస్పర విరుద్ధమైనది.

నా కండ్లు తెరచుకున్నాయి అని ఎవడో ఒకడు అన్నాడనుకోండి. అతడు వచ్చి ప్రబోధం మొదలెడుతాడు – "మనుషులందరి ఆత్మలు, పరమాత్మ ఈ రెండూ ఒకటే" అంటాడు. మరొకడు తన అనుభవం ద్వారా దానికి విరుద్ధమైన విషయాలను గ్రహించానంటాడు. ఒకడు "నాకు జ్ఞానోదయం కలిగింది. నేనే బ్రహ్మమును, నేనే దేవుణ్ణి" అంటాడు. మరొకడి అనుభవం మరో విధంగా ఉంటుంది – నా జ్ఞానోదయం ద్వారా నేనో సృష్టి జీవిని మాత్రమే అని తెలిసింది. దేవునికంటే నేనెంతో తక్కువ వాణ్ణి, ఎంతో క్రింద ఉన్నాను" అంటాడు. "నా కన్నులను సైతం దేవునివైపుకు తిప్పడానికి నాకు ధైర్యం చాలదు" అంటాడు.

మరొకడి అనుభవం ఈ విధంగా ఉండవచ్చు – "నేను స్వభావికంగా మంచివాణ్ణి". మరొకడు "నేను ఘోర పాపిని". "నేను పాపిష్టి వాణ్ణి" అంటాడు. మరొకడు విగ్రహాన్ని పూజిస్తూ, ఆవేశం కలిగించే అనుభవం ఏదో పొందుతాడు. మరొకడికి అవే విగ్రహాలంటే ఏవగింపు కలుగుతుంది. "విగ్రహ పూజ పాపమని నాకు జ్ఞానోదయం కలిగింది" అంటాడు.

అనుభవం మాత్రమే మనకు మార్గదర్శి అయితే, సత్యమంటే ఏదో ఎవరు రుజువు చేయాలి? అసత్యమేదో ఎవరు తీర్చాలి? మత సంబంధమైన అనుభవాలు పరస్పర వ్యతిరేకంగా ఉంటాయి. అంతే కాదు, అవి అపాయకరాలు కూడా, అంటే ఇవి మనుషులను మోసపుచ్చుతాయి.

లోకంలో మోసకాండ మూడు శక్తులద్వారా కొనసాగుతూ ఉన్నది – సైతాను, పాపం, మానవ హృదయం. వీటిలో ప్రతిదాన్ని గురించి బైబిలు తేటగా నేర్పిస్తుంది. ఈ వచనాలను చూడండి:

"సైతాను సర్వలోకాన్ని మోసగిస్తూ ఉండేది."[4] "పాపం ద్వారా కలిగే మోసం."[5] "హృదయం అన్నిటికంటే మోసకరం. దానికి ఘోరమైన రోగం ఉంది. దానిని ఎవరు గ్రహించగలరు?"[6]

సైతాను సర్వ లోకాన్ని మోసపుచ్చగలడు. అలాంటప్పుడు నీవూ నేనూ వాడికి లెక్కకాదు. సైతాను పాపంవల్ల ప్రజలను భ్రమింపజేస్తాడు. మన హృదయాలలో పని చేస్తాడు. మన హృదయాలు కూడా మోసకరమైనవి. మోసకాండకు ఇంకా హద్దు అనేది ఉంటుందా? మత విషయంలో అబద్ధ అనుభవం కలిగించి ఇదే

సత్యమని ప్రజలను మభ్యపెట్టగలడు సైతాను.

మత విషయమైన అనుభవం అనేవి అనుమానమైనది. సైతాను మనకు అనేక రకాల అనుభవాలు కలిగించగలడు. గగుర్పాటు కల్గిస్తాడు కూడా. దర్శనాలు కూడా చూపుతాడు. స్వరాలు వినిపిస్తాడు. అదృశ్య లోకంలోకి కూడా తీసుకుపోగలడు. మనకు జ్ఞానోదయం కలిగినట్టే అనిపిస్తుంది గాని భయంకరంగా భ్రమలో పడిపోతాం; తప్పుడు త్రోవలో బలీయంగా స్థిరపడిపోతాం. ప్రతి ఆధ్యాత్మిక అనుభవంలో తొంగిచూడడం అపాయకరమని మనం గుర్తించాలి.

కొందరు "మాకు దేవునితో ఆధ్యాత్మిక అనుభవం కలిగింది" అని గర్వంగా చెప్పుకుంటారు. వారు మోసపోయి ఉండవచ్చు. మనుషులు మాయ అనుకున్నది వాస్తవం కావచ్చు. వాస్తవం అనుకున్నది మాయ కావచ్చు. ఇందులో ఏది నిజమో వారికి తెలియకుండా పోయింది. ఆత్మ విషయాలలో ఎవడైనా సరే, తన స్వకీయ భావనలమీద, అనుభవాలమీద నమ్మకం పెట్టుకున్నాడంటే, అవే సత్యానికి ఆధారంగా ఏర్పరచుకున్నాడంటే, అది కేవలం దురహంకారమూ, అవివేకమూ అని చెప్పవచ్చు. అది అపాయకరమైనది కూడా. మనకు దీనికి మించిన ఆధారం కావాలి.

## ఉన్నతమైన నియమం

ఉత్తమమైన ఆధారం ఏది? మనకు కావలసిన ఉన్నతమైన నియమం ఏమి? ఇతరుల అభిప్రాయాలూ, సాంప్రదాయాలూ, గురువులు చేసిన ఉపదేశాలూ, మనకు ఇంపుగా అనిపించిన ఉద్దేశాలూ, అంతర్వాణీ, పదార్థ విజ్ఞానమూ, హేతుబుద్ధీ, మత విషయిక అనుభవమూ, వగైరా . . . వీటికి మించినది ఎక్కడుంది?

దీనికి జవాబు స్పష్టంగా ఉంది. అదే దేవుని వాక్కు. మనకు దేవుణ్ణి గురించి తెలియాలి. దేవుని దగ్గరికి దారి తెలియాలి. అలాంటప్పుడు దేవుడే తనకు తానై ఈ సత్యాలను మనకు తెలియజేయాలి. దేవుడు వెల్లడి చేసినదే మనకు అవసరం. అదే సత్యానికి ఏకైక ప్రమాణం, నియమం, ఆధారం.

దేవుడు ప్రేమ అని యేసుప్రభువు నేర్పాడు. దేవుడు మంచి తండ్రిలాంటివాడు. మానవత విషయమై ఆయనకు మిక్కుటమైన శ్రద్ధాసక్తులున్నాయి. మనం సత్యాన్ని తెలుసుకోవాలని ఆయన కోరుతున్నాడు. మనం నేర్చుకోవలసిన విషయాలను ఆయన ఒక గ్రంథంలో వెల్లడి చేశాడు. ఈ గ్రంథమే బైబిలు అని వ్యవహరిస్తాం. మన దివ్య గురువు యేసుప్రభువు బైబిలంతా దేవుని వాక్కే అని

ఉపదేశించాడు (కావాలంటే బైబిలులోని ఈ వచనాలను గుర్తించుకోండి – మత్తయి 5:17,18; లూకా 16:17; యోహాను 10:35; మత్తయి 4:4; మార్కు 13:31; యోహాను 14:26; 16:13; లూకా 24:25–27).

ఆ మాటకొస్తే ఎవడైనా ఒకడు ఒక పుస్తకం రాసేయవచ్చు. రాసీ, దీన్ని రాయడానికి దేవుడు నన్ను ప్రేరేపించాడు అనవచ్చు. ఒకవేళ దేవుడే అతణ్ణి ప్రేరేపించి ఉండవచ్చు కూడా. మరో విధంగా చూస్తే అతడు దేవుడు నన్ను ప్రేరేపిస్తున్నాడని నటించవచ్చు కూడా. ఈ విషయం మనకెలా తెలుస్తుంది

తెలివైనవాళ్ళు ఈ విషయాన్ని పక్షపాతం లేకుండా పరీశీలించాలి. వినయ భావంతో అన్వేషించాలి, పరిశోధించాలి. ప్రతి విధమైన పక్షపాత సంబంధమైన తలంపునూ అవతల పెట్టివేసి దేవుణ్ణే అడుగుదాం, మన సృష్టికర్త వైపు చేతులు చాచి – "దేవా! మాకు నేర్పించు, మాకు సత్యాన్ని ఉపదేశించు."

ఏదైనా దేవుడు రాయించిన గ్రంథమైతే దానికి ఎంతో బలవత్తరమైన రుజువులు కావాలి. దాని రచయితలు గొప్ప కవులైనా. వేదాంతులైనా చాలదు. రచయితలు గౌరవనీయులైన ఉపదేశకులు కావచ్చు. వారు సన్యాసులై ఉండవచ్చు. యోగిపుంగవులై ఉండవచ్చు. అయినా దేవుని ప్రేరణ మాకుందని చెప్పగానే వారికది ఉందని అర్థం కాదు. వారి మాటలు మనం నమ్మాలంటే దానికి బలమైన కారణాలుండాలి. కారణాలు లేకుండా వారి మాటలు ఊరికే నమ్మితే మనం మోసపోయామన్నమాటే!

మతం పేరట ఏమి వచ్చినా సరే, అనేకులు అదంతా ఇట్టే నమ్మేస్తారు. ఇది చాలా విషాదకరం. అలాంటప్పుడు వీరు ఏ రుజువులు అడగరు. సత్యాన్ని వెదకేవారు అలా ఏది పడితే అది నమ్మేయకూడదు. నిర్భయంగా వాస్తవాన్ని ఎదుర్కోవాలి. రుజువులుంటే సరే. లేకపోతే తెలుసుకోవాలి. ప్రతిదాన్ని పరిశోధించాలి, పరీక్షించాలి.

గత అధ్యాయాలలో యేసుప్రభు ఉపదేశాలను మనం ఎందుకు అంగీకరించాలో కొన్ని కారణాలు పొందుపరిచాం. ఈ రుజువులు లోకంలోని మత గ్రంథాలలో మరి దేనికీ లేవు. బైబిలు తప్ప మరొకటి అలాంటిది ఉండబోదు. ఈ రుజువులను పరిశోధించి తెలుసుకోగలం. ఇలా చేయడం ద్వారా క్రీస్తును వెదకే ఆశ కలగాలి. అప్పుడు ఆయనలో విశ్వాసముంచడానికి తీర్మానం కలుగుతుంది. ఆయన ప్రత్యక్షం చేసిన ప్రతి సత్యాన్ని అంగీకరించాలనిపిస్తుంది కూడా. క్రీస్తును స్వీకరించిన తరువాత, ఆయనను అనుసరించేటప్పుడు సత్యం మనకు అనుభవ పూర్వకంగా తెలుస్తుంది. ఆయన మనకు వెలుగు ప్రసాదిస్తాడు.

బైబిలులోని సత్యాలను గ్రహించడానికి శక్తి అనుగ్రహిస్తాడు.

మత విషయమైన అభిప్రాయాలను పరీక్షించడానికి ఒక నిశ్చయమైన సూత్రం ఉంది. తప్పని నియమం ఉంది. అదేమిటంటే యేసుక్రీస్తు ప్రబోధాలతో, ఉపదేశాలతో సరిపోతే అది సత్యమని నమ్మవచ్చు. క్రీస్తు ఉపదేశాలకు విరుద్ధంగా ఉన్నదంతా అసత్యమే అని గ్రహించాలి. ఆయన మాటలు కేవలం దేవ వాక్కులు. "నేనే సత్యాన్ని" అన్నాడు యేసుప్రభువు. ఆయనే సత్యమైనప్పుడు ఆయన బోధకు వ్యతిరేకమైనదంతా అసత్యమని తేటగా గ్రహించగలం. "నేను సత్యం చెప్తూవుంటే నన్ను నమ్మరేమిటి? దేవునికి చెందినవారు దేవుని మాటలు వింటారు."[7] అన్నాడు యేసు. సత్యం పక్షాన ఉన్నవాడు క్రీస్తు వాక్కులను అంగీకరించి తీరతాడు. ప్రతి ఒక్కరూ తప్పక అంగీకరిస్తాడు. ఆయన మాటల నమ్మి అంగీకరించకపోతే మనం దేవునికి సంబంధించినవాళ్ళం కాము అని తేలిపోతుంది. ఇది గురుదేవుడే చెప్పిన మాటలు.

దేవుడు బైబిలును రాయించాడనడానికి మరి కొన్ని కారణాలున్నాయి. కానీ అన్నిటికంటే ముఖ్యమైన కారణం యేసు క్రీస్తే. ఆయనను గురించిన రుజువును అంగీకరించనివాడు మిగతావి కూడా ఒప్పుకోడు. యేసుక్రీస్తు దేవుని మహా ప్రత్యక్షత. ఆయనను గురించి అన్నిట్లోకీ గొప్ప సాక్ష్యాధారం ఉంది. ఆయనను విశ్వసించాలి, అనుసరించాలి, ప్రేమించాలి. అప్పుడే మన మనసుకు, అంతర్వాణికి సంపూర్ణ వెలుగు కలుగుతుంది. మన హేతుబుద్ధికి తగిన స్థాయి చిక్కుతుంది. అప్పుడే మన ఆధ్యాత్మిక అనుభవం సత్యమై, గంభీరమై, సంపన్నమవుతుంది. మానవుడు ఏమై ఉన్నాడో ఆ పూర్తి మనిషికి క్రీస్తు సంపూర్ణ సత్యం.

ఇప్పుడు యేసుక్రీస్తు శరీరకంగా ఈ లోకంలో లేడు. మనలను సత్యంలోకి తేవడానికి ఆయన ఆత్మ ఉన్నాడు. ఆయన ఉపదేశాలు మనం ధ్యానం చేయవచ్చు, నమ్మవచ్చు, ఆచరణలో పెట్టవచ్చు. దేవుణ్ణి గురించిన ప్రాచీనమైన ప్రశ్నలకు అధికారయుతమైన జవాబులు ఆయన ఉపదేశంలో ఉన్నాయి. మానవుడు ఎవడు, దేవుని దగ్గరకు మార్గమేది అనే ప్రశ్నలకు క్రీస్తు ఉపదేశాలే సరైన జవాబిస్తాయి. బంధకాల నుంచి విముక్తిని ప్రసాదిస్తాయి. నిష్ప్రయోజనమైన ఊహలూ, ప్రమాదకరమైన భావాలూ, తృప్తి కలిగించని కల్పితమైన తత్వాలనుంచి క్రీస్తు ఉపదేశాలే విమోచించగలవు. ఈ బోధామృతం దివ్య గురుదేవుని హృదయంలోనుంచి పెల్లుబికి వచ్చింది. సర్వజ్ఞుడైన దేవుని హృదయంలోనుంచి, మనసులోనుంచి వచ్చింది.

**జవాబు**

ఇంతకు మనకు సత్యమనేది ఎలా తెలుస్తుంది? దీనికి ఒకే విధానమున్నది. పవిత్ర గ్రంథమైన బైబిలు దేవుడు వెల్లడి చేసిన సత్యం. దీన్ని గ్రహించడం ద్వారానే సత్యం తెలుస్తుంది. ఇంకా సూటిగా చెప్పాలంటే, యేసు క్రీస్తు సత్యం. ఆయనను పరిచయం చేసుకోవాలి. ఆయనకోసం మన జీవితాలను, హృదయాలను తెరవాలి. ఆయనను వ్యక్తిగతంగా యజమానిగా స్వీకరించాలి. ఆయనను గురుదేవుణ్ణిగా, ప్రభువును, రక్షకుణ్ణిగా స్వీకరించాలి. ఆయన వాక్కులను నమ్మి, వాటి ప్రకారం జీవించాలి.

"మీరు నా వాక్కులో నిలిచి ఉంటే నాకు నిజమైన శిష్యులుగా ఉంటారు. అప్పుడు మీరు సత్యం గ్రహిస్తారు. సత్యం మీకు విడుదల కలిగిస్తుంది."[8]

దేవుని ఇష్టప్రకారం చేయడానికి ఎవరైనా ఇష్టపడితే ఈ ఉపదేశం ఆయనదో, లేక నా అంతట నేనే చెపుతున్నానో ఆ వ్యక్తి తెలుసుకుంటాడు."[9]

**ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. యోహాను 16:2
2. యెషయా 55:8,9
3. మత్తయి 11:25
4. ప్రకటన 12:9
5. హీబ్రూ 3:13
6. యిర్మీయా 17:9
7. యోహాను 8:46,47
8. యోహాను 8:32
9. యోహాను 7:17

# 10 మార్గాలన్ని ఒకటేనా?

“మతాలన్నీ నేర్పేది ఒకటే, మతాలన్నిటి సారాంశం ఒకటే” అని కొందరంటారు. మరికొందరు “దేవుణ్ణి చేరడానికి అనేక మార్గాలుంటాయి. ఏ మార్గాన్ని అనుసరించినా పరవాలేదు. అన్నీ ఒకే సత్యానికి చేరుతాయి” అని మరి కొందరంటున్నారు. ఇంకా కొందరు “యేసు దేవుని దగ్గరనుంచి వచ్చినవాడు, మంచి ఉపదేశకుడు అంటే నమ్ముతాం. కానీ, ఇంకా చాలామంది అలాంటి మహానుభావులు లోకంలో వచ్చారు. ఆయన చేసిన ఉపదేశాలలాంటివే వీరూ చేశారు” అని మరి కొందరు వాదిస్తున్నారు.

సహనం ఉండాలి

ఈ మాటల్లో సరైన అభిప్రాయం ఉందనీ, చాలా సహనం కనిపిస్తున్నదనీ అనేకులు నమ్ముతున్నారు. కలహాలు, దురభిమానాలు మంచివి కావు. అవి విద్వేషాలను పెంచుతాయని అందరికీ తెలుసు. వేరే మతానికి చెందినవాడే అని అసహ్యించడం, హింసించడం భయంకరమైన కీడు అని చెప్పవచ్చు. అయితే అన్ని మార్గాలు ఒకే స్థలానికి చేరుస్తాయి అనడం సహనం అనిపించుకోదు. వాస్తవంగా సహన శీలత చెప్పవలసినదేమంటే, పక్షపాతం లేకుండా అన్ని విషయాలను పరిశోధించండి. వాస్తవాన్ని పరిశీలించండి. మీకు మీరే నమ్మదగినదేదో నిర్ణయించుకోండి. మనకు కావలసినది సత్యం. ఇది నిజం, ఇది నిజం కాదు అనే సొంత అభిప్రాయాన్ని ఇతరుల నెత్తిన రుద్దడం తెలివి కాదు. ఏ మాత్రమూ దురభిమానమూ, ద్వేషమూ, పక్షపాతమూ లేకుండా అభిప్రాయాలను జాగ్రత్తగా పరిశీలించాలి. హృదయాలను దేవునివైపు పైకి ఎత్తి దేవుని ఉపదేశాన్ని కోరుకోవాలి. హృదయాలలో సత్యమే కావాలని దీక్ష ఉండాలి. ఈ అధ్యాయంలో చెప్పబడిన సత్యాలను చదవకముందు అలాంటి కోరిక, మనస్తత్వం ఉండడం ప్రాముఖ్యమైన విషయం. ఇది నిజమా కాదా అని జాగ్రత్తగా వివేచించండి. నిజమైతే తెలుసుకొని తీరాలి. సహనం పేరుతో పరిశోధనను ఆపివేయకూడదు. కొందరు సహన శీలత అనే పేరు మీద కండ్లు మూసుకుంటారు. అలా చేయకుండా మనం ఒకే ఒక ప్రశ్న ఇప్పుడు అడగాలి – ఏది నిజం?

ఈ అధ్యాయం ప్రారంభంలో చెప్పిన అభిప్రాయాలు బాగానే ధ్వనిస్తూ ఉండవచ్చు. “హైదరాబాదు నుంచి ఢిల్లీకి వెళ్ళాలంటే చాలా మార్గాలున్నాయి.

విమానంలో వెళ్ళవచ్చు. రైలుబండిలో వెళ్ళవచ్చు. లేదా కారులో కూడా వెళ్ళవచ్చు. వెళ్ళాలనుకుంటే ఎద్దులబండ్లు కూడా ఉన్నాయి. లేకపోతే నడిచి వెళ్ళగలం కూడా. నాగపూర్ ద్వారా వెళ్ళవచ్చు. ముంబాయి మీదుగా వెళ్ళవచ్చు. మరో మార్గాన కూడా వెళ్ళవచ్చు. ఎవరి ఇష్టం వారిది. ఒక త్రోవ దగ్గరి దారి కావచ్చు. మరో త్రోవ సౌఖ్యం కావచ్చు. ఏ త్రోవ ఎలాంటిదైనా అందరూ చేరే చోటు ఒక్కటే. మతం విషయం కూడా ఇలాంటిదే. అన్ని త్రోవలూ దేవుని దగ్గరికే మనల్ని చేరుస్తాయి" అంటూ కొందరు వాదించవచ్చు.

ఢిల్లీ నగరానికి వెళ్ళాలంటూ ఏ మార్గమైనా పరవాలేదు అనుకోవచ్చు. రైలుబండిలో గానీ, విమానంలో గానీ, ఎద్దుబండిలో గానీ వెళ్ళవచ్చు. నాగపూర్ మీదుగా, లేదా, ముంబాయి మీదుగా వెళ్ళవచ్చు. అందులో ప్రమాదమేమీ లేదు. అయినా ఢిల్లీ నగరం పరలోకమేమీ కాదు. ఆ నగరాన్ని మనుషులే నిర్మించారు. అక్కడికి మార్గాలు వేసినది కూడా మనుషులే. దీని విషయమై మనుషులు తమకిష్టం వచ్చినట్లు వ్యవహరించవచ్చు.

పోనీ, ఈ భూగోళానికి వేరుగా ఉన్న మరో గ్రహాన్ని గురించి ఆలోచిద్దాం. చంద్రగోళం ఉంది, అక్కడికి వెళ్ళాలని ఉంది. నాగపూర్ మీదుగా వెళ్ళినా లాభం లేదు. అక్కడికి రైలుబండ్లు పోవు. కాలిబాటలూ లేవు. చంద్ర మండలానికి వెళ్ళాలంటే ఒకే ఒక మార్గమున్నది. అంతరిక్ష నౌకలోనే ప్రయాణం చెయ్యాలి. భూమికి ఆకర్షణ శక్తి ఉంది. దాన్ని జయించి స్వేచ్ఛగా పైకి దూసుకుపోగలిగే శక్తి అంతరిక్ష నౌకకు మాత్రమే ఉంది. లేకపోతే, ఆ రాకెట్టు అంతరిక్షంలోనే అంతరిస్తుంది.

పరలోకం దేవునిది. అది ఇహలోకానికి చెందినది కాదు. ఈ దృశ్యమాన జగత్తుకు సంబంధించినది కూడా కాదు. స్వభావ రీత్యా మనుషులకు పరలోక స్వరూప స్వభావాదులు తెలియవు. అక్కడికి ఎలా వెళ్ళాలో తెలియదు. అంతే కాక, పరలోకానికి మనిషి విముఖుడు, దానివైపుకే వెళ్ళడం లేదు. మనిషి తన ప్రయాణంలో ఎంత ముందుకు వెళ్ళిపోతూ ఉంటే పరలోకానికి అంత దూరమైపోతున్నాడన్నమాట! "మనమందరమూ గొర్రెలలాగా తప్పిపోయాం. మనలో ఒక్కొక్కరం సొంత త్రోవకు తొలగిపోయాం"[1] మానవుడు స్వంతగా కల్పించిన మార్గమేదీ మనల్ని దేవుని దగ్గరికి ఎన్నడూ చేర్చదు. ఈ విషయంలో ఎలాంటి సందేహమూ లేదు. దేవుడు కేవలం పవిత్రుడు. పాపియైన మానవుడు తన సొంతమార్గంలో నడుస్తూ ఎలా దేవుని సన్నిధిని చేరగలడు? దేవుని దగ్గరికి వెళ్ళాలంటే మనం ఆయన వేసిన మార్గాన్నే నడవాలి. మనిషిని మార్గాలను

కనిపెట్టాలని దేవుడు నియమించలేదు. దేవుడు అన్నిటికి పైగా ఉన్నవాడు, సర్వాతీతుడు. దేవుడే పరలోకాన్ని నిర్మించాడు. దానిలోకి వెళ్ళడానికి ఒకే ఒక మార్గాన్ని నిర్మిచాడు. అక్కడికి వెళ్ళడానికి మార్గాలను స్వయంగా కనిపెట్టానని మానవుడు చెప్పుకుంటున్నాడంటే, అది అతడి ఇష్టం. అంతే గాని, అది దేవుని నిర్ణయం కాదు.

లోకంలో చాలా మత సంబంధమైన మార్గాలున్నాయి. వీటన్నిటిని గురించిన నాలుగు అభిప్రాయాలు ప్రచారంలో ఉన్నాయి. మొదటిది, వీటిలో ఏ మార్గమూ దేవుని దగ్గరికి చేర్చదు. రెండోది, అన్ని మార్గాలు దేవుని దగ్గరికి చేరుస్తాయి. మూడోది, వీటిలో కొన్ని మార్గాలు దేవుని దగ్గరకు చేరుస్తాయి, కొన్ని చేర్చవు. నాలుగోది, వీటిలో ఏదో ఒకటి మాత్రమే దేవుని దగ్గరికి మనల్ని చేరుస్తుంది.

ఈ అభిప్రాయాలలో ఏది సరైనదో ఎలా నిర్ణయించగలం? గత అధ్యాయంలో హేతుబుద్ధి గానీ అనుభవం గానీ అలాంటి మరేదైనా హద్దుకు లోనైనది అని తేల్చాం. హేతుబుద్ధి సరిపడదు. దేవుని మనసును మానవుడి బుద్ధి గ్రహించడం అసాధ్యం. దేవుని ఉద్దేశాలనూ ఆలోచనలనూ మన మనసు దానంతట అది కనుక్కోవడం అసాధ్యం.

ఇంతకూ తేలిన సారాంశమేమిటంటే, సత్యమనేది తెలుసుకోవాలంటే దాన్ని దేవుడే తెలియజేయాలి. ఇదే విషయాన్ని మళ్ళీ మళ్ళీ గుర్తించాలి. ఏదో సత్యమని, సహేతుకమైనదని నా మనసుకు తోస్తున్నది గదా అని దాన్ని అట్లే నమ్మెయ్యకూడదు. అలా చేసినా తీరా సత్యానికి విరుద్ధమైన విషయాన్ని నమ్మినవాళ్ళమవుతామేమో.

మత సంబంధమైన సత్యాలలో ప్రత్యక్షత కావాలి. దేవుడే మాట్లాడాలి. దేవుడు ఎవరి ద్వారా మాట్లాడాడో ఆయన ఏమి చెప్పాడో తెలుసుకోవాలి. దేవుని దగ్గరికి ఒకటే మార్గం ఉంటే, ఆ మార్గాన్ని వెదకి చూడడంలో మనమెంతో జాగ్రత్త వహించాలి. దేవునికీ ప్రార్థన చెయ్యాలి. మనం మోసపోకుండా ఆయనే మార్గాన్ని చూపాలని వేడుకోవాలి.

యేసుక్రీస్తు దేవుని వద్దనుంచి వచ్చిన ఉపదేశకుడని మనకు తెలుసు. ఈ సత్యాన్ని దృఢపరచే రుజువులు అనేకాలు. క్రీస్తులో మనకు పరమాద్భుతమైన ప్రత్యక్షత ఉంది. అయితే కొందరు ఈ విధంగా అనవచ్చు: “దేవుడు ఇతరుల ద్వారా కూడా మాట్లాడాడు. లోకంలో గొప్ప మతాచార్యులు చాలా మంది ఉన్నారు, వారందరి ద్వారా దేవుడు మాట్లాడాడు. అనేక మత గ్రంథాలున్నాయి, వాటిద్వారా కూడా దేవుడు మాట్లాడాడు. బైబిలు, ఖురాను, భగవద్గీత, అలాగే ఇంకా అనేక

గ్రంథాలున్నాయి. వీటిలో ఏదో కొద్ది భేదాలుండవచ్చు. అంతేగాని, చాలామట్టుకు ఇవన్నీ ఒకటే". ఈ అభిప్రాయాన్నే అనేకులు వెలిబుచ్చుతున్నారు. అయితే ఇలాంటి అభిప్రాయం నిజమైఉంటుందా?

సత్యమే కావాలని కోరేవారు ఇలాంటి అభిప్రాయాన్ని సులభంగా అంగీకరించలేరు. దీన్ని పరిశీలించి తీరుతారు.

కొన్ని విషయాల్లో మత గ్రంథాలన్నీ ఒకేలాగా ఉంటాయి. ఈ సంగతి స్పష్టమే. ఈ గ్రంథాలన్నిటిలో ఏదో ఒక దేవుణ్ణి గురించి చెపుతున్నాయని భావించకూడదు. ఇవన్నీ ఒకే ముక్తిని గురించి వివరిస్తున్నాయని కూడా భ్రమించకూడదు. ఇంతకుముందే మనం వేదాంత విధానాలలో పరస్పర విరుద్ధమైన ఆలోచనలూ భిన్నాభిప్రాయాలూ ఎన్నో ఉన్నాయని తెలుసుకున్నాం. లోకంలోని మత గ్రంథాలను పోల్చి చూచేటప్పుడు మూల పాఠాలలో అనేక చోట్ల భేదం కానవస్తుంది. ఈ భేదం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

దీన్ని గురించి ఎన్నో ఉదాహరణలూ దృష్టాంతాలూ చూపవచ్చు. మన తలంపులలో స్పష్టమైన వాతావరణం ఏర్పడాలంటే అలాంటి నిదర్శనాలు మనం చూడాలి. ఈ క్రింద మీరు చదవబోయేది నా స్వకీయ అభిప్రాయం కాదు. ఈ గ్రంథాలు చెప్పే విషయాలనే నేను ఉదాహరిస్తాను. ఒకే విషయంలో ఆయా గ్రంథాలలో ఎలాంటి మాటలూ ఉపదేశాలూ ఉన్నాయో చూపుతాను.

**బైబిలు, ఖురాను**

యేసుక్రీస్తు దేవుని శాశ్వతుడైన కుమారుడని బైబిలు చాలా తేటగా నేర్పిస్తుంది. ఖురాను ఈ సత్యాన్ని ఎంత మాత్రమూ ఒప్పుకోదు.

మహమ్మద్ గట్టిగా చెప్పాడు – యేసు దేవుని కుమారుడు కాడు. దేవునికి భార్య ఉంటే గదా కుమారుడు కలిగేది? (ఖురానులోని 6వ అధ్యాయం). బైబిలును పట్టుకొని యేసు దేవుని కుమారుడని క్రైస్తవులంటారు గానీ ఇది అబద్ధం; దేవుడు ఇలాంటి అబద్ధికులతో పోరాడవలసి ఉంటుంది అన్నాడు మహమ్మద్ (ఖురాను 9:30). యేసు ఒక ప్రవక్త మాత్రమే అన్నాడు మరో చోట (5:79).

క్రైస్తవానికి ఏది కేంద్ర సత్యమో దాన్ని ఖురాను ఒప్పుకోదు. పైగా ఖండిస్తుంది. బైబిలు క్రీస్తు దేవుని కుమారుడని పదే పదే చెపుతుంది. ఖురాను అనేక చోట్ల క్రీస్తు దేవుని కుమారుడు కాడు అని చెపుతుంది. దేవుడు బైబిలులో ఒక సంగతి చెప్పి, ఖురానులో దానికి వ్యతిరేకంగా చెపుతాడా? క్రీస్తును పంపి, "ఈయన నా ప్రియ కుమారుడు" అని చెప్పిన దేవుడు మళ్ళీ మహమ్మదును పంపి క్రీస్తు దేవుని

కుమారుడు కాడు అని చెప్పిస్తాడా? అలా ఒకసారి చెప్పినదాన్ని మళ్ళీ కాదు అని ఖండించే దేవుడు ఎలాంటి దేవుడు?

క్రీస్తు సిలువ మరణం అనుభవించిన విషయంలో కూడా ఇలాంటి భేదమే ఈ రెండు గ్రంథాలలో కనబడుతుంది. బైబిలు ప్రకారం సిలువ అత్యవసరం. సిలువమీద యేసు మన పాపాల కోసం బలియాగం అయ్యాడు. పాపాన్ని నాశనం చేసే దేవుని దివ్య ప్రభావం సిలువే. అదే మానవకోటికి ఒకే ఒక విముక్తి విధానం. అదే మనకు శరణ్యం. ఖురాను సిలువలను గురించి ఏమీ ఘనంగా చెప్పదు. పైగా క్రీస్తు సిలువమీద చనిపోయాడనే విషయంలో అనుమానాన్ని కలిగించడానికి ప్రయత్నిస్తుంది. చాలామంది ముస్లిములు క్రీస్తు సిలువమీద చనిపోలేదు అంటారు. ఒక చోట ఖురాను చెప్పేదేమంటే, వాళ్ళు క్రీస్తును చంపలేదు. వాళ్ళు ఆయనను సిలువ వేయలేదు (4:155–158). కొందరు దీనికి వేరే అర్థం చెపుతారు. క్రీస్తు సిలువ మరణం పొందాడని ఖురాను ఒప్పుకోకపోయినా, ఒప్పుకొన్నా, ఒకటి నిజం – ఖురాను సిలువలో అతిశయాన్ని చూపదు, సిలువ మానవకోటికి ముక్తి విధానం అంటే ఖురాను ఒప్పుకోదు. బైబిలు సిలువను గురించి చెప్పినదానికి పూర్తి వ్యతిరేకంగా మాట్లాడుతుంది.

ఖురానుకూ బైబిలుకూ ఇంకా ఎన్నో పరస్పర విరుద్ధ లక్షణాలున్నాయి. మత సంబంధమైన సత్యాలలో చాలా ప్రాముఖ్యమైన వాటిల్లోనే ఈ భేదాలు కనిపిస్తాయి.

ఖురానులోని ముక్తి మార్గం మహమ్మద్ నేర్పించినది, మహమ్మద్ ప్రోక్తమైనది. అంటే “అల్లా”లో విశ్వసించాలి. మహమ్మద్ అల్లా యొక్క ప్రవక్త అని కూడా నమ్మాలి. మంచి క్రియలు చేయాలి. అప్పుడే మోక్షం అంటుంది ఖురాను. మహమ్మద్ నేర్పిన సంగతులను నమ్మి సత్‌క్రియలు చేసేవారు పరదైసు అనే పరలోకానికి చేరుతారు. కాని, ఆయన్ను అనుసరించని వారికి బాధలు కలగాలని ఖురానులో వ్రాసి ఉంది (4:120–124; 47:14–27).

కానీ, బైబిలు చెప్పినది దీనికి విరుద్ధంగా ఉంది. మంచి పనులు చేయడంవల్ల పరలోకాన్ని చేరలేము. క్రీస్తు దేవుని కుమారుడు కాడని నేర్పించే వ్యక్తిని నమ్మినవాడు కూడా పరలోకానికి వెళ్ళడు. మన ముక్తికి ఆధారం సిలువ మీద దేవుని కుమారుడు చేసిన బలియజ్ఞమే. ముక్తి కేవలమూ దేవుని కృపా కార్యమే. అది ఆయన ఉచితంగా ఇచ్చినదే. ఇలాంటి ప్రాముఖ్యమైన అంశాలలో బైబిలూ ఖురానూ పరస్పర విరుద్ధమైన విషయాలను చూపుతున్నాయి. వీటిలో ఒకటి నమ్మాలంటే రెండోదాన్ని విసర్జించాలి. క్రీస్తు దేవుని కుమారుడు అనైనా నమ్మాలి.

కాదనైనా నమ్మాలి. ముక్తి కోసం సత్క్రియలు ముఖ్యమనైనా నమ్మాలి. కాదనైనా నమ్మాలి.

మనం సహనం చూపాలి. నిజమే. ఇతరుల అభిప్రాయాల పట్ల ఎంతో ఓర్పుతో ఉండాలి. సహనానికి అర్థం భేదాలు లేవని నటించడం కాదు. మనం దయగా ఉండాలని యేసుప్రభువు చెప్పాడు. అంతేగాని ప్రతి ఒక్కటీ కండ్లు మూసుకుని నమ్మాలని ఆయన ఎప్పుడూ చెప్పలేదు.

## బైబిలు, భగవద్గీత, ఉపనిషత్తులు

బైబిలు భగవద్గీతతో, ఉపనిషత్తులతో పోల్చి చూచినప్పుడు కూడా ఇలాంటి పరస్పర వ్యతిరేకం కనిపిస్తుంది. చాలా ప్రాముఖ్య విషయాలలో ఈ గ్రంథాల్లో ఉన్న ఉపదేశాలను పరిశీలిద్దాం.

## దేవుణ్ణి గురించి

బైబిలు ప్రకారం దేవుడు వ్యక్తిత్వం గలవాడు, జగత్తుకు సృష్టికర్త. మానవులు దేవునిచేత సృజించబడినవారు. దేవుడు సృష్టికి అతీతుడు. దేవుడు సృష్టికి పైగా, ప్రత్యేకంగా, వేరుగా ఉన్నాడు. ఆయన సృష్టించిన జీవులు జీవం, మనుషుల ఆత్మలు – వీటిలో ఏవీ దేవుని ఆత్మ కావు. కానీ భగవద్గీత, ఉపనిషత్తులు దీనికి భిన్నంగా నేర్పిస్తాయి.

భగవద్గీత పదమూడో అధ్యాయం ఇరువయో శ్లోకంలో ప్రకృతి మొదలంటూ లేనిది అని కృష్ణుడు చెప్పాడు. ప్రతి ఒక్కరిలో ఉన్న ఆత్మ తానే అని మరో చోట అన్నాడు. సృష్టాలన్నిటిలో తన ఆత్మ ఉంది. దుష్టులలో కూడా ఉంది అన్నాడు. (10:20; 15:7; 16:18; 17:6; 18:61). నశించేవాటిలో నశించని పరమేశ్వరుడున్నాడనీ సర్వ భూతాల్లో సమానంగా ఉన్నాడనీ గ్రహించేవాడే జ్ఞాని అన్నాడు కృష్ణుడు (భగవద్గీత 13:28–30).

ఉపనిషత్తులు కూడా దేవుడు ప్రతి ఒక్కదానిలో ఉన్నాడని చెపుతాయి. కథోపనిషత్తు శాశ్వతమైన ఆత్మ మానవులందరిలో, దేవతలందరిలో ఉన్నదని చెపుతుంది. ఈషోపనిషత్తులో పరమాత్మ ప్రతి ప్రాణిలో ప్రకాశిస్తున్నాడని వ్రాసి వుంది.

## దేవుడు, దేవతలు, విగ్రహాలు

బైబిలు ప్రకారం దేవుడు ఒక్కడే. తండ్రి కుమార పవిత్రాత్మ ఈ ముగ్గురూ

ఒక్కరిలో సంపూర్ణంగా సమైక్యమై ఉన్నారు. మిగతా దేవుళ్ళందరూ అసత్యం. వారిని విసర్జించాలి. విగ్రహ పూజ భయంకరమైన పాపం. దేవుడు ఇచ్చిన ఆజ్ఞలలో మొదటి రెండు ఇవే – "నేను గాక వేరే దేవుడు మీకు ఉండకూడదు. మీ కోసం ఏ విగ్రహమూ చేసుకోకూడదు. పైన ఆకాశంలో గానీ, క్రింద భూమిమీద గానీ, భూమిక్రింద నీళ్ళలో గానీ, ఉన్న దేని రూపమూ చేసుకోకూడదు. అలాంటివాటికి సాగిలపడకూడదు. వాటిని పూజించకూడదు."[2]

ఈ విషయమే బైబిలంతటిలో పదే పదే రాసి ఉంది. ఈ సత్యాన్ని బైబిలు గట్టిగా నొక్కి వక్కాణిస్తుంది. మరో చోట "వేరొక దేవునికి మొక్కకూడదు"[3] అని బైబిలులో ఉంది.

మరో చోట – "ఒకవేళ మీరు మీ దేవుడైన యెహోవాను మరచి, ఇతర దేవుళ్ళను అనుసరించి, సేవించి, పూజిస్తే, మీరు తప్పనిసరిగా నాశనం అవుతారని ఈ రోజు నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను."[4]

"మీరు విగ్రహాలను చేసుకోకూడదు. చెక్కిన ప్రతిమను గానీ స్తంభాన్ని గానీ నిలబెట్టకూడదు."[5]

"మలచిన విగ్రహాన్ని గానీ, పోత విగ్రహానికి గానీ చేయించి దానిని చాటున నిలబెట్టేవాడు శాపగ్రస్తుడు."[6]

"ప్రియమైన పిల్లలారా, విగ్రహాల బారినుంచి మిమ్ములను కాపాడుకోండి."[7] "ప్రజలు అర్పించే బలులు దయ్యాలకే అర్పిస్తున్నారు గాని దేవునికి కాదు."[8]

"సూర్యుణ్ణి గాని, చంద్రుణ్ణి గాని, ఆకాశ నక్షత్రాలలో వున్న దేనినైనా పూజించకూడదనీ అలాంటిది అసహ్యా కార్యం" అని బైబిలు చెపుతుంది.[9] ఏ విధమైన విగ్రహ పూజనైనా బైబిలు గట్టిగా ఖండిస్తుంది. దేవునికి విగ్రహ పూజ అసహ్యం పుట్టిస్తుంది. దీన్ని ఆచరించే ప్రజకు శిక్ష రాక మానదని బైబిలు చెపుతుంది. విగ్రహారాధన చేసినవాళ్ళకు దేవుడు తీర్పు తీర్చి శిక్ష విధిస్తాడు. "నా ప్రజ నన్ను విడిచిపెట్టి, ఇతర దేవుళ్ళకు ధూపం వేసి, వాళ్ళు చేతులతో చేసిన విగ్రహాలను పూజించి చెడ్డగా ప్రవర్తించారు. గనుక నేను వాళ్లకు విరోధంగా తీర్పులు చెపుతాను."[10]

మానవుడు చేయగల ఘోరమైన పాపాలలో విగ్రహ పూజ ఒకటి అనీ, అది ఎంతో నింద్యమైనదనీ, దీనికి శిక్ష తప్పక ఉంటుందనీ బైబిలు బహు తేటగా చెపుతుంది. "పిరికివారు, విశ్వాసం లేనివారు, అసహ్యులు, హంతకులు, వ్యభిచారులు, మాంత్రికులు, విగ్రహపూజ చేసేవాళ్ళూ, అబద్ధికులంతా అగ్ని గంధకాలతో మండుతున్న సరస్సు పాలవుతారు".[11] "మోసపోకండి. జారులు

గానీ, విగ్రహపూజకులు గానీ, దేవుని రాజ్యవారసులు కాబోరు."[12]

భక్తుడైన పౌలు విగ్రహ పూజ అసలు ఎలా ఆరంభమైందో, దాన్ని దేవుడు ఎంతగా అసహ్యిస్తాడో వివరించాడు. "వారు దేవుణ్ణి ఎరిగివుండి కూడా దేవుడుగా ఆయనను మహిమపరచలేదు . . . తాము జ్ఞానులమని చెప్పుకొంటూ బుద్ధిలేనివారయ్యారు. ఎన్నడూ నాశనం కాని దేవుని మహిమకు బదులుగా నాశనం అయ్యే మనుషుల విగ్రహాలను తెచ్చి పెట్టుకున్నారు. పక్షుల విగ్రహాలూ నాలుగు కాళ్ళున్న మృగాల విగ్రహాలూ ప్రాకే ప్రాణుల విగ్రహాలూ కూడా పెట్టుకున్నారు. . . . వారు దేవుని సత్యానికి బదులు అబద్ధాన్ని పెట్టుకొని సృష్టికర్తకు మారుగా సృష్టిలోని వాటినే పూజించారు, సేవించారు. ఆయనే శాశ్వతంగా స్తుతిపాత్రుడు! తథాస్తు!"[13]

ఏ గురువైనా, ఏ ఉపదేశకుడైనా, ఏ ఉపదేశమైనా విగ్రహ పూజను ప్రోత్సహించే పక్షంలో బైబిలుకు విరుద్ధమే అవుతుంది. అనేక దేవతలను ఆరాధించే విధానమేదైనా సరే. బైబిలుకు కేవలం వ్యతిరేకమే.

భగవద్గీతలో కృష్ణుడు అర్జునుడికి ఉపదేశిస్తూ వేరు వేరు దేవతలను, రూపాలను ఆరాధించేవారికి స్థిరమైన విశ్వాసాన్ని ఇస్తానన్నాడు. వారి అభీష్టాలకు తీరుస్తానన్నాడు (భ. గీ. 7:21,22). ఏ దేవతను ఆరాధించినా, ఎవరికి యజ్ఞం చేసినా, నాకు చేసినట్టే అని కృష్ణుడు అన్నాడు (9:23). ఈ దేవతలందరికీ అన్ని విధాలుగా తానే ఆది కారణుడు, మూల భూతుడు, ఉత్పత్తి అన్నాడు (10:2). కృష్ణుడికీ దేవతలకూ సమీప సంబంధం ఉందన్నమాట.

సృష్టికర్త మానవులతో "యజ్ఞం చేత దేవతలను తృప్తి పరచండి. అలా దేవతలు మిమ్మును తృప్తిపరుస్తారు. ఇలా సర్వోన్నతమైన క్షేమాన్ని అందుకోండి" అన్నట్టు కృష్ణుడు చెప్పాడు (3:10–12). దేవతలను ఆరాధించేవారు దేవతల దగ్గరికి పోతారు అంటుంది భగవద్గీత. కానీ బైబిలు ప్రకారం దేవతలూ దేవుళ్ళూ లేనే లేరు. ఒకే దేవుడున్నాడు. ఆయనకు వేరుగా పూజ కావాలని తహతహలాడే దయ్యాలున్నారు. ఆ ఒకే దేవుని ఎదుట తీర్పుకు మనమంతా ప్రత్యక్షంగా నిలబడాలని బైబిలులోని దేవుడు తేటగా మాట్లాడుతున్నారు. అందరూ గ్రహించగలిగేట్టు ఇలా అంటున్నాను – "నేను తప్ప వేరే దేవుడున్నాడా, చెప్పండి. నేను తప్ప వేరే ఆధారశిల లేదు. అలాంటివాణ్ణెవణ్ణీ ఎరగను."[14]

భగవద్గీత 10వ అధ్యాయంలో కృష్ణుడు తాను అన్నిటిలో ఉన్నానన్నాడు. దీన్ని చెపుతూ అనేక ఉదాహరణలు ఇచ్చాడు. ప్రతి ఒక్కటి తనను ప్రత్యక్షపరుస్తున్నది అన్నాడు. దేవతలను గురించీ చెప్పాడు. మనుషులను గురించి చెప్పాడు.

రాక్షసులను గురించీ రుద్రులను గురించీ గంధర్వులను గురించీ కూడా చెప్పాడు. తానే వీరందరిలో ప్రముఖుడు అయి ఉన్నాను అన్నాడు. వన్య మృగాలను గురించీ, సూర్య చంద్రులను గురించీ, మత్స్యాలు, వంచకుల్లో జూదము, సర్పాలు, మొదలైన వాటిని గురించీ కూడా చెప్పాడు. వీటన్నిటిలో ముఖ్యమైనవి తన ప్రతిఫలాలే అన్నట్టు సూచించాడు. తానే ఇవన్నీ అయి ఉన్నానన్నాడు. తన అనంత మహిమను అంతా వెల్లడి చేస్తున్నదన్నాడు. పదకొండో అధ్యాయంలో అర్జునుడు కృష్ణుడిలోనే సమస్త దేవతలను చూస్తున్నాను అన్నాడు (11:15). ఈ విధంగా కృష్ణుడు సమస్తమూ, సమస్తమూ కృష్ణుడు అని భగవద్గీత సూచిస్తుంది.

ఒక విషయం గమనించండి. దేవుడు సమస్తమే అయి ఉంటే, సమస్తమూ దేవుని ప్రతిఫలమే అయితే, ఈ సమస్తంలో దుర్మార్గులు ఇమిడి ఉన్నారు. మంచి క్రియలు మాత్రమే కాకుండా చెడ్డ క్రియలు కూడా ఇమిడి ఉన్నాయి. అలాంటప్పుడు దేవుని పవిత్రత ఏం అవుతుంది?

భగవద్గీతలో కనబడే దేవుని చిత్రానికీ బైబిలు ప్రకారం కనవచ్చే దేవునికి చాలా భేదం ఉంది. దేవునికీ మానవునికీ పరస్పర సంబంధాలలో ఎంతో వ్యత్యాసం ఉంది. దేవుని స్వరూపం, ఆయన ఆరాధన అనే అంశాలలోనే బైబిలుకూ, భగవద్గీతకూ ఎంతో భేదం ఉంది. బైబిలులోని క్రీస్తు, భగవద్గీతలోని కృష్ణుడు ఒకటే అని ఏ మాత్రమూ చెప్పరాదు. ఇద్దరూ ఒకే దేవుని దగ్గరనుంచి వచ్చారు అని కూడా చెప్పకూడదు.

దేవుడు ఈ రెండు గ్రంథాలనూ రాయించి ఉంటే, ఈ రెండింటిలో దేవుడు తన సత్యాలను వెల్లడి చేసి ఉంటే, మరి ఈ పరస్పర వ్యతిరేకమేమిటి? ఒకే ఒక దేవుడు బైబిల్లో విగ్రహ పూజ, ఇతర దేవతారాధన దోషమని, పాపిష్టమని, నింద్యమని ఒక చెంప హెచ్చరించి, మరో చెంప భగవద్గీతలో దాన్ని ఎలా ప్రోత్సాహిస్తాడు? ఎలా సమ్మతిస్తాడు? ఇది అసాధ్యం.

ఈ విషయంలో ఉపనిషత్తులు భగవద్గీతతో ఏకీభవిస్తాయి. తైత్తిరీయోపనిషత్తు అన్నం పరబ్రహ్మ స్వరూపమని భావించినవారికి ఐశ్వర్య సిద్ధి కలుగుతుంది అని చెపుతుంది. బుద్ధి పరబ్రహ్మమని భావించడం తప్పు కాదని సూచిస్తుంది. మరో ఉపనిషత్తులో దేవతలను ఆరాధించడం దేవతా తృప్తికి మాత్రమే కాదనీ అది పరబ్రహ్మ స్వరూపమైన ఆత్మకోసమే అనీ ఉన్నది (బృహదారణ్యకోపనిషత్తు). వేదాలలో కూడా అనేక దేవతలను ఉద్దేశించిన ప్రార్థనలున్నాయి

యేసుక్రీస్తుకు ఇవేవి గిట్టవు. ఆయన తేటగా చెప్పాడు – "నీ ప్రభువైన దేవుణ్ణే ఆరాధించాలి, ఆయనకు మాత్రమే సేవ చేయాలి అని వ్రాసి వుంది."[15]

## ముక్తి మార్గం

ఈ విషయంలో కూడా పరస్పర విరుద్ధ భావనలు కానవస్తాయి. ముక్తి క్రీస్తు మీది విశ్వాసం ద్వారా కృపచేతనే కలుగుతుంది అని బైబిలు నొక్కి చెపుతున్నది. ఎవడైనా తన స్వధర్మాన్ని ఆచరించడం ద్వారా, సత్క్రియాచరణ ద్వారా, ఆచారా వ్యవహారాల ద్వారా, స్వంత ప్రయత్నం చేత ముక్తి చెందడం అసాధ్యమని బైబిలులోని క్రొత్త ఒడంబడిక తేటగా చూపిస్తుంది. కానీ కృష్ణుడు భగవద్గీతలో మోక్షప్రాప్తి అనేక విధానాలలో కలగగలదని చెప్పాడు. మానవులు ఏ మార్గాన్ని అవలంబించినా సరే అది చిట్టచివరకు దేవునివద్దకే చేరుస్తుంది అనే భావన భగవద్గీతలో ఉంది (4:11). కర్మ మార్గం, జ్ఞాన మార్గం, భక్తి మార్గం, మొదలైన వివిధ మార్గాలు ఉపదేశించాడు కృష్ణుడు. కర్మ మార్గమంటే క్రియాచరణ, మంచి కార్యాలు చేయడం. జ్ఞాన మార్గం ఆధ్యాత్మిక సందర్శనం. భక్తి మార్గం దైవ సేవా విధానం. భగవద్గీతలో ఇవన్నీ మోక్షానికి చేరుస్తాయని రాసి ఉంది. వీటిలో ఏది కూడా మోక్షానికి చేర్చదని బైబిలు ఉపదేశిస్తుందని ఇంతకు ముందు చూశాం (5వ అధ్యాయంలో).

సత్క్రియలు ఆచరించేవారికి స్వర్గలోకం ఉంది అంటుంది భగవద్గీత. కానీ ఈ స్వర్గం శాశ్వతమైనది కాదు (6:40,41; 9:20,21). మానవుడు ముక్తి ప్రాప్తికి "నిష్కామ కర్మ" చేయాలి. ఆసక్తుడై ఉండాలి. కర్మ ఫలాలను గురించి చింతపడకుండా ఉండాలి (3:19; 8:8-14). పరిపూర్ణతను కోరుకునే యోగి అలాంటి సిద్ధిని, కొన్ని జన్మలలోనైనా సరే పొంది తీరుతాడు (6:45). కర్మలు చేయడం ద్వారా మానవుడు సిద్ధి పొందుతాడు (12:10). ప్రతి వ్యక్తీ తన స్వధర్మాన్ని ఆచరిస్తే తన స్వంత కర్మచేత ముక్తి చెందుతాడు (18:42-46). క్షత్రియుల ధర్మం యుద్ధం చేయడమే. అందుచేత అర్జునుడు ఎదుర్కొవలసిన యుద్ధంలో అతడు ఆనందించాలి. విషాదంతో ఉండకూడదు. యుద్ధంలో చనిపోతే స్వర్గం. యుద్ధంలో గెలిచి బతికాడా, ఈ లోకాన్ని అనుభవించగలడు (2:21-37).

పైన చెప్పిన గీతా వాక్యాలు బైబిలు ఉపదేశాలకు పూర్తిగా విరుద్ధం. క్రీస్తు నేర్పిన సంగతులకు ఇవన్నీ కేవలం వ్యతిరేకంగా ఉన్నాయి. క్రీస్తుయొక్క బలియజ్ఞం లేకుండా పాప శుద్ధీకరణ ఉందని భగవద్గీత సూచిస్తుంది. సరైన విధానంలో క్రియ చేస్తే, మోక్ష సిద్ధి ఉందని చెపుతుంది. కానీ బైబిలు చెప్పేదేమంటే, మానవుడి పాపం ఘోరమైనది. మానవుడు స్వప్రయత్నంతో శుద్ధి కోసం ఎంత పని చేసినా అదంతా వ్యర్థమే. మానవుడికి ధర్మశాస్త్రం చేత విమోచన లభించదు. స్వయం

కృషివల్ల లాభం లేదు. స్వధర్మం అవలంబించడం నిష్ఫలం. యోగ అభ్యాసం గానీ, మరి అలాంటిదేదీ గానీ ముక్తికి ఏ మాత్రమూ సహాయపడవు. క్రీస్తు సిలువ తప్ప మరి ఏ విధానమైనా సరే, అది బైబిలు ఉపదేశించినది మాత్రం కాదు. మానవుడి పాపం భయంకరమైనది అనే సత్యాన్ని త్రోసివేసే సిద్ధాంతం ఏదైనా అది బైబిలు సత్యం కానే కాదు.

**మానవుడు దేవుడా?**

అన్ని మతాలు ఒకే విషయాన్ని చెపుతాయనే మాట సరి కాదు అనడానికి ఇంకా రుజువులున్నాయి. చాందొగ్య ఉపనిషత్తులోని "తత్వమసి" అనేది ఉపనిషత్తులన్నిటిలో మహా వాక్యమనీ సారాంశమనీ కొందరు చెపుతారు. "తత్వమసి" అంటే "నీవు అది". "అది" అంటే సర్వ వ్యాప్తమైన ఆత్మ. దీని భావం ఒక మాటలో చెప్పాలంటే మానవాత్మ, దేవాత్మ – ఈ రెండూ ఒకటే. అంటే ఒక విధంగా మానవుడు దేవుడు అని అభిప్రాయం.

ఈ విషయాన్నే పలు విధాలుగా ఉపనిషత్తులు చెపుతాయి. తైత్తిరీయ ఉపనిషత్తులో ఒక యోగి నేను జీవాత్మను అన్నాడు. నేనే బ్రహ్మమును అన్నాడు. నాకు స్వయం ప్రకాశముందని చెప్పాడు. నేను తేజస్సంపన్నుణ్ణి అన్నాడు. నా తేజస్సు పర్వత శృంగమంత ఎత్తు అన్నాడు. నాకు జ్ఞానం వచ్చింది. నేను శాశ్వతుణ్ణి, మృతి లేనివాణ్ణి అంటూ చెప్పుకున్నాడు. బృహదారణ్య కోపనిషత్తు బ్రహ్మము నొందినవాడు అంతటా వ్యాప్తమై ఉన్న పరమాత్మను తనే అని గ్రహిస్తాడు అని నేర్పిస్తుంది. మనమంతా ఎప్పుడూ భగవంతునితో సంపూర్ణ ఐక్యత గలవారమనీ, ఈ జ్ఞానం మనలో కలగాలనీ, ఇది తెలుసుకోవలసినదనీ, అంతకు మించి మరో సత్యం లేదనీ శ్వేతాశ్వతరోపనిషత్తు చెపుతుంది. కైవల్య ఉపనిషత్తు ఇలా చెపుతుంది: ప్రతి ఒక్కడూ నేనే బ్రహ్మమును అని చెప్పగలడు. ఇది గనుక మనకు తెలిసివుంటే బంధ విముక్తిని కలుగుతుంది. ముండకోపనిషత్తు ప్రకారం బ్రహ్మమును ఎరిగినవాడు బ్రహ్మమే అవుతాడు. భగవద్గీత కూడా ఈ విధంగానే చెపుతుంది (13:29–31).

బైబిలు వీటికి భిన్నంగా, వ్యతిరేకంగా నేర్పిస్తుంది అనే విషయం మళ్ళీ చెప్పవలసిన అవసరమేమీ లేదు. ఉపనిషత్తులలో గొప్ప ఉపదేశంగా ఎంచబడిన మహా వాక్యం బైబిలు ప్రకారం మానవుడు పాపంతో నిండిన క్రిమిలాంటివాడు. అన్ని విధాల హద్దులకు లోనైనవాడు. పాపం చేసి చెడిపోయినవాడు. అతని శరీరం, ఆత్మ, జీవం అన్నీ పాపంచేత అపవిత్రాలైపోయాయి. కానీ దేవుడు అతి

పవిత్రుడు. ఆయన సృష్టికర్త, సమస్తాన్ని పరిపాలించేవాడు, మహిమ గలరాజు, సర్వాతీతుడు. ఎవడైనా సరే తనను తాను సృష్టికర్తతో సమానంగా హెచ్చించుకోవడం మూర్ఖత్వమనీ ఘోర దోషమని బైబిలు కనపరుస్తున్నది. బైబిలు ప్రకారం దేవునితో సమానుడు కావడానికి మానవుడు చేసే ప్రయత్నం దుష్టత్వమే, నేను దేవుణ్ణి అని తలపోయడం భయంకర అహంకార భావన. సైతాను అనే పిశాచం ఇదే పాపం చేశాడు. అందుకే వాడు పరలోకంనుంచి వెళ్ళగొట్టబడ్డాడు.

**మతాలన్నీ ఒకటికాదు**

ఇంతకూ తేలే సారాంశమేమంటే, మూల పాఠాల విషయాలలో కూడా మతాలన్నీ ఒకటే కావు, ఒకే సంగతిని చెప్పవు. విభిన్న విషయాలను, ఒక దానికి ఒకటి వ్యతిరేకమైన విషయాలను నేర్పిస్తాయి. మతాలన్నీ ఒకటే అనే ఆలోచన కేవలం అసాధ్యమని తేటతెల్లమే.

మత గ్రంథాలన్నిటిలో రాసిన విషయాలను దేవుడే వెల్లడి చేసి తెలియజేశాడని చెపితే, దేవుడే పరస్పర విరుద్ధమైన సంగతులు చెప్పాడని ఒప్పుకోవలసి ఉంటుంది. దేవుడే తాను చెప్పిన మాటల ద్వారా గలిబిలి చేస్తున్నాడని చెప్పినట్టే. అలా చెప్పిన దేవునికి సత్యం అంటే అంతగా లక్ష్యం లేదని అర్థమిస్తుంది. ఇది కేవలం అసాధ్యం.

ఈ గ్రంథాలన్నీ చెప్పేది ఒకటే అనుకునేవారు మూడు విధాలుగా పొరబడుతున్నారు. కొందరు ఆ మత గ్రంథాలన్నిటినీ చదవలేదు. ఒకవేళ చదివినవారైతే వాటిలో ఉన్న ఈ భేదాలను గమనించలేదోమో. వాటిని జాగ్రత్తగా చదవక ఈ భేదాలు గ్రహించి ఉండకపోవుచ్చు కూడా. జాగ్రత్తగా చదివి గ్రహించారే అనుకోండి. అప్పుడు కూడా అన్నీ ఒకటే అంటున్నారంటే, వారు మనసారా నిజం చెప్పడం లేదన్నమాట. యేసు ప్రభువును అంగీకరించడానికీ, తిరస్కరించడానికీ భేదం వుంది. ఈ రెండూ ఒకటే అంటే అర్థంలేదు. సిలువ మీద ఆయన చేసిన బలియజ్ఞం లేకుండా ముక్తి పొందే ప్రయత్నం చేయడంలో ఆ బలియజ్ఞం మీదే ఆధారపడడంలో ఎంతో భేదం ఉంది. బైబిలులోని దేవుణ్ణి ఆరాధించడంలో, ఆయన నిషేధించినవాటిని పూజించడంలో ఎంతో భేదం ఉంది. మానవుడి ఆత్మ, దేవుని ఆత్మ ఒకటి అనడానికీ, అవి వేరు అనడానికీ ఎంతో వ్యత్యాసం ఉంది. అందుకే నేను చెపుతున్నది – దేవుణ్ణి గురించి ఆయా మత గ్రంథాలు ఒకే విషయాన్ని చెప్పనే చెప్పవు. మానవుణ్ణి గురించి, ముక్తి మార్గాన్ని గురించి ఈ గ్రంథాలు వివిధ విషయాలను నేర్పుతాయి. మనమీ సంగతిని స్పష్టంగా గుర్తించాలి.

"అవునండి మరేం చేద్దాం? ఇవన్నీ పరస్పర వ్యతిరేకంగానే ధ్వనిస్తున్నాయి. అందుచేతే వీటిలో దేనినీ నేను నమ్మను. ఇవన్నీ ఒకదానికొకటి విరుద్ధంగా ఉన్న విషయాలు. వీటికి ఏమీ అర్థమూ పర్థమూ ఉన్నట్టు కనబడదు" అని నీవనవచ్చు. "దీన్నంతా నేను విసర్జిస్తాను" అంటూ నీ తీర్మానాన్ని నీవు వెలిబుచ్చవచ్చు కూడా.

ఇది తెలివైన తీర్మానమనిపించుకోదు. వీటిలో ఒకటి దేవుని నిజ ప్రత్యక్షత అయి ఉంటే, ఒకదానిలో దేవుడు తెలియజేసిన సత్యం ఉంటే, నీ తీర్మానం తప్పు అయి ఊరుకుంటుంది. అందుచేతే నేను చెప్పేదేమంటే, దేవా సత్యాన్ని నాకు చూపు, అని ప్రార్థన చెయ్యాలి.

"నేనో పని చేస్తాను. ప్రతి గ్రంథంలోనుంచి మంచిదంతా సేకరిస్తాను. మిగతాదాన్నంతా తీసి పారేస్తాను" అని మరొకడు అనవచ్చు.

కానీ, ఈ విధానం అన్నిటికంటే ఘోరమైనది. ఇది మొండి విధానమనిపించు కుంటుంది. అంటే, నీవు ఈ మత గ్రంథాలన్నిటిపై అధికారినిగా చేసుకుంటున్నావన్న మాట! నీ స్వంత తలంపులను నీ దేవతగా చేసుకున్నావన్నమాట! ప్రతి మత గ్రంథంలోని శ్రేష్ఠమైనది ఏదో నిశ్చయించుకోవడానికి నీవెవడివి? నేనెవణ్ణి? నాకు శ్రేష్ఠమైనది నీకు భ్రష్టమైనది కావచ్చు. మరో మాట, ఈ గ్రంథాలలో ఏదో ఒకటి దేవుడిచ్చిన సంపూర్ణ సత్యం ఉంటే అప్పుడు నీ గతి ఏమిటి? దేవుని సత్యంలో నీకు అనుకూలమై నీకు తృప్తి కలిగించినదాన్ని ఉంచుకొని, మిగతా సత్యాన్ని విసర్జించడం తెలివైన పనేనా? దేవుని సత్యం ఒక్కటే. అలాంటప్పుడు అందులో కొంత తీసుకొని, దేవుని సత్యం కాని వాటిలో మరి కొంత తీసుకొని, వీటిని కలగలపడానికి మనకెవరు హక్కు ఇచ్చారు?

## యేసుక్రీస్తు నేర్పినదేమిటి?

యేసుప్రభువు నేర్పినదానిలో ఏ మాత్రమూ సందేహం లేదు. దేవునిదగ్గరకు మార్గమేది? అనేదాన్ని గురించి యేసుప్రభువు ఏమి ఉపదేశించాడు? ఆయన దేవుని కుమారుడు, దేవుడు పంపగా వచ్చిన సద్గురువు, గురుదేవుడు. ఆయన ప్రబోధాలేమిటి? అని వెంటనే అడిగి తీరాలి. ఆయన చెప్పినదాని ప్రకారం దేవుని వద్దకు అనేక మార్గాలున్నాయా? ఒక్కటే మార్గమా? ఆయన మాటలు ఇవిగో వినండి!

"నేనే మార్గాన్ని, సత్యాన్ని, జీవాన్ని. నా ద్వారానే తప్ప ఎవరూ తండ్రి దగ్గరకు రాలేరు."[16] మరో సందర్భంలో ఇంతకంటే సూటిగా యేసుప్రభువు మాట్లాడాడు.

"గొర్రెలకోసం నేనే ద్వారాన్ని, నాకు ముందుగా వచ్చిన వారంతా దొంగలు."[17]

శిష్యులు యేసుప్రభువును బాగా గ్రహించారు. నాటి కాలం ప్రజలకు వారిలా నొక్కి చెప్పారు: "పాప విముక్తి ఇంకెవ్వరివల్లా కలగదు. ఈ పేరుననే మనం పాప విముక్తి పొందాలి. ఆకాశం క్రింద మనుషులకు ఇచ్చిన మరి ఏ పేరున మనకు పాప విముక్తి కలగదు."[18]

యేసుక్రీస్తు వాక్కులు, ఆయన శిష్యుల ఉపదేశాలు మిగతా మార్గాలను నిరాకరిస్తున్నాయి. మిగతా నామాలను త్రోసివేస్తున్నాయి. మిగతా రక్షకులను అవతల పెట్టివేస్తాయి. మానవుడి పాప శుద్ధికి ఒకే ఒక మార్గముందని యేసు చెపుతున్నాడు. దేవునికి మధ్యవర్తి ఒక్కడే అంటున్నాడు. దేవుని సన్నిధిలోకి ఒకే మార్గమంటున్నాడు. ఆ మార్గం యేసుక్రీస్తు.

మనుషులు అంటూ ఉంటారు – "దేవుణ్ణి ఆరాధించేటప్పుడు ఏ నామాన్ని ఉపయోగిస్తే ఏమి? మీరొక నామం వాడితే మేము మరొకటి వాడుతాం. కాని, మనమంతా ఆరాధించేది ఒకే దేవుడు." కానీ ఇది సరి కాదు.

నీరు అనేదానికి అనేక పదాలున్నాయి. దాన్ని ఉదకం అనవచ్చు. జలం అనవచ్చు. పానీ అనవచ్చు. ఏ పేరుతో పిలిచినా, నీరు నీరే. ఏ పేరు పిలిచినా నీరు త్రాగి, దాహం తీర్చుకోవచ్చు. మంచిదే గానీ అది నీళ్ళు అని ముందు రూఢిగా తెలుసుకోవాలి. ఎవడో వచ్చి మహా ద్రావకాన్ని పట్టుకుని నీరు అనవచ్చు. విషాన్ని నీళ్ళు అనవచ్చు కూడా. అలా అంటున్నాం గనుక దాన్ని తాగితే కలిగిన ఫలితాలు ఘోరమైనవి కాక మానవు.

పేర్లకు ప్రాముఖ్యమైన స్థానం ఉంది. పేర్లు నామధేయాలు. వాటి ద్వారా వస్తువులను సూచించి తెలుసుకోగలుగుతాం. పేర్ల ద్వారా ఇది ఫలాని వస్తువు అని గుర్తించగలుగుతాం. అలాగే వివిధ అభిప్రాయాలను వేరు వేరుగా సూచించడానికి పేర్లు ఎంతగానో ఉపకరిస్తాయి.

బైబిల్లో పేరు ఒకటి ఉన్నదంటే దానికి ఎంతో అర్థం ఉంటుందన్నమాట. బైబిల్లోని మొదటి భాగంలోని ప్రజలకు దేవుడు ఆజ్ఞాపించినదేమంటే – "వేరే దేవుని పేరు ఉచ్చరించకూడదు. అది నీ నోటనుంచి రానివ్వకూడదు."[19] దేవుడు ఇస్రాయేల్ ప్రజను కనాను అనే దేశానికి పంపాడు. అక్కడి దేవుళ్ళ విషయం దేవుడు – "వాళ్ళ బలిపీఠాలను పడద్రోసి, వాళ్ళ దేవతా స్తంభాలను తుత్తునియలుగా చేసి, వాళ్ళ అషేరాదేవి స్తంబాలను కాల్చి వేసి, వాళ్ళ దేవుళ్ళ విగ్రహాలను కూలద్రోయాలి."[20] ఆ తరువాత దేవుడు ఇలా స్వయంగా చెప్పాడు: "ఆ రోజున దేశంలో విగ్రహాల నామరూపాలు లేకుండా చేస్తాను."[21] మరో

సందర్భంలో దేవుడిలా అన్నాడు: "నేను యెహోవాను. ఇదే నా పేరు. ఇంకెవరికీ నా మహిమను ఇవ్వను. నాకు రావలసిన స్తుతి విగ్రహాలకు చెందనివ్వను."[22]

పేర్లలో ఏమున్నదిలే అనుకొంటే, సర్వాతీతుడైన దేవుడు ఎందుకిలా చెపుతాడా?

బైబిలు ప్రకారం ముక్తి ఒకే ఒక నామంలో ఉంది. ఆ నామం యేసు క్రీస్తు. ఆయన తన శిష్యులను పంపుతూ "ఆయన పేర పశ్చాత్తాపం, పాపక్షమాపణ ప్రకటించడం జరగాలని వ్రాసివుంది."[23]

యేసు క్రీస్తు అనే నామానికి నిశ్చయమైన అర్థం ఉంది. ఆయన ఏమైవున్నాడో అదంతా ఈ నామంలో ఉంది. ఆయన చేసినదంతా ఈ నామంలో ఉంది. ఈ నామంలో అవతార మర్మం ఇమిడి ఉంది. లోకంలో ఆయన జీవించిన జీవితం ఉంది. ఆయన ఉపదేశాలున్నాయి. పాపుల కోసం ఆయన అనుభవించిన మరణం ఉంది. ఆయన మృత్యువును జయించి సజీవంగా లేవడం ఉంది. ఆయన దేవుని కుడిప్రక్కన ఉండి ప్రస్తుతం చేస్తున్న కార్యాలంతా ఈ నామంలో ఉంది. ఈ విధంగా ఆ నామం ఆయనను ఇతరులందరి నుంచి ప్రత్యేకించి చూపుతున్నది. పేరులో ఏముంది? ఏమీ ఎందుకు లేదు? ఎంతో ఉంది.

యేసుప్రభువు తన మహిమను అవతల పెట్టాడు. లోకానికి వచ్చాడు. సిలువ మరణానికి విధేయత చూపాడు. ఈ కారణంచేత – "దేవుడు ఆయనను ఎంతో హెచ్చించాడు. అన్ని పేరులకంటే పై పేరు ఆయనకు ఇచ్చాడు. దీనికి ఫలితంగా యేసు పేరు విని పరలోకంలో గానీ భూమిమీద గానీ, భూమిక్రిందగానీ, ఉన్న ప్రతి ఒక్కరి మోకాలూ వంగాలనీ, తండ్రి అయిన దేవుని మహిమకోసం ప్రతి నాలుకా యేసుక్రీస్తే ప్రభువని ఒప్పుకోవాలనీ దేవుని సంకల్పం."[24]

అందుచే బైబిల్లోని దేవుడు ఈ నామంలోనే ముక్తి ఉందని చెపుతున్నాడు. మరో నామానికి ఆ ప్రభావం లేదు. మనుషులకు మోక్షం ప్రాప్తించడానికి యేసు మాత్రమే పాపుల కోసం చనిపోగలిగాడు. ఇప్పుడు ఆయనే వారికి పాప విముక్తి ప్రసాదిస్తాడు. ఈ ఘనత ఆయనదే. ఇతర నామాలను ఉచ్చరించవద్దని ఖండించి మళ్ళీ అవే నామాల ద్వారా ప్రజలకు దేవుడు మోక్షం ఇస్తాడా? ఇది అసంభవం, అసాధ్యం. అలా చెయ్యను అని దేవుడు తానే చెపుతున్నాడు.

యేసుప్రభువు "నేనే దేవుని దగ్గరికి మార్గాన్ని" అని చెప్పాడు. మార్గం అంటే కేవలం ఏదో ఆధ్యాత్మిక అర్థమని మాత్రమే అని యేసుప్రభువు ఉద్దేశం కాదు. ఈ మార్గం యేసుప్రభువు ఉపదేశాల గురించి మాత్రమే కాదు. యేసుప్రభువు చరిత్రలోని వాస్తవిక వ్యక్తిగా మాట్లాడుతున్నాడు. దేవుని నిజమైన అవతారంగా

మాట్లాడుతున్నాడు. ఆయన నిజంగా బ్రతికినవాడు. దేవుని కుడి చేతి వైపున జీవిస్తున్నవాడు. మనం దేవుని దగ్గరికి రావాలంటే ఈయనే మార్గం. ఈయన చరిత్రలో జీవించిన వ్యక్తి.

ఈ సత్యం ప్రజలు ఇష్టం చూపవచ్చు. లేకపోతే అయిష్టం చూపవచ్చు కూడా. ప్రజలు ఇష్టపడినా, ఇష్టపడకపోయినా ఆయన ఇచ్చిన ఈ సత్యం మాత్రం మారదు. "యేసుకు పరమత సహనం లేదు. అందుకే ఇలా మాట్లాడుతున్నాడు" అని ఎవరో అభ్యంతరం చూపవచ్చు. కానీ, అలాంటివారు ఒకటి మాత్రం మరచిపోకూడదు. వారి వివాదం దేవుని కుమారునితో, వారు మనుషులతో కాదు వివాదం పెట్టుకుంటున్నది. మనుషులే యేసు అంటే సహించకుండా ఉన్నారు. అందుకే ఆయన ఉపదేశాన్ని తృణీకరిస్తున్నారు. అన్ని మతాలూ ఒకటే అనీ, అవి నేర్పించేదంతా ఒకటే అనీ అన్ని మార్గాలూ దేవునివద్దకు చేరుస్తాయి అనే భావన బైబిలు వెల్లడి చేసిన సత్యానికి వ్యతిరేకమైనది, క్రీస్తు ఉపదేశానికి పూర్తిగా భిన్నమైనది.

గురుదేవుడు నేనే దేవునివద్దకు ఏకైక మార్గాన్ని అని ఎందుకు పదే పదే చెప్పాడు? ఆయన ఈ మాట అహంకారంతో, గర్వంతో చెప్పలేదు. ఇది నిజం అని ఆయనకు ఖచ్చితంగా తెలుసు, గనుకనే అలా చెప్పాడు. "నేనే సత్యాన్ని" అన్నాడు యేసుప్రభువు. సత్యమే అయినవాడు "నేనే మార్గాన్ని" అంటున్నాడు. ఆయనసత్యం కాదు అని రుజువు చేస్తేనే ఆయనే మార్గం కాదని రుజువయ్యేది.

క్రీస్తు సత్యం. సత్యమే మానవుణ్ణి విమోచించగలదు. ఆయన దీన్ని గురించి మాట్లాడడమే కాదు, అంతకు మించి చేశాడు. ఈ అంశాలను గురించి ఆయన ప్రసంగించి ఊరుకోలేదు. అంతకు మించి చేశాడు. మన పాపాలను భరించి ఆయన మహా వేదనతో చనిపోయాడు. ఆయన మార్గం సిలువ మార్గం. ఎందుకంటే మానవులను విమోచించడానికి ఇదే ఏకైక మార్గమని ఆయనకు తెలుసు. పవిత్రుడైన దేవుణ్ణి, పాపులైన మనుషులను సమాధానపరచి సఖ్యపరచబడాలంటే, ఇదే మార్గం, సిలువ మార్గం.

ఈ సిలువ వెలుగులోనే మనం ఏమైన ప్రశ్నలడగాలి. మతాలన్నీ ఒకటే అనే భావనకు ఎదురులేని జవాబు సిలువ. మరేదైనా మార్గం ఉంటే దేవుడు తన కుమారుణ్ణి సిలువ మీద చనిపోవడానికి పంపుతాడా చెప్పండి.

ఆ రాత్రి యేసు వేదనామయుడయ్యాడు. రక్తం చెమట కార్చాడు. ఆక్రందన చేశాడు – "నా తండ్రీ! సాధ్యమైతేనీ గిన్నె నా దగ్గరనుంచి తొలగిపోనియ్యి![25] మరునాడే ఆయన సిలువ మీద భయంకరంగా బాధ అనుభవిస్తూ మరణించాడు.

ఎందుకు? సిలువే మార్గం. వేరే మార్గం శూన్యం.

యేసుప్రభువు నేనే మార్గాన్ని అని చెప్పడానికి మరో కారణం ఉంది. మనం ఈ మార్గంలో నడవాలి. దీన్ని చేపట్టాలి. ఇతర మార్గాలు ఉన్నాయనుకొంటే దీన్ని మనం చేపట్టము. మనకు అనుకూలమైన వేరే మార్గాలే గనుక ఉంటే అవే నిజమనుకుంటే సిలువను మనం కోరుకోము. ఎందుకంటే సిలువ మన గర్వాన్ని ఛేదిస్తుంది. స్వార్థాన్ని ఖండిస్తుంది. పాపాన్ని తెగనరుకుతుంది.

దేవుడు అనంతుడు. అందుచేత ఆయనవద్దకు మార్గాలు అనంతమై ఉండాలి అనే వాదం సత్యం కాదు. మార్గమనేది అనంతుడైన దేవుడు నిర్ణయించినదే అయి ఉండాలి. ఈ విధంగా ప్రత్యేకమైన మార్గమే యేసుక్రీస్తు.

## మార్గం

ఈ మార్గం అసలు ఎలాంటిది? దీన్ని చెపట్టడం ఎలాగా అనే విషయాన్ని తేటగా గ్రహించాలి. ఈ మార్గం స్వప్రయత్నం కాదు. మతాలు మార్చినంత మాత్రాన మోక్షం కలగదు. ఆ మాటకొస్తే క్రైస్తవ మతం కానియ్యండి, మరేదైనా కానియ్యండి. ఏ మతం ద్వారా ముక్తి కలగదు. క్రీస్తు అనే ఈ మార్గం అసలు మతం, మతాచార కాండ కానేకాదు. ఈ మార్గం ఒక వ్యక్తి. ఆ వ్యక్తిని మనం స్వీకరించాలి. ఆయనకు విధేయత చూపాలి. ఆయనను ప్రేమించాలి, విశ్వసించాలి, అనుసరించాలి. ఇదే జీవ మార్గం. ఈయనే దేవుని కుమారుడు. ఆయనను విశ్వసించగానే ఆయన మనలోకి వస్తాడు. మనకు ఆయనతో ఐక్యత కలుగుతుంది.

ఈ మార్గం ఎక్కడుందీ? అది ఎక్కడ ఆరంభమైనదీ? నీవు ఎక్కడున్నావో సరిగ్గా అక్కడే ఈ మార్గం ప్రారంభమవుతుంది. ఆయనను కనుక్కునేందుకు మనమేమీ దీర్ఘమైన తీర్థ యాత్రలు చేయనక్కరలేదు. మానవుల చేతులతో కట్టబడిన దేవాలయంలో ఆయన జీవించడు. పుణ్య క్షేత్రాలలో కనబడే దేవాలయాలలో ఈయన జీవించడు. పుణ్య క్షేత్రాలలో ఆయన కనబడడు. నేనూ నీవూ ఉన్నచోటనే ఈ మార్గం ప్రారంభమౌతున్నది. మార్గం సరిగ్గా మన హృదయం తలుపు దగ్గరే ఉంది. ఈ మార్గం ఎక్కడికి వెళుతుంది? చైతన్యం లేని నిర్జీవమైన పదార్థతుల్యమైన దైవత్వానికి కాదు. క్రూరుడై కసి తీర్చుకునే దేవత దగ్గరికి కాదు. అగమ్య గోచరమైన అంధకారంలోకీ కాదు. తెలియని అదృష్ట దేవత దగ్గరికి కూడా కాదు. భయంకరమైన తీర్పుకూ కాదు. నిర్వకల్ప సమాధికీ కాదు. నిష్చైతన్యతా మహా సముద్రంలోకీ కాదు. ఉనికీ మనికీ లేని స్థితికి కాదు. ఇలాంటిదేదీ కాదు. ఈ

మార్గం పరమ తండ్రిదగ్గరికి చేరుస్తుంది.

"నా ద్వారానే తప్ప ఎవరూ తండ్రి దగ్గరకు రాలేరు." ఈ మార్గం మనలను పరలోక నివాసానికి చేరుస్తుంది. తండ్రియైన దేవుని హృదయానికి చేరుస్తుంది. తండ్రియైన దేవుని మహిమకు కొనిపోతుంది. తండ్రియైన దేవుని శాశ్వత సన్నిధికి చేరుస్తుంది. తండ్రియైన దేవుని నిత్య రాజ్యంలోకి రప్పిస్తుంది. క్రీస్తు మార్గం ఇదే.

మనమంతా ఈ మార్గాన్ని స్వీకరిస్తే ఎంతో మంచిది. దేవుడు తన మహా ప్రేమతో ఈ మార్గాన్ని మనకోసం సిద్ధం చేశాడు. ప్రియ మిత్రమా, ఈ మార్గాన్ని నీవు స్వీకరించి అనుసరించు.

**ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. యెషయా 53:6
2. నిర్గమ 20:3-5
3. నిర్గమ 34:14
4. ద్వితీ 8:19
5. లేవీ 26:1
6. ద్వితీ 27:15
7. 1 యోహాను 5:21
8. 1 కొరింతు 10:20
9. ద్వితీ 17:2-5
10. యిర్మీయా 1:16
11. ప్రకటన 21:8
12. 1 కొరింతు 6:9,10
13. రోమ్ 1:18-25
14. యెషయా 44:8
15. మత్తయి 4:10
16. యోహాను 14:6
17. యోహాను 10:7,8
18. అపొ కా 4:12
19. నిర్గమ 23:13
20. ద్వితీ 12:3
21. జెకర్యా 13:2
22. యెషయా 42:8
23. లూకా 24:47
24. ఫిలిప్పీ 2:9-11
25. మత్తయి 26:39

# 11 నిజమైన శిష్యులు

యేసుక్రీస్తు దేవుని కుమారుడు. తండ్రి ఆయనను ఈ లోకంలోకి పంపాడు. ఆయన సద్గురువు, సత్య గురువు. ఆయనే ముక్తి మార్గాన్ని చూపగలడు. ఆయనకు యథార్థమైన శిష్యులు కావాలి.

ఆయన ఈ లోకంలో సేవ చేసిన రోజుల్లో శిష్యులను కొందరిని పిలుచుకున్నాడు. నన్ను అనుసరించండని ఆదేశించాడు. నాదగ్గర నేర్చుకోండి అన్నాడు. చిట్టచివరకు ఆయన తనను మానవ పాపపరిహార్థం కోసం బలిచేశాడు. చనిపోయి సమాధి చేయబడ్డాడు. తరువాత సజీవంగా లేచాడు. నలభై రోజుల తరువాత అదృశ్య లోకంలోకి తిరిగి ప్రవేశం చేశాడు. చనిపోకముందు ఆయన ఆరంభించిన పనిని ఇప్పటికి కొనసాగిస్తూ ఉన్నాడు.

ఇప్పుడు మనకు ఆయన శారీరక స్వరూపం కనబడదు. ప్రథమ శిష్యులు ఆయన్ను చూడగలిగినట్టు మనమిప్పుడు ఆయన్ను భౌతిక నేత్రాలతో చూడలేము. కాని, ఆయన ఆత్మద్వారా ఈ లోకంలో ఉన్నాడు. శిష్యులను రమ్మని ఇంకా పిలుస్తూనే, వారికి ఉపదేశిస్తూనే ఉన్నాడు. దేవునికోసం జీవించేందుకు వారిని సిద్ధం చేస్తూనే ఉన్నాడు. మనలను తనవైపు త్రిప్పుకుంటున్నాడు. అంటే మనలను శిష్యత్వానికి పిలుస్తున్నాడన్నమాట. మనకు తనలోని యథార్థ విశ్వాసాన్ని ఇస్తున్నాడు. ఆ విశ్వాసమే మనలను శిష్యులనుగా రూపొందిస్తుంది. అదే విశ్వాస ప్రబోధం రెండు వేల సంవత్సరాల క్రిందట ఆయన ఇస్రాయేల్ దేశంలో ఉపదేశించినప్పుడు శిష్యులలో పని చేసింది.

ఇంతకు శిష్యుడంటే ఎవరు? క్రీస్తును ప్రభువుగా, రక్షకుడుగా , ముక్తిదాతగా విశ్వసించి స్వీకరించేవాడే శిష్యుడు. అంతేకాదు, శిష్యుడు క్రీస్తును గురువుగా స్వీకరిస్తాడు. ఆయన ఆజ్ఞలకు లోబడుతాడు. సత్యమేదో ఆయనదగ్గరే నేర్చుకొంటాడు. సత్యాన్ని ఎలా ఆచరణలో పెట్టాలో ఆయనదగ్గరే నేర్చుకొంటాడు. ఎవరైనా క్రీస్తును నిరాకరిస్తే శాశ్వత నాశనం తప్పదు. ఇది ఆయనే నేర్పిన విషయం. ఆయనను నిజంగా స్వీకరించి ఆయన శిష్యులమైతే మనకు గొప్ప ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయి. ఇహపరాలలో ఆశీర్వాదాలు కలుగుతాయి.

మొదటిది: మనకు విశ్రాంతి కలుగుతుంది. గురుదేవుడు సెలవిచ్చాడు.

“భారం మోస్తూ అలసిపోయిన సర్వ ప్రజలారా! నా దగ్గరికి రండి, మీకు విశ్రాంతి ప్రసాదిస్తాను. నా కాడి మీమీద ఎత్తుకొని నా దగ్గర నేర్చుకోండి, నేను సాధుశీలుణ్ణి, అహంభావం లేనివాణ్ణి, గనుక మీ ప్రాణాలకు విశ్రాంతి దొరుకుతుంది. ఎందుకంటే, నా కాడి మృదువైనది, నా భారం తేలికైనది”.

బ్రతుకు పోరాటంలో ఆయాసమవుతున్న వారికి, విసికి వేసారిపోయినవారికి ఇది ఎంతో విలువైన మాట! శాంతీ, విశ్రాంతీ లేని ఈ లోకంలో యేసు క్రీస్తు శిష్యులకు ఆయన మూలంగా ఇవి దొరుకుతాయి.

మరోమాట – ఆయన శిష్యులమైతే, మనం సత్యాన్ని గ్రహిస్తాం. గురుదేవుడు పలికిన మాట ఇంతకుముందే చెప్పాము గాని దీన్ని మళ్ళీ చెప్పవలసిన అవసరమెంతో ఉంది. “మీరు నా వాక్కుల్లో నిలిచి ఉంటే నాకు నిజమైన శిష్యులుగా ఉంటారు. అప్పుడు మీరు సత్యం గ్రహిస్తారు, సత్యం మీకు విడుదల కలిగిస్తుంది.” శిష్యులు తెలుసుకునే ఈ సత్యమేమిటి? దేవుణ్ణి గురించిన సత్యం క్రీస్తును, మనలను గురించిన సత్యం. ముక్తి మార్గాన్ని గురించిన సత్యం. క్రీస్తు శిష్యులు సత్యాన్ని గురించి ఊహాగానం చేయవలసిన అవసరమేమీ లేదు. దాన్ని తెలుసుకునే ప్రయత్నంలో అక్కడకీ ఇక్కడికీ తిరుగాడవలసిన అవసరం కూడా లేదు. మనం ఆయన వాక్కును స్వీకరించి ఆయన చెప్పినట్లు చేస్తే మనకు సత్య సందర్శనం కలిగిందని అర్థం. ఈ విషయాలను గురించి మధురమైన నిశ్చయత మనకు అబ్బుతుంది. ఆయన శిష్యులంగా సంపూర్ణ పాపక్షమాపణ అనుభవించగలం. మనకు శాశ్వత జీవం ఉందని తెలుసుకుంటాం. మనకు సత్యం ఉందని గ్రహిస్తాం. ఇది చీకటి లోకం. ఈ లోకం అనిశ్చితమైనది. అశాశ్వతమైనది. కనుక ఈ వెలుగు, ఈ జ్ఞానప్రాప్తి మనకు ఎంతో అమూల్యం.

మనం ఆయన శిష్యులమైనప్పుడు దేవుని ఆత్మ మనలో నివసించసాగుతాడు. యేసుప్రభువు తన శిష్యులకు ఈ విషయం చాలా సార్లు చెప్పాడు. సత్య స్వరూపియైన ఆత్మను పంపుతానని శిష్యులతో చెప్పాడు. లోకం దేవుని ఆత్మను ఎరగలేదు. ఈ పవిత్రాత్మ శిష్యులలో ఆదరణకర్తగా ఉండి వారికి సహాయం చేస్తాడనీ, వారికి సత్యాన్ని నేర్పుతూ వారిని సర్వ సత్యంలోకి నడిపిస్తాడనీ వారిలో ఎల్లప్పుడు నివాసం చేస్తాడనీ చెప్పాడు యేసు.

క్రీస్తు ఇచ్చే సర్వ శ్రేష్ఠమైన ఉచిత వరం పవిత్రాత్మ లోకంలో ఉన్న అసంఖ్యాక ప్రజానీకంలో ఈ వరాన్ని అనుభవించగలవారు క్రీస్తు శిష్యులు మాత్రమే. క్రీస్తును స్వీకరించినవారికి మాత్రమే దేవుడు తన ఆత్మను ప్రసాదిస్తాడు. బైబిలు ప్రకారం మరింకెవ్వరిలోనూ పవిత్రాత్మ నివాసం చెయ్యడు.

అంతేకాదు. క్రీస్తు శిష్యులకు శాంతి, ఆనందాలు కూడా ఉంటాయి. యేసుప్రభువు లోకాన్ని విడిచివెళ్ళే సందర్భమది. అప్పుడాయన శిష్యులతో ఇలా అన్నాడు: "శాంతిని నేను మీకిచ్చి వెళ్ళిపోతాను." నా ఆనందం మీలో ఉండాలనీ మీ ఆనందం లోపం లేనిదిగా ఉండాలనీ ఈ సంగతులు మీకు చెప్పాను. లోకంలో మీకు బాధలు వస్తాయి. అయినా ధైర్యంగా ఉండండి. నేను లోకాన్ని జయించాను." ఆనందం, శాంతి – వీటికోసం లోకం అర్రులు చాచుతూ ఉన్నా లోకానికి ఇవి లభించడం లేదు. యేసు శిష్యులకు ఆయన మూలంగా ఇవి దొరుకుతాయి. యేసుప్రభువు తన నమ్మకస్తులైన ప్రజలకు, ఆయన అనుచరులకు వీటిని ఉచితంగా ఇస్తున్నాడు. యేసు శిష్యులు ఎప్పుడూ దుఃఖంతో ఉన్నవారమైనా ఎప్పుడూ ఆనందిస్తూ ఉన్నవారమే?" అంటూ తన అనుభవాన్ని వ్యక్తం చేశాడు. ఇలాంటి అనుభూతి యేసు శిష్యులందరికీ కలుగుతుంది.

మనం యేసు శిష్యులమైతే, ఇంకా అనేకాలైన ఆశీర్వాదాలు మనకు కలుగుతాయి. అంతేకాదు – ఇహలోక జీవితం ముగించాక, దేవుని సన్నిధిలో పరమానంద దాయకమైన మోక్షం శాశ్వతంగా అనుభవిస్తాం. యేసుప్రభువు ఈ విధంగా చెప్పాడు – "ఎవరైన సరే, నా కోసం, శుభవార్తకోసం ఇంటిని గానీ అన్నదమ్ములను గానీ, అక్కచెల్లెళ్ళను గానీ తల్లిని గానీ తండ్రిని గానీ పిల్లలను గానీ భూములను గానీ వదిలివేస్తే ఆ వ్యక్తికి ఇప్పుడు ఇహంలో ఇండ్లూ అన్నదమ్ములూ అక్కచెల్లెళ్ళూ తల్లులూ పిల్లలూ భూములూ హింసలతోపాటు నూరు రెట్లు దొరకక తప్పదు. వచ్చే యుగంలో అలాంటి వ్యక్తికి శాశ్వత జీవం ఉంటుంది."

ఈ వాగ్దానం ఇహలోకంలోని ఆస్తిపాస్తులను గురించి కాదు. ఆధ్యాత్మిక సంపత్తును గురించిన వాగ్దానమిది. ప్రేమ, సహవాసం, దేవుని ప్రజలతో సమైక్యత, దేవుని కుటుంబంలోని నిత్య సహవాసం – మొదలైన ఆధ్యాత్మిక ఐశ్వర్యానికి సంబంధించిన వాగ్దానమిది.

పైన ఉదహరించిన బైబిలు వచనంలో "హింసలు" అనే మాటను గమనించండి. "లోకంలో మీకు బాధలు కలుగుతాయి." క్రీస్తు నిజమైన శిష్యులపట్ల లోకం విరుద్ధ భావంతో ఉంటుంది. పైకి అలాకనిపించకపోయినా ఇది మాత్రం నిజం, యేసును ప్రేమించనివారి చేతిలో క్రీస్తు శిష్యులను ఆనందంతో కౌగలించుకుంటుందనే మాట కల్ల. మీకు కష్టాలు వస్తాయి. ఆటంకాలు ఎదురౌతాయి. ఇబ్బందులూ బాధలూ తప్పనిసరి అవుతాయని క్రీస్తు తన శిష్యులను హెచ్చరించాడు. సత్య మార్గం సులభమని ఆయన ఎన్నడూ చెప్పలేదు. కష్టాల నడుమ, బాధలమధ్య దేవుడు వారికి తోడుగా ఉంటాడు. దేవుని

శాంతి వారికి ఉంటుంది.

ఎన్ని కష్టాలు వచ్చినా, ఎన్ని విషమ పరీక్షలు వచ్చినా యేసుక్రీస్తు శిష్యుడు కావడంకంటే మహా భాగ్యం మరొకటి లేదు. యేసుప్రభువు సర్వ శక్తిమంతుడు, దయామయుడు, నమ్మదగినవాడు. ఆయన గురుదేవుడు, ఆయనను అనుసరిస్తూ ఉండగా మనకు లెక్కలేని ఆశీర్వాదాలు లభిస్తాయి. అవన్నీ ఇక్కడ మనం వివరించలేము. యేసు శిష్యులు దేవుని తోడు, సహవాసం అనుభవిస్తారు. అంతే కాదు, ప్రతి ఆధ్యాత్మిక ఆశీర్వాదమూ వారిదే అవుతుంది. ప్రేమతో మనుషులను ఆయన ఇలాంటి శిష్యత్వానికే పిలుస్తున్నాడు. యేసుప్రభువు బలహీనులను, పాపులను సహా ఆయన పిలుస్తున్నాడు.

మనం ఆయన శిష్యులం కావాలంటే, పొందబోయే ఆశీర్వాదాలను తలపోయడంతో సరిపోదు. శిష్యత్వానికి నియమాలున్నాయి, షరతులున్నాయి. ఈ ఆశీర్వాదాలన్నీ ఒక ప్రత్యేకమైన తరగతికి చెందినవారే అనుభవించ గలుగుతారు. వీటినీ అనుభవించాలంటే ఈ క్రింద షరతులను పాటించాలి.

**షరతులు**

ఆయన కాడి ఎత్తుకొని ఆయన దగ్గర నేర్చుకోవాలి. ఇది శిష్యత్వానికి యేసుప్రభువు నిర్దేశించిన మొదటి షరతు. దీని భావమేమటి? విశ్రాంతి లేకుండా దాస్యం చెయ్యాలనా? విధి విరామం లేకుండా చాకిరీ చెయ్యాలనా? అలాంటిదేమి కాదు. లోగడ మనం నేర్చుకొన్నట్లు దీనికి అర్థం శాంతి, నిజమైన విమోచన.

ఆయన కాడి ఎత్తుకోవడమంటే, స్వేచ్ఛగా, ఇష్టపూర్వకంగా ఆయనతో ఏకీభవించడం, సంయుక్తపరచుకోవడం, మన చిత్తమూ, జీవితమూ, హృదయమూ ఆయనతో జత చేయడానికి చేసుకునే తీర్మానమిది. వ్యక్తిగతంగా, ప్రగాఢంగా మనలను మనమే ఆయనతో సమైక్యపరచుకోవడం. ఆయనకు లోబడడం, ఆయనతో నడవడం, ఆయనను సేవించడం, ఆయనతో ఆనందించడం, విశ్రమించడం.

ఆయన శిష్యులు ఆయనకు తమ హృదయంలో ప్రథమ స్థానం ఇవ్వాలి. ఆయనను అత్యధికంగా ప్రేమించాలి. ఎవరికంటే కూడా ఆయన్నే ఎక్కువగా ప్రేమతో చూడాలి. మన కుటుంబంలో మన ప్రియులకంటే కూడా ఆయనను ఎక్కువగా ప్రేమించాలి. “నామీది ప్రేమకంటే తండ్రి మీద గానీ తల్లి మీద గానీ ఎక్కువ ప్రేమగలవారు నాకు తగినవారు కారు. నా మీది ప్రేమ కంటే, కొడుకుమీద గానీ కూతురుమీద గానీ ఎక్కువ ప్రేమ గలవారు నాకు తగినవారు

కారు."[6]

మరో సందర్భంలో యేసుప్రభువు "నా దగ్గరకు వచ్చేవాడెవడైనా సరే, తన తండ్రినీ తల్లినీ భార్యనూ పిల్లలనూ అన్నదమ్ములనూ అక్కచెల్లెళ్ళనూ తన ప్రాణాన్ని కూడా ద్వేషించకపోతే నా శిష్యుడు కాలేడు" అన్నాడు.[7] అంటే మిగతా అందరికంటే యేసుప్రభువును ఎక్కువగా ప్రేమించాలి అని అర్థం. అంతేకాదు, మనలను మనం పరిత్యజించుకోవాలి. మరో చోట ఆయన అన్నాడు – "ఎవరైనా సరే, నా వెంట రావాలనుకొంటే, తనను పరిత్యజించుకొని తన సిలువ ఎత్తుకొని నన్ను అనుసరించాలి"[8] "తన సిలువ మోసుకొంటూ నా వెంట రానివాడెవడూ నా శిష్యుడు కాలేడు" అని కూడా అన్నాడు.[9] సిలువ మరణాన్ని ప్రకటిస్తుంది. మనం స్వార్థాన్ని పైకెత్తి దాన్నే దేవుడై ఉన్నట్టు బ్రతకకూడదు. స్వార్దాన్ని విసర్జించాలి. దాన్ని, మనల్ని కూడా మరణ పాత్రులమని భావించాలి. మన పాపాలను బట్టి మనం సిలువపై ఉండదగినవాళ్ళమని గ్రహించాలి. పాత జీవితానికి చనిపోయేందుకు సంసిద్ధం కావాలి. స్వార్థ విధానాలకు చనిపోవాలి. మనలను మనం మెప్పించుకునే విధానాలు అంతరించాలి. యేసు క్రీస్తు మన యజమాని. క్రీస్తులో క్రొత్త జీవితాన్ని ప్రారంభించాలి. స్వచ్ఛందంగా తీర్మానించుకోవాలి.

మరొకటి, ఇహ లోకంలోని ఆస్తిపాస్తుల పట్ల సరైన ఆలోచన ఉండాలి. గురుదేవుడు ఇలా అన్నాడు: "మీలో తనకున్నవన్నీ వదులుకోనివాడెవడైనా సరే, నా శిష్యుడు కాలేడు."[10] ఈ మాట అర్థమేమిటి? యేసు శిష్యులు ఇల్లు వాకలి విడిచిపెట్టి సంచారం చేస్తూ బిక్షకులు కావాలనా? అలా కాదు. బైబిలు ఆ విధంగా ఎన్నటికీ చెప్పదు. మన హృదయంలో లోకంలోని వస్తువులకు గల సంబంధాన్ని సరిచేసుకోవాలి. వాటికి అంటుకుపోకూడదు, వాటికోసం జీవించకూడదు. మనకున్నది మన స్వంతమనీ, ఇష్టం వచ్చినట్లు దాన్ని వాడుకోవచ్చునని తలంచకూడదు. యేసు శిష్యులు తనకున్నదంతా దేవునిదే అని గుర్తిస్తారు. తాము దానికి కార్యకర్తలు మాత్రమే. అందులో కొంత ఉంచుకొని, దేవుని మహిమకోసం వాడవలసిందిగా దేవుడు చెపితే ఉంచుకోవచ్చు. ఉన్నదంతా అక్షరాలా ఇచ్చి వేయవలసిందని తేటగా ప్రభువు నీతో చెపుతున్నట్లు గ్రహిస్తే అలా ఇచ్చివేయాలి. డబ్బుకోసం, వస్తు సముదాయం కోసం పేరాశతో తమ జీవితాలను పూర్తిగా పాడు చేసుకొన్నవారున్నారు. అయితే యేసు శిష్యులు ఇహ లోకంలోని ఆస్తికోసం బ్రతకకూడదు. మనకోసం చనిపోయి సజీవంగా లేచిన యేసు కోసమే బ్రతకాలి.

యేసుక్రీస్తు తెలియజేసిన షరతులు ఇవే. శిష్యులందరూ వీటిని తప్పకుండా అనుసరించాలి. యేసును గురించి మనసు, ధోరణి సరిగా ఉండాలి. ఇతరులపట్ల

మన మనసు, ధోరణి సరిచేసుకోవాలి. లోకంలో మనకున్న ఆస్తి విషయంలో కూడా సక్రమమైన మనసు, ధోరణి మనకుండాలి. లేకపోతే మనమాయన శిష్యులం కాలేము. ఈ షరతులు ఎలా ఉన్నాయి? కఠినంగా ధ్వనిస్తున్నాయా? తెలివైన వనిపించడం లేదా? కష్టసాధ్యంగా తోస్తున్నాయా? ఆయనను స్వీకరించి విశ్వసించి, ఆయనను ప్రేమించినవారికి ఇవి కఠినంగా తోచనే తోచవు. ఆయన నిజంగా ఎవరో, ఎలాంటివాడో జాగ్రత్తగా చూడాలి. ఆయన ఇచ్చే ముక్తి ఎంత విలువైనదో గ్రహించాలి. దేవుడు మనలో పశ్చాత్తాపం, విశ్వాసం కలిగించాలి. అప్పుడు క్రీస్తును స్వీకరించి అనుసరించడంలో ఇవేవీ అడ్డు రావు. నిజంగా ఈ షరతులు ఎంత సహేతుకమైనవో, సరైనవో, తెలివైనవో, అవసరమైనవో గుర్తించగలుగుతాం. పాపమనేది ఘోరమైన వ్యాధి. ఇది మనిషిని సమూలంగా తినివేస్తుంది. అందుచేత దీనికి గట్టి చికిత్స కావాలి.

**విధులూ, హక్కులూ**

యేసు శిష్యులు కాదలచుకున్నవారికి కొన్ని షరతులున్నాయి. అలాగే ఆయన శిష్యులైనవారికి కొన్ని విధులూ కొన్ని హక్కులూ కూడా ఉన్నాయి సంక్షిప్తంగా కొన్నిటిని పరిశీలిద్దాం.

**దేవుని వాక్కును చదవాలి–**

వారు దేవుని వాక్కును చదవాలి. "మీరు నా వాక్యాలలో నిలిచి ఉంటే నాకు నిజమైన శిష్యులుగా ఉంటారు"[11] అన్నాడు యేసుప్రభువు. ఆయన చెప్పినదేమిటో ఎంతో కృషిచేసి మరీ తెలుసుకోవాలి. ఆ తరువాత ఆయన చెప్పినదంతా దేవుని సత్యమని భావించి స్వీకరించాలి. దేన్ని గురించి వాదం పెట్టుకోకూడదు. సందేహించకూడదు. నిర్లక్ష్యం చేయకూడదు. దిగజారిపోకూడదు. మన దగ్గర బైబిలు లేకపోతే ఏ విధంగానైనా ఒకదాన్ని సంపాదించుకోవాలి. దాన్ని చదవాలి. అది దేవుని వాక్కు. అదే మన ఆత్మలకు సరైన భోజనం. మన ఆధ్యాత్మికమైన పెరుగుదలకు అది అత్యవసరం. "పాపవిముక్తి విషయంలో వాక్కు సంబంధమైన స్వచ్ఛమైన పాలవల్ల పెరిగేలా, కొత్తగా పుట్టిన శిశువులాగా ఆ పాలను ఆశిస్తూ ఉండండి."[12]

బైబిలు చదువుకోవడానికి ప్రతి రోజూ కొంత సమయాన్ని ప్రత్యేకించుకోవాలి. ఆరంభంలో నాలుగు శుభవార్తలు చదవడం మంచిది. వీటిలో యేసు క్రీస్తు చెప్పిన మాటలు రాసి ఉన్నాయి. ఆ తరువాత "క్రొత్త ఒడంబడిక"లోని మిగతా పుస్తకాలు చదవాలి. ఆ తరువాత "పాత ఒడంబడిక" కూడా చదవాలి. మన ఆధ్యాత్మిక

జీవితాలకు బైబిలు పఠన ఎంతో విలువైనది.

బైబిలు చదువుతూ దేవుని మాటలకు లోబడాలి. విధేయత ప్రాముఖ్యం ఊరికే బైబిలు చదవడం చాలదు. విషయాలు తెలుసుకుందామనే ఆసక్తితో బైబిలు ఊరికే చదివినందువల్ల ప్రయోజనం లేదు. క్రీస్తు మన ఆదరణ నిమిత్తమే ఇన్ని మాటలు మనకు చెప్పాడు. "నా ఆజ్ఞలు కలిగి వాటిప్రకారం బ్రతికేవారే నన్ను ప్రేమించేవారు. నన్ను ప్రేమించేవారిని నా తండ్రి ప్రేమిస్తాడు."[13] "మీరు నన్ను ప్రభూ! ప్రభూ! అని పిలుస్తూ నేను చెప్పినట్టు చేయకపోవడం ఎందుకని?"[14] యేసు శిష్యులలో ఒకడు ఈ విధంగా చెప్పాడు – "నేను ఆయనను తెలుసుకున్నాను అని ఎవరైనా చెప్పిన ఆయన ఆజ్ఞలు శిరసావహించకపోతే అతడు అబద్ధికుడు. అతనిలో సత్యం లేదు."[15]

యేసుక్రీస్తు గొప్ప ఉపదేశకుడనీ మహా గురువనీ మెచ్చుకొంటూ, ఆయనను అనుసరిస్తూ, ఆయన ఉపదేశాల ప్రకారం చేయకపోతే, ఆ స్తుతి పొగమంతా వ్యర్థమే అవుతుంది. యేసు క్రీస్తుకు మన పొగడ్తలేమీ అక్కర్లేదు. ఆయనకు మన విధేయత కావాలి.

మనం ఆయన వాక్కులో నిలిచి ఉండాలి. ఉంటే ఎడతెగక వాక్కును ధ్యానం చెయ్యాలి. విశ్వాసముంచాలి. విధేయత చూపాలి. ఎలాంటి కష్టాలు ఇబ్బందులు వచ్చినా, మానకూడదు. సైతాను తన శక్తినంతా ప్రయోగించి మనలను నిరుత్సాహపర్చాలని చూస్తాడు. మనం వెనక్కు పోవాలని వాడి ఉద్దేశం. క్రీస్తులోని విశ్వాసం విడనాడాలని వాడి ప్రయత్నం. అనేక చోట్లనుండి నిరుత్సాహకరమైన ఆటంకాలు వచ్చి ఎదురౌతాయి. గానీ వీటన్నిటిని మనం జయించగలం. జయించి తీరాలి. మనలను ప్రేమిస్తున్న యేసుక్రీస్తు ద్వారా ఇదంతా చేయగలం. యేసు శిష్యుల జీవితంలో జరిగే గొప్ప సంగతి ఇదే – ఎన్ని పరీక్షలు, శోధనలు వచ్చినా క్రీస్తుతో ముందుకు సాగాలి. వెనకపడిపోయి, ఇంత గొప్ప ముక్తిని నిర్లక్ష్యం చేయడం విషాదకరం, అపాయకరం.

### ప్రార్థించాలి–

శిష్యులు ప్రార్థించడం నేర్చుకోవాలి. "మీరు నిరుత్సాహ పడకుండా నిత్యమూ ప్రార్థన చూస్తూ ఉండాల"ని యేసు వారికి చెప్పాడు.[16] ప్రభు విశ్వాసులందరికీ దేవుని సన్నిధిలోకి రావడానికి హక్కు ఉంది. క్రీస్తు పేరట వారందరూ దేవ సన్నిధిలో ప్రవేశించగలరు. దేవుడు తమ ప్రార్థనలను వింటున్నాడని వారు తెలుసుకోవాలి. మనం ఇతరుల కోసం ప్రార్థన చెయ్యాలి. లోకంలో దేవుని కార్యం

కొనసాగాలని ప్రార్థించాలి. మన అక్కరల కోసం కూడా ప్రార్థించాలి. మనుషులకు ఎల్లప్పుడూ దేవుని కృప అవసరం. దేవుడిచ్చే బలం, సహాయం విశ్వాసులు అడిగి పొందాలి. వీటిని పొందడానికి ప్రార్థనే దేవుడు ఏర్పాటు చేసిన సాధనం. "అడగండి, మీకు ఇవ్వబడుతుంది. వెదకండి మీకు దొరుకుతుంది" అన్నాడు యేసుప్రభువు.[17]

బైబిలు చదువుతూ ఉంటే ప్రార్థనలో ఏమేమి విషయాలు అడగాలో మనకు బోధపడుతుంది. దేవుని ఈవులకోసం, ఆశీర్వాదాల కోసం ఆయనను స్తుతించడం నేర్చుకుంటాం. దేవుడు మన ప్రార్థనలు వింటాడు. ప్రార్థనలకు జవాబులిస్తాడు. ప్రతి రోజూ మన హృదయాలను ఆయనవైపుకు ఎత్తిపట్టడం అభ్యాసం చెయ్యాలి. కృతజ్ఞతాస్తుతులతో మనవులు ఆయనకు తెలియజేయాలి. బైబిలు పఠనతోపాటు నిర్ణీత సమయంలో ప్రార్థన చేయడం చాలా మంచిది. కానీ మనం ఎక్కడైనా ప్రార్థించవచ్చు. ఏ స్థలంలోనైనా ప్రార్థించవచ్చు. ఆయన మన ప్రార్థనలు వింటాడు.

**బహిరంగంగా ఒప్పుకోవాలి–**

క్రీస్తును బహిరంగంగా ఒప్పుకోవాలి. యేసు అన్నాడు – "నన్ను ఎరుగుదుమని మనుషుల ఎదుట ఒప్పుకొనేవారిని పరలోకంలో ఉన్న నా తండ్రి ఎదుట ఎరుగుదునని నేనూ ఒప్పుకుంటాను. కానీ మనుషుల ఎదుట నన్ను ఎరుగననే వారిని పరలోకంలో ఉన్న నా తండ్రి ఎదుట నేనూ ఎరగనంటాను."[18] "యేసు ప్రభువని మీ నోటితో ఒప్పుకొని దేవుడు ఆయనను చనిపోయిన వారిలోనుంచి సజీవంగా లేపాడని మీ హృదయంలో నమ్మితే మీరుపాపవిముక్తి, రక్షణ పొందుతారు. ఎందుకంటే, మనిషి హృదయంలో నమ్మితే మీరు పాపవిముక్తి, రక్షణ పొందుతారు. ఎందుకంటే, మనిషి హృదయంలో నమ్ముతాడు, దాని ఫలితంగా న్యాయవంతుల లెక్కలోకి వస్తాడు. నోటితో ఒప్పుకొంటాడు. దాని ఫలితంగా పాపవిముక్తి, రక్షణ."[19]

రహస్యంగా నమ్ముకోవడం అనేదాన్ని బైబిలు ప్రోత్సహించదు. అలాంటిది మనం ప్రయత్నించరాదు. మనకు సిగ్గు అనిపిస్తే, భయం కలిగితే, మౌనంగా ఉండిపోతే, మనం క్రీస్తును విశ్వసించామని ఇంకా అనుకోవడం మట్టుకు ఎందుకు? శిష్యులు తోడి మనుషులకు సాక్షులు. వారికి కూడా క్రీస్తు శుభవార్త అవసరం. ఇతరులకు చెప్పడం మన విధి. అలా చెప్పే హక్కు మనకు ఉంది.

**బాప్తిసం–**

శిష్యులు బాప్తిసం అనే నీటి సంస్కారం పొందాలి. శిష్యులతో యేసు చెప్పిన మాట – "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనాలను శిష్యులుగా చేయండి. తండ్రి, కుమార, పవిత్రాత్మ పేరట వారికి బాప్తిసం ఇవ్వండి."[20] "దాన్ని నమ్మి బాప్తిసం పొందే వ్యక్తికి పాపవిముక్తి, రక్షణ దొరుకుతుంది. నమ్మని వ్యక్తికి శిక్షావిధి కలుగుతుంది."[21]

విశ్వాసి క్రీస్తుతో సంయుక్త పరచుకుంటున్నాడనే బహిరంగ సాక్ష్యమే బాప్తిసం. అంతేకాదు, ప్రభు ప్రజలతో కూడా ఇతడు సమైక్యత పొందుతున్నాడనేది ఇందులో విశదమవుతుంది. ఇది పాత జీవితానికి చనిపోయాడనడానికి సూచన. క్రీస్తు మూలంగా నూతన జీవితానికి సజీవంగా లేచాడనే సత్యానికి కూడా బాప్తిసం సూచనగా దృశ్యమానమవుతుంది. క్రీస్తులో విశ్వాసముందని చెప్పి, మళ్ళీ వెనుక తీసి, బాప్తిసాన్ని నిరాకరిస్తే, మన విశ్వాసమే అసలు నిజమైనదా కాదా అని ఆత్మ పరీక్ష చేసుకోవాలి.

క్రీస్తును నమ్ముకొన్న ఇతరులతో సహవాసం చెయ్యాలి. దేవుని సేవకులు బైబిలును నేర్పే చోట్లకు వెళ్ళాలి. విశ్వాసుల సమావేశాలకూ సభలకూ హాజరు కావాలి. క్రీస్తును అనుసరించే విశ్వాసులతో కలిసిమెలసి ఉండాలి. అయితే మనమీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రార్థనా పూర్వకంగా ఉండాలి. నేను క్రీస్తును అనుసరిస్తున్నాననీ చెప్పినవారంతా క్రీస్తు శిష్యులే అనుకోలేము. అలాగే క్రీస్తును గురించి సరిగా ప్రకటిస్తున్నామని చెప్పే ప్రతి సంఘం అలా చెయ్యకపోవచ్చు కూడా. ఇతర విశ్వాసులు ఎందరో ఉన్నారు. క్రీస్తు శిష్యులకు ఇలాంటి విశ్వాసుల సహవాసం ఎంతో అవసరం. గురుదేవుడు తన శిష్యులకు జీవిత యుద్ధంలో ఒంటరిగా పోరాడాలని ఎన్నడూ చెప్పలేదు. అది ఆయన ఉద్దేశం కాదు.

మనలను మనం క్రీస్తు సేవకోసం సమర్పించుకోవాలి. మనకు కలిగినదాన్ని కూడా సమర్పించాలి. క్రీస్తు శిష్యులు తమకోసం తామే బ్రతకకూడదు. మనకున్న సమయం, డబ్బు, బలం మన ఇష్టం వచ్చినట్లు స్వార్థానికి వినియోగించుకోకూడదు. క్రీస్తుకు సంబంధించిన విధంగా సద్వినియోగం చెయ్యాలి. మన ఉనికి మనకీ, మనకున్నది అన్నీ ఆయనవే. ఇదే వెలుగులో మనం బ్రతకాలి.

**మనుషులందర్నీ ప్రేమించాలి–**

మనుషులందర్నీ ప్రేమతో చూడాలి – మనలను ద్వేషించినవారిని, మనకు

గాయం కలిగించినవారిని కూడా మనం ప్రేమతో చూడాలి. వారి క్షేమాన్ని కోరి ప్రార్థించాలి. వారి విముక్తికోసం ప్రార్థించాలి, పని చెయ్యాలి. "మీ పగవారిని ప్రేమతో చూడండి. మిమ్మలను హింసించేవారి కోసం ప్రార్థన చేయండి."[22]

యేసు క్రీస్తు మార్గం ప్రేమ మార్గం. క్రీస్తు శిష్యులు ఆయన అడుగు జాడలలో నడవాలి. అలా నడిచినప్పుడు లోకమంతటా ఉన్న విశ్వాసుల సహవాసంలో ఉన్నట్టు మనకు అనుభవం కలుగుతుంది. బైబిలు ప్రకారం క్రీస్తుకు చెందినవారు జాతి, కులం, రంగు ఇలాంటి భేదాలు చూడకూడదు. క్రీస్తు దృష్టిలో ఇలాంటి భేదాలు అసలే ఉండవు.

**పవిత్రంగా బ్రతకాలి–**

మనం ప్రతి విధమైన దుష్టత్వాన్ని, పాపాన్ని విసర్జించాలి, పవిత్రంగా బ్రతకాలి. దేవుడు తన వాక్కులో ఇలా చెప్పాడు – "పవిత్రత, అందరితో సమాధానం మీకు ఉంచడానికి తీవ్ర ప్రయత్నం చేయండి. పవిత్రత లేకుండా ఎవరూ ప్రభువును చూడరు."[24]

ప్రతి విషయంలో పవిత్రతను పాటించడమే మన గురి కావాలి. చెడుగు నుంచి, అసత్యం నుంచి వైదొలగి ప్రత్యేకంగా ఉండడమే మన విధి. పవిత్రుడైన దేవునికి సంతోషం కలిగించడానికి మరో విధానం లేదు. పవిత్రతను అనుసరించకుండా శాశ్వత జీవానికి వారసులం కాలేము.

ఎలాంటి విపత్తు సంభవించినా శిష్యులు క్రీస్తును విశ్వసిస్తూ సాగిపోవాలి. పరీక్షలు వచ్చినప్పుడు తట్టుకొని నిలబడాలి. మనకు అర్థం కాని సంగతులు జరుగుతాయి. దేవుడు ఇలా నాపట్ల జరగనిస్తున్నాడా అనేది అర్థం కాక, సందేహపడవచ్చు, కలత చెందవచ్చు. కానీ క్రీస్తు వాగ్దానాలు ఎప్పటికీ తప్పిపోవు. ఆయన మనలను సురక్షితంగా పరీక్షల్లో గుండా, కష్టాల గుండా కాపాడుతూ తీసుకుపోతాడు. మనం మాత్రం ఆయనమీది నమ్మకంతో ముందడుగు వేస్తూ పోవాలి.

యేసు క్రీస్తు శిష్యులకు ఇలాంటి హక్కులూ విధులూ ఉన్నాయి. ఒక విధంగా చూస్తే ఇవన్నీ క్రీస్తు శిష్యులకు కలిగిన మహా అవకాశాలు, ఉన్నతమైన తరుణాలు. వీటిని మనస్కరించనివాడు "నేను దేవుణ్ణి ఎరుగుదును" అని భ్రమించకూడదు. తాను క్రీస్తు శిష్యుణ్ణి అని ఊహించుకోవడం కూడా వృథా. అలాంటి వ్యక్తి విశ్వసించవలసిన విధంగా విశ్వసించలేదు గనుక సరిగ్గానే ఉన్నానులే అనుకొంటే మోసపోతున్నాడన్నమాట. దేవుడు మనలో పని చేసి పాప విముక్తి మనకు

అనుగ్రహించినప్పుడు క్రీస్తు మూలంగా నూతన జీవాన్ని ప్రసాదించినప్పుడు, తప్పనిసరిగా క్రీస్తును అనుసరించి ఆయన మాట వినాలనే మనసు మనకు కలుగుతుంది. ఆయన చెప్పినదెల్లా చేయాలని ప్రయత్నం చేస్తాం. ఈ లోకంలో మనం లోపం లేనివారుగా కాబోము. మనలో ప్రతి ఒక్కరమూ మన స్వల్ప విశ్వాసాన్ని గురించి, అల్ప ప్రేమను గురించి, కొద్దిపాటి విధేయతను గురించి దుఃఖించవలసిన వాళ్ళమే. క్రీస్తును నమ్మి స్వీకరించిన తర్వాత కూడా ఇలాంటి అనుభవాలు కలుగుతుంటాయి. శిష్యులు కూడా అనేక విషయాలలో తప్పిపోతూ ఉండవచ్చు. క్రీస్తుకు అగౌరవాన్ని కలిగించవచ్చు. కానీ ఆయన కృపను బట్టే మనలో మార్పు వస్తుంది. మన ఆశలు మారుతాయి. మన ఉద్దేశాలు మారుతాయి. మన వైఖరీ మన క్రియలూ మన ఆలోచనలూ అన్నీ ప్రభువు సంకల్పానికి అనుకూలంగా మారగలవు.

మనం క్రీస్తును విధేయతతో అనుసరించాలి. దేవుని మహిమార్థం బ్రతకాలి. అలాంటి పక్షంలో మన స్వశక్తీ జ్ఞానమూ చాలవు. కానీ క్రీస్తు మనకు తన ఆత్మనిస్తున్నాడు. ఆయనే దేవుని పవిత్రాత్మ. ఆయన మనలో నివాసం చేస్తాడు. ఆయన మనకు సహాయం చేస్తాడు. ఆయనే మన బలం, మన జీవం. ఆయన ద్వారానే మనం జయించగలం, నిజమైన శిష్యులుగా జీవించగలం.

క్రీస్తు మనలను ఎన్నడూ విడవడు, ఎడబాయడు. ఈ సంగతి తెలుసుకున్నవారికి ఎంతో ఆదరణా బలమూ కలుగుతాయి. ఆయన శిష్యులమైతే, లోకాంతం వరకూ ఆయన వాగ్దానాన్ని నమ్మగలం. ఆయన మన దేవుడు. మనం ఆయన ప్రజలం – ఇది శాశ్వతమైన సంబంధం. గురుదేవుడు శిష్యులతో అన్న చివరి మాట ఇదే: "నేను ఎప్పటికి – యుగాంతం వరకూ – మీతో కూడా ఉన్నాను."[25]

**ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. మత్తయి 11:28,30
2. యోహాను 8:31,32
3. యోహాను 14:16,17,26, 16:33
4. యోహాను 14:27; 15:11; 16:33
5. మార్కు 10:29,30
6. మత్తయి 10:37
7. లూకా 14:26
8. మత్తయి 16:24
9. లూకా 14:27
10. లూకా 14:33
11. యోహాను 8:31
12. 1 పేతురు 2:2
13. యోహాను 14:21
14. లూకా 6:46
15. 1 యోహాను 2:4
16. లూకా 18:1
17. మత్తయి 7:7
18. మత్తయి 10:32,33
19. రోమ్ 10:9,10
20. మత్తయి 28:19
21. మార్కు 16:16
22. మత్తయి 5:44
23. యోహాను 15:12
24. హెబ్రీ 12:14
25. మత్తయి 28:20

# ప్రశ్నలు, అభ్యంతరాలు, వాటి జవాబులు

యేసు క్రీస్తు ఉపదేశాలను విన్నవారు వాటిని గురించి అనేక ప్రశ్నలు అడగవచ్చు, అభ్యంతరాలు చెప్పవచ్చు. కొందరు స్వయంగా వచ్చి తమ సందేహాలు తెలుపుతారు. సందేహాలు రాత మూలంగా తెలియజేసేవారు కూడా ఉన్నారు. ఈ ప్రశ్నలలో కొన్ని అర్థం లేనివి. వాటిని అడిగేవారు క్రీస్తు నేర్పినవాటిని సరిగా అర్థం చేసుకోలేదని ఇట్టే తెలిసిపోతుంది. మరి కొందరు లోతుగా ఆలోచించి ప్రశ్నలు అడుగుతారు.

సత్యమనేది దేనికీ భయపడదు. సత్యం పరీక్షకు భయపడదు, పరీక్షను తప్పించుకునే ప్రయత్నమేమీ చెయ్యదు. అసత్యం వెలుగును చూచి భయపడుతుంది. కాని సత్యం అలా బెదరదు, యథార్థ బుద్ధితో ప్రశ్నలడిగిన వారిని యేసు ప్రభువు ఎన్నడూ త్రోసివేయలేదు. ఆయన శిష్యులు కూడా అలా చేయకూడదు. సాధారణంగా ఎదురుపడే కొన్ని అభ్యంతరాలనూ, ప్రశ్నలనూ ఇక్కడ పొందు పరుస్తున్నాం. వీటి జవాబులు కూడా వాటితో పాటే పొందుపరిచాం.

**ప్రశ్న:** "యేసుక్రీస్తు శుభవార్త కులహీనులకు, పంచములకు, బీదవాళ్ళకు మాత్రమే గదా! ఈ శుభవార్త విద్య, జ్ఞానం లేని వారికి మాత్రమే అన్నమాట."

**జవాబు:** ఈ శుభవార్త ఎవరికోసమో యేసుప్రభువునే స్వయంగా చెప్పనివ్వండి. శుభవార్త ఆయనదే గదా. ఆయన తేటగా ఈ విషయం ఇలా చెపుతున్నాడు:

లోకం – "దేవుడు ఈ లోకాన్ని ఎంతో ప్రేమించి తన ఒక్కగానొక్క కుమారుణ్ణి ప్రసాదించాడు.

సమస్త జనులు – "పరలోకంలో, భూమి మీదా నాకు సర్వాధికారం ఇవ్వబడింది. కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయండి."

ప్రతివాడు – "మానవ పుత్రుని మీద నమ్మకముంచే వారెవరైనా సరే నాశనం కాకుండా శాశ్వతజీవం పొందేలా ఆ విధంగా జరగాలి."

ఇవి యేసు ప్రభువు స్వయంగా చెప్పిన మాటలు. వీటిని బట్టి శుభవార్త ఎవరికోసమో తేటగా తెలుసుకోగలం.

ప్రతి విధమైన ప్రజలు, కులస్తులు, ప్రతి జాతివారు, ప్రతి అంతస్తుకు చెందినవారు – పండితులు గానీ పామరులు గానీ ధనికులు గానీ దరిద్రులు గానీ – క్రీస్తును స్వీకరించవచ్చు. అలాంటివారు అనేకులు క్రీస్తును ముక్తిదాతగా, ప్రభువుగా స్వీకరించారు కూడా.

యేసుప్రభువు చెప్పినదాన్ని బట్టి సర్వత్రా ప్రజలందరూ పాపులు. అందరికీ ముక్తిదాత, రక్షకుడు కావాలి. కుల గర్వం, విద్య గర్వం, ధన గర్వం, జాత్యహంకారం, ప్రాంతీయ దురభిమానాలు ఇవి దేవునికి ఏ మాత్రమూ సరిపడవు. మనం వీటిని బట్టి యేసుక్రీస్తు శుభవార్తను నిర్లక్ష్యం చేస్తే, ఈ భేదాలను బట్టి శుభవార్తను తృణీకరిస్తే మనకు నష్టం కలుగుతుంది. దానికి ఫలితంగా కింద ఉన్నవారు, బీదలు, దీనులు మాత్రమే శుభవార్తను అంగీకరిస్తే దానికి మనం ఆశ్చర్యపోవలసిన పని లేదు.

**ప్రశ్న:** "క్రైస్తవం పడమటి దేశాల మతం కదా? దీన్ని భారతీయులు ఎందుకు అంగీకరించాలి?"

**జవాబు:** ఆయన శుభవార్త ప్రతి ఒక్క మనిషికి ఉద్దేశించబడింది. అసలు, భారత దేశమే సంతోష పూర్వకంగా క్రీస్తును స్వీకరించవలసిన దేశం. యేసుప్రభువు జన్మించినదీ పెరిగినదీ చనిపోయినదీ సజీవంగా లేచినదీ ఆసియా ఖండంలోనే. ఐరోపాలో, అమెరికాలో ప్రజలు నాగరికత లేనివారిగా, శుభవార్తను విననివారుగా ఉన్నప్పుడు, నేటి శకం మొదటి శతాబ్దంలోనే యేసు శుభవార్త భారత దేశానికి వచ్చింది. ఆయన సంపూర్ణతా సిద్ధి గల గురు దేవుడని నిదర్శనం అయింది. ఆయన దేవుని కుమారుడనీ, బంధకాలలో ఉన్నవారికి విముక్తి నిచ్చేవాడనీ మృత్యుంజయుడనీ కూడా రుజువైంది.

పడమటి దేశాల నాగరికత సభ్యతలలో మనకు సరిపడని విషయాలు చాలా ఉండవచ్చు. మనం దాన్ని అంతా వదలివేయవచ్చు. అయితే క్రీస్తును స్వీకరించవచ్చుగా? ఆయనను అనుసరించవచ్చు కదా. క్రీస్తు దేశాలన్నిటికీ మించినవాడు. జాతులకు పైగా ఉన్నవాడు. ఆయనే స్వయంగా ఇలా చెప్పాడు: "నేను లోకానికి వెలుగును" ఇది ప్రపంచమంతటికీ వర్తిస్తుంది. అందులో ఒక భాగానికి మాత్రమే క్రీస్తు వెలుగు పరిమితం కాదు. మనం అడగాలిసింది – "ఈ వెలుగు ఎలాంటిది? ఏది నిజం?" అంతే గాని, పశ్చిమమా, తూర్పా అంటూ అభ్యంతరపడడం అవివేకం.

**ప్రశ్న:** "పడమటి దేశాలు క్రైస్తవ దేశాలే గదా? అయితే ఆ దేశాలలో ఎక్కువ యుద్ధాలున్నాయి ఎందుకని? ఆ దేశాలలో ఎక్కువ దుర్మార్గాలు, నేరాలు ఉన్నాయే – దీనికి కారణం ఏమిటి?"

**జవాబు:** పడమటి దేశాలు క్రైస్తవ దేశాలని ఎవరన్నారు? అవి క్రైస్తవదేశాలు కావు. లోకంలో ఏ జాతీ కూడా క్రైస్తవ జాతి అనేది ఉండదు. అయితే కొన్ని దేశాలు క్రైస్తవ శుభవార్త చేత బాగా ప్రభావితమై ఉండవచ్చు. మరి కొన్ని అలా కాకపోవచ్చు. ప్రతి దేశంలోనూ నిజంగా క్రీస్తును అనుసరించేవారు కొద్దిమందే.

దుర్మార్గాలూ, నేరాలూ, యుద్ధాలూ, అన్నారే – వీటికి కారణం ఒక్కటే. పాపులైన మనుషులు ఉన్న చోటెల్లా ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. అవి ప్రతి జాతిలోనూ జరిగే సంఘటనలే. దీనికి పడమటి దేశాలనీ, తూర్పు దేశాలనీ భేదమేమీ ఉండదు. ఇవి జరుగుతున్నాయంటే ప్రజలు క్రీస్తును స్వీకరించకపోయినందుకే గాని స్వీకరించి నందుకు కాదని తెలుసుకోవాలి. లోకమంతా ఆయన ఉపదేశాలను అనుసరిస్తూ ఉంటే యుద్ధమనేది ఉండదు. అప్పుడు దుర్మార్గాలూ ఉండవు. హింస ఉండదు.

బ్రహ్మ సమాజ్ స్థాపకుడూ ప్రఖ్యాతి చెందినవాడైన రాజరాం మోహన్‌రాయ్ ఇలా అన్నాడు: "మత విషయిక సత్యాలను నేనెంతో కాలంనుంచి పరిశోధిస్తున్నాను. నేను చూచినదేమంటే సిద్ధాంతాలన్నిటికంటే క్రీస్తు సిద్ధాంతాలే నీతి నియమాలకు సరిపడతాయి. వివేకం గలవారి ఉపయోగానికి ఈ సిద్ధాంతాలు చక్కగా ఉన్నాయి.

**ప్రశ్న:** "క్రైస్తవ శుభవార్త చాలా మంచిదంటున్నారే – మరి ఎందుకని చాలామంది క్రైస్తవులు చెడ్డవాళ్ళు?"

**జవాబు:** ఇదే ప్రశ్న ప్రతి మతాన్ని గురించీ అడగవుచ్చు. చెడ్డవాళ్ళందర్నీ క్రైస్తవమనబడినది గుత్తకు తీసుకోలేదు. ప్రతి మతంలోనూ చెడ్డవాళ్ళున్నారు. దురదృష్టవశాత్తు క్రైస్తవ నామధేయం కలిగినవాళ్ళలో చాలామంది చెడ్డవాళ్ళున్నారు. అయితే వాళ్ళు నిజమైన క్రైస్తవులు కానేకారు. వారు పేరుకు మాత్రమే క్రైస్తవులు. కొందరున్నారు వారు నిజమైన క్రైస్తవులు. అయినా కొన్ని విషయాలలో వీరూ బలహీనులు కావచ్చు. ఇలాంటివాళ్ళు క్రీస్తు శుభవార్తకు చాలా అగౌరవం కలిగిస్తారు. కాని, ఒక సిద్ధాంతాన్ని గానీ, ఉపదేశాన్ని గానీ పరీక్ష చేసేందుకు దాన్ని సరిగా అనుసరించని వారిని ఎన్నుకోవడం సరి కాదు. ఒక సిద్ధాంతం విలువను నిర్ణయించడానికి అందులోని బలహీనులను, భ్రష్టులను

మాదిరిగా తీసుకోవడం గొప్ప తప్పు అనే చెప్పాలి.

క్రైస్తవం పేరుతో జరుగుతున్న ప్రతిదాన్ని నేనేమీ మెచ్చుకోవడం లేదు. క్రైస్తవం పేరుతో చెప్పుకునే ప్రతి ఒక్కరినీ నేను బలపరుస్తానని ఎప్పుడూ అనుకోవద్దు. నేను చెప్పేదేమంటే, ఇలాంటి బలహీనతలన్నిటినీ క్రీస్తుకు అంటకట్టవద్దు. మనకు కావలసినది క్రీస్తు. మనం స్వీకరించవలసినది క్రీస్తును. మనం అనుసరించవలసినది క్రీస్తును. ఎవరేం చేస్తే మనకెందుకు? ఆయనమీద విశ్వాసముంచినవారికి క్రీస్తు విముక్తి నిస్తాడు, వారిని దివ్యంగా మారుస్తాడు. తరతరాలుగా లోకంలో అనేకమంది జీవితాలలో ఈ మార్పు దృశ్యమానమైంది. ఈ రోజుల్లో కూడా ఇది మనకు సజీవంగా కనబడుతున్న సంగతి. క్రీస్తు శుభవార్త ఘనంగా, శక్తివంతంగా పని చేస్తుంది.

**అభ్యంతరం:** “తూర్పు దేశాల్లో చాలా మతాలున్నాయి. వీటిలో పోల్చిచూస్తే క్రైస్తవం కొత్తది. ప్రాచీన మతాలలోని విశ్వాస విధానాన్ని విడిచి, ఆధునికమైన, నిన్న మొన్న పుట్టినదాన్ని ఎందుకు చేపట్టాలి?”

**జవాబు:** బైబిల్లోని దేవుని ఆరాధన ఈ భూమిమీద బహు ప్రాచీనమైనది. ఈ భూమిమీద ఉన్న మొదటి మానవుడు బైబిలులో వెల్లడైన దేవుణ్ని ఆరాధించాడు. ఇది సత్యయేక దేవుని ఆరాధన. జాతులు దానినుంచి వైదొలిగినప్పుడు దేవుడు ఇస్రాయేల్ ప్రజను ఎన్నుకుని ఈ ఆరాధనను కొనసాగేలా చూశాడు. నిజ క్రైస్తవులు ఆత్మలో, సత్యంలో దేవుణ్ణి ఆరాధిస్తారు. సత్య ఏక దేవుని ఆరాధనకు ఇది కొనసాగింపు మాత్రమే. ఆరంభంనుంచీ తనను తాను ప్రత్యక్షపరచుకొన్న దేవుడు ఈయన. ఆ ఆరాధన బహు ప్రాచీనమైనది. ఈ దేవుడు ఇప్పటివాడేమీ కాడు. అనాది కాలం నాటి వాడు. బైబిల్లోని కొన్ని గ్రంథాలు కూడా చాలా ప్రాచీనమైనవి. ఇంతకంటే పాతవి మరెక్కడా లేవని చెప్పగలం, కొందరు ఇంకా పాతవి ఉన్నాయని చెప్పడానికి తెగించవచ్చు గాని ఆ అభిప్రాయానికి సరైన ఆధారమేమీ లేదు. అయితే ఇవి ఎంత పాతవి, ఎంత కొత్తవి అనే వివాదం విలువ లేనిది. చాలా పాతవి అయినంత మాత్రన విలువ గలదని చెప్పలేము. అది సత్యానికి రుజువేమీ కాదు. చాలా ప్రాచీనమైన అబద్ధాలు కూడా ఈ లోకంలో ఉన్నాయని గమనించాలి.

**ప్రశ్న:** “మత సిద్ధాంతాలనీ, మత ప్రమాణాలనీ ఊరికే బాధపడడం దేనికీ? మత ఉపదేశాలంటూ మథనపడడం దేనికి? మత సిద్ధాంతాలకంటే మంచి బతుకు

మేలు. సిద్ధాంతాల కంటే అనుభవం మేలు.”

**జవాబు:** ఈ ప్రశ్న బాగానే ఉన్నట్టు ధ్వనిస్తుంది. కానీ ఇందులో లోపం ఉంది. దీన్ని గురించి కొన్ని ప్రశ్నలు అడిగితే, ఆ లోపమేదో ఇట్టే తేలిపోతుంది. రైలు పట్టాలు లేకుండా రైలుబండ్లు ఉంటాయా? రోడ్డు మార్గం లేకుండా కార్లు ఉండవు గదా? కొన్ని నియమాలు లేకుండా ప్రభుత్వమే నడవదు. కొన్ని కట్టుబాట్లు, హద్దులు లేకుండా ఫుట్‌బాల్ ఆటా ఉండదు, హాకీ ఉండదు. ఒకవేళ పైవన్నీ ఉండాలంటే వాటికి తగ్గ రైలు పట్టాలు, రోడ్లు, నియమాలు, కట్టుబాట్లు కూడా ఉండాలి. ఇది కావాలా, అది కావాలా అనేది మన ప్రశ్నకాదు. రెండూ కావాలి.

దేవుని విషయాలలో కూడా ఇది వర్తిస్తుంది. మనకు సత్‌క్రియలు కావాలి. అనుభవమూ కావాలి. వీటికి తోడు మనకు దారి చూపడానికి ప్రమాణాలు, నియమాలు, సిద్ధాంతాలు కావాలి. వీటిద్వారా మన అనుభవాలను సరిచూచు కోగలుగుతాం. సరైన తీర్పు విధించగలుతాం. మన క్రియలు ఎలాంటివో తెలుసుకో గలుగుతాం కూడా. మనకు సరైన ఉపదేశం ఉంటేనే తప్ప మన మార్గం సరిగా ఉండదు. మనం ఏమి చేయాలని దేవుడు కోరుతున్నాడు? మన అనుభవం ఎలా ఉండాలని దేవుని కోరిక? అనే విషయాలు మనం తెలుసుకోవాలి. మనుషులు కల్పించిన సిద్ధాంతాలు మనకు అవసరం లేదు నిజమే. మనకు కావలసినది దేవుని వాక్కులోని సత్యాలు. మన ఆలోచనలు, అనుభవాలు మాత్రమే ప్రతి దానికి గీటురాయి కాలేవు.

మరో వాదం ఉన్నది. “మత విషయమైన సత్యాలు మాకు ఎవ్వరూ నేర్పించనక్కర్లేదు. మేమే సత్యాన్ని స్వయంగా వెదకి సూటిగా తెలుసుకొంటాం.” ఈ వాదం ఎలా ఉందంటే – ఎవడో మందుల దుకాణానికి వెళ్ళాడట, అతగాడికి మందులను గురించి జ్ఞానం బొత్తిగా లేదు. అందుచేత కనబడ్డ ప్రతి మందు తనమీద ప్రయోగించుకొని చూద్దామనుకుని, చివరికి చచ్చి ఊరుకున్నాడట! అనుభవం కలిగింది గాని దానివల్ల లాభం మట్టుకు శూన్యం. అందుచేత అతడు ముందుగా ఔషధ శాస్త్రం క్షుణ్ణంగా చదివి తెలుసుకోవడం ప్రయోజనకరం. లేదా, ఎవరైనా చెప్పిన మంచి సలహాను పాటించైనా ఉండాలి.

ప్రజలు అనేక వ్యవహారాలలో తెలివిగానే ప్రవర్తిస్తారు, కానీ మత విషయాలలో చాలా అవివేకాన్నీ తెలివితక్కువతన్నాన్నీ ప్రదర్శిస్తున్నారు. సిద్ధాంతాలు వద్దు రాద్ధాంతాలు వద్దు అంటూ అభ్యంతరాలు పలికేవారు అనేకసార్లు తమ స్వంత మొండి సిద్ధాంతాలను గట్టిగా పట్టుపడతారు. కొంతమంది దృష్టిలో తాము చెప్పినదే సరైన సిద్ధాంతం!.

ఉపదేశం అనేది లేదనుకోండి, సిద్ధాంతాలు అసలే లేవనుకోండి, అలాంటప్పుడు సత్యాన్ని గురించి మాట్లాడడంలో అర్థం లేదు. అసలు విషయమేమిటంటే యేసు క్రీస్తులో మనకు పరిపూర్ణమైన ప్రమాణం ఉంది. దీన్నిబట్టి మన మాటలను, క్రియలను, అనుభవాలను సరిచూచుకోగలం. క్రీస్తులో ఏది నిజం, ఏది కాదు తేటగా చూడగలం. మనం చేయవలసినది ఏదో, అనుభవించవలసినది ఏదో క్రీస్తులో మనకు కనబడుతుంది. ఆయన మాట నమ్మి ఆయన చెప్పినట్లు చేస్తే మనమేమీ తప్పిపోము. మనం ఆయన ఉపదేశాలను విసర్జిస్తే మనకు అనేక చిక్కులు కలుగుతాయి.

**ప్రశ్న:** "మనకు చరిత్ర ఎందుకు? దాని శ్రేష్టత ఏమిటి? రెండువేల సంవత్సరాల క్రిందట యేసుప్రభువుకు ఏం జరిగిందో ఎందుకు తెలుసుకోవాలి? ఇప్పుడే దేవుణ్ణి ఎందుకు సూటిగా అనుభవించకూడదు?"
**జవాబు:** నిజమే, చరిత్ర అంతగా తెలుసుకోకుండానే దేవుణ్ణి అనుభవించగలం. కానీ మనం తెలుసుకొని తీరవలసిన నిజమైన విషయాలు కొన్ని ఉన్నాయి. మొదట మనం దేవుణ్ణి అనుభవించినప్పుడు మనకు తెలిసినది చాలా కొద్ది కావచ్చు. తరువాత మనం అనుభవించిన దేవుణ్ణి గురించి ఇంకా ఎక్కువ తెలుసుకోగోరుతాం. మనం అనుభవించినది దేవుణ్ణా? లేక మరేమైనా? అనే విషయం కూడా ఖచ్చితంగా తెలుసుకోగోరుతాం.

బైబిలు చరిత్రలో ఒక విశేషం ఉంది. దానిలో దేవుడు మనుషుల విషయంలో ఏమి చేశాడో రాసి ఉంది. దేవుడు మానవ జాతికి ఇచ్చిన సందేశం అందులో రాసి ఉంది. క్రీస్తులో దేవుడు మనుషులతో మాట్లాడాడు. మనుషుల కోసం చనిపోయి సజీవంగా లేచాడు. ముక్తి మార్గాన్ని చూపాడు. ఈ విషయాలు చాలా ప్రాముఖ్యమైనవి. వీటిని మనం తెలుసుకోవాలి.

ఈ సందేశం మనుషులకు అందించడం ఎలాగు? ఇది వాస్తవమైన చరిత్రలో కొనసాగిపోతూ ఉండాలి. ఆ విధంగానే ఈ సందేశానికి సరియైన రుజువు లభిస్తుంది. ఆ విధంగానే మనం దీన్ని జాగ్రత్తగా పరీక్షించి అది సత్యమని తెలుసుకోగలం. సత్యాన్ని కోరేవాడు సందేశాన్ని బాగా తరచి చూస్తాడు. చరిత్రలో దేవుడిచ్చిన వాక్కులూ అద్భుతాలూ భక్తుల జీవితాలూ చూడగలం. అంటే క్రీస్తు సత్యాలను గురించి మనకు నిశ్చయత కావాలంటే దానికి అవసరమైన రుజువులను ఇవ్వగలిగేదే చరిత్ర.

దేవుడు కొన్ని సిద్ధాంతాలను రాసి పైనుంచి కిందికి పడెయ్యవచ్చు. అయితే

వాటిని పడేసినది దేవుడే అని మనకెలా తెలుస్తుంది? దేవుడు ఆకాశం మీద "క్రీస్తు మీ కోసం చనిపోయాడు" అని రాశాడనుకుందాం. కానీ దానికి అర్థం ఎవరు చెప్పాలి? అందుకే ఇలాంటివాటిని వెల్లడి చేయడానికీ వివరించడానికీ చరిత్రలో రాసిన పుస్తకం శ్రేష్ఠమైన సాధనం. బైబిల్లోని చరిత్ర మనకు చాలా అవసరం. దీన్ని నిజాయితీపరులు రాశారు. వీరందరూ దేవప్రేరితులు. దేవునిమూలంగా పలికినవారు. తాము రాసినవాటిని కొందరు స్వయంగా చూశారు. కొందరు ఇంకో విధంగా వాటి యథార్థతను బాగా ఎరిగారు. వారు రాసిన సత్యాల కోసం ప్రాణం పెట్టడానికి కూడా తెగించినవాళ్ళు, ఆ సత్యాల్లో అక్షరాలా జీవించినవాళ్ళు.

**అభ్యంతరం:** "యేసు శిష్యులు రాసినదేమి మనకు దొరకవు. తరువాత క్రైస్తవులు రచనలు తారుమారు చేశారు. ఇంతే జరిగివుంటుంది."

**జవాబు:** మనకున్న రుజువులన్నీ ఈ అభ్యంతరం సరైనది కాదని చూపుతున్నాయి.

1. ఈ మధ్య చాలా ప్రాచీనమైన రాతలు దొరికాయి. క్రీ.శ. ప్రథమ శతాబ్దాలకు చెందిన రచనలవి. అప్పుడు వారు వాడిన "క్రొత్త ఒడంబడిక" ప్రతులు ఇప్పటి వాటిలాగే ఉన్నాయి. లోకంలో ఇంతకంటే ప్రాచీన ప్రతులు మరే మత గ్రంథానికీ లభించలేదు. వీటిని బట్టి తేలుతున్నదేమిటంటే, శతాబ్దాల తరబడి వాడకంలో ఉన్న క్రొత్త ఒడంబడిక సత్యాలలో ఒక్కటి కూడా మారలేదు.
2. బైబిలు రచన పూర్తి కాగానే క్రైస్తవ రచయితలు ఇందులోని విషయాలను తమ రచనలలో ఉదాహరించడం మొదలు పెట్టారు. ఈ రచనలలో కొన్ని మొదటి రెండు శతాబ్దాలకు చెందినవి. వీరు ఉదహరించిన సత్యాలను బట్టి చూస్తే, క్రొత్త ఒడంబడిక రచన అప్పుడున్నట్లే ఇప్పుడూ ఉందని తెలిసింది.
3. క్రైస్తవులు బైబిలును మార్చాలని ఎన్నడూ ప్రయత్నించి ఉండరు. వారు దాన్ని దేవుని వాక్కు అని భావించారు. మనుషులను విమోచించగల ఏకైక సత్యమిదే అని నమ్మారు. పోనీ, కొందరు అవివేకులు ఈ రచనలలో కొన్ని విషయాలను మారుద్దామని ప్రయత్నం చేసేవారే అనుకొందాం. అలా మారిస్తే దాన్ని క్రైస్తవులు ఒప్పుకొని ఉండరు.

తరతరాలుగా ఈ గ్రంథానికి ఎన్నో వ్రాత ప్రతులు తయారు చేస్తూ వచ్చారు. వారు వ్రాస్తూ ఉండగా మాటలలో కొన్ని చిన్న చిన్న తప్పులు దొర్లి ఉండవచ్చు. కానీ సర్ ఫ్రడరిక్ కెన్యాన్ అనే మహా పండితుడు ప్రాచీన వ్రాత ప్రతులను బాగుగా

పరిశోధించి ఈ విధంగా చెప్పాడు: "ఈ లేఖనాలు అప్పటివి ఉన్నవి ఉన్నట్టుగానే మనవరకు వచ్చాయి అనేదాంట్లో ఏవిధమైన సందేహం లేదు. క్రొత్త ఒడంబడికలోని గ్రంథాలు నమ్మదగినవి. నిజపరచబడినవి. వీటి అధికారం స్థాపించబడింది."

**ప్రశ్న:** బైబిల్లో చాలామంది ప్రవక్తలున్నారు. వీరు గాక ఇంకా అనేకమంది ప్రవక్తలున్నారు. ప్రతి దేశంలోనూ దేశీయ ప్రవక్తలు ఎందరో ఉన్నారు. వీరు కూడా దేవ ప్రేరితులు కారా? దేవుని మూలంగా పలకలేదా?"

**జవాబు:** భవిషత్తును గురించి చెప్పేవారు నాడూ, నేడూ ఎందరో ఉన్నారు. జన్మ నక్షత్రాన్ని బట్టి జ్యోతిష్యం చెప్పేవారున్నారు. శకునాలు చెప్పేవారున్నారు. హస్త సాముద్రికం చూచేవారున్నారు. మరి కొందరు భూత ప్రేతాల ద్వారా మాట్లాడేవారు. ఈ విధంగా జరగబోయే సంగతులను ముందుగా చెపుతామని కొందరు బయలుదేరుతారు. వాళ్ళు చెప్పేవాటిలో కొన్ని సరిగానే జరుగుతాయి. కొన్ని సార్లు అవి నెరవేరవు కూడా. బైబిలు ప్రవక్తలకూ, ఇలాంటి ప్రవక్తలకూ నాలుగు ముఖ్యమైన భేదాలున్నాయి

1. బైబిల్లోని ప్రవక్తలు వారు చెప్పి రాసినదానిలో ఎప్పుడూ పొరపాటుపడలేదు. వారి భవిష్యత్‌వాక్కులు మనం ఇప్పుడు చదివితే వాటిలో కొన్ని భూతకాలం నాటివి అని గ్రహిస్తాం. మరి కొన్ని భవిష్యత్తుకు చెందినవి. చరిత్రలో వాటిని సరిచూడవచ్చు. ఈ ప్రవక్తలు చెప్పినవన్నీ యథార్థాలు. అక్షరాలా వారి మాటలు నెరవేరాయి.

2. బైబిల్లోని ప్రవక్తలు ఎల్లప్పుడు నిర్ణయమైన ప్రవచనాలు ఎత్తి చెప్పారు. భవిష్యత్తును గురించి చెప్పినప్పుడు వారు చిన్న వివరాలు కూడా చేర్చారు. వేరే ప్రవక్తలు సందిగ్ధమైన భాషను ప్రయోగించి అయోమయంగా మాట్లాడతారు. తీరా ఆ విషయం జరగకపోతే సులభంగా తప్పించుకోగలిగేట్లు మాట్లాడుతారు.

3. బైబిల్లోని ప్రవక్తలు దేవునికి మహిమ కలిగించారు. తమ సొంత ఘనత వారు కావాలని చూడలేదు. మేము గొప్పవాళ్ళమని వారెప్పుడూ చెప్పుకోలేదు. వారు వినయశీలురు. దేవుని సేవకులు. తాము సత్యాన్ని ప్రచురించినందుకు బాధలకు గురి అయ్యారు. మరణం పాలయ్యారు కూడా. వారు ఇహలోకం లాభాన్ని ఏమాత్రం ఆశించలేదు.

4. బైబిలు ప్రవక్తలు దేవుడు ఉపయోగించవద్దన్న విధానాలను ఎన్నడూ ఉపయోగించలేదు. దేవుడు తన ప్రజలతో గట్టిగా సూటిగా చెప్పాడు – "సోదె

చెప్పే వ్యక్తిని గానీ, మేఘ శకునాలు, సర్పశకునాలు చెప్పే వ్యక్తిని గానీ, చేతబడిచేసే వ్యక్తిని గానీ, మంత్రవిద్య అభ్యసించే వ్యక్తిని గానీ, కర్ణపిశాచాన్ని సంప్రదించే వ్యక్తిని గానీ, పూనకం వచ్చి పలికే వ్యక్తిని గానీ, చచ్చినవారిని పిలిచే వ్యక్తిని గానీ, మీ మధ్య ఉండనివ్వకూడదు. వీటిని చేసే ప్రతి వ్యక్తి యెహోవాకు అసహ్యం."[5]

బైబిల్లోని ప్రవక్తలు నేరుగా దేవుని దగ్గరనుంచి తమ భవిషత్ వాక్కులను అందుకున్నారు, ఇతరులకు అందించారు. "నేనే దేవుణ్ణి, ఇంకా ఏ దేవుడు లేడు. నేనే దేవుణ్ణి. నాకు సమానుడంటూ ఎవ్వడూ లేడు. ఆది నుంచి అంతాన్ని తెలియజేసేవాణ్ణి. పూర్వకాలం నుంచి ఇంకా జరగబోయే సంగతులను తెలిపేవాణ్ణి" అంటూ దేవుడు యెషయాప్రవక్త ద్వారా పలికాడు.[6] ఈ విధంగా చెప్పడమే కాదు చెప్పినది జరిగించాడు. క్రీస్తును గురించి ఆయన చేసిన భవిష్యత్‌వాక్కులు కొన్ని శతాబ్దాల తరువాత నెరవేరాయి. యేసుక్రీస్తు దేవుని కుమారుడు అనడానికి ఇది ప్రబలమైన రుజువు.

**ప్రశ్న:** "మీరు అంటారు గదా, క్రీస్తు దేవుడై ఉన్నాడు, ఆయన తండ్రి దేవుడై ఉన్నాడు, దేవుడు పవిత్రాత్మ దేవుడై ఉన్నాడు. మరి ముగ్గురు దేవుళ్ళున్నారా?"

**జవాబు:** యేసుప్రభువు నేనే దేవుణ్ణి అని చెప్పాడు. ఆ హక్కు ఆయన కుంది. అంతేకాదు, తండ్రి తనను ఈ లోకానికి పంపాడు అని కూడా చెప్పాడు. మరో సందర్భంలో, సత్యస్వరూపుడైన ఆత్మను పంపుతాను; ఆ ఆత్మ మరో దివ్య వ్యక్తి; ఆయన మీతో ఉంటాడు అని శిష్యులకు యేసుప్రభువు చెప్పాడు.[7] దీని లాభమేమి? ఎలా సాధ్యం? ముగ్గురు దేవుళ్ళుంటారా?

దేవుడు ఒక్కడే అనే సత్యాన్ని బైబిలు నొక్కి చెపుతుంది. "ఒకే ఒక దేవుడు తప్ప మరో దేవుడు లేడు." మన పూర్ణ హృదయంతోనూ, మన పూర్ణ ఆత్మతోనూ, మన పూర్ణ శక్తితోనూ ఈ ఒకే దేవుణ్ణి ప్రేమించాలని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు బైబిలులో.[8]

ముగ్గురు దేవుళ్ళు అంటే అర్థం లేనిది. యేసు ఇలాంటి విషయాన్ని ఎప్పుడూ నేర్పలేదు. ఆయన చెప్పిందేమంటే, ఈ ఒక్క దేవునిలో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. నిత్యత్వం నుంచీ ఈ ముగ్గురూ ఏకమైవున్నారు.

తండ్రి దేవుడు, కుమారుడు దేవుడు, పవిత్రాత్మ దేవుడు. అయినా దేవుళ్ళు ముగ్గురు కాదు, ఒక్కడే దేవుడు. ఈ ముగ్గురి మధ్య పోటీ లేదు, వివాదమూ లేదు. అధికారాన్ని గురించిన తగవులూ లేవు. గౌరవాన్ని గురించిన పోరాటమూ లేదు. దేవుడు తనతో తానే ఎలా దెబ్బలాడుతాడు? దేవుడు నిత్యుడు. సంపూర్ణ ప్రేమపూర్ణుడు.

తండ్రి కుమారుణ్ణి లోకానికి పంపగలిగాడు. కుమారుడు తండ్రికి ప్రార్థన చేయగలిగాడు. తండ్రి కుమారులనుంచి పవిత్రాత్మ రాగలిగాడు. వారు ముగ్గురూ ఒకటే. ఒక్కరే మూడుగా ఉన్నారన్నమాట. దేవుని నామం ఎంత అద్భుతమైనది! మనకు ఎంత ఆశ్చర్యం కలిగిస్తుంది!

## గంభీరమైన రహస్య సత్యం

ఈ సత్యం నిజంగా ఎంతో గంభీరమైంది. అందుకని ఈ సత్యాన్ని ఎవరూ కాదనకూడదు. మనం వర్ణించాలంటే మాటలు చాలవు. దేవుడు వర్ణించబడడు. దేవుడు మన జ్ఞానానికి మించినవాడు. చిన్న పాత్ర సముద్రాన్ని పట్టగలదా? దేవుని గురించిన మర్మమంతా మన చిన్న మనస్సులు గ్రహించజాలవు. దేవునిలో మనకు తెలియని అద్భుతమైన విషయాలు ఉన్నాయి. వినయంతో ఆయనను సమీపించి, దేవునినుంచి వచ్చిన జ్ఞానాన్ని పొందాలి. ఆయన ఇచ్చిన గ్రంథాన్ని చదువుకోవాలి. దేవుడు తన కుమారుణ్ణి ఈ లోకంలోకి పంపి, తన స్వభావాన్ని ఆయనలో బయలుపరచాడు గదా!

జీవం అంటే మర్మం గలది. ఆ మాటకొస్తే లోకంలోని చిన్నచిన్న జీవులు గొప్ప శాస్త్రజ్ఞులకు అంతుపట్టకుండా ఉన్నాయి.

వాటికంటే శ్రేష్ఠమైన జీవులను గ్రహించడం మరింత కష్టం. పురుగుకంటే కోతిని గ్రహించడం దుర్లభం. మనిషి విషయం కోతికంటే ఎంతో చిక్కైనది. తెలుసుకోవడం అంత సులభమేమి కాదు. దేవుడు శాశ్వత జీవం గల మహా అనంతుడు, ఆత్మ స్వరూపి. అంచేత దేవుణ్ణి గ్రహించడం అన్నిటికంటే కష్టమైనది, గంభీరమైనది, మర్మం గలది.

ముగ్గురు ఒక్కటిగా ఉన్న సత్యాన్ని మనం సంపూర్ణంగా గ్రహించలేక పోతున్నామంటే ఆశ్చర్యపడాల్సిన పని లేదు. క్రిమికీటకాదులను కూడా సరిగ్గా గ్రహించజాలని మనం దేవుణ్ణి గురించిన మర్మాన్ని పూర్తిగా ఎలా గ్రహించ గలుగుతాం?

**అభ్యంతరం:** "ఈ రుజువులన్నీ ఏదో ప్రాచీన గ్రంథంలో రాసి ఉన్నాయి గదా. లోకంలో అలాంటి గ్రంథాలెన్నో ఉన్నాయి. నిజమైన చరిత్ర గ్రంథాలున్నాయి. నిజమే గాని కొన్ని పుస్తకాలు ఊహా కల్పితాలు. పద్య రచనలు ఉన్నాయి. కథలు, గాథలతో కూడినవీ ఉన్నాయి. మరి, యేసు క్రీస్తు మరణ పునర్జీవితాలను గురించి ఆయన శిష్యులు రాసినదంతా నిజమని మనం నిశ్చయంగా నమ్మగలమా?"

**జవాబు:** యేసు క్రీస్తును గురించి ఇన్ని రుజువులున్నా కొందరు వీటిని ఒప్పుకోరు. యేసు వాస్తవిక వ్యక్తి కాదంటారు. శిష్యులు ఊహించి, ఆయన జీవితాన్ని రాశారని, ఆయన ఉపదేశాలు, మరణం, పునర్జీవితం అనేవి శిష్యుల ఊహా కల్పితాలని అంటారు. ఇదంతా కుదరనివనీ వీటిని నమ్మమనీ చెపుతారు.

**వాస్తవిక విషయాలు**

వాస్తవిక విషయాలకంటే బలమైన వాదం మరొకటి లేదు. వాస్తవాన్ని పరిశీలించి చూస్తే శిష్యులు క్రీస్తు కథను కల్పించారని నమ్మడానికి వీలు లేదు. ఈ క్రింది వాస్తవిక విషయాలను గమనించండి.

1. మొదటి వాస్తవిక విషయం: యేసు క్రీస్తు జీవించిన కాలంలో అదే దేశంలో ఉన్న ఎందరో ప్రజలు శిష్యుల ఉపదేశాన్ని నమ్మారు. యేసు క్రీస్తు నిజంగా ఈ లోకంలో జీవించకపోతే ప్రజలచేత శిష్యులు ఎలా క్రీస్తు వాస్తవిక వ్యక్తి అని ఒప్పించగలిగారు?

ఈ రోజున ఒక కవి ఒక వ్యక్తిని ఊహించి ఒక కథ రాశాడనుకుందాం. ఆ వ్యక్తిని ఒక గొప్ప వీరుడుగా వాస్తవిక వ్యక్తిగా చిత్రించాడనుకోండి. అతడు మన తరంలో ఉన్నట్లుగా రాశాడు. ఈ వ్యక్తి అనేక మహత్కార్యాలూ అద్భుతాలూ చేశాడని రాశాడు. గంభీరమైన ఉపదేశాలు చేశాడనీ, పూర్వం రాసిన భవిష్యద్వాక్కులూ ప్రవచనాలెన్నో నెరవేర్చాడనీ, ఆయన దేవుని కుమారుడు, అద్వితీయుడనీ, లోక పాపాలకోసం సిలువపై చనిపోయి సజీవంగా లేచాడనీ రాశాడు. ఇదంతా కల్పించాడనుకోండి. బాగానే ఉంది. కానీ, ఈ వ్యక్తిని ఎవరూ చూడలేదు. అతడి బోధలు ఎవరూ వినలేదు. అతణ్ణి గురించి ఒక్క వాస్తవిక విషయం కూడా రుజువు కాదు. అలాంటప్పుడు ఆ కవి తన పాత్రయొక్క వాస్తవికతను లోకంచేత ఎలా ఒప్పించగలడు? అతడు రాసినది వాస్తవమైన చరిత్ర ఎలా అవుతుంది? అది సత్యమని అందరూ ఎలా సమ్మతించగలుగుతారు?

శిష్యులు ఎవరో ఒక వ్యక్తి తరతరాల క్రిందట జీవించాడని రాయలేదు. ఎక్కడో దూరాన పుట్టి పెరిగిన వ్యక్తిని గురించి రాయలేదు. యేసు తమ కాలంలోనే జీవించాడు. తమ దేశంవాడు. అందుచేత ఆయన జీవించాడనీ, చనిపోయాడనీ, పునర్జీవితుడై లేచాడనీ వారు ఇచ్చే రుజువులు బలంగా స్పష్టంగా ఉన్నాయి. అందుకనే శిష్యులు ఉపదేశించినవీ రాసినవీ వాస్తవమైన విషయాలని వారు అనేకులను నమ్మించగలిగారు. అవి సత్యాలని తమ దేశంలోనూ, ఇతర అనేక దేశాలలోను అధిక సంఖ్యమంది నమ్మారు. అనేకమంది ప్రజలు తమ స్వంత

మతాన్ని విసర్జించడానికి సిద్ధమయ్యారు. ఇది మామూలు విషయం కాదు. ఆ కాలంలో చాలామంది యేసును రక్షకుడుగా, ప్రభువుగా స్వీకరించారు, ఆయనకోసం జీవించారు. అలా చేయడం వల్ల అపహాస్యమూ హింసలూ అనుభవించారు. శిష్యులే గనుక ఏదో వెర్రి కథ కల్పించి, రాసివేసి, ఉపదేశిస్తే, దాన్ని నిజపరచుకోలేని స్థితిలో ఉండిపోయి ఇంత ఘన విజయం సాధించి ఉండేవారా, చెప్పండి? మొదటి శతాబ్దంలోనే క్రీస్తు శుభవార్త అతి వేగంగా పయనించింది, చాలా అభివృద్ధి చెందింది. క్రీస్తు కథ కల్పన అయివుంటే ఈ అభివృద్ధికి అర్థమేమిటి?

2. మొదటి శతాబ్దంలో మత విషయమైన వికాసమూ, జాగృతీ మొదలయ్యాయి. ఈ కొద్దిమంది శిష్యులు లోకాన్ని తల్లక్రిందులు చేశారు. ప్రతి పట్టణంలో గ్రామగ్రామాలలో వీరు క్రీస్తు మార్గాన్ని సుస్థిరంగా స్థాపించారు. దేశదేశాలలో క్రీస్తు మార్గాన్ని ప్రకటించారు. క్రీస్తు కల్పిత వ్యక్తి అయితే ఇది జరిగేదా? ఒక మహాశయుడు ఇలా అన్నాడు, "క్రీస్తు వాస్తవిక వ్యక్తి అనేదానిని గురించిన సందేహాలు పట్టించుకోదగినవి కావు. చారిత్రక రుజువులు అలా ఉంచండి. అప్పుడు గొప్ప నైతిక, మత విషయక దిద్దుబాటు ఉద్యమం ఉద్భవించింది. దిద్దుబాటు లేనిచోట దిద్దుబాటు ఎలా జరిగింది? దిద్దువాడు ఉండ బట్టే దిద్దుబాటు ప్రళయంలాగా వచ్చింది. నాయకుడు లేకుండా అనుచరులు ఉండరు. గురువు లేనిదే శిష్యులు ఉండబోరు. చరిత్రలోని క్రీస్తు కూడా లేకుండా క్రైస్తవులకు ఉనికి లేదు. యేసు క్రీస్తు వాస్తవిక వ్యక్తి అని శిష్యులు నమ్మారు అనేది స్పష్టంగా గోచరిస్తుంది."

3. మరో విషయం ఇక్కడ ఉంది. ఆ కాలంలోని యూద రచయితలలో క్రీస్తును ప్రభువుగా, రక్షకుడుగా అంగీకరించనివాళ్ళున్నారు. అలాగే ఇతర జాతులకు చెందిన రచయితలు కూడా ఉన్నారు. వీరిలో ఎవ్వరూ యేసుప్రభువు వాస్తవిక చారిత్రక మనుషుడు కాడు అని చెప్పలేదు. పైగా, వారి రచనలలో యేసు అనే వ్యక్తి నిజంగా జీవించినట్టు రాశారు.

4. క్రొత్త ఒడంబడికలో అనేక స్థలాలు, వ్యక్తులు, సమయాలు పేర్కొనబడ్డాయి. పండితులు చరిత్రలోకి పరిశోధన చేసి చూశారు. బైబిలును మిగతా మూలాధారాలతో పోల్చి చూశారు. బైబిలు రచయితల వ్రాతలు ఖచ్చితమైనవని, సరియైనవని పండితులు ఖండితంగా చెప్పారు.

5. ఇదే అధ్యాయంలో మరో చోట ఈ సత్యాన్ని మేము ఉదహరించాం. ఈ శిష్యులను గురించి మనకు తెలిసినదంతా పరిశీలించి చూస్తే వీరు దేవుని శక్తిచేత

దివ్య మార్పు చెందినవారు అని తేలుతుంది. వీరి రచనలలో ఉన్నతమైన న్యాయ నియమాలు, నైతిక ప్రమాణాలు ఉన్నాయి. ఈ విషయంలో వీటికి మించిన మరే రచనా లేదు. దేవుడు అబద్ధాన్నీ మోసాన్నీ ద్వేషిస్తాడనీ, కఠినంగా శిక్షిస్తాడనీ వీరు పదే పదే తమ రచనలలో రాస్తూ హెచ్చరించారు. ప్రజలు నిజాయితీగా బతకాలనీ, సత్యాన్నే చెప్పాలనీ హెచ్చరించారు. నీతికీ సన్మార్గానికీ ఈ రచనలు ఉన్నతమైన స్థాయిని ఇచ్చాయి. ఈ ఉపదేశాలకు అనుకూలంగా వారు జీవించలేదనుకోవడానికి కారణమేమీ లేదు. అలాంటప్పుడు వారు కపటంగా యేసు కథను కల్పించి రాసి, దీన్ని అక్షరాల చరిత్ర అని ప్రజలకు బోధించారనడం నమ్మరాని విషయం, జ్ఞానహీనమైన అపవాదం.

6. ఇంతకుముందే మేము ఉదహరించిన మరో వాస్తవం ఉంది. క్రీస్తును గురించి ఉపదేశించినందుకు శిష్యులు బాధలు అనుభవించవలసి వచ్చింది. వారు స్వేచ్ఛగా ఆ బాధలు అనుభవించారు. ఇదంతా వీరు కల్పించినదైతే ఈ లోకంలో వారికి దొరికిన బహుమానాలు ఎలాంటివి? శ్రమలు, ద్వేషం, అపనింద, పరిహాసం, బెదిరింపులు, దెబ్బలు, పిడిగుద్దులు, దూషణలు, బీదతనం, బాధలు, హింసలు, ఆపదలు, చెరసాల, చిత్రవధ, మరణం – ఇవే వారికి దొరికినవి! ఈ యుగంలో మొదటి మూడు శతాబ్దాలలో వారికి కలిగిన సాధారణ అనుభవాలు ఇవన్నీ. తన కష్టాల గురించి పౌలు రాసినది చూడండి–

"వారికంటే ఎంతో ఎక్కువగా ప్రయాస పడ్డాను. మరి అనేక సార్లు ఖైదుపాలయ్యాను. లెక్కలేనన్ని దెబ్బలకు గురి అయ్యాను. తరచుగా ప్రాణాపాయంలో ఉన్నాను. యూదులచేత అయిదు సార్లు ముప్ఫయి తొమ్మిది కొరడా దెబ్బలు తిన్నాను. ముమ్మారు నన్ను బెత్తాలతో కొట్టడం ఒకసారి రాళ్ళతో కొట్టడం జరిగింది. ముమ్మారు నేనున్న ఓడలు పగిలిపోయాయి. ఒకసారి పగలు రాత్రి సముద్రంలో గడిపాను. పదే పదే ప్రయాణాలు చేస్తూవున్నాను. అనేక అపాయాలు నాకు ఎదురయ్యాయి – నదుల వల్ల అపాయాలు, దోపిడీ దొంగలవల్ల అపాయాలు, స్వజనంవల్ల అపాయాలు, ఇతర జనాలవల్ల అపాయాలు, పట్టణాలలో అపాయాలు, అరణ్యాలలో అపాయాలు, సముద్రంలో అపాయాలు, కపట సోదరులవల్ల అపాయాలు. నేను ప్రయాసలో కష్టంలో ఉన్నాను. నిద్రరాని అనేక రాత్రులు గడిపాను. ఆకలిదప్పులతో ఉన్నాను. తరచుగా నాకు భోజనం లేకుండా పోయింది. సరైనా బట్టలు లేక చలిలో సమయం గడిపాను."[9]

వారి ఉపదేశాలకు, ప్రబోధాలకు ఇదేనా బహుమతి! వారినెవరూ ఇలా

బాధపడాలని బలవంతం చేయలేదు. వారు దాన్ని కావాలంటే సులభంగా తప్పించుకోగలరు. క్రీస్తు గురించిన ఉపదేశాలు మానివేస్తే ఆ బాధ ఉండేది కాదు. ఇదంతా ఎందుకు? బాధలూ హింసలూ ముగిసిపోవాలంటే ఏమీ బోధించకుండా ఊరుకుంటే సరిపోయేదిగా. కాని, వారు ఊరుకోలేకపోయారు. ఎందుకని? వారు తమ సందేశం వాస్తవమని పూర్తిగా నమ్మారు. దేవుడు వారిని ఈ సందేశాన్ని ఉపదేశించడానికే పంపాడని విశ్వసించారు. లోకానికి ఇదే ముక్తి మార్గమని కూడా నమ్మారు. తమ ఉపదేశం సత్యమని, న్యాయమని గట్టిగా నమ్మినవాడు ఎన్ని కష్టాలు అనుభవించడానికైనా తెగించవచ్చు. శిష్యులు తాము బోధించేది కల్పితమనుకొని ఉంటే, అలా చేయగలిగి ఉండేవారా? ఇది నమ్మరాని విషయం.

7. చివరి విషయం. వారి రచనలు యథార్థాలని నేటికి రుజువవుతుంది. లోగడ క్రీస్తు వాగ్దానాలను గురించి చెప్పాం. అనుభవం ద్వారా ఇవి ఎలా రుజువయ్యావో చెప్పాం. దేవుని శుభవార్తకు దేవుని శక్తి తోడుగా ఉందనేది నేటికీ ఒప్పుకొని తీరవలసిందే. ఈ రచనలు అద్భుతంగా మానవ జీవితాలను మార్చగలుగుతున్నాయి. వీటిలో అనేకులకు నూతన జీవాన్ని కలిగింది. వారి జీవితాలలో శ్రేష్ఠకరమైన మార్పు వచ్చింది. త్రాగుబోతులూ, అవినీతిపరులూ, దొంగలూ, వ్యభిచారులూ, హంతకులూ ఇలాంటివారనేకులు క్రీస్తును విశ్వసించి, దివ్య మార్పు చెందారు. యేసుప్రభువు సజీవుడు. ఇప్పుడే, ఇక్కడే మనం ఆయనను అనుభవ పూర్వకంగా తెలుసుకోగలం.

**నిజమైన విషయాలు**

ఇంతకూ ఇందులో తేలిన వాస్తవిక విషయాలేమంటే, యేసుప్రభువును గురించిన మహాద్భుత గాథను ఆయన శిష్యులు ఎన్నటికీ కల్పించి ఉండరు. ఆయన జీవితం, ప్రబోధాలు, మరణం, పునర్జీవితం, మొదలైనవి శిష్యుల కల్పనలు కావు. వారు ఇలాంటివి కల్పించడమనేది మత విషయకంగా, మానసికంగా, నైతికంగా సాధ్యం అనుకోవడానికి ఆధారం లేదు. లేదా, కల్పించారే అనుకోండి. అలాంటప్పుడు ఈ విషయాలను జన సమూహాల చేత ఎలా ఒప్పించగలిగారు? అబద్ధాలు రాసి, ఇది నిజమని దేశప్రజలందరినీ నమ్మించడం, లోకాన్ని తలక్రిందులు చేయడం అసాధ్యం.

పోనీ, కల్పించి ఒప్పించారనే అనుకుంటే, దానికోసం స్వేచ్ఛగా ఇష్టపూర్వకంగా బాధలనూ మరణాన్నీ కూడా సహించగలిగారే. ఇది ఎలా జరుగుతుంది? కట్టుకథ

కోసం ఎవ్వరూ ప్రాణాలు అర్పించరు.

ఇది కూడా సాధ్యమే అయిందనుకొంటే, వారి ఉపదేశాలకు దేవుని శక్తి తోడుగా ఉండడం ఎలా జరుగుతుంది? లోకంలో నీతిన్యాయాల కోసం వారి ప్రబోధాలను దేవుడు వాడుకున్నాడే. ఇది ఎలాగా? అంతేకాదు, ఇది కల్పిత గాథ అయితే, దీన్ని నిజమని ప్రస్తుతం తమ అనుభవాల ద్వారా అనేకులు ఎలా చూపగలుగుతున్నారు?

నమ్మరాని విషయాలను ఇక్కడ కొన్నిటిని పొందుపరిచాం. వీటన్నిటినీ ఒకచోట చేర్చి చూస్తే, ఇలాంటివి జరగడానికి అవకాశాలు కనిపించవు. యేసులాంటి వ్యక్తిని శిష్యులు ఊహించి కల్పించగలవారు కారు. ఆ విధంగా అలాంటి బ్రహ్మాండమైన పునర్జీవాన్ని కలిగించగలవారు కారు, రోమ్ ప్రభుత్వాన్ని కూకటి వ్రేళ్ళతో పెకిలించగలవారు కారు, లోక చరిత్ర గతినే మార్చివేయగలవారు కారు. ఇవి నమ్మలేని విషయాలు. వారు నిజమని విశ్వసించినదే రాశారనడం నమ్మదగినది. యేసు నిజంగా తన అద్భుత జీవితాన్ని ఇహలోకంలో గడిపాడు. గంభీర సత్యాలు ఉపదేశించాడు. పాపుల కోసం చనిపోయాడు. సజీవంగా లేచాడు.

వారు సత్య విషయాలు రాశారు. కనుక, యేసు క్రీస్తు నిజంగా దేవుని కుమారుడే. ఆయన లోక రక్షకుడు. యేసు దేవుని కుమారుడైతే ఆయన ప్రబోధాలన్నీ సత్యాలే. ఆయన ఉపదేశాలన్నీ సత్యాలే అయితే, మనలో ప్రతి ఒక్కరూ దీన్ని నమ్మాలి.

**చారిత్రక రుజువు**

బైబిలులో కనిపించే రుజువుల కంటే విశ్వసనీయమైన రుజువులు మరి ఇంకే పుస్తకంలో దేవుడు ఇవ్వగలడని మనం అనుకోగలమా? బైబిలులో ప్రవచనాలూ భవిష్యద్వాక్కులూ ఉన్నాయి. వాటి నెరవేర్పులు కూడా ఉన్నాయి. అందులో నిజమైన చరిత్ర ఉంది. దానిని పరీక్షించవచ్చు కూడా. ఎందరో స్వయంగా చూచి రాసిన విషయాలున్నాయి. దేవుని శక్తితో యేసుప్రభువు చేసిన అద్భుతాలు ఉన్నాయి. ఆయన నీతిగల స్వభావం ఎంతో అద్భుతమైనది, అందమైనది. ఆయన ప్రబోధాలు మనుషులను వారి పాపాలనుంచి విడిపిస్తాయి. ఆయన వాగ్దానాలను నేటికి కూడా అనుభవించవచ్చు. ఏ గ్రంథం నుంచి అయినా ఇంతకంటే ఎక్కువ ఏమి చూడగలం? ఇది తృప్తి కలిగించకపోతే మరొకటి ఏదీ కూడా తృప్తిని ఇవ్వదు. క్రీస్తు సత్యానికి ఉన్న చారిత్రక రుజువులు నమ్మదగినవి. గొప్ప సాక్ష్యాధారాలతో వచ్చినవి. ఇంతకంటే ఇంకేమీ అక్కర్లేదు.

ఈ రుజువులను గురించి మరో మాట చెప్పగోరుతాను. రుజువులు రాయబడినవి. వీటిని అనుభవించాలి. ఈ రెండూ కలిసి ఉండాలి. క్రీస్తు చరిత్రలో జీవించిన వాస్తవిక వ్యక్తి అనడానికి అనేక బలమైన రుజువులు ఉన్నాయి. అయినా క్రీస్తును స్వీకరించడానికి ఇష్టంలేని వారికి ఇవి అంతగా నమ్మదగినవి అనిపించకపోవచ్చు. చారిత్రక రుజువులు అనేటప్పటికి ఇది ఇష్టం లేని మనుషులను బలవంతాన నమ్మింపజేస్తుందని ఎవరూ భ్రమించనక్కర్లేదు. ఇవి గణిత శాస్త్రంలాగా ఇవి ఇంతే అనేలా చూపవు. సందేహం ఉన్న సాధ్యతను పూర్తిగా తొలగించివేయవు కూడా. ఎంతటి చారిత్రక నిదర్శనమైనా, సందేహించ దలచుకున్నవాడు సందేహిస్తూనే ఉంటాడు. కాదనేవాడు కాదంటూనే ఉంటాడు.

రాయబడిన ఈ రుజువులు క్రీస్తును సత్యవంతుడుగా ముక్తిదాతగా చూపుతాయి. ఆయనదగ్గరకు వెళ్ళడానికి మనలను బలవంతం చేయలేవు. ఈ రుజువులను బట్టి శిష్యులు రాసినవన్నీ విశ్వసించి తగిన విషయాలు అని నమ్మడానికి అవకాశమూ, సాధ్యతా ఎక్కువ. మనం క్రీస్తును స్వీకరించి ఆయనను అనుసరిస్తూ ఆయనను గురించిన రుజువులు పూర్తిగా నిజమని తెలుసుకొంటాం. క్రీస్తును అనుభవించి, ఆయనను అనుసరించేవారికి ఈ రుజువులు ఎంతైనా నమ్మదగినవి అనిపిస్తాయి.

బైబిలులో రాయబడిన విషయాలతో దేవుడు బలప్రభావాలు తోడై పని చేస్తాడని ఎన్నో సార్లు మానవతా చరిత్రలో తేటగా కనబడింది. ఆయన ఈ సత్యాల ద్వారా మానవుల మనసులను, గ్రహింపు శక్తిని వికసింపజేస్తాడు. క్రీస్తు సత్యాన్ని అంతరంగంలో తన పవిత్రాత్మ ద్వారా ఒప్పిస్తాడు. ఇదే మనుషులకు కావలసినది. మనం హృదయ పూర్వకంగా ఆయనవైపు తిరిగితే, ఇది మనకు లభ్యమవుతుంది.

**అభ్యంతరం:** "సందేహమేమీ లేదు, క్రీస్తు నిజమైన చారిత్రాత్మక వ్యక్తి. అయితే ఆయన ఎన్నడూ సిలువమీద చనిపోలేదు. ఆయన సజీవంగా లేచినదీ కూడా లేదు అని కొందరంటున్నారు. వీరనేది నిజమా?

**జవాబు:** వీరు చెప్పినది నిజం కాదు. యేసుక్రీస్తు మరణ పునర్జీవితాలను కాదనడానికి కొందరీ విధంగా వెర్రి ఊహలను ప్రచారం చేస్తారంతే. యేసును సిలువమీద పెట్టి చీలలు కొట్టారు. కానీ ఆయన చావలేదు అంటారు వీళ్ళు. బాధచేత, రక్తం కారడం చేత ఆయన మూర్ఛబోయి, చనిపోయినట్టు కనబడ్డాడని వీరి వాదం. అందుచేత వారాయనను సిలువ మీదనుంచి తొలగించి సమాధిలో ఉంచారని వీరి అభిప్రాయం. ఆ సమాధి చల్లదనం విశ్రాంతి కలిగించింది.

అప్పుడు యేసు మళ్ళీ మేల్కొన్నాడు. బయటికి వచ్చాడు. తన శిష్యులకు కనబడ్డాడు. తాను చనిపోయి సజీవంగా లేచానని శిష్యులకు ఆశ్చర్యం కలిగేలా చెప్పాడు. అక్కడినుంచి ఆయన కాశ్మీర్‌కి వచ్చాడు. అక్కడ చనిపోయాడు. శ్రీనగర్‌లో సమాధి చేయబడ్డాడు అంటున్నారు.

ఈ వాదం చెదలు కొట్టిన వస్త్రంలాంటిది. దీనికి జవాబులు బోలెడన్ని ఉన్నాయి.

1. యేసుప్రభువు ఇంకా తన శిష్యులతో ఉన్నప్పుడు స్వయంగా నేను చనిపోయి బ్రతుకుతానని చాలా సార్లు చెప్పాడు. తీరా, సజీవంగా లేచినప్పుడు లేచానని శిష్యులతో అన్నాడు. యేసు అబద్ధికుడు కాడు.

2. ఈ సంఘటనలో సంబంధం ఉన్నవారందరూ ఆయన చనిపోయాడని నిర్ధారణ చేసుకున్నారు. ఆయన చనిపోయాడని తనకు నమ్మకం కుదరకపోతే రోమ్ గవర్నరు పిలాతు సమాధి చేయండని యేసు శవాన్ని అప్పగించి ఉండడు. ఈ విషయాన్ని అనవసరంగా పొడిగించదలచుకోలేదు పిలాతు. ఆయన చంపిన యూదులకు కూడా ఆయన చనిపోయాడు అని సంతృప్తికరమైన రుజువులు దొరికాయి. అప్పుడు ఆ శవాన్ని సమాధి చేయనిచ్చారు. ఆయన ఇంకా బ్రతికి ఉన్నాడు అని ఎంతమాత్రం రుజువు ఉన్నా వాళ్ళు అలా చేసి ఉండరు. సిలువ దగ్గర కొందరు సిపాయిలు ఉన్నారు. వారి పని యేసును చంపడమే. ఆయన చనిపోయాడని వారికి దృఢంగా తెలిసిపోయింది. అయినా సిపాయిలలో ఒకడు ఈటె తీసుకుని గుండెకు తగిలేట్టు యేసు ప్రక్కలో పొడిచాడు. అంతకుముందు ఆయన చనిపోకపోతే ఆయన్ను చంపడానికి ఈ బల్లెం పోటే చాలు.

3. యేసు దేహంలో అనేక గాయలు తగిలాయి. అలాంటి గాయాలతో ఉన్న మనిషి బ్రతకడు. ఒకవేళ బ్రతికివున్నా సమాధిలోనుంచి రాలేడు. ప్రేత వస్త్రాలతో గట్టిగా ఆయన శవాన్ని బంధించారు. అది వారి ఆచారం. సమాధిని మూసేశారు. రాత్రింబగళ్ళు రోమ్ సిపాయిలు కాపలా కాస్తున్నారు. సిపాయిలను తప్పించుకుని రాయి దొర్లించి ప్రేత వస్త్రాలలో ఉన్న యేసును ఎవరు బయటికి తేగలరు?

4. ఆయనకు భయంకరమైన గాయాలయ్యాయి. ఇవి ఉన్నా ఒకవేళ ఆయన బ్రతికి ఉన్నాడనుకుందాం. సమాధిలోనుంచి తప్పించుకున్నాడు అనుకుందాం. కానీ తాను మృత్యుంజయుడై సజీవంగా లేచిన జయశాలిని అని శిష్యులను ఒప్పించగలిగేవాడా? చనిపోయి బ్రతికిన జీవాధిపతీ దేవుని కుమారుడు అని శిష్యులు నమ్మి ఉండగలిగేవారా? అలా గాయాలతో కొన ఊపిరితో వచ్చినవాడైతే సగం చచ్చినట్టు, చికిత్స పొందవలసినవవాడై కనబడి ఉండేవాడు.

5. యేసు తన శిష్యులను ఈ విధంగా గానీ మరే విధంగా గానీ మోసగించి ఉండడు అని రుజువవుతుంది. ఆయన అలాంటి మోసగాడు కాడు. ఆయన పునర్జీవితాన్ని పూర్వ పక్షం చేసే ఈ ప్రయత్నం యేసును ఘోరమైన మోసగాడుగా చిత్రిస్తుంది. ఆయన శిష్యులను ఎంతో తెలివితక్కువ వారుగా చూపుతుంది. ఈ వాదం నమ్మరానిది.

6. ఈ వాదానికి రుజువులేమీ లేవు. ఇదంతా కేవలం ఊహాగానం. ఈ సంఘటన జరిగిన ఎన్నో శతాబ్దాల తరువాత చరిత్ర రాయబూనుకుంటే అది ఊహాగానం తప్ప మరేమవుతుంది? అలాంటి పొరపాటు పడిన రచయితలు బైబిలులోని క్రీస్తు చరిత్రను సత్యం కాదని చెపుతారు. కానీ రుజువు చేయలేరు. వారికి ఆ చరిత్ర ఇష్టం లేదని దాన్ని మార్చడానికి ప్రయత్నం చేస్తున్నారు. కానీ మనం దేన్ని నమ్మాలి? వాస్తవాన్ని చూచిన ధర్మపరులు చెప్పినది నమ్మాలా లేక వందలకొలది సంవత్సరాలు దాటిపోయిన తరువాత వచ్చిన క్రీస్తు శత్రువులు ఆధారం లేకుండా కల్పించి రాసిన రచనలు నమ్మాలా? శిష్యులకు తెలిసిన వాస్తవిక విషయాలు వీరికి తెలియవు గదా.

వీరి వాదం సరైనది కాదు. ఇందులో ఏమీ అర్థం కానరాదు. యేసు చనిపోయి సజీవంగా లేచాడు. ఆయన దేవుని దగ్గరనుంచి వచ్చిన ఉపదేశకుడని రుజువైంది. ఆయన దేవుని కుమారుడు అని నిరూపించబడింది. దీన్ని ఎందుకు మనం నమ్మకూడదు? ఎన్నో రుజువులు ఉన్నాయి. ఆయన జీవితం, మరణం, పునర్జీవితం, వీటన్నిటిలో పవిత్రత, మహిమ, విశ్వసనీయత, ఆకర్షణ ఉన్నాయి. తనను వెదకడానికి దేవుడు ఎవరి హృదయాన్ని సిద్ధం చేశాడో అలాంటి ప్రతి ఒక్కరూ ఈ యథార్థాన్ని గుర్తించి నమ్ముతారు.

**ప్రశ్న:** "క్రీస్తే సత్యం అంటున్నారు గదా – దానికి ఎన్నో ఆధారాలు కూడా ఉన్నాయంటున్నారు. అలాంటప్పుడు చాలామంది తెలివిగలవారూ విద్యావంతులూ క్రీస్తును స్వీకరించకపోవడం ఎందుకని?"

**జవాబు:** ఈ ప్రశ్ననే మరో విధంగా కూడా వేయవచ్చు. రుజువులు బలహీనమైనవే అయితే ఎందుకని ఇంతమంది విద్యావంతులూ తెలివిగలవాళ్ళూ క్రీస్తును స్వీకరిస్తారు? క్రీస్తును నమ్ముకొన్న అలాంటివారు అనేకులున్నారు. క్రీస్తును విశ్వసించినా, తిరస్కరించినా, దీనికి వేరే కారణాలుంటాయి గాని ఒకరి తెలివితేటల వల్ల కాదు. తెలివితేటలు గలవారు కొందరు క్రీస్తును నిరాకరించే వారున్నారు, స్వీకరించేవారున్నారు. కొందరు పామరులు కూడా నిరాకరిస్తారు,

కొందరు స్వీకరిస్తారు. బైబిలే దీనికి గల కారణాలను వివరిస్తుంది.

1. కొందరు శుభవార్తను గ్రహించక అపార్థం చేసుకొని నిరాకరిస్తారు. అలాంటివాడు విజ్ఞాన శాస్త్రంలో గొప్ప మేధావి కావచ్చు. విద్వాంసుడు కావచ్చు. అయినా ఆధ్యాత్మిక విషయాలలో కేవలం తెలివితక్కువవాడై ఉండవచ్చు. “సహజ సిద్ధమైన మనిషి దేవుని ఆత్మ విషయాలు అంగీకరించడు. అవి అలాంటి మనిషికి తెలివితక్కువతనంగా అనిపిస్తాయి. అవి ఆధ్యాత్మికంగా మాత్రమే తెలుస్తాయి గనుక అతను వాటిని గ్రహించలేడు.”[10] కొందరు విద్యావంతులూ మేధావులు కూడా యేసు క్రీస్తు శుభవార్త అంటే ఏమిటో బొత్తిగా ఎరగరు. అందుచేత దానికి ఉన్న రుజువేదో వారికి బొత్తిగా తెలియదు. వారికి అర్థం కానిదాన్ని విసర్జిస్తున్నారు.

2. కొందరికి మత సంబంధమైన వివాదాలలో గానీ వేదాంత విషయాలలో గానీ తమ పంతమే నెగ్గాలని ఉంటుంది. వీరికి తమ సొంత అభిప్రాయాలు మాత్రమే ఇష్టం. తమ అభిప్రాయాలను భిన్నంగా మాట్లాడేవారి పట్ల వీపు చూపుతారు. ఇలాంటి పక్షపాత ధోరణి సత్య సందర్శనానికి గొప్ప ఆటంకం.

3. మరి కొందరు తమ హేతుబుద్ధి కల్పించే వాదాలపై అతిగా ఆధార పడుతారు. కానీ హేతువాదం మాత్రమే ప్రామాణికం కాదు. దీనిమీద పూర్తిగా అధారపడితే ఎన్నో పొరపాట్లు చేయవచ్చు.

4. మరి కొందరు ఇతరుల మెప్పును కోరి క్రీస్తును నిరాకరిస్తారు. ఇలాంటి వారికి సత్యం కనబడకుండా పోతుంది. ఇతరులు మనలను ఘనపరచాలని ఆశిస్తే సత్యం గ్రహించడానికి ఆటంకం కలిగితీరుతుంది. అవిశ్వాసులతో ఒకసారి యేసుప్రభువు ఈ విధంగా అన్నాడు – “మీరు ఒకరిచేత ఒకరు ఘనత పొందుతూ, ఒకే ఒక దేవుని నుంచి వచ్చే ఘనత వెదకకుండా ఉంటే నన్ను ఎలా నమ్ముతారు?”[11]

5. మరి కొందరు గర్వంచేత సత్యాన్ని చూడలేకపోతున్నారు. శుభవార్త మనల్ని పొగడదు. మనం పాపులమని చూపిస్తుంది. పాపులమైన మనకోసమే దేవుని కుమారుడు చావవలసి వచ్చింది. మనం ఆధ్యాత్మికంగా అజ్ఞానులం, నిస్సహాయులం. దేవుని కృపపై సంపూర్ణంగా ఆధారపడవలసిన వారం. గర్విష్ఠులు దీన్ని సహించలేరు. ఈ విధంగా వారి నిజ స్థితిని వెల్లడి చేసే సందేశాన్ని అంగీకరించడం కంటే క్రీస్తును గురించిన ఎన్ని రుజువులున్నా గర్విష్ఠులు ఆయన్ను స్వీకరించరు. గర్వం క్రీస్తు శుభవార్తను గ్రహించి అంగీకరించకుండా చాలామందికి అడ్డంగా వస్తుంది.

6. కొందరు స్వేచ్ఛాప్రియులు. మా ఇష్టం వచ్చినట్లు జీవిస్తామంటారు. దేవుడు కూడా తమ జీవితంలో జోక్యం కలిగించుకోకూడదు అనుకుంటుంటారు. తమకు ప్రీతికరంగా ఉండేదేదో అదే చేస్తుంటారు. అంతగా అయితే క్రీస్తే మార్చుకుంటాడులే అంటారు. ఈ విధంగా వీరు క్రీస్తును నిరాకరిస్తున్నారు.

7. మరి కొందరు అవినీతి కారణాలను బట్టి క్రీస్తును తిరస్కరిస్తారు. ఎలాగంటే, పాపంలో ఉండి అందులోనే హాయిగా ఉంటున్నామని తలపోస్తారు. అలా పాపం చేయడం ద్వారా వారికి వ్యక్తిగతంగా లాభం ఉంటుందనుకుంటారు. క్రీస్తును స్వీకరిస్తే పాపాన్ని విడిచిపెట్టవలసి వస్తుంది. పవిత్రతను, నీతిని చేపట్టవలసి ఉంటుంది. వారికి వెలుగుకంటే చీకటే ఎక్కువగా ప్రీతి. క్రీస్తును గురించి ఎన్నో రుజువులు చూపినా వీరికేమీ పట్టదు.

8. కొందరు నిజమైన దేవునిపట్ల విరోధ భావాన్ని బట్టి క్రీస్తును తిరస్కరిస్తారు. మనుషులందరూ పాపులే. దీన్ని బట్టి అందరూ దేవ విరోధులవుతున్నారు. "శరీర స్వభావాన్ని అనుసరించే మనసు దేవునికి విరోధమే. అది దేవుని ధర్మశాస్త్రానికి లొంగదు, అలా లొంగడం అసాధ్యమే"[12] మనుషులకు ఇది తెలియకపోవచ్చు. కానీ ఇది నిజం, మానవులు దేవ కుమారుణ్ణి నిరాకరించడం ద్వారా దుష్ట మనసును బయలు పరుస్తున్నారు. దేవుని కృప ఒక మనిషిని విమోచించలేదు అంటే అతడు తన స్వంత తలంపులు ప్రయోగించి సత్యాన్ని అడ్డు కట్టవేసుకున్నాడన్నమాట. ఇలాంటి వారు క్రీస్తును గురించిన రుజువులను పెడ చెవిని బెడతారు. ఈ లోపం రుజువులలో లేదు. లోపమంతా సత్యానికి వ్యతిరేకంగా పోరాడే మనిషిలోనే ఉంది. మానవుడి మేధస్సు ఎంత గొప్పదైనా క్రీస్తు విషయంలో ఏ మాత్రమూ ఉపకరించదు. దేవుణ్ణి గురించిన తీర్మానం చేసే విషయం మానవుడి జ్ఞానం మీద ఆధారపడదు. ఈ నిర్ణయం మనిషి ఆంతర్యసంబంధమైనది. మానవుడి అంతరంగంలో నుంచి, హృదయాంతరాళంలో నుంచి వచ్చే తీర్మానమిది.

**అభ్యంతరం:** "ఇది విజ్ఞాన శాస్త్ర యుగం. ఇలాంటి ఆధునికి యుగంలో దేవునిలో, క్రీస్తులో ఎలా నమ్మగలం? బైబిలును ఎలా విశ్వసించగలం?"

**జవాబు:** ఎందుకని నమ్మకూడదు! ఈ ఆధునిక యుగంలో కూడా దేవునిలో నమ్మిక యుంచిన విజ్ఞాన శాస్త్రవేత్తలు అనేకులున్నారు. క్రీస్తును విశ్వసిస్తున్నారు. బైబిలును నమ్ముతున్నారు. అంతరిక్ష శాస్త్రజ్ఞుడైన లాంబర్ట్ డాల్ఫిన్ ఇలా చెపుతున్నాడు: "నా జీవితమే ఒక ప్రయోగశాల. ఇందులో నేను అనేక సార్లు బైబిలుపై శాస్త్ర పరిశోధన

చేసి చూశాను. ఈ దివ్య గ్రంథం అపూర్వమైనది. ఇది నమ్మదగినది. బైబిలు చెపుతున్నదంతా విశ్వసనీయమే! ఇది నేను దృఢంగా నమ్ముతున్నాను. బైబిలు తప్పులేనిది. నమ్మదగినది. నిర్థిష్టమైనది. ఇది దేవుని వాక్కు."

డా॥ వెర్నెర్ వాన్ బ్రవుణ్ అనే శాస్త్రవేత్త చంద్రమండల యాత్రకు కారకుల్లో ఒకడు. అతడీ విధంగా అన్నాడు: "దేవుడు సమస్త విశ్వానికీ సృష్టికర్త అని మనం నేర్చుకోవాలి. ఈ విషయాన్ని మనమంతా గుర్తించడం అవసరం. దేవుడు సమస్తానికీ యజమాని." అపోల్లో 11 అనే అంతరిక్ష నౌక చంద్రమండలానికి వెళ్ళే సమయంలో అతడు యేసుప్రభువు శిష్యులకు నేర్పిన ప్రార్థన పలికాడు.

ఈ విధంగా ఎన్నైనా ఉదాహరణలు చెప్పవచ్చు. మరో దృష్టాంతం చెపుతాను. ఒక ప్రఖ్యాతి చెందిన శాస్త్రజ్ఞుడున్నాడు. ఆయన పురు ఆండ్రూ కాన్వే ఐవీ. ఈయనకు బోలెడన్ని డిగ్రీలు కూడా ఉన్నాయి. పి.హెచ్.డి., యం.డి., డి.యస్.సి., యల్.యల్.డి., యఫ్ ఎ.సి.పి., మొదలైన డిగ్రీలున్నాయి. ఈయన శరీర శాస్త్రజ్ఞులలో మేటి. ఈయన ఓ సారి ప్రశ్న వేశాడు – "దేవుడున్నాడా?" ఆయనే ఈ ప్రశ్నకు జవాబు కూడా చెప్పాడు – "అవును, ఉన్నాడు. నేను ఉన్నానని నా శరీర ఉనికిని గురించి ఎంత గట్టిగా చెప్పగలనో, దేవుణ్ణి గురించి కూడా అంత దృఢంగా ఆయన ఉన్నాడని చెప్పగలను."

విజ్ఞాన శాస్త్రవేత్తలు కొందరు కల్పించిన వాదాలూ, ఊహలూ బైబిలుకు విరుద్ధం కావచ్చు. కానీ నిజమైన శాస్త్రీయ విజ్ఞానం రుజువు పరిచినది, నిరూపించినది బైబిలు సత్యాలకు విరుద్ధం కాదు.

**ప్రశ్న:** యేసుక్రీస్తు దేవుని అవతారమని మీరు అంటున్నారు గదా! ఆ మాటకొస్తే ఇంకా ఎన్నో అవతారాలు లేవా? వాటి సంగతి ఏమిటి?

**జవాబు:** అనేక అవతారాలు లేవు. దేవుడు వేరు వేరు మనుషుల్ని ప్రత్యేకమైన పనికోసం ఆయా సమయాలలో లేపుతూ ఉంటాడు. అనేకుల్ని దేవుడు తన ఆత్మచేత నింపి బయలుదేరదీశాడు. కానీ దేవుడు ఒకసారి మానవుడుగా అవతరించాడు. మానవుల శాశ్వత విముక్తికి అవసరమైనదంతా క్రీస్తు మూలంగా ఒకేసారి చేశాడు. ఎవరైనా క్రీస్తువైపు తిరిగి ఆయనను విశ్వసించి స్వీకరిస్తే వారికి శాశ్వత ముక్తి లభిస్తుంది. మనుషులకు అవసరమైనంత సత్యాన్ని క్రీస్తు వెల్లడి చేశాడు. దేవుడెవరు, మానవుడెవడు, దేవుని దగ్గరికి మార్గమేది? అనే ప్రశ్నలకు సంపూర్ణమైన జవాబులు, వాటి గురించి మనకు అవసరమైన సత్యాలన్నీ దేవుడే ప్రత్యక్షపరిచాడు. మనకు మరో అవతారమేమీ అక్కర లేదు. దేవుని వాక్కు ప్రకారం

మరి ఇంకెవరినీ దేవుడు పంపలేదు. పంపడు కూడా. దేవునికి గానీ మనకు గానీ ఏమీ ప్రయోజనం లేనిది దేవుడు ఎందుకు చేస్తాడు?

**ప్రశ్న:** “మా మతమే సరైనది. ఇదే సత్యమైనది అనడంలో మత దురభిమానం ధ్వనిస్తుంది. దీనికి మీరేమంటారు?”
**జవాబు:** ఇది పరిస్థితులపై ఆధారపడి ఉంది. నిజమే చాలమందికి మత దురాభిమానం ఉంటుందని నాకు తెలుసు. ఇతరుల మతాలను గురించి కొందరు ఏ సహనం చూపరు. ఒకవేళ సత్యం కాని మతాన్ని పట్టుకొని దాన్నిబట్టి దురాభిమానం పెంపొందించుకుంటే, అది ఇంకా అవివేకం అనిపించుకుంటుంది. కానీ యేసుక్రీస్తు నిజం చెప్పాడనడంలో దురభిమానం ఏముంది? ఇందులో మత గర్వం ఏముంది? క్రీస్తు నిజం చెప్పలేదు అనడంలో చాలావరకు అహంకారం కనబడుతుంది. క్రీస్తు ఇచ్చిన సత్యాన్ని కాదని చెప్పి దురభిమానాన్ని ప్రదర్శించినవారు లేకపోలేదు.

నేనే దేవుని దగ్గరికి మార్గాన్ని అన్నాడు యేసుప్రభువు. ఇది ఆయన శిష్యులు కల్పించినదేమీ కాదు. ఆయన శిష్యులు తమ గురుదేవుడు చెప్పినది విశ్వసించి విధేయతతో దాన్ని ఇతరులకు ప్రకటించేవారు మాత్రమే. దేవుని దగ్గరకు ఒకే మార్గం ఉంది అనుకోండి. దేవుడు దీన్ని తేటగా బయలుపరచాడు. కొందరికి ఈ విషయం బాగా తెలుసుననుకోండి. ఈ సత్యాన్ని వారు ఇతరులకు వెల్లడి చేయడం తప్పా? ఇందులో పొగరుబోతుతనం ఏముంది? దురభిమానం ఏముంది? ఏమీ లేదని చెప్పగలను. క్రీస్తును విశ్వసించినవారు. తమ తోటి మనుషుల మధ్య ఈ ప్రాముఖ్యమైన సత్యాన్ని దాచిపెట్టిన నేరానికి గురి అవుతారు.

**ప్రశ్న:** “జన్మాంతర సిద్ధాంతం మాటేమిటి? ఇది నిజమా, కాదా?”
**జవాబు:** పునర్జన్మం నిజమని నమ్మడానికి బలమైన కారణాలు లేవు. సరైన హేతువు లేకుండా మనం దేనినీ నమ్మకూడదు.

1. యేసుప్రభువు జన్మాంతరం అనేమాట ఎప్పుడూ ప్రయోగించినవాడు కాడు. అంతే కాకుండా ఆయన చెప్పిన మాటలు ఈ సిద్ధాంతానికి కేవలం వ్యతిరేకం. మనుషులు బ్రతికేది ఒకసారి, చనిపోయేది ఒకసారి. “ధనవంతుడు, లాజరు” అనే ఉదాహరణలో మనుషులు చనిపోయిన తరువాత మరోసారి బ్రతకడానికి లోకానికి రారు అని ప్రభువు సూచించాడు.[13]

2. కర్మ అనే భావనను జాగ్రత్తగా అర్థం చేసుకుంటే అందులో సత్యం

లేకపోలేదు. ప్రతి మనిషి చేసిన కర్మకు ప్రతిఫలం అనుభవించి తీరాలి. విత్తినదే పంట కోయడం జరుగుతుంది. అయితే యేసుప్రభువు నేర్పిన ప్రకారం ఇది చాలావరకు పరలోకంలోనే జరుగుతుంది. లేదా, నరకంలోనైనా జరుగుతుంది. ఈ లోకంలో మాత్రం కాదు. పాపానికి చివరి ఫలితం పునర్జన్మ కాదు. దేవుని నుంచి శాశ్వతంగా వీడిపోవడం, నరకం. "దాని కంటే నాకు పునర్జన్మే బాగుంటుంది" అని ఎవడైనా చెపితే, చెప్పవచ్చు. మన ఇష్టాయిష్టాలపై అది ఆధారపడి ఉండదు. అసలైన ప్రశ్న – ఏది నిజం? అసలు అపాయమేదో ముందు గ్రహించాలి. ఎలాంటి అపాయం కావాలో మనం కోరుకుందాం అని అనుకోవడంలో అర్థం లేదు. యేసుప్రభువు ఉపదేశం ప్రకారం పాపం భయంకరమైనది. దానికి తగిన శిక్ష శాశ్వత స్థితికి సంబంధించినది. క్రీస్తును అంగీకరించక స్వీకరించని పాపి దేవుని సన్నిధినుంచి శాశ్వతంగా వేరుగా ఉండాలి. దేవుని న్యాయానికి పునర్జన్మ సిద్ధాంతం అసలు సరిపడదు.

కాని, మనకందరికీ శుభవార్త! జన్మాంతరం గానీ శాశ్వత శిక్షగానీ మనం అనుభవించనక్కర్లేదు. పశ్చాత్తాపపడి యేసుక్రీస్తును విశ్వసించి స్వీకరిస్తే చాలు. దీనిద్వారా శాశ్వతుడైన దేవుడు క్రీస్తులో మన పాపాల కోసం బాధలు అనుభవించాడని తెలుసుకొంటాం. ఆ పాపాలను పూర్తిగా తుడిచివేశాడని గ్రహిస్తాం. దేవుని కుమారుడైన క్రీస్తు మనకోసం బలయాగమయ్యాడని తెలుసుకుంటాం. ఆయన మన పాపాలను తన రక్తంతో తుడిచివేశాడు.

ఇది వాస్తవమైన విషయం. అందరమూ తప్పనిసరిగా నమ్మవలసిన వాస్తవం. అనంతుడైన దేవుడు మానవుడి పాప భారాన్ని వహించకపోతే అతడికి నిత్య శిక్ష ప్రాప్తించి తీరుతుంది. అలాంటప్పుడు మానవుడికి విమోచన ఇంకా ఎక్కడిది? మరో మార్గం బొత్తిగా గోచరించడం లేదు.

3. జన్మాంతర వాదం దేనిమీద ఆధారపడి ఉందో గమనించాలి. ఓ మనిషి అనేక జన్మలు ఎత్తుతూ ఉంటే, రాబోయే జన్మలో ఇప్పటికంటే ఉన్నతంగానో, నీచంగానో జన్మించవచ్చు. ఈ సిద్ధాంతాన్ని ఆధారం చేసుకొని ఈ లోకానికి వస్తూ పోతూ ఉంటారనే ఆలోచనతో కొందరున్నారు. కానీ, మానవుడు పాపి. అతడు పాపం చేస్తూనే ఉంటాడు. అతడి స్వభావం పాపంతో నిండి ఉన్నది. మానవుడు నిస్సహాయుడు. దేవుని శక్తి మాత్రమే క్రీస్తు ద్వారా అతణ్ణి మార్చగలదు. మనుషులు ఎన్ని జన్మలెత్తినా స్వయంగా విముక్తి సంపాదించుకోలేరు. కోట్లకొలది జన్మలలో కూడా ఇది మనుషులకు అసాధ్యమే. అనేక జన్మలెత్తినా ఈ పాపాన్ని పరిహరించే క్రియాకలాపాలు చేయగోరినా, పాపంవల్ల వచ్చే శిక్షను కూడా తప్పించుకోలేడు.

మానవుడు పవిత్రుడు కాలేడు సరిగదా, అలా అతడి పాపాలు ఎక్కువవుతాయి.

4. పునర్జన్మ సిద్ధాంతంలో మరి కొన్ని విషయాలు విచిత్రంగా ధ్వనిస్తాయి. మానవుడు జంతువుగా జన్మం ఎత్తవచ్చుననే వాదం కూడా ఉంది. మానవుడికి జంతువుకూ ఉన్న భేదాన్ని తెలుసుకున్న వాడెవడూ ఈ విధంగా తలంచలేడు. దేవుడు చేసిన ప్రత్యేకమైన సృష్టి మానవుడు. మానవుడికి ప్రత్యేకమైన తెలివి ఉంది, సంకల్ప శక్తి ఉంది, ఆధ్యాత్మిక ప్రేమ, అలాంటి మరి కొన్ని ఉద్రేకాలున్నాయి, చిత్తవృత్తి ఉంది. అందుచేత మానవుడు జంతు స్వభావంకంటే పైవాడు. అతడు జంతువు కాలేడు. మానవుడు జంతువుగా అవుతాడే అనుకోండి. తిరిగి జంతువు మానవుడి స్థాయికి ఎలా రావాలి? అది కూడా అసాధ్యం.

పునర్జన్మ సిద్ధాంతం మరో విషయాన్ని చెపుతుంది. బాధితుడు అలాంటి బాధకు తగిన కర్మ చేసివుంటాడు. బాధ అనేది ఎల్లప్పుడూ దుష్కర్మ ఫలితమే. పైగా, ఒకడు మరి ఒకరికి బదులు బాధపడడం అసాధ్యం. ఎవరు చేసిన కర్మ వారు అనుభవించవలసిందే అంటారు. ఈ ఉద్దేశాలన్నీ యేసు క్రీస్తు ఉపదేశాలకు వ్యతిరేకంగా ఉన్నాయి. ఉదాహరణగా యోహాను 9:1-3 చూడండి.

5. ఎవరెన్ని చెప్పినా, జన్మాంతర సిద్ధాంతానికి సరైన రుజువు లేదనేది తథ్యం. గత జన్మ మనకేమీ జ్ఞాపకం ఉండదు. కొందరికి గత జన్మ వాసనలున్నాయని చెప్పారు. వీటిని పునర్జన్మ సిద్ధాంతంతో సంబంధం లేకుండా వివరించవచ్చు. మనుషుల మానసిక ప్రపంచంలో చిత్ర విచిత్రాలు జరుగుతుంటాయి. దీనికి మించి లోకంలో సైతానూ, వాడి దూతలూ మనిషి మనసులో అనేక కార్యాలు జరిగిస్తూ ఉన్నారు. రుజువు లేకుండా, తగిన కారణాలు లేకుండా దేనిని నమ్మడం తెలివైన పని కాదు.

6. క్రీస్తును గురించి సరైన రుజువులున్నాయి. నీకు పునర్జన్మలో నమ్మక మున్నదనుకో. భవిష్యత్తులోని జన్మ పరంపరను గురించి నీకు భయముందనుకో. అయినా పరవాలేదు. క్రీస్తు దగ్గరికి రా. ఆయన నీకు ఇప్పుడే శాశ్వత జీవం ప్రసాదిస్తాడు. నీ పాపాలన్నీ క్షమిస్తాడు. నిన్ను పూర్తిగా బంధ విముక్తుణ్ణి చేస్తాడు. నీవు క్రీస్తును విశ్వసిస్తే జీవన్ముకుడవు అవుతావు. దేవునితో ఇప్పుడే ఇక్కడే సమాధానం, పొందిక కలిగి జీవించగలుగుతావు.

**ప్రశ్న:** "క్రీస్తు గొప్పవాడు. సందేహమేమీ లేదు. ఆ మాటకొస్తే ఇంకా చాలామంది గొప్పవాళ్ళున్నారు. గాంధీజీ లేడా? వీరందరూ ఒక అంతస్తుకు చెందిన మహా పురుషులు."

**జవాబు:** ఈ విధంగా మహా పురుషులను పేర్కొన్నప్పుడు ప్రతి ఒక్కరు చేసినదేమిటో పరిశీలించడం మంచిది. వారి స్వంత అనుభవాలను వారే చెప్పినప్పుడు వింటే మంచిది. గాంధీజీ ఎప్పుడు కూడా నేను దేవుని అవతారాన్నని చెప్పలేదు. కానీ యేసుక్రీస్తు తాను పరలోకంనుంచి దిగివచ్చాననీ దేవుణ్ణి అనీ చెప్పాడు. గాంధీజీ నేనేమీ అవతారాన్ని కాను అని చెప్పుకున్నాడు కూడా. గాంధీజీ నేను సత్యాన్వేషిని అన్నాడు. సంపూర్ణ సత్యం నాకింకా కనబడలేదు అని కూడా చెప్పాడు. విముక్తి పొందే లక్ష్యంతో సాధన చేస్తున్నాను అన్నాడు. కానీ యేసు క్రీస్తు తాను పాపం లేనివాణ్ణి అని చెప్పాడు. ఇతరులకు విముక్తి ప్రసాదించడానికి వచ్చానని కూడా చెప్పాడు. గాంధీజీ తాను పాపుల కోసం చనిపోతున్నానని గానీ తనలోని విశ్వాసం ద్వారా పాపులకు మోక్షం లభిస్తుందని గానీ చెప్పలేదు. క్రీస్తు అలా చెప్పాడు. వీరి స్వంత మాటలు చదివితే వారేమి చెప్పుకున్నారో తెలిసిపోతుంది. గాంధీజీ చనిపోయి సజీవంగా లేచినవాడేమీ కాదు. తాను నిజమైన గురువునని నిరూపించుకోవడానికి, తాను దేవుని ఏకైక కుమారుణ్ణి అని రుజువు చేసుకోవడానికి ఆయన అలాంటిది ఏమీ చేయలేదు.

గాంధీజీ భారత జాతికి చేసినదేమిటో మనకు తెలుసు. ఆయన స్వతంత్ర భారత పిత. ప్రజాస్వామ్య భారతానికి గాంధీజీ తండ్రి. దీనికోసం గాంధీజీని ఘనపరచవచ్చు. కాని, ఆయన ఒప్పుకున్న సంగతులు గమనించకుండా – నేను కాను అని చెప్పిన వాటిని ఆయనకు ఆరోపించడం ఆయనకు తగిన గౌరవం కాదు. అది అవమానమే కలిగించినట్లవుతుంది. యేసుప్రభువు భూమ్యాకాశాలకు ప్రభువు. ఆయన సృష్టికర్త. తనదగ్గరికి వచ్చేవారందరికీ ఆయన ముక్తిదాత, రక్షకుడు. ఎంత గొప్ప మనిషినైనా యేసుక్రీస్తుతో సమానుడని చెప్పి ఆయన అంతస్తుకు ఎక్కించకూడదు.

**ప్రశ్న:** "ప్రజలకు యేసుక్రీస్తు సిలువద్వారా మాత్రమే మోక్షం లభిస్తుందని మీరంటున్నారు గదా – క్రీస్తు లోకంలో పుట్టకముందు జీవించినవారి మాటేమిటి? వారికి ముక్తి లేదా?

**జవాబు:** యేసుప్రభువు తన ప్రజలందరి కోసం చనిపోయాడు. వారు ఆయన కాలంలో ఉన్నవారై ఉండవచ్చు. లేదా, ఆయనకు ముందు బ్రతికినవారై ఉండవచ్చు. లేదా, ఆయన తరువాతివారై ఉండవచ్చు. యేసుక్రీస్తు సిలువమీద ఏమి చేయబోతున్నాడో జగత్తు ఆరంభమైనప్పటినుంచీ దేవునికి తెలుసు. తరతరాలలో ప్రజలు తమకు దేవుడు నేర్పిన సత్యాన్ని విశ్వసించి ఆయనకు

లోబడినప్పుడు ఆయన వారందరినీ రక్షించాడు. ప్రతి విషయం జరగకముందే దేవునికి తెలుసు. అది జరిగినట్టే దేవుడు వ్యవహరించగలడు కూడా.

**ప్రశ్న:** "దేవుణ్ణి ఆరాధించాలంటే సరైన మార్గమేది?"
**జవాబు:** గురుదేవుడు సత్యంలోను ఆత్మలోను దేవుణ్ణి ఆరాధించాలి అని చెప్పాడు. దేవుడు ఆత్మ. అలాంటి దేవుణ్ణి మనం ఆరాధించాలి. మనం సృష్టి పదార్థాలను పూజించకూడదు. హస్త కృత్యాలను ఆరాధించరాదు అని దీని భావం.

ఆధ్యాత్మిక ఆరాధన వట్టి ఆచారం కాదు. మత గ్రంథాలను వల్లెవేయడం కూడా కాదు. ఎక్కువగా మాటలు ఉచ్చరించి వ్యర్థంగా పలికినందుచేత దేవుడు వింటాడనుకోవడం ఆరాధన లక్షణం కాదు.[14] నిజమైన ఆరాధన హృదయంలో నుంచి వస్తుంది, ఆత్మలోనుంచి పెల్లుబికి వస్తుంది. దేవుణ్ణి గురించిన జ్ఞానమూ, ప్రేమా అనే దివ్య గుణాలకు ఫలితమే యథార్థమైన ఆరాధన.

మన ఆరాధన నిజమైన నైతిక జీవితం చేత బలపరచబడాలి. తన ఇష్టప్రకారం జీవించే వ్యక్తి, పాపంలో మునిగి తేలేవాడు చేసే ఆరాధనను దేవుడు అంగీకరించడు. ప్రవక్తద్వారా దేవుడు ఈ విధంగా చెప్పాడు: "ఇకనుంచి మీ వ్యర్థ నైవేద్యాలను తేవద్దు. మీరు అర్పించే ధూపం నాకు అసహ్యం! అమావాస్య, విశ్రాంతిదినాలు, సభలు జరుగుతూనే ఉన్నాయి గాని, మీ దుష్టసమావేశాలను నేను ఓర్చుకోలేను. మీ అమావాస్య ఉత్సవాలు నియామకమైన పండుగలు నాకు అసహ్యం! అవి నాకు బాధకరం! వాటిని సహించలేక విసుగుచెందాను! మీరు మీ చేతులు చాపి ప్రార్థన చేసేటప్పుడు మిమ్మల్ని చూడకుండా నా కళ్ళు దాచుకుంటాను. మీరు ఎంత ప్రార్థించినా నేను చెవినిబెట్టను. మీ చేతుల నిండా రక్తమే. కడుక్కోండి! మిమ్మల్ని శుద్ధి చేసుకోండి! మీ చెడు క్రియలు నాకు కనబడకుండా తొలగించి వేయండి. చెడుగు చేయడం మానండి! మంచి చేయడం నేర్చుకోండి! న్యాయాన్ని అనుసరించండి! హింసకు గురి అయినవారిని విడిపించండి! తండ్రిలేని పిల్లలకు న్యాయం చేకూర్చండి! వితంతువుల పక్షాన వాదించండి!"[15]

**అభ్యంతరం:** "యేసుక్రీస్తు అద్వైత వేదాంతి. నేను దేవుని కుమారుణ్ణి అని ఆయన చెప్పాడు. ఆయన దేవునితో ఏకమై ఉన్నానని చెప్పుకున్నాడు. ఆయన మాటలు అద్వైతం ప్రకారం జ్ఞానసిద్ధి అనుభవించినవాడు చెప్పిన మాటల్లా ఉన్నాయి."
**జవాబు:** యేసుక్రీస్తు అద్వైత వేదాంతి కాదు. ఆయన ఉపదేశాలన్నీ అద్వైత

సిద్ధాంతానికి వ్యతిరేకంగానే ఉన్నాయి. కొందరు అద్వైత సిద్ధాంతం సారం ఈ విధంగా చెపుతారు – "బ్రహ్మమే వాస్తవం. దృశ్యమాన లోకం అసత్యం. మాయా జన్యం. బ్రహ్మమునకూ మన ఆత్మలకూ భేదమేమీ లేదు." అద్వైత సిద్ధాంతాన్ని బాగా ఎరిగినవారు దాన్ని క్రీస్తు ఉపదేశాలతో చూస్తే భేదాలు తెలుసుకోగలరు. యేసుప్రభువు సొంత ప్రబోధాలూ ఆయన బైబిల్లోని మొదటి భాగంలోనుంచి ఉదహరించినదీ తీసుకుని అద్వైత వాదంతో సరిపోల్చే ప్రయత్నం చేసి చూడవచ్చు.

1. దేవుడు శాశ్వతుడు. ఆయన స్వయంభవుడు. స్వయంగా ఉనికిగల వాస్తవికత. ఒకే దేవత్వంలో తండ్రి, కుమారుడు, పవిత్రాత్మ అనే ముగ్గురున్నారు. ఇదే దేవత్వం సారాంశం. ఈ పరమాత్మయొక్క ఉన్నత సత్యం ఏమిటంటే, ఈయన వ్యక్తిత్వం గలవాడు. అద్వైతులు ఇది దేవుణ్ణి గురించిన ఉన్నత భావన కానే కాదని కొట్టిపారేశారు. వారు నేర్పిన ప్రకారం "నిర్గుణ బ్రహ్మమే" ఉన్నతమైనది. అంటే, పరబ్రహ్మమునకు వ్యక్తిత్వం గానీ ఏ గుణమూ గానీ ఉండదు. అయితే యేసుప్రభు ఉపదేశం ప్రకారం పరమాత్మ సుగుణి. ఆయనకు లక్షణాలున్నాయి. ఆయన వ్యక్తి. ఈ విషయం ఇంతటితో ముగించవచ్చు. ఎందుకంటే, యేసుప్రభువు దేవుని దగ్గరనుంచి వచ్చాడు. ఆయనే దేవుడు. దేవుడు ఎలాంటివాడో ఆయనకు బాగా తెలుసు. యేసుప్రభువు చెప్పిన సత్యాన్ని అటుంచండి. నిర్గుణ బ్రహ్మ వ్యక్తిగతమైన దేవునికంటే గొప్ప ఎలా కాగలదు? దేవుడు వ్యక్తిగా, ప్రేమ, పవిత్రత, చిత్తం, సంకల్పం, చైతన్యవంతమైన జ్ఞానం గలవాడు అనే భావన ఉత్తమమైనది కాదా!

మనకున్న జ్ఞానాన్ని బట్టి విచారించి చూస్తే, వ్యక్తిత్వం లేనిది వ్యక్తికంటే గొప్పది కాదు. చైతన్యవంతమైన జ్ఞానం, సంకల్ప శక్తి, ప్రేమ లేనివాడు మృగతుల్యమే! వృక్షంతో సమానమే! లేకపోతే పాషాణమే. ఈ దివ్య గుణాలు లేని పరమాత్మ ఎలాంటిదై ఉంటుంది? క్రీస్తులో ప్రత్యక్షమైన వ్యక్తిత్వం గల దేవునికంటే తక్కువే అనిపించడం లేదా? పదార్థం కంటే ఆత్మ గొప్ప. అలాగే నిర్గుణ పదార్థం కంటే సుగుణుడైన దేవుడు గొప్ప. వ్యక్తిత్వం లేదు అనే భావన దేవుణ్ణి పరిమితం చేస్తుంది. దేవుని ఉన్నత స్థితిని తగ్గిస్తుంది.

దేవుని వ్యక్తిత్వం స్వార్థమయమైన అహంకారం కాదు. మానవుడి వ్యక్తిత్వంలో మనం అహంకారాన్నీ స్వార్థాన్నీ చూడవచ్చు. కానీ దేవునిలో అలా కాదు. మానవుడు పతనమైనవాడు. అతడి వ్యక్తిత్వం భ్రష్టమైనది. కానీ దేవుని వ్యక్తిత్వం కేవలం పవిత్రమైనది, పరిపూర్ణమైనది, అపరిమితమైనది.

ఈ విషయాన్ని మనం ఎంత తర్కించినా, ఒకే ఒక సత్యం మిగిలిపోతుంది. దేవుడు మాట్లాడాడు. యేసుక్రీస్తులో వ్యక్తిగతంగా ప్రత్యక్షమయ్యాడు. ఆయన సుగుణమూర్తి. మనం నిజ జ్ఞానం గలవారమైతే దేవుడు ప్రసాదించిన ప్రత్యక్షతను అంగీకరిస్తాం.

2. దేవుడు జ్ఞానంతో లోకాన్ని సృజించాడు. మాయద్వారా కాదు. అవిద్య ద్వారా కాదు. లోకం యథార్థమైనదే గాని శాశ్వతమైనది కాదు. ఇది దేవుని కంటే భిన్నమైనది. ఇది దేవునిలో ఒక భాగం కాదు.

3. పాపం, దుష్టత్వం అనేవి సైతాను ద్వారా జగత్తులో ప్రవేశించాయి. సైతాను చేత మోసపోయిన ప్రథమ మానవుల ద్వారా కూడా పాపం లోకంలో అడుగు పెట్టింది. పాపం చేత మనుషులందరూ చెడిపోయారు. మనుషులందరిపై ఈ నేరం నిలిచి ఉంది.

4. మాయ లేక అవిద్య సైతాను అనే దయ్యం చేసే ఫలితం. దీనికి దేవుడు కర్త కాడు. సైతాను మనుషుల మనసులకు అంధత్వాన్ని కలిగిస్తాడు. దేవుణ్ణి గురించి, తనను గురించి, మానవుణ్ణి గురించి ప్రజలను మోసగిస్తాడు. ఇంకా అనేక నిజ విషయాలను వీరికి గోచరం కాకుండా చేస్తాడు. మనుషుల పాపం, అవిశ్వాసం మొదలైన వాటిపై దేవుడు తీర్పు తీరుస్తాడు.

5. మానవుడు దేవుని చేత సృజించబడినవాడు. మానవుడి ఆత్మ, దేవుని ఆత్మ భిన్నమైనవి. దేవుని ఆత్మ శాశ్వతం. ఆయనకు అంతం లేని, లోపం లేని జ్ఞానం, బలం, మహిమ, పవిత్రత ఉన్నాయి. మానవుడి ఆత్మ పరిమితం. దానికి ఆరంభం ఉంది. స్వభావ రీత్యా పాపంచేత దేవుని సహవాసంనుంచి వేరైపోయి ఉంది.

6. విముక్తి అంటే జన్మ పరంపర నుంచి విడుదల కాదు. జనన మరణ చక్ర భ్రమణం నుంచి కాదు విముక్తి. అలాంటిదేదీ లేదు. అసలు లేని సమస్యకు పరిష్కారమంటూ ఎలా ఉంటుంది? పాపంనుంచి విముక్తి మనకు కావాలి. ఎవరైనా తాను పాపినని గ్రహించి క్రీస్తు చేసిన పరిష్కారాన్ని తెలుసుకోగలిగితే అలాంటివారికి విముక్తి దగ్గరగా ఉంటుంది. పాపాలకు బదులుగా దేవుని కుమారుడు బలి కావలసివచ్చింది. ఆయన అలా కాకపోతే వేరే మార్గం మానవుడికి ఉండేది కాదు. పాపవిముక్తి కృపద్వారా మాత్రమే లభ్యమవుతున్నది. పశ్చాత్తాపం, క్రీస్తుమీద విశ్వాసంద్వారా మాత్రమే ఈ రక్షణానుభూతి కలుగుతుంది.

7. మనుషులు క్రీస్తుమీద నమ్మకం పెడితే వారికి నూతన ఆధ్యాత్మిక జీవం లభిస్తుంది. వారు తిరిగి దేవుని సన్నిధిలో జీవించడానికి అవకాశముంటుంది. కానీ

మానవుడు దేవుడు కాలేడు. అంతేకాక మానవుడు తన వ్యక్తిత్వాన్ని ఏ మాత్రమూ పోగొట్టుకోడు. నీటి బిందువులు సముద్రంలో కలిసిపోతాయి. అలాంటిది కాదు మనిషి స్థితి. వారు వ్యక్తిగతంగా దేవునితో సహవాసం చేస్తారు. దేవుని సన్నిధిలో శాశ్వతంగా ఆనందంగా గడుపుతారు.

మాయ అనేది విశ్వంలో లేదు. విశ్వానికి కారణం మాయ కాదు. మాయ మనుషులలో ఉంది. మనుషులు మోసపోయినవాళ్ళు. అందుకే వారిలో తప్పుడు అభిప్రాయాలు ఏర్పడుతున్నాయి. దేవుని మీది విశ్వాసంద్వారా మనం ఆయన పిల్లలం అవుతామని యేసుప్రభువు ఉపదేశించాడు. కానీ యేసు దేవుని ఏకైక కుమారుడు. ఆ కుమారత్వం ఆయనకు చెందుతుంది. ఇది అందరికీ చెందినది కాదు. ఆయన దేవుడు. మనమంతా మనుషులం. ఆయన దేవుని అద్వితీయ కుమారుడు. "దేవుడు ఈ లోకాన్ని ఎంతో ప్రేమించి తన ఒక్కగానొక్క కుమారుణ్ణి ప్రసాదించాడు. ఆ కుమారునిమీద నమ్మకం ఉంచేవారెవ్వరైనా సరే నాశనం కాకుండా శాశ్వత జీవం పొందాలనేది ఇందులో దేవుని ఉద్దేశం" అని యేసుప్రభువే స్వయంగా చెప్పాడు.[16]

మానవుడు ఎన్నటికీ దేవుడు కాలేడు. సృష్టికర్త కావడం అసాధ్యం. ఇది స్పష్టం. పరిమితులకు లోనైనది, అశాశ్వతమైనది అనంతుడైన శాశ్వతుడైన దేవుడు కాలేదు. మహాత్ములెందరో ఉన్నారు. మహానుభావులెందరో ఉన్నారు. కాని, యేసుప్రభువుకూ వీరందరికీ ఉన్న భేదాల్లో ఇదే ముఖ్యమైనది.

అద్వైతానికీ, యేసు క్రీస్తు ఉపదేశానికీ మరో ముఖ్యమైన భేదం ఉంది. అద్వైతమనేది రుజువుకాని తలంపులపై ఆధారపడి ఉంది. రుజువు చేయలేని సిద్ధాంతాలపై నిలిచివుంది. కాని, క్రీస్తు ఉపదేశం దేవుడు తానే తెలియజేసిన సత్యం.

**అభ్యంతరం:** "దేవుడు మార్పు లేనివాడు గదా – సృష్టి బొత్తిగా లేనప్పుడు శూన్యంలో నుంచి దేవుడు అకస్మాత్తుగా మార్పుకు లోనై "సృష్టిస్తాను" అనుకుని ఉంటాడా? అందుచేత ఈ విశ్వం శాశ్వతమైనది అయివుండాలి."

**జవాబు:** దేవుడు ఫలానిది చేయగలడు, చేయలేడు అని చెప్పడానికి మనమెవరిమి? అలాంటి మనసు మనలను అహంకారులను చేస్తుంది అంతే. బైబిలులో దేవుడు మార్పు లేనివాడు అని రాసి ఉంది. ఆయన సృష్టి చేశాడు అని కూడా రాసి ఉంది. ఈ రెండూ నిజమే. మనకు తెలిసినంతమట్టుకు సృజించాలనే భావం, సంకల్పం, తీర్మానం ఆది లేని శాశ్వతం కలిగిన దేవునిలో ఉన్నాయి. అది

నిజమైతే దేవుడు సృజిస్తే దేవుడు మార్పుకు లోనయ్యాడు అని అర్థం కాదు. దేవుడు సృష్టి గనుక చేయకపోతే తన సంకల్పం మార్చుకున్నాడు అని అర్థమిస్తుంది. దేవుడు ఈ సృష్టిని చేయకముందు ఇంకా ఎన్నిటినో సృజించి ఉండవచ్చు. మనకు తెలియదు. దేవుడు నిత్యానంద పూర్ణుడు. మనం ఊహించలేని విధంగా సృజించే సంకల్పం ఆయనలో ఎన్నో విధాలుగా వ్యక్తీకరించబడి ఉండవచ్చు. దేవుడు సంపూర్ణ స్వేచ్ఛ గలవాడు. మానవుడి అభ్యంతరాలు ఎన్ని ఉన్నా ఆయనను బంధించలేవు.

మరో విషయం మనం గ్రహించాలి. దేవునిలో మారనిది ఆయన స్వభావం. ఆయన నైతిక శీలం. ఆయన సారాంశం మారనిది. దేవుడు దేవుడే. ఎన్నటికీ ఆయన మారలేడు. ఆయన ఎల్లప్పుడూ వ్యక్తిగా ఉంటాడు. పవిత్రుడు, సత్యవంతుడు, న్యాయశీలి, జ్ఞాన సంపన్నుడు, సౌజన్యమూర్తి. సృజించినా, సృజించకపోయినా దేవుడు మారడు అని గ్రహించాలి.

**ప్రశ్న:** "రామానుజాచార్యుని విశిష్టాద్వైతం, మధ్వాచార్యుని ద్వైతం ఇవి క్రీస్తు ఉపదేశాలకు సన్నిహితంగా ఉన్నాయా?"

**జవాబు:** ఒకవేళ అవి సన్నిహితంగా ఉన్నప్పటికీ ఏం లాభం? సత్యానికి దగ్గరగా ఉన్నంత మాత్రాన చాలదు. ఒక మనిషి దేవుని రాజ్యానికి చాలా దగ్గరగా ఉండవచ్చు. కానీ అందులో అడుగు పెట్టకపోతే, ఎంత దగ్గరగా ఉంటే మట్టుకు ఏం ప్రయోజనం?

సత్యాన్ని గ్రహించాలంటే, ముందు మనసులో ఈ విషయాన్ని స్థిరం చేసుకోవాలి – యేసుక్రీస్తు దేవుని కుమారుడు, ఆయన దేవుని సత్యమే! పాపుల కోసం యేసుక్రీస్తు సిలువ మరణం, ఆయన సజీవంగా లేచిన సంగతి సత్యంలో ప్రముఖ భాగాలు. క్రీస్తుమీద విశ్వాసం యొక్క ఆవస్యకత, క్రీస్తుకు సమర్పణ ఇవి సత్యంలో అంతర్భాగాలు. ఇవి లేకపోతే దేవుని ప్రత్యక్షతలోని కేంద్రాన్ని కోల్పోయినవారమవుతాం. అందరికంటే సత్యానికి దగ్గరగా ఉంటే సరిపోదు. సత్యాన్ని గ్రహించాలి, సత్యాన్ని స్వీకరించాలి, అవలంబించాలి, ప్రేమించాలి. ఈ సత్యమే క్రీస్తు.

**ప్రశ్న:** "అయితే మీరనేది యేసుక్రీస్తు తప్ప మిగతా గురువులందరూ అబద్ధికులు. వారికి సత్యం తెలియదు అనే గదా మీరనేది?"

**జవాబు:** వారందరూ అబద్ధికులని నేను అనడం లేదు. నేననేది ఇది: దేవుడే నిజమైన గురువు. ఆయనే అవతారమెత్తాడు. యేసుక్రీస్తు దేవుని ఏకైక అవతారం.

ఆయన ప్రజలను సర్వ సత్యంలోకి తెచ్చే గురుదేవుడు. మానవ గురువులంతా క్రింది స్థాయికి చెందుతారు. వచ్చిన ప్రతి గురువునూ ఉన్నపళంగా, ఆలోచన లేకుండా మనం నమ్మలేము. వారు నేర్పే విషయాలను రుజువులు మనకు కావాలి. లేకపోతే రుజువులు లేవు అని నిర్ధారణగా తెలుసుకోవాలి. ఆ గురువే స్వయంగా తన యథార్థతను, సత్యానికి తన విశ్వసనీయతను రుజువు చేసుకోవాలి.

కొందరు గురువులు సాంప్రదాయాన్ని అనుసరిస్తారు. వారేమీ కావాలని అబద్ధాన్ని బోధించరు. కానీ వారికి నిజం తెలియదు. వారింకేం చేయగలరు? కొందరు గురువులకైతే సత్యమో, అసత్యమో – అదేమీ వారికి పట్టదు. తమకు లాభసాటిగా ఉండేది ఏదైనా ఉపదేశిస్తారు. కొందరు గురువులు సత్యానికి అసత్యానికి భేదమేమీ లేదు పొమ్మంటారు. కొందరు తెలిసీ, మరికొందరు తెలియకా, యేసుక్రీస్తు ఉపదేశాలకు వ్యతిరేకంగా ఉపదేశిస్తారు. మరి కొందరు తమ శాయశక్తులా యేసు ఉపదేశాలనే బోధిస్తారు. మనుషులలో శ్రేష్ఠ గురువు ఎవరు? ఎవరైతే క్రీస్తు ఉపదేశాలను అంగీకరిస్తారో, ఆయనను విశ్వసిస్తారో, ప్రేమిస్తారో, క్రీస్తు ఉపదేశాలకు అనుకూలంగా జీవిస్తూ బోధిస్తారో వారే శ్రేష్ఠ గురువులు. కారణం, వారు మహాగురువైన యేసుక్రీస్తును తమ గురువుగా, ప్రభువుగా ప్రతిష్ఠించుకున్నారు. ఆయన దగ్గర వీరందరూ శిష్యరికంచేస్తున్నవారే.

మనమిప్పుడేం చెయ్యాలి? దేవునివైపు మన హృదయాలు ఎత్తి పట్టాలి. ఆయన మన సృష్టికర్త. మన పోషణకర్త. ఆయన సమస్త ప్రపంచానికి శాసనకర్త. ఆయనకు ప్రార్థన చేయాలి. ప్రభూ! మాకు సత్యం నేర్పు అని అడగాలి. దేవుడే మనకు సత్యం నేర్పితే ఆయన పంపిన యేసు క్రీస్తును అంగీకరించేందుకు ఆయనే మనలో పని చేస్తాడు. దేవుడే ఆయనను పంపాడు గదా! "దేవుని క్రియ అంటే ఆయన పంపినవాణ్ణి మీరు నమ్మడమే."[17]

"తండ్రివల్ల విని నేర్చుకొనే ప్రతి ఒక్కరూ నా దగ్గరకు వస్తారు."[18] యేసు క్రీస్తును తప్ప మరే గురువును మనం ఆరాధించకూడదు. ఆయనే సత్యయేక దేవుడు.

**ప్రశ్న:** "మీరు ఇంతగా చెప్పారు గదా – అసలు యేసుక్రీస్తును ఎందుకు స్వీకరించాలి?"

**జవాబు:** ఎందుకంటే యేసుక్రీస్తు సత్యం! ఆయనను గురించి ఎన్నో రుజువులూ నిరూపణలూ ఉన్నాయి. ఆయనను మన జీవితాలలో ఇప్పుడు అనుభవించవచ్చు. ఆయనను తెలుసుకోవచ్చు. మనకు అవసరమైన ప్రతి విషయాన్ని ఆయన

తెలియజేస్తాడు. ప్రతి ప్రశ్నకూ ఆయన వద్ద జవాబు ఉంది. అందుకే నేను మళ్ళీ చెప్పేది - ఆయనను ప్రతి ఒక్కరూ స్వీకరించి తీరాలి.

**ఈ అధ్యాయంలోని బైబిల్ రిఫరెన్సులు:**

1. యోహాను 3:16
2. మత్తయి 28:18
3. యోహాను 3:15
4. యోహాను 8:12-12
5. ద్వితీ 18:10-12
6. యెషయా 46:9,10
7. యోహాను 14:16,17
8. మత్తయి 22:37,38
9. 2 కొరింథు 11:23-27
10. 1 కొరింథు 2:14
11. యోహాను 5:44
12. రోమ్ 8:7
13. లూకా 16:19-31
14. మత్తయి 6:5-7
15. యెషయా 1:13-17
16. యోహాను 3:16
17. యోహాను 6:29
18. యోహాను 6:45